

# వ'సుధా(స)మ'యం

కాలమ్ రచనలు

సుధామ

# వసుధా(స)మయం

విజయక్రాంతి దినపత్రిక కాలమ్ రచనలు

## సుధామ

**స్నేహిత స్రవంతి**
జి. 12,సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలకపేట, హైదరాబాద్–500 036

**VASUDHA(SA)MAYAM**

---

Column articles of Vijayakranthi Daily

*by*

SUDHAMA
98492 97958

First Edition : 2, July 2019

Price : Rs.150/-

*For Copies*

Smt. A.USHA RANI
Snehitha Sravanti
G.12, Sadath Towers, Padmavathi Apartments
Saleemnagar Colony, Malakpet
Hyderabad - 500 036.
Telangana
Cell : 9849297958 / 9848276929
&
NAVODAYA BOOK HOUSE
Arya Samaj Road, Kachiguda X Roads
Hyderabad - 500 027

*DTP & Layout*

MANU GRAPHICS
1-8-430/3/A, Chikkadpally
Hyderabad - 500 020
Cell : 93 93 83 40 50

*Cover Design*


SUDHAMA

*Printed at*

SATISH GRAPHICS
21-1-392, Nallakunta
Hyderabad - 500 044.
Cell : 88851 444 22, 96421 444 22

యువకునిగా ఉన్నప్పుడు
సమ్యక్‌దృష్టి నేర్పి
అభ్యున్నతికి
సహకరించిన

సాహిత్య,సాంస్కృతిక
సంస్థకు
కృతజ్ఞతలతో....




**శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య**

(ప్రముఖ కవి, సాహితీవేత్త)

ఆంధ్రాబ్యాంక్ అపెక్స్ కాలేజి, ప్లాట్ నెం.27-29

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి

హైదరాబాద్-500 032 (తెలంగాణ)

సెల్ నెంబర్ : 94404 19039


# హిత వచనం

కవిగా సుధామ సాహిత్యలోకానికి సుపరిచితులే. ఆకాశవాణిలో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవజ్ఞుడు కూడా. ఉద్యోగ విరమణ తర్వాత కాలాన్ని సద్వినియోగం చేసుకునే క్రమంలో ఆయన అనేక ఇతర కార్యకలాపాల్తో పాటు 'విజయక్రాంతి' దినపత్రికలో ఒక 'కాలమ్'ను నిర్వహించారు, నలభై వారాలపాటు. తన పేరు ఇమిడేలా కాలమ్‌కు 'వసుధా(స)మయం' అనే పేరు పెట్టారు. కాలమ్‌కు పెట్టిన పేరులో 'సమయం' వుండడం ఒక విశేషమే. ఆ కాలమ్ కింద వచ్చిన రచనల కూర్పే ఈ పుస్తకం.

ఈ కాలమ్ 'విజయక్రాంతి'లో వస్తున్నప్పుడే కొన్ని ఖండికల్ని నేను చదివాను. 'సభావేదికల ఔచిత్య విచార చర్చ' శీర్షికతో వచ్చిన రచనను చదివినపుడు 'సుధామ'కు ఉత్తరం రాశాను, నా స్పందనను తెలియజేస్తూ.

దినపత్రికలోనో, వారపత్రికలోనో 'కాలమ్'ను నిర్వహించడం ఎప్పుడో మొదలైంది. కాలమిస్టులుగా ప్రసిద్ధులైనవారెందరో వున్నారు. కులదీప్‌నయర్ కాలమ్ 'Exclusive' ను చదవడం కోసమే 'WEEK' అనే ఆంగ్ల పత్రికను నేను కొనేవాణ్ణి. తెలుగులోనూ 'కాలమ్' సంప్రదాయం సుపరిచితమే. గతంలో 'చేరాతలు' లాంటి కాలమ్‌లు బాగా ప్రాచుర్యాన్ని పొందాయి. అవి ఆసక్తిని రేకెత్తించడంతోపాటు కొన్ని సార్లు చర్చలకు, వాదోపవాదాలకు తెరలేపాయి.

'కాలమ్'ను నిర్వహించడం తేలికైన విషయంకాదు. దానికి స్థలపరిమితి వుంటుంది. ఆ పరిమితిలో చెప్పదల్చుకున్నదాన్ని క్లుప్తీకరించుకుని చెప్పాలి. శైలిపట్ల జాగరూకతతో వుండాలి. భావనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. రచనను

చదివించే గుణం వుండాలి. స్పష్టతా సూటిదనం వుంటేనే 'కాలమ్' పాఠకులకు దగ్గరవుతుంది.

సుధామ తన 'కాలమ్' తొలి ఖండికలోనే చెప్పాడు, రాయబోయే వస్తువేమిటో. 'భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు పరిమితమై సమయోచిత ఆలోచనలు సారించడానికే 'వసుధాసమయం' అన్నాడాయన. అంతేకాదు–"ఈ కాలమ్ ప్రయోజనదాయకమైన 'కాలం'కు హితచింతనతో సంధానం చేసుకుందామనేదే ప్రయత్నం" అని కూడా అన్నాడు. తాను తలచిన హితచింతనను ఈ కాలమ్ కింద వచ్చిన అన్ని ఖండికల్లోనూ గమనించొచ్చు.

ఈ ఖండికల్లో సింహభాగం భాషకూ, సాహిత్యవాతావరణానికీ సంబంధించి నది. మాతృభాష తెలుగు వర్థిల్లాలని బలంగా ఆకాంక్షిస్తూ సుధామ చేసిన రెండు రచనలు విలువైనవిగా వున్నాయి. "సాహిత్యం లేకపోయినా భాష వుంటుంది. వుండాలి. భాష వుంటేనే సాహిత్యసృష్టి అనే మాట" అంటూ భాషను నిలుపుకోవాల్సిన అవసరాన్ని స్ఫుటంగా చెప్పారు. 'ఏ భాష అయినా సంపూర్ణంగా వికసించాలి అంటే, నిలద్రొక్కుకుని విస్తరించాలి. అంటే ఆ మాతృభాషీయులు తమ భాషలో మాట్లాడటం, చదవటం, రాయటం, ఆలోచించటం అనే నాలుగు పార్శ్వాలలోనూ పురోగమించాలి' అనే సూత్రీకరణ చేసాడు. ఈ సందర్భంగానే ఒక స్పష్టమైన భాషా సాంస్కృతిక విధానాన్ని గురించిన స్పష్టతకై పాలకుల్ని నిలదీయాలని ఆయన సూచించాడు. ఈ సూచన ఎంతో సముచితమైంది. తక్షణ అవసరం కూడా.

ఇక సాహిత్య సభల నిర్వహణకు సంబంధించి సుధామ చేసిన పరిశీలనలు గమనించదగ్గవి. సభల నిర్వహణలో తరచుగా జరుగుతున్న అవకతవకల్ని ఆయన సూటిగా ఎత్తిచూపాడు. 'సభ ఆసాంతం ఆసక్తిగా నిండైన ప్రేక్షకులతో సాగాలంటే, వేదికపై ఉన్న వారందరికీ ప్రసంగ ఔచితి, సమయ ఔచితి తెలియాలి' అన్నాడాయన. ఈ ఔచిత్యరాహిత్యం ఎన్ని విధాలుగా వుంటున్నదో అనేక ఖండికల్లో విపులంగానే వివరించాడు. అనేక సభల్ని చూసిన సుధామ తన అనుభవాల్ని క్రోడీకరించుకుని ఈ పరిశీలనల్ని చేసి వుంటాడు. 'సభానంతర సభల' మీద ఆయన చేసిన రచన వాడిగా వుంది. రచనలో సుధామ ఎంత నిర్మొహమాటంగా వుంటాడో చెప్పడానికి ఇది మంచి దాఖలా అని చెప్పొచ్చు. అలాగే, అవార్డులు, పురస్కారాల పేరిట ఇవాళ జరుగుతున్న పలు వ్యవహారాల గురించి చెబుతూ 'ఇచ్చినమ్మ వాయినం, పుచ్చుకొంటి నమ్మ వాయినం' అన్న చందాన పంపిణీలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించాడు సుధామ. శాలువాలు, పూలదండల మీద అర్థవంతమైన అభిప్రాయాల్ని తెలియజేసే

క్రమంలో ఆయన ఆడంబరం, ఆలంకారిత కన్నా ఉపయోగధర్మానికే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చాడని అర్థమౌతుంది. సాహిత్య సభానిర్వాహకులు వీటిని పట్టించుకోవాల్సిన అవసరముంది. లేకుంటే కొత్తతరం సాహిత్య ప్రియులకు తప్పుడు సంకేతాలిచ్చిన వాళ్ళమవుతాం.

కవిగా తనకున్న అనుభవనేపథ్యం నుంచి సాహిత్య విమర్శను కూడా తట్టాడు సుధామ. 'విమర్శక కాలుష్యం' రచన ఆ కోణం నుంచి వచ్చిందే. 'వచ్చిన చిక్కు ఏమిటంటే 'విమర్శ' అంటే తిట్టు అనే భావన చాలా మందిలో స్థిరపడిపోయింది' అనే వాక్యంతో ప్రారంభమవుతుంది ఆ రచన. "సాహిత్య విమర్శలో మేధకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి, హృదయాన్ని విస్మరించడం సరికాదు" అని సహృదయపూర్వకంగా తన అభిప్రాయాన్ని చెప్పాడు. ఇంకా బాహాటంగా 'విమర్శకుడు దాక్కోకూడదు, విలువల విధ్వంసకుడు కాకూడదు' అని చెప్పడానికి సుధామ వెనుకాడలేదు.

ఇదే కాలమ్‌లో సుధామ సాహిత్యానికి సంబంధించిన కొన్ని ఇతర మౌలికాంశాల్ని చర్చించాడు. సాహిత్యానికి వున్న అపారమైన శక్తిని నొక్కి చెప్పాడు. "మనుషుల్లో పరివర్తనం తేగల శక్తి రాజకీయాలకన్నా సాహిత్యానికే ఉందనే ఒక విశ్వాసం ఉంది. ఎందుకంటే ఉద్యమాలకు ఊపిరులూదినది సాహిత్యమే అయిన సందర్భాలు చరిత్రలో ఎన్నో వున్నాయి" అనడం వెనక వున్నది ఆ విశ్వాసమే. అధ్యయనానికి వున్న ప్రాధాన్యతను చెబుతూ ప్రాచీన సాహిత్యాన్నీ చదవాల్సిన ఆవశ్యకతను హితవుగా పలికాడు. మనకున్న అపారమైన పద సంపదను, భాషా సంపదను కోల్పోవద్దని కూడా హెచ్చరించాడు. ప్రబలుతున్న సాహిత్య రాజకీయాల్ని ప్రస్తావిస్తూ "సాహిత్యం రాజకీయాలు లేకుండా ఉండదనే మాట నిజం కావచ్చు గానీ, ఇంతగా సాహిత్య రాజకీయాలు ప్రబలిపోవడమే చేటు" అని సుధామ అన్నదాన్ని సాహిత్య ప్రేమికులు పట్టించుకుంటే మంచిది.

భాషాసాహిత్య సాంస్కృతిక రంగాలకు తన కాలమ్ పరిమితమని తొలి ఖండికలో సుధామ చెప్పుకున్నప్పటికీ, కొన్ని ఖండికల్లో రాజకీయాల గురించి మాట్లాడాడు. రాజకీయ రంగంలో నానాటికీ దిగజారుతున్న విలువల గురించీ, తిట్ల దండకాల గురించీ, ఎన్నికల్లో నామినేషన్ లీలల గురించీ, రాఫెల్ డీల్ గురించీ, పుల్వామా దాడి గురించీ రాశాడు. వీటినిండా వున్నది వర్తమానమే. ఆలోచనల్ని రేకెత్తించేవే. ఒకానొక చోట సుధామ అన్నాడు–"ప్రజాస్వామ్యంలో ప్రజ మినహాయించి అధికారస్వామ్యం, ధనస్వామ్యం, నేరస్వామ్యం, హింసాస్వామ్యం

తరగలెత్తుతున్నాయి". ఈ ఒక్క వాక్యంలో ఇవాళ్టి రాజకీయ స్వరూపమంతా కనబడుతుంది.

శైలిపరంగా, సుధామ ఈ కాలమ్ కోసం చేసిన రచనలన్నీ సరళంగా వున్నాయి. క్లిష్టపదబంధాలు అతి తక్కువ. భావప్రసారంలో ప్రవాహశీలత వుంది. తన భావనలకు, ప్రతిపాదనలకు బలాన్ని చేకూర్చడానికి అవసరమైన చోట వివిధ కవుల ప్రసిద్ధ కవితా పంక్తుల్ని ఉటంకించాడు. అట్లా ఈ కాలమ్ రచనల్లో అక్కడక్కడా శ్రీశ్రీ, కాళోజీ, జాషువా, కరుణశ్రీ, పెద్దన, దాశరథి, సినారె, ఆరుద్ర అగుపడతారు. అంతేకాదు, కొన్ని చోట్ల సినిమా పాటల పల్లవుల్నీ చరణాల్నీ ఉటంకించాడు. ఇవన్నీ ఈ కాలమ్ రచనలకు అదనపు శోభను చేకూర్చాయి.

ఆకాశవాణిలో దీర్ఘకాలం తాను నిర్వహించిన అనేక కార్యక్రమాల ద్వారా పొందిన రచనానుభవం ఈ కాలమ్‌ను నైపుణ్యంతో నిర్వహించడానికి సుధామకి దోహదపడిందనుకుంటున్నాను. వివిధ ఖండికలకు పెట్టిన శీర్షికల్నీ, వాటి ప్రారంభాల్నీ గమనిస్తే, ఎంతో వైవిధ్యం కనబడుతుంది. ఉదాహరణకు 'చంద్రునిపై మొలకెత్తిన చైనా పంట' అనే శీర్షికే ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. రచనలోని ఆరంభ వాక్యాలూ అంతే ఆసక్తిని కలిగిస్తాయి– "చందమామలో అవ్వ ఉందనీ, ఆ అవ్వ నూలు వడుకుతూ ఉంటుందనీ చిన్నప్పుడు కథలు విన్నవాళ్ళం. చందమామ రావే! అనే పాట అమ్మ పాడుతూంటే విని పెరిగినవాళ్ళం" ఈ వాక్యాల్ని చదువుతూ నేనైతే నా బాల్యంలోకి వెళ్ళిపోయాను, కాసేపు.

సాహిత్య విషయాలకు సంబంధించి గానీ, రాజకీయాలకు సంబంధించి గానీ సుధామ ఈ కాలమ్ ద్వారా వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాల్తో కొందరు విభేదించొచ్చు. వాటి మీద కొంత చర్చ జరగొచ్చు. మంచిదే. ఆరోగ్యకరమైన చర్చలు అవసరమే! వాటివల్ల ప్రయోజనముంటుంది. చదివించే గుణాన్ని పొదుగుకున్న ఈ కాలమ్ రచనల్ని చదవడమే కాక, ఈ నాల్గు మాటల్ని రాయడం నాకొక మంచి రుచికరమైన అనుభవం. వాడుపుతో, చిత్తశుద్ధితో, పదునైన సూటిదనంతో 'కాలమ్'ను 40 వారాలపాటు నిర్వహించి, ఆ రచనల్ని ఇలా ఈ పుస్తకరూపంలో తెస్తున్న మిత్రుడు సుధామ కు ఇష్టంగా అభినందనల్ని అందజేస్తున్నాను.

హైదరాబాద్ **–దర్భశయనం శ్రీనివాసాచార్య**

24.05.2019



**శ్రీమతి జె.కామేశ్వరి ప్రసాద్ (పాప)**
(కార్యదర్శి, ఆంధ్ర బాలానందం సంఘం, హైదరాబాద్)
4, కింగ్స్‌మిడ్ కోర్ట్, డింగ్లే విలేజ్
విక్టోరియా–3172, ఆస్ట్రేలియా

# లోచూపు-లోకవృత్తం

ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో ఫేస్‌బుక్ చూడటం అలవాటు, అలాగే చూస్తూ ఉంటే సుధామ కొత్త కాలమ్ కనిపించింది. తను ఏది వ్రాసినా కొంత ఆసక్తితో చదవడం నాకు పరిపాటి. ఎందుకంటే సుధామ నా చిన్ననాటి బాలానందం మిత్రుడు. ఆ స్నేహం ఈరోజుకీ పచ్చగా ఆరోగ్యంగా నిలబడింది. నాకు ఏదైనా ఇంగ్లీష్ పదానికి తెలుగు పర్యాయపదం కావాలంటే టక్కున ఫోన్ చేసి "ఈ మాటని తెలుగులో ఏమంటారు" అని అడిగి జవాబు రాగానే ఇంకోమాట మాట్లాడకుండా పెట్టేసేంత స్నేహం. నో ఫార్మాలిటీస్! రెండోది, తను ఏం వ్రాసినా దాంట్లో నిజాయితీ, నిర్భయం కనిపిస్తాయి. తను నమ్మినది రాస్తాడు కాని ఒకరి మెప్పుపొందాలనో, ఇలారాస్తే ఎవరైనా ఏదైనా అనుకుంటారేమో, తన గురించి విమర్శిస్తారేమో, ఇలాంటి మీమాంసలు ఉండవు. స్ట్రైట్ ఫార్వర్డ్‌గా ఉండే ప్రతీ ఒక్కరికీ తన రచనలు సెన్సిబుల్‌గా ఉంటాయి.

కనుక ఎప్పటిలాగే ఇదేదో కొత్త దినపత్రిక, మనవాడి కొత్త కాలమ్ అనుకుంటూ చదివాను. అప్పటి నుండీ ప్రతీవారం వసుధా(స)మయం చదవడం ఒక అలవాటుగా మారింది. నా లోకం బాలానందం కనుక పిల్లల గురించి కానీ, తెలుగు భాష గురించీ, విదేశాలలో బాలల జీవితంపై కానీ కంపేరిజన్స్ ఇలాంటివాటిపై కొంచెం ఆవేశంగానే నా ఉద్దేశ్యాలు కామెంట్స్‌లో తెలియచేయడం జరిగింది. 'లోకోభిన్నరుచి' అన్నట్లు– తను వ్రాసిన ప్రతీదీ నాకు ఆసక్తిగా అనిపించిందని కాదు గానీ, సుధామ ప్రత్యేకత ఏమిటంటే–అన్ని వర్గాలకీ ఆసక్తి కలిగేటట్టు వ్రాయడం. హోటల్‌లో బఫే

భోజనం లాగా, కొన్ని కాకపోతే కొన్ని అయినా, మన రుచులకీ, ఆలోచనలకీ దగ్గరగా ఉంటాయి. దాంతో అందరూ సంతృప్తిపడతారు. చదవడానికి కుతూహలంగా ఉంటుంది.

అసలు ఇన్ని విషయాలు తనకి ఎలా తడతాయా అని విస్మయంగా ఉంటుంది నాకు.

ఇక్కడ నాకు బాగా నచ్చిన కొన్ని రచనల గురించి ప్రస్తావిస్తాను మరి!

అమ్మ భాష తెలుగు. దానిని కోల్పోవద్దు అన్న వ్యాసంలో అన్నింటికంటే నాకు నచ్చిన వాక్యం "మదర్‌టంగ్' అని వ్రాయాలంటే తెలుగు అంటాం గానీ, ప్రాంతం, రాష్ట్రం పేరు రాయంకదా' అన్నది. ఎంత నిజం! రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు గారు వ్రాసిన "అంతా ఒక్కటే"పాటలో లాగా ప్రాంతాలు, రాష్ట్రాలు వేరయినా, మనం అంతా ఒకటే అయితే ద్వేషాలు ఉండవుగా!

ఈరోజుల్లో పిల్లలు తెలుగు మాట్లాడితే అదే చాలు అన్న పరిస్థితికి వచ్చాం. తెలుగు పాటని ఇంగ్లీషులో రాసుకుని పాడితే, పోనీలే తెలుగు పాట నేర్చుకుంటున్నారు కదా! అని తృప్తిపడే అల్పసంతోషులు అయిపోయాం.

రెండు తెలుగు రాష్ట్రాలలో సాంస్కృతిక విధానంపై స్పష్టమైన అవగాహన ఉండాలనీ, ప్రాంతం వేరైతే పదప్రయోగం, ఉచ్ఛారణ వేరుగానీ, అంతా తెలుగే కదా! అంటూ, తెలుగు బాలలకి తెలుగు రావాలంటూ ఆవేదనగా వ్రాసిన వ్యాసం నా మనసుకి చాలా నచ్చింది.

ఇక–ఒకప్పటి రచయితల, రచయిత్రుల వైభవం, చూసిన మాలాంటివారికి తప్ప ఇప్పటి కొత్తవారికి అర్థంకాదు. పేరు సంపాదించి చక్కటి రచనలు చేసేవారు పెద్ద సెలబ్రిటీలు మాకు.

వార పత్రికలు రెగ్యులర్‌గా కొని చదివే రోజుల్లో– మంచి రచయితలు ఉన్నారని తెలుసుకొని, వారి పూర్వ రచనలు తెప్పించుకొని ఓపికగా చదివేవాళ్లం. పత్రికల్లో ప్రచురించే వారి సీరియల్స్, నవలలు, ప్రచురణకర్తలు ఆ రచయిత(త్రు)లు దగ్గరికి వెళ్ళి, డబ్బిచ్చి–రైట్స్ కొనుక్కొని, పుస్తక రూపంలో ప్రచురిస్తే, అందరూ కొనుక్కునేవారు.

ఈ రోజుల్లో పరిస్థితులు మారాయి. బుక్‌ఫెయిర్స్ పెట్టినా అమ్ముడవని పరిస్థితి. జనంతో కిటకిటలాడుతున్నా అవన్నీ గ్రూప్ కాంపిటీషన్స్, ఆధ్యాత్మిక

పుస్తకాలు, వంటలు, వ్యక్తిత్వ వికాసం (మా చిన్నతనంలో అర్థం తెలియని విషయం ఇది. మా తరం అంతా ఆ మాట తెలియకుండానే మంచి వ్యక్తిత్వం కలవారమే అయ్యాం మరి!!) ఇలాంటివే కానీ, మంచి నవలలూ, కథలూ కొని చదివేవారు తక్కువే అంటూ – "పుస్తకాల సంత" (బుక్‌ఫెయిర్‌కి తెలుగు పదం కాబోలు) అన్న వ్యాసంలో, దాని ఉపయోగాలూ, సాధక బాధకాల గురించి చక్కగా విశ్లేషించాడు సుధామ. మంచి సాహిత్యం అమ్ముడవటం లేదని, గ్రంథాలయాలకి–ప్రభుత్వ ప్రోత్సాహం లేదనీ, పిల్లలకి కొన్ని పుస్తకాలున్నా–వాటిని కొని ఓపికగా పిల్లలకి వినిపించే పెద్దలు కానీ, చదివే సమయం పిల్లలకి కానీ లేదని బాధపడుతూ వ్రాసిన వ్యాసం ఇది ఆలోచింపచేస్తుంది.

ఇక పోతే "పూలదండలు' గురించి–అభినందనగానీ, పుట్టినరోజు వేడుకలు కానీ, ఎవరైనా పోయినా, ఏదీ కాకపోతే మన రొటీన్ సన్మానసభకి గానీ, పూల మీద ఎంత డబ్బు వృథా అవుతోందో ఒక్కక్షణం ఆగి ఆలోచించమంటాడు సుధామ. 'బొకే' తీసుకున్న సగం మంది, అక్కడే వదిలిపోవటం, సభ అవుతూనే–అవన్నీ చీపురుతో (కార్యకర్తలు వెళ్ళకుండానే) ఊడ్చిపారెయ్యడం ఎన్నోసార్లు అందరూ చూసే ఉంటారు.

బాలానందంలో మొదటి నుండీ పెద్ద 'బొకే' కాకపోయినా, ఒక ఆరు రోజా పువ్వులు, నాలుగు ఆకులతో బొకే ఇచ్చేవారం. ఈ ఆర్టికల్ చదివాక ఒకే ఒక గులాబీ పువ్వు ఇచ్చి, లక్షణంగా పళ్ళబుట్ట ఇయ్యటం మొదలుపెట్టాం. పిలిచిన అతిథులు గొప్పవారై విదేశీ పళ్ళు తిన్నా, మనం ఇచ్చిన పళ్ళు వారి పనివారికైనా ఇస్తారు కదా! ఎవరికైనా ఉపయోగపడుతుంది అన్న ఆశతో!!

ఈ చిన్నమార్పు చాలదూ! ఒక రచయిత సంతోషించడానికి.

హ్యూమన్ వాల్యూస్ ఎంత అధోగతి పాలయ్యామో చెప్పే రచన ఈనాటి ఓటు బ్యాంక్ రాజకీయాలు. ఎన్నికలలో మాయమైన హుందాతనం, కుల, మత, ధన పిచ్చిలో మునిగి తేలుతున్న నాయకులు, వారి అనుచరులు, వీటన్నిటిపై ఎంతో ఆవేదన చెందుతూ విశ్లేషించాడు సుధామ.

"దేశంకోసం, దేశ సంక్షేమంకోసం ఆర్తి చెందుతున్నవారు ఎవరు" అన్న వాక్యం చదవగానే గుండె బరువెక్కింది. ప్రతీదీ వ్యాపారాత్మకమై, ధనమే మూలంగా

నడుస్తున్న ఈ కాలం గురించి సుధామ వ్రాసిన వాక్యాలు చదువుతుంటే మన నిస్సహాయత తలుచుకుని ఫ్రస్ట్రేటింగ్‌గా అనిపించింది. విదేశాలలో ఉన్నది చాలు, మనదేశానికి వెళ్లి పనికివచ్చే పని చేద్దాం. అని తిరిగి వచ్చే నాలాంటి వారికీ ప్రతీ అక్షరం నిజం కదా! అని అనిపించకమనదు

సభా వేదికల ఔచిత్యం గురించి వ్రాసిన రచన–ప్రతీరోజూ మాలాంటివారం చెప్పుకుని నవ్వుకోవడం, పాతరోజులూ, అప్పటి హేమాహేమీల నిగర్వం, ప్రచారం అన్న పదం వారి నిఘంటువులో లేకపోవడం ఇవన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఈరోజుల్లో ప్రతీ వీధికీ ఒక సాంస్కృతిక సంస్థ. నిజంగా సాంస్కృతిక దిశగా ఏదైనా చేస్తున్నారా అంటే ప్రశ్నార్థకమే! ఏదో ఒక కారణంతో ఎవరినో పిలవడం (సినిమాలతో సంబంధం ఎక్కడైనా పిసరు ఉంటే మరీ మంచిది), సన్మానం అనడం, అది ఒక కార్యక్రమం. మరి ప్రేక్షకులు రావద్దూ! ... అందుకని సినిమాపాటల ప్రోగ్రామ్. కార్యక్రమం ఎలా నడిపించాలో, ఎవరిని ముందు పిలవాలో, ఇవేమీ ఎవరికీ తెలియదు. లెక్కకు మించి వేదికపైకి మనుష్యులని ఎక్కించడం, వారు మైకు వదలకుండా ఉపన్యాసాలు, “చప్పట్లు కొట్టండోయ్” అంటూ ప్రాంప్టింగ్... ఇలా ఎన్నో తమాషాలు ఈ రచనలో ఎంతో మర్యాదగా రాశాడు. నన్ను పిలిస్తే వేదిక ఉచితంగా ఇస్తానన్న హాలు అధికారులు ఉన్నప్పుడు కార్యక్రమాలు నడపడం ఎంత తేలిక! కావలసినదల్లా మర్నాడు పేపర్‌లో (ఒక మూల చిన్నదైనా సరే) వారి గ్రూప్ ఫొటో పడటమేగా!

ఆ వ్యాసానికి కొనసాగింపే అనిపించే రచన– ‘ఓ గుడ్డముక్కా–దిమ్మచెక్కా’. అసలు టైటిల్ చదివే నవ్వొచ్చింది. ఆ తరువాత విచారం వేసింది. ఒకప్పుడు ఒక నాలుగయిదు సాంస్కృతిక సంస్థలు చాలా యాక్టివ్‌గా పనిచేసేవి. యువతీమండలి, మహిళాసభ, బాలానందం, యువభారతి కాక, సెవెన్‌స్టార్స్ సిండికేట్ అని యువకులు స్థాపించిన సంస్థ, కొన్ని బాలానందాలు ఆంధ్ర బాలానంద సంఘానికి అనుబంధంగా ఉండేవి. ఇవికాక ఆఫీసులలో ఉద్యోగస్థుల సంస్థలు వారి వరకే పరిమితమయ్యేవి. అయితే ఇవేవీ కూడా సన్మానాలు ఎడాపెడా చెయ్యగా గుర్తులేదు. అక్కినేని వారికీ, సావిత్రి గారికీ, సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినపుడు భానుమతిగారికీ, పద్మశ్రీ వచ్చినపుడు నాగయ్యగారికీ తప్ప ఆరోజుల్లో పెద్దగా ఎవరికీ సన్మానం అంటూ జరగలేదు. ఎవరినైనా గౌరవించడం అంటే ఒక పూలదండ వెయ్యడం, ఒక

కార్యక్రమానికి అతిథిగా పిలవడం. అంతే! ఈరోజుల్లో సన్మానానికి కావలసింది-ప్రత్యేకత ఉన్నవారు కాదు. ఎవరైనా ఫరవాలేదు. కారణాలు వెతుక్కోనక్లర్లేదు. సదరు వ్యక్తి ఇరవై సినిమాలలో నౌకరు వేషం వేశాడనో, ఆపకుండా ఆరు గంటలసేపు ఈల వేశాడనో, నలభై సంవత్సరాల యువకవులు ఆరు మంది గురించి పుస్తకం రాశారనో, మహిళలకి వంటింటి చిట్కాల పుస్తకం రాశారనో ఇలా ఎన్నెన్నో! వారికి కావాల్సింది ఏదో కారణంతో సన్మానం చెయ్యడం. ఒక శాలువా, ఒక దిమ్మ చెక్కా ఇయ్యడం. మరునాడు పేపర్‌లో వేయించే సత్తాగల ఫొటోగ్రాఫర్, అతిథిగా పిలిస్తే హాలు ఫ్రీగా ఇస్తానన్న పెద్దలు ఎలాగూ ఉన్నారు. వీటిని గురించి సుధామ తన వ్యాసంలో కుండబద్దలు కొట్టినట్టు రాశాడు. ఈ వ్యాసం చదివాక – ఒక్కడైనా నిష్కర్షగా పబ్లిక్‌గా చెప్పాడని ఎంత సంతోషం వేసిందో!. నాకు ఈ పుస్తకంలో చాలా చాలా నచ్చిన వ్యాసాలలో ఇది ఒకటి.

ఇక నాకు-మనసుకి నచ్చిన విషయం బాల సాహిత్యం. చింతా దీక్షితులు గారు, రేడియో అన్నయ్య, అక్కయ్య న్యాయపతి రాఘవరావు, కామేశ్వరి దంపతులు, జేజి మామయ్య రజనీ కాంతరావు గారు, గిడుగు సీతాపతి గారు-ఇంకా అనేకమంది ఆ కాలంలో వ్రాసిన బాలసాహిత్యం చదివి వారి ప్రేరణతో పెరిగిన తరం మాది. వారు వ్రాసిన కథలు, పాటలలో నీతి అంతర్లీనంగా ఆసాంతం ఉండేది. ఏదో మోరల్ సైన్స్ పాఠం లాగ కాక, చదవడానికి ఆసక్తిగా ఉండేవి. మంచి చెడు ఏమిటి అన్నది అర్థం అయ్యి, మాకు తెలియకుండానే మంచి మార్గం ఎంచుకునే విచక్షణ కలిగేది.

"ఇప్పుడు బాలసాహిత్యం-పిల్లలకి ఏంకావాలని పెద్దలు అనుకుంటున్నారో, పిల్లలు ఎలా ఉండాలని, ఎలా పెరగాలని తాము ఆశిస్తున్నారో అందుకు అనుగుణంగా, వారికోసం పెద్దలు రాస్తున్నదే బాలసాహిత్యంగా చెలామణి అవుతోంది. అకాడమీలు సైతం అదే గుర్తిస్తున్నాయి" అంటూ సుధామ వ్రాసింది అక్షరసత్యం.

నిజమైన బాలసాహిత్యం విరాజిల్లుతున్నది విదేశాలలోనే. అక్కడ దొరికే చక్కటి, సరళమైన రంగురంగుల బొమ్మల పుస్తకాలు, మూడు నెలల పాపాయికి కూడా చూపించి, చదివి వినిపించే తల్లిదండ్రులను చూస్తే, అయ్యో మన పిల్లలకి పుస్తకాలు చదివే తీరిక, ఉత్సాహం మనం కలుగచెయ్యటంలేదే! అని ఎంతో బాధగా ఉంటుంది. బుక్ రీడింగ్ అక్కడ పిల్లలకు ఇంట్లో కానీ, స్కూల్‌లోకానీ, పార్ట్ ఆఫ్

డెయిలీ లైఫ్! ఇది నేను స్వయంగా చూసిన విషయం... ఒక తల్లిగా, టీచర్‌గా పాటించిన సూత్రం.

మనం 'విదేశీ సంస్కృతి' అని పనికిరానివి ఎత్తి చూపే నెగెటివ్ దృక్పథం మాని, ఉపయోగపడే ఇలాంటి మంచి విషయాలు అందరికీ తెలియచేస్తే బాగుండును. అక్కడ పిల్లలు పుస్తకాలు చూసి, ఆ ఊపులో ఇండియా వచ్చి, అన్నయ్య గారి 'రాముా సోముా', అక్కయ్యగారు చెప్పిన కథలు, ఇలా ఒక అయిదు చిన్న చిన్న పుస్తకాలు, "బాలి" వేసిన చక్కటి రంగురంగుల బొమ్మలతో బాలానందం ద్వారా ప్రచురిస్తే, ఆదరించే పెద్దలు, పిల్లలు కరువై "ఇది లాభం లేదు" అని నిరుత్సాహపడ్డాం. సుధామ ఈ వేదన అంతా ఎంతో స్పష్టంగా ఈ వ్యాసంలో రాశాడు. చదివిన పెద్దలు "నిజమైన" బాలసాహిత్యాన్ని ప్రోత్సహిస్తే బాగుండును.

సుధామ కాలమ్ వ్యాసాలలో ఇవి కొన్ని మాత్రమే!.... ఇంకా గిన్నిస్‌బుక్ రికార్డుల పిచ్చి, పత్రికలలో కథల పోటీలు, తెలుగు భాష ప్రాచుర్యం ఎలా తగ్గుతోందో అన్న బాధ, రాజకీయాల మీద విశ్లేషణ, నేటి నాయకుల తీరూ తెన్నూ, ఇలా ఎన్నో విషయాలపై మనల్ని ఆలోచింపచేశాడు సుధామ. అన్నీ ఈ విధంగా రాసుకుంటూ పోతే నా ముందుమాట ఇంకో పుస్తకం అవుతుంది. ఇది కథలు చదువుతున్నట్లు కాక–ప్రతీ వ్యాసం చదివి, ఆగి ఒక్క క్షణం ఆలోచించే పుస్తకం! ఈ వ్యాసాలు పుస్తకరూపంలో ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూసిన వ్యక్తులలో నేనొకరిని.

'నాకు చేతకాదు మొర్రో' అన్నా, "నువ్వే ముందుమాట రాయాలి" అంటూ నాకంత అర్హత లేకపోయినా, బలవంతం పెట్టి ధైర్యం ఇచ్చిన మా సుధామకి ధన్యవాదాలు.

విక్టోరియా, 3172 **–జె. కామేశ్వరి**

23.04.2019

# నా గోడు

కొలమిస్టుగా నా ముచ్చటగా మూడవ పుస్తకం ఇది. 1997లో ఆంధ్రభూమి దినపత్రికలో 'సం.సా.రా.లు' (సంస్కృతి-సాహిత్యం-రాజకీయాలు) కాలమ్ రాయడం ప్రారంభించి సుమారు పుష్కరకాలం నడిపాను. ఒక 50 వ్యాసాలతో 2001లో ముద్రించిన సం.సా.రా.లు గ్రంథం 2004లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆ ఏటి సాహితీపురస్కారం ను అందుకుంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక విశాలాంధ్ర దినపత్రిక తెలంగాణలో 'మన తెలంగాణ'గా వెలువడుతూ రాగా 2015-2016లో 'మనతెలంగాణ' దినపత్రిక ఎడిట్ పేజిలో 'సుధామ'యోక్తి' పేర ఓ ఏడాది పైగా రాసిన వ్యాసాలతో 2018 లో ఆ కాలిక వార్తాంశ కథనాలను గ్రంథస్థం చేయడం జరిగింది.

ఆపై 'విజయక్రాంతి' దినపత్రిక వారు కోరగా 2018 మే నుండి ఓ నలభై వారాలపాటు రాసిన కాలమ్ రచనలే ఈ 'వ'సుధా(స)మ'యం'. ఫేస్‌బుక్‌లో ఈ కాలమ్ పోస్ట్ చేస్తూ వచ్చినప్పుడు లభించిన అనూహ్యస్పందన, పాఠకజనాదరణ సంతోషాన్నిచ్చింది. ఈ రచనలను కూడా ఒకచోట నమోదు చేయాలన్న సంకల్పమే ఈ గ్రంథం. ఉత్తరాలు రాయడమనేదే అంతరించిపోతున్న కాలాన ఈ కాలమ్‌లో రచనకు స్పందించి ప్రముఖ కవి, సాహితీవేత్త శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్యగారు స్వయంగా రాసిన పెద్దఉత్తరం, అదేవిధంగా వారం వారం ఈ కాలమ్ శ్రద్ధగా చదివి ఫేస్‌బుక్‌లో ఎప్పటికప్పుడు స్పందించిన ఆస్ట్రేలియాలోనూ, ఇండియాలోనూ పౌరసత్వం నెరపుతున్న హైదరాబాద్ బాలానంద సంఘం కార్యదర్శి శ్రీమతి జంధ్యాల కామేశ్వరి (పాప) సమాదరణ నాకు ఎంతో తృప్తిని కలిగించాయి. నా అభ్యర్థనను మన్నించి వారిరువురూ

ఈ గ్రంథానికి విలువైన మున్నుడులు సంతరించినందుకు ధన్యవాదాలు.

ఈ 'వసుధా(స)మయం' కాలమ్ రచనల్లో సాహిత్య సభలు, సంస్థలు, పత్రికల ధోరణుల గురించిన వ్యాసాలకు ఎక్కువ ప్రతిస్పందన లభించింది. నా వలె ఆలోచించి, ఆర్తి చెందేవారున్నారన్న గ్రహింపు లభించింది. ఆయా రచనల్లో నేను వ్యక్తిగతంగా ఎవర్నీ ఉద్దేశించి కాక నేటి వర్తమాన వైపరీత్య ధోరణులను మాత్రమే చిత్రించానని సవినయంగా తెలియజేసుకుంటున్నాను. కొన్ని భావాలు చర్వితచర్వణాలుగా వచ్చాయి. ఆ అంశాలపట్ల మరింత ఊనికకోసమే ఆ వైఖరి సాగిందని గ్రహించగలరని విశ్వసిస్తున్నాను. మంచివైపు మార్పు అంత త్వరగా సమకూడదని తెలుసు. కానీ మార్పుకు సదాలోచన ప్రేరేపించకలిగినా అదొకతృప్తి. యువభారతి వంటి నిబద్ధత కలిగిన సంస్థలో సమ్యక్‌దృష్టితో ఎదిగినవారిలోని వాడిని కనుక ఈ పుస్తకాన్ని యువభారతికే అంకితం చేస్తున్నాను. శ్రీ వంగపల్లి విశ్వనాథం గారికి ప్రత్యేకించి కైమోడ్పు లందిస్తున్నాను.

నా సాహిత్య కృషిలో అనవరతం ప్రోత్సాహకంగా నిలుస్తున్న శ్రీమతి అల్లంరాజు ఉషారాణికి, కుమారుడు చి॥స్నేహిత్‌కు, కోడలు చి॥సౌ॥ లక్ష్మీస్రవంతికి ఆశీఃపూర్వక కృతజ్ఞతలు. అర్థవంతంగా డి.టి.పి చేసిన శ్రీ కుదుపూడి భాస్కర్‌రావు (మను గ్రాఫిక్స్) గారికీ, అచ్చొత్తిన సతీష్ గ్రాఫిక్స్ వారికీ నా ధన్యవాదాలు. విజయక్రాంతి దినపత్రిక వారికి ముఖ్యంగా శ్రీ దివాకర్, శ్రీ గడియారం ధృవకుమార మైత్రేయ ప్రభృతులకు నా నమస్కారాలు. ఈ కాలమ్ రచనలపై పాఠకులయిన మీ ప్రతిస్పందనలను అభిలషిస్తున్నాను.

సదా మీ

సుధామ

98492 97958

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | కలసి నడుద్దాం | 19 |
| 2. | అందలాలకు అర్హులు!? | 22 |
| 3. | కలం దాటుల కవులమంద | 25 |
| 4. | విమర్శక కాలుష్యం | 28 |
| 5. | కొడిగట్టకూడని తెలుగు మాధ్యమ దీపం | 31 |
| 6. | కవిత్వం – ఎవరి దుఃఖమో అది! | 34 |
| 7. | పత్రికల్లో పోటీలు | 37 |
| 8. | ఓ గుడ్డముక్కా–దిమ్మచెక్కా–అవే కావాలి! | 40 |
| 9. | ప్రాచీన సాహిత్య అధ్యయనం అక్కరలేదా? | 44 |
| 10. | 'రికార్డి'ంగ్ డ్యాన్స్‌లు | 47 |
| 11. | మరల ఇదేమి రామాయణమటన్న..! | 50 |
| 12. | సభావేదికల ఔచిత్య విచార చర్చ! | 53 |
| 13. | 'బజారు' మనుషులౌతున్న ప్రముఖులు | 57 |
| 14. | వాళ్ళకేం కావాలో నిజంగా తెలుసా మీకు? | 60 |
| 15. | పూల దండ(గ)లు | 63 |
| 16. | కొన్ని 'చెత్త' కబుర్లు | 66 |
| 17. | సన్మాన శాలు(వా)లు | 69 |
| 18. | కులం వ్యాకులానికి కా(కూడ)దు | 72 |
| 19. | చిత్తమెచట భయస'హితమో!' | 75 |
| 20. | ఏది 'సుప్రీం'? – ఎవరు 'సుప్రీం'? | 78 |

| | | |
|---|---|---|
| 21. | (చెడ) తిట్టుకుందాం రా! | 81 |
| 22. | మీ(రె)టూ!.... | 84 |
| 23. | మార్పు నా(?)తీర్పు | 87 |
| 24. | సభానంతర సభలు | 90 |
| 25. | ఎప్పటికెయ్యది ప్ర'స్తుతము'...!? | 94 |
| 26. | నా(మి)నేషన్ దందాలు! | 97 |
| 27. | దిగజారుతున్న విలువల వలువలు | 100 |
| 28. | 'కుక్క బతుకు' వ్యవస్థ | 103 |
| 29. | రేప'టి' వెలుగు కోసం... | 106 |
| 30. | పుస్తకాల సంత(సం) | 109 |
| 31. | కొత్తదారిలో.. మన హైదరాబాద్ | 112 |
| 32. | 'రా(హుల్)ఫెల్' డౌన్ డీల్! | 115 |
| 33. | సమానత్వ (సా)ధన పథంలో... | 118 |
| 34. | చంద్రునిపై మొలకెత్తిన చైనా పంట | 121 |
| 35. | ఆరిపో(లే)ని దారి దీపం గాంధీ | 124 |
| 36. | మొరటువాని జోలి ముప్పును తెచ్చురా! | 127 |
| 37. | సోమవారం సాహిత్య పేజీ(చీ)లు | 130 |
| 38. | అమ్మ(భాష)ను కోల్పోవద్దు! | 133 |
| 39. | బతికుండగానే బయోపిక్‌లు... చిత్రమే మరి! | 136 |
| 40. | ఎవ్వారలుపేక్ష సేసిరది వారల చేటగు...! | 139 |

* * *

# 1

**28 మే' 2018**

# కలిసి నడుద్దాం

నిజమే! ప్రతిదానికీ సమయాలు, సందర్భాలు ఉంటాయి. ఆ వేళలో జరిగే సంగతులకు హేతువులూ ఉంటాయి. 'సమయానికి తగుమాటలాడి'... అని కీర్తనపాడుకున్నా, 'ఏ సమయానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ!' అని సినీగీతం అందుకున్నా రాగం ఏదయినా వసుధలో సమయం విలువైనది. అది సుధామయమైనా, వ్యధామయమైనా వసుధామయం అన్నమాట మాత్రం వాస్తవం.

పరిణామశీలమైన సమాజంలో సాహిత్యమూ, సంస్కృతీకూడా సమయానుకూల మార్పులకు ప్రభావితం కాక తప్పదు. పరిణామాలు ఏ పరిమాణాల్లో వున్నా ప్రభావోపేతమైనప్పుడు అవి ప్రత్యేక సమయాలుగా, సందర్భాలుగా చరిత్రలో నమోదవుతాయి. నన్నయయుగం నుండి నానీల కాలం వరకూ ఎన్నెన్ని మార్పులు ఎన్నెన్ని కూర్పులు, ఎన్నెన్ని చేర్పులు. ఒకప్పటి భాషా సాహిత్యాల స్థాయికీ, సంస్కృతీ ఆచారాల వైఖరికీ, నేటి కాలపు పరిణామాలకీ అనంత వైవిధ్యం ఉంది. కొన్నిచోట్ల అనంతవైరుధ్యమూ ఉంది.

నిజమే! నేటి రోజువారి జీవితం ఒకనాటి పద్ధతిలో లేదు, ఉండదు కూడాను. 'గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్' అనేవారు ఉన్నట్లుగానే, 'మంచి గతమున కొంచెమేనోయ్' అనే వారూవుంటారు. ఇంతకీ దేశాన్ని బట్టీ, కాలాన్నిబట్టీ, సమయాన్ని బట్టీ తనను తాను మనిషి అన్నింటా నవీకరించుకోలేకపోతే అతనికే నష్టం. నిజమే! కాలానికి వెనుకబడినవాడిని కాలానికి ఎదురీదినవాడు అనరు. మార్పు అంగీకరించలేని జడప్రాయునిగా సంభావించే ప్రమాదం ఉంది. అయితే మార్పు, పరిణామం ఏదయినా ఏ మేరకు అంగీకారం, ఆహ్వానించదగింది అనే వివేచనా ముఖ్యమే! కొత్తది ఏదయినా గుడ్డిగా విశ్వసించడం కూడా సరికాదు. మౌలికమైన

విలువలను, ఉపయుక్త ప్రాతిపదికలను, బలీయమైన పునాదులను విస్మరించి పొందే ఎదుగుదల కూడా నిస్సంకోచంగా ఔదల దాల్చవలసింది కానేకాదు. హేతువుకీ, తర్కానికీ నిలువ లేనిది ఏదయినా అంధవిశ్వాసంలా తేలిపోవచ్చు.

అందుకే సమయోచిత వివేచనలు, విశ్లేషణలు ఆవశ్యకాలు. అవి రాజకీయాలే కానక్కర్లేదు. నేటి సామాజిక సందర్భాల్లో భాషా, సాహిత్యాలు, సంస్కృతీ, ఆచారాలు, వేటి గురించయినా కావచ్చు. అవును మాట్లాడుకోవాలి, భావాలు విస్తరించాలి. ఎన్ని భిన్నత్వాలు రానీ, ఎన్ని భిన్నాభిప్రాయాలు కానీ, అభివ్యక్తం కావడం అవసరం. ఆలోచనలు మొగ్గలుగా వికసిస్తే సదాచరణలు పువ్వులుగా విచ్చుకునే అవకాశాలుంటాయి. రాలిపోయే మొగ్గలు, కసుగాయలూ ఉంటాయి. తప్పేంలేదు. కానీ ఫలపుష్ప భరితంగా సమాజ తరువు విస్తరించాలి. అందుకు చీడపీడల గురించి చర్చించి, నివారించడమూ అవసరం. సమున్నత పోషకాలకై సముచిత ఎరువులూ కావాలి.

భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు పరిమితమై సమయోచిత ఆలోచనలు సారించడానికే వసుధా(స)మయం. అసలే తెలుగు మృతభాషగా మారుతోందనే ఆర్తి విస్తరిస్తున్న కాలం ఇది. విద్యావ్యవస్థ మాతృభాషను విస్మరిస్తూ విద్యార్థులను విదేశీవిద్యా, ఉద్యోగాలకు తరలించడమే లక్ష్యంగా కుహనా విలువలతో కునారిల్లుతున్న కాలం. ఆలోచనలను ప్రేరేపించే సాహిత్యగ్రంథ పఠనం మందగించి. టీవీ ఛానల్స్ వీక్షణంలో స్థిరత్వం లేని చంచల వైఖరులకు లోబడిపోతున్న కాలం. పాఠ్య పుస్తకాలు తప్ప ఇతరేతర గ్రంథాలు ఆననివారు, గ్రంథాలయాలనేవి కనుమరుగవుతూ, ఉన్నా, వెళ్ళ(లే)నివారు, సాహిత్య సభలు, సమావేశాలు యువతను ఆకట్టుకోలేక ప్రయోజనంలేని ఒక మొక్కుబడి వ్యవహారాలుగా మారుతున్నా ఏమీ పట్ట(లే)నివారు పెరిగిపోతున్న కాలం.

ఫోర్త్ఎస్టేట్‌గా భావించబడే పత్రికలు సైతం భాషా, సాహిత్యాల విషయంలో సరియైన పట్టు, దిశానిర్దేశం లేక, ముఖ్యంగా తెలుగు పత్రికల వెలుగులు– క్రీనీడల పాలవుతున్న వైఖరులు శోచనీయంగా ఉన్నాయి. దిగ్గంతుల వంటి పెద్దలు క్రమేపి మరుగవుతున్నారు. చెప్పేవారు కరువవుతున్నారు. ఏ విషయం మీదా ఆసక్తి లేని శ్రవణశీలురూ పెరిగి, కేవలం చేతిలో సెల్‌ఫోన్, అందులో వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లోపడి చుట్టూ పరిసరాలనే కాదు, తమని తామే కోల్పోతున్నవారు కొల్లలుగా పెరిగి

పోతున్నారు. మానవ సంబంధాలు పెద్ద ప్రమాదంలో పడుతున్న వాస్తవం విస్మరించకూడదు. ఇప్పటికైనా 'ఉత్తిష్ఠోత్తిష్ఠ' అన్న జాగరూకతతో మేల్కొనకపోతే ఒంటరి ఎడారిలో తప్పిపోయి,మనిషే మటుమాయమయ్యే పరిస్థితులు హెచ్చరికలుగా ద్యోతకం అవుతున్నాయి.

కుల, మత, ప్రాంత, జెండర్‌లతో శకలాలు శకలాలుగా మానవ సమాజం మారితే ఇక 'విశ్వశ్రేయస్సు', 'సర్వ మానవ సౌభ్రాతృత్వం', 'మానవీయత' అన్న పదాలకు అర్థమే ఉండదు. పడగొట్టేది కాక విడగొట్టేది కాక, కలిపి కుట్టేదిగా, సమష్టికి సమకట్టేదిగా భాషా, సాహిత్య, సాంస్కృతిక అంశాలు సహకరించేవి కావాలి. చైతన్యవంతమై ఉద్బుద్ధమైనప్పుడే నిలచి నిలుపుతుంది. చదవడం, రాయడం, మాట్లాడటం, ఆలోచించడం అనే నాలుగు పునాది స్తంభాలపైనే ఏ భాషాభవంతి అయినా నిలబడగలుగుతుంది. తెలుగు భాష విషయంలో ఆ నాలుగు పార్శ్వాలను భావితరం కూడా అందిపుచ్చుకుని ఎదగాలి. ఏది కుంటుపడినా ప్రమాదమే!

అందుకే భవిష్య కాలాన్ని– వర్తమాన సమయాలతో, సందర్భాలతో, సాహిత్య సాంస్కృతిక మేళవింపుతో సుసంపన్నం చేసుకోవాల్సి ఉంది. గతం పునాదులపై, వర్తమానం విశ్లేషణలతో, భవిష్య నిర్మాణం వ్యక్తిత్వానికి వికాసవంతంగా మలుచుకోవాలి. అందుకే ఈ 'కాలమ్' ప్రయోజన దాయకమైన 'కాలం'కు హితచింతనతో సంధానం చేసుకుందామనేదే ప్రయత్నం. వేయిభావాలు వికసించనీయండి. హిత సహితమైనదిగా సాహిత్యం విస్తరించనీయండి. సంగతులూ సందర్భాలూ సుధామయమై నవజీవనోదయాలను ప్రభవించనీయండి. వసుధ సువర్ణమయమై భాసించనీయండి. అందుకోసం కలసి నడుద్దాం రండి! *

# 2

**4 జూన్' 2018**

# అందలాలకు అర్హులు!?

"వేడి కూడా ఒక రుచే" అనే మాట ఉంది. కొన్ని పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే ఆస్వాదయోగ్యంగానూ, ఆమోదయోగ్యం గానూ ఉంటాయి. వేడి చల్లారాక బాగుండవు. ఒక్కోసారి అయిష్టతనూ, విసర్జించాలన్న భావనను కూడా కలిగిస్తాయి. కళారూపాలకూ నేడు ఈ మాట వర్తించేదిగా మారుతోంది. ఉద్యమం వేడిలో ఆట, పాట అన్నీ రాణించి, ఉద్యమ లక్ష్యం నెరవేరిందని, ఉద్యమ స్వభావం అంతరించాక, చప్పబడిపోయే వైఖరి నిజానికి సీరియస్‌గా పట్టించుకుని వివేచించదగింది. కొత్త రాష్ట్రంగా రూపొందాక తెలంగాణలో కళారూపాల స్వరూప, స్వభావాలు మారిపోయాయి. ముఖ్యమంత్రికి గల సాహిత్య, సాంస్కృతిక అభిరుచుల కారణంగా ఈ నాలుగేళ్లలో అందలాలెక్కిన కవులు, రచయితలు, కళాకారులున్నారు. మునుపెన్నడూ లేనంత ప్రాముఖ్యం, గుర్తింపు ఒక్కసారిగా అందిపుచ్చుకున్న వారున్నారు. అయితే ఈ అందలాలెక్కినవారంతా అందుకు అర్హులేనా అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. దానిని లేవనెత్తేవారూ ఉన్నారు. తెలంగాణ రాష్ట్రావతరణ నాల్గవ వార్షికోత్సవ సందర్భంగా అక్షరాల లక్షా వెయ్యి నూట పదహార్ల నగదుతో ప్రభుత్వ పురస్కారాలందుకున్న నలభైమందికి పైగా పండితులు, కవులు, రచయితలు, వివిధ రంగాల నిష్ణాతులు అందరికీ అభినందనలు. ఇప్పుడు పురస్కార గ్రహీతలైన వారి కన్నా ప్రతిభావంతులు, గుర్తింపు పొందినవారు, సాహిత్య సాంస్కృతిక రంగాలకు చిరకాలంగా నిస్వార్థంగా తమ సేవలందించి ప్రజాభిమానం చూరగొన్నవారు లేరా? అంటే-నిజానికి గుర్తింపు పొందని ప్రతిభావంతులు ఉన్నారు, ప్రజల కోసం, ప్రజాపక్షాన నిలిచే కవులూ, రచయితలూ, పాలకులకు ఆనకపోవడం అంటే, రాజకీయం రాణకెక్కినంతగా సత్యధర్మాలు రాణకెక్కకపోవడమే! ప్రజాచైతన్యంలో

కలాలు, గళాల పాత్ర అవిస్మరణీయం. అందునా ఉద్యమస్ఫూర్తిని ఎగసనదోసి లక్ష్యసాధనవైపు ప్రజలను సమాయత్తం చేసిన మౌలిక ప్రభావదీప్తులు అవే! అధికారపీఠం ఎక్కాక అస్మదీయులు, తస్మదీయులు అన్న భావన రాజకీయం అవుతుంది తప్ప, నిజమైన ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడానికి రాజకీయం అవరోధం కాకూడదు. ప్రజల మనుషులను, ప్రజా రచయితలను పక్కనపెట్టక, నిజానికి మౌనంగా చిరకాలంగా పనిచేసుకుంటూ పోతూ ప్రజాదరణ పొందినవారిని, ఏళ్ల తరబడి కృషిచేసీ– ఏ గుర్తింపునూ ఆశించని, నోచని వారిని నిజానికి గుర్తించి సత్కరించడం చేయవలసిన పని. ఆ విచక్షణ పాలనారంగంలోని బాధ్యతాయుత అధికారాలతో వ్యవహరిస్తున్న వారికి ఉండాలి. ప్రముఖ కవి, రచయిత శ్రీ జయధీర్ తిరుమలరావు అన్నట్లు తెలంగాణ సాయుధ రైతాంగపోరాటం, ఇతర అభ్యుదయ విప్లవ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ పలు కళారూపాలు విశిష్ట పాత్రను పోషించాయి. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమం, దాని స్వభావం పోయింది. ఈ నాలుగేళ్లలో ఉద్యమస్ఫూర్తి సాహిత్యం దాదాపు లేదు. అతికొద్ది సంఖ్యలో స్వరాలు, గళాలు ప్రజల కోసం పాడుతున్నాయి. భవిష్యత్తులో కళారూపాలు లేకుండా ఉంటాయా లేక మరో మార్పుకు దోహదం చేస్తుందా అనేది పాలకుల వివక్ష మీద, ప్రజల చైతన్యం మీద ఆధారపడి ఉందనేది అక్షరాలా నిజం.

కవి, కళాకారుడు ఎప్పుడూ ప్రతిపక్షమే అన్నట్లుగా ఉన్నప్పుడే వారు ప్రజాపక్షంలో ఉన్నట్లు. అలాకాక పాలక ప్రభువుల అనుగ్రహ వీక్షణాల కోసం, ప్రభుత్వ కైవారాల కోసం ఆశించేవారయినట్లయితే వారి కలం, వారి గళం స్వరం మార్చుకుంటుంది. “వందేమాతర గీతం వరుస మారుతున్నది” అన్నట్లుగా కవులు, రచయితలు వందిమాగధులు అయ్యే ప్రమాదం ఉన్నది. నిర్మాణాత్మకంగా పాలకవైఖరులను ఎండగడుతూ నిజమైన ప్రజాసంక్షేమ దిశానిర్దేశం చేసే కలాలు, గళాలు సుమధుర ధ్యేయాలు కావాలి. కానీ అందలాలు వారికి అందవు. ఎందుకంటే అందలమంటేనే ప్రజలు కాక ప్రభువు ఎక్కించేదిగా అయినప్పుడు ప్రభువు కృపాకటాక్షాలు ఎవరివైపు ప్రసరిస్తాయో వారే సంపదలు, అధికారాలు అనుభవించేవారవుతారు.

అందలం ఎక్కినవారిపట్ల అసూయ స్వభావంతో మాట్లాడటం కాదిది. విస్మృత ప్రతిభావంతుల పట్ల, వారు గుర్తింపు నోచనితనం పట్ల ఒక ఆర్తి మాత్రమే! ఎందుకంటే

ప్రతి ఎంపికకూ నిర్ణాయక కమిటీలుంటాయి. ఆ నిర్ణాయక కమిటీలలో పాలకులు అనుగ్రహించబడిన వారే ఉండవచ్చు. కానీ వారు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగల, అసలైన ప్రతిభ గుర్తించగల నిపుణులు కారనుకోవడం సరికాదు. కానీ ఆ నిర్ణాయక సభ్యులే ఒత్తిడులకు, స్వలాభాలకు, పాలక అనుగ్రహం పటిష్టపరుచుకుని అధికారవ్యవస్థలో కొనసాగే ఆరాటాలకు, ప్రలోభాలకు లొంగి తమ విచక్షణ ఉపయోగించక, ఆత్మను జోకొట్టి, కేవలం లౌకిక స్వార్థ చింతనలకు ప్రాముఖ్యం ఇచ్చి తలలూపే వారిగా, రబ్బరు స్టాంపు మాదిరిగా వ్యవహరించే వారు కావడం వల్ల ప్రజలలో అందలాలు ఎక్కినవారి పేర్లు కొన్ని గమనించినప్పుడు సందేహాలు, నిరసనలు, అయోగ్యతకు అందలాలు దక్కి అసలు గౌరవనీయులు, విద్వాంసులు విస్మృతి పాలయ్యారన్న ఆర్తి కలగడం జరుగుతుంటుంది. నిజమే! అందరూ అందలాలు ఎక్కేవారయితే మోసేవారు ఎవరని సామెత ఉంది. అయితే ఎక్కవలసిన వారు మోసే వాళ్లయి, మోతగాళ్లవ్వలసిన వారు ఎక్కినప్పుడే-వ్యవస్థలోని అవస్థ, పాలనలోని నిర్ణయాలు పరిహాసాస్పదాలవుతూంటాయి. నిజానికి విస్మృతులు ఎప్పటికీ విస్మృతులుగానే ఉండిపోతే విషాదం. కాలం వెంట ఎప్పటికోగాని గుర్తింపు లభించని అనామకులుగా రాలిపోతే విషాదం కానీ, సమయోచిత సత్కారాలు అందుకోగలిగితే అభినందనీయం! ఏమయినా ఇటువంటి సందర్భాలలో శతకకర్త చెప్పినమాటే శిరోధార్యం సమాధానపడేందుకు.

"పండితులైన వారు దిగువం దగనుండగ, నల్పుడొక్కడు
ద్దండత బీఠమెక్కిన బుధప్రకరంబుల కేమి యెగ్గగున్
గొండక కోతి చెట్టు కొనకొమ్మల నుండగ గ్రింద గండభే
రుండమదేభ సింహనికురుంబములుండ చేరి భాస్కరా!"

నిజానికి గురు అనుగ్రహం, తల్లిదండ్రుల ప్రేమ, బంధుమిత్రుల సమాదరణ, భార్య పిల్లల ప్రేమాభిమానాలు మించి సౌశీల్యుడు కోరుకోదగినవి ఏమీలేవు. పాలకుల అస్థిర ఆగ్రహానుగ్రహాల వెంపర్లాటతో ఆశల ఊబిలో "ఆధునిక జీవి" కావడం మూర్ఖత్వం. అజ్ఞానం!. 'లోకం దృష్టిలో కాదు, దేవుని దృష్టిలో ధనవంతుడివి కావడానికి ప్రయాసపడు' అని బైబిల్ కూడా చెబుతోంది. *

3

12 జూన్' 2018

# కులం దాటుతు కవులుంద

సమాజం గొప్పదే. శక్తిమంతమయిందే. కాదని ఎవరు అన(లే)రు. వ్యష్టి సమష్టిగా రూపొందాలి కూడాను. కానీ చిక్కు ఎక్కడొస్తుందంటే – సమూహంలో గుర్తింపు కోసం ఆరాటపడడం! పదిమందీ గుర్తించే ప్రతిభ కలిగి, వారిచే గుర్తింపబడటం వేరు. పదిమందిలో తనను తాను ప్రమోట్ చేసుకోవడం వేరు. సాహిత్యంలోనూ ఈ గుర్తింపు సమస్య ఉంది. తమ ప్రాంత కవులనూ, రచయితలనూ అణగద్రొక్కారనీ, సాహిత్య చరిత్రలో వారికి స్థానం కావాలనే కల్పించలేదనీ పొందిన ఆర్తి వల్ల కలిగిన ఆవేశం కూడా – తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో ప్రముఖ పాత్ర వహించింది అన్నమాట యథార్థం! అందువల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక అంశాలపట్ల ప్రత్యేక శ్రద్ధ, అధ్యయనం మొదలయ్యాయి. తెలంగాణ సాహిత్య అకాడమిని స్థాపించడం, గత సంవత్సరం పెద్దఎత్తున మహాసభలు నిర్వహించడం అందులో భాగమే! ఇంతవరకూ గుర్తింపు, వెలుగుకు నోచుకోని ఎందరినో జిల్లాల వారీగా గుర్తించి సత్కరించడం, వివిధ సందర్భాలలో కవులను, కళాకారులను సన్మానించుకోవడం జరుగుతూ ఉంది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలలో సాహిత్యానికి అందునా కవిత్వానికి ముఖ్యంగా అవధానాలకూ, పద్యాలకూ, వచన కవిత్వానికీ ఇచ్చిన ప్రాముఖ్యం అనుపమానం. ఉదయం నుంచి రాత్రి వరకు పబ్లిక్ గార్డెన్స్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మహాసభలు జరిగినన్ని రోజులూ నిరంతరాయంగా కవిసమ్మేళనాలు జరగడం విశేషం! దాదాపు మూడువేల మంది వరకూ కవులు ఆ కవిసమ్మేళనంలో పాల్గొన్నారనీ, ప్రతి కవినీ మూడువేల రూపాయలతో, శాలువాతో, జ్ఞాపిక పత్రంతో సత్కరించారని తెలిసినప్పుడు... కవులకు

ఆ గుర్తింపు పట్ల హర్షాతిరేకాలు చెలరేగినా, అసలు నిజంగా అన్నివేల మంది కవులున్నారా? అనే సందేహం కూడా పొడచూపినమాట వాస్తవం. ఒక్కసారిగా ఇంతమంది ఎలా, ఎక్కడనుంచి, ఎందుకు పుట్టుకొచ్చారు? ఎప్పుడో పానుగంటి వారు 'కవితా రసిక ప్రహసనం'లో ఉటంకించినట్లు ఊరూరా కవులు, పేటపేటకూ కవులు, ఇంటింటికీ కవులు అన్నట్లు తామరతంపరలా ఇంతమంది కవులు ఎలా వచ్చారో, వారు రాసినదంతా ఎలా కవిత్వమైపోయిందో అర్థం కాక విజ్ఞులు నివ్వెరపోయారు. బహుశా ఇవాళ కవిత్వ విస్తృతి గమనించాక, ఆ అచ్చెరువు మరింత పెరుగుతూనే ఉంది! ఇవాళ ఫేస్‌బుక్‌లో, వాట్సాప్‌లలో కవిత్వం పొంగి పొర్లుతోంది. కవిత్వం పత్రికలకు పంపితే, కనీసం సంపాదకులు పరిశీలించి–ఎంపిక చేసి బాగుంటే ప్రచురించడం అనేదయినా ఉంటుంది. ఇప్పటి కొన్ని పత్రికలలో ఆ సంపాదక ఎంపికలు కూడా లేక, ఇతరేతర కారణాలు, ప్రభావాలతో అచ్చుపురుడు పోసుకుంటున్న రచనల సంఖ్య పెరిగిపోతోంది అనుకోండి! కానీ ఈ అంతర్జాల మాధ్యమాలు మరీ అందివచ్చేయడంతో, తోచినదేదో కవితగా ఎవరయినా ఫేస్‌బుక్‌లోనో, వాట్సాప్‌లోనో పోస్టుచేయడం, దానికి చదివినా చదవకపోయినా, కవిత్వం గురించి తెలిసినా తెలియకపోయినా.. తక్షణ ప్రతిస్పందనగా 'లైకులు' అంటూ రావడం, ఆ లైకులూ, కామెంట్లు చూసుకుని తమవి గొప్ప రచనలనీ, తాము గొప్ప కవులమనీ, యువత పొంగిపోవడం, ఎవరయినా వారు రాసిన రచనలోని లోపాన్నో, శిల్పరాహిత్యాన్నో ఎత్తిచూపితే అలా ఎత్తి చూపినవారు అసూయగ్రస్తులో, తమ విరోధులో అయినవారని భావించడం జరుగుతోంది. తక్షణ కీర్తి ప్రతిష్టల ఆరాటం పెరిగిపోతోంది. దీనికి తోడు సామూహిక సంతర్పణలు, సామూహిక వివాహాలు తంతున–సామూహిక కవి సమ్మేళనాలు జరుగుతున్నాయి. ఇన్నేసి గంటలు కవిసమ్మేళనాలనీ, ఫలానా రికార్డుల కోసం కవిసమ్మేళనాలనీ పలు చోట్ల నిర్వాహకులు ఏర్పాటు చేసి 'మంద'కవిత్వాన్ని పరుగులెత్తిస్తూ, అందులో పాల్గొన్నవారిని సత్కరించడం, ఎవరికి వారు ఆ సత్కార ఫొటోలను తమతమ ప్రాంత పత్రికల్లో వార్తలుగా వేయించుకోవడం, తమ గురించి రాయించుకోవడం మామూలైపోయింది. అంతటితో ఆగకుండా ఆ సన్మాన దృశ్యాలు మళ్ళీ వాట్స్‌అప్, ఫేస్‌బుక్స్‌లో ప్రత్యక్షం కావడం సర్వ సాధారణమై పోయింది. ఆవగింజంత ప్రతిభ ఉన్నా గుమ్మడికాయంత ప్రచారం చేసుకునే ఆర్భాట కవులు పెరిగిపోయారు.

అధ్యయనం, అభ్యాసం లేకుండానే రాసుకుంటూ పోయేవారు, సంకలనాలుగా ముద్రించుకుని ఆవిష్కరణలనీ, సమీక్షలనీ, వారిపై వ్యాసాలనీ ఆర్భాటం చేసుకునేవారు పెరిగిపోయారు. "ఎందుకయ్యా బండ్లకొలదిగ ఎదకదల్చని కావ్యరాశులు" అన్న వివేకం మరచి, పుస్తకాలు వేసి సన్మానాలనీ, అవార్డులనీ వెంపర్లాడే వారు అధికమయ్యారు. సంస్థలు కూడా అలాగే పుట్టుకొచ్చి ప్రముఖుల పేరుమీద అవార్డులు నెలకొల్పి అర్భకులకు కట్టబెట్టడం, ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో ఈ అవార్డుల పంపకాలు జరుగుతుండటం, అసలు వాటి పేరెత్తితేనే రోత కలిగే స్థాయికి దిగజారుతున్నాయి. పైగా వాటిపై డాక్టరేట్ పరిశోధనలు కూడానూ! దీనికి తోడు గ్రూపు కల్చర్ అనేది ఓ తెంపరితనమై పొడచూపుతోంది. 'నాయకుడు' అయిపోవాలన్న ఆరాటంతో, ఇలా గ్రూపులు ఏర్పరచి, యువతకు ప్రోత్సాహం పేరుతో వారికి సరియైన దిశానిర్దేశం ఇవ్వక 'తమ నాయకత్వంకు సంఖ్యాబలం ఎంత పెంచుకుని గురుస్థానంలో వెలిగిపోదామా' అన్న తాపత్రయాల్లో కొందరు సీనియర్ కవులూ, రచయితలు కూడా సృజన కొరవడి దారితప్పుతున్నారు. కవిత్వం కావాలి కవిత్వం అంటూనే, జయకేతనాలు ఎగరవేస్తూనే, పసలేని అర్భకులను ప్రోత్సాహం పేరిట పైకెత్తడం, తాము 'లీడర్'గా వెలుగొందడానికే అనిపింపచేస్తున్న వారు ఉన్నారు. అధ్యయనం, అభ్యాసం లేని కవిత్వం, వస్తుశిల్ప సమన్వయం లేని కవిత్వం, ప్రచారార్భటుల కవిత్వం పెరిగినంతగా"కదిలేది, కదిలించేది పెనునిద్దుర వదిలించేదీ, మునుముందుకు నడిపించేదీ" అని శ్రీశ్రీ అన్న తరహా కవిత్వం కాక, అపరిపక్వతకే అత్యున్నత పీఠాలన్నట్లవుతోంది. కవికి నేడు అనుభవం, అధ్యయనం, అభివ్యక్తి కన్నా, లౌక్యం, 'పట్టు' పరిశ్రమ, చొరబాటు, ఆక్రమణం అనేవి కీర్తికి అడ్డదారులయ్యాయి. నిజానికి అధ్యయన శిబిరాలు, శిక్షణా కేంద్రాలు యువత అభ్యున్నతికి ఎంత ఆవశ్యకమయినా వాటి నిర్వహణలో, అందులో శిక్షణ ఇచ్చేవారిలో కూడా రాజకీయాలు, పలుకుబడులే, ప్రధానమై కూచుంటే 'కాటుక కంటినీరు చనుకట్టుపైబడంగ' సరస్వతీ విలాపమే కనిపిస్తుంది. కవిత్వానికి 'మంద' వైఖరికాక, ఆమందానంద అనుభూతి వైఖరి అభివ్యక్తం కావాలని ఆకాంక్షిద్దాం! *

**4**

**18 జూన్' 2018**

# విమర్శక కౌశల్యం

వచ్చిన చిక్కు ఏమిటంటే 'విమర్శ' అంటే 'తిట్టు' అనే భావన చాలా మందిలో స్థిరబడిపోయింది. అందువల్ల ఎవరయినా విమర్శించారు అంటే తప్పుపట్టుకున్నారనీ, దోషాలను ఎత్తిచూపి నిందిస్తున్నారనీ అనుకోవడం మామూలైపోయింది. అయితే విద్యాధికులు, కవులు, రచయితలు అనుకునేవారు కూడా 'విమర్శ'కు సరియైన విశ్లేషణమనే సంగతి తెలిసి కూడా తమ రచనలను విమర్శ పరిధిలో కాక కేవలం ప్రశంసా పరిధిలోనే ఆశించడం, అభిలషించడం, అందుకు మారుగా జరిగితే తట్టుకోలేకపోవడం, గింజుకోవడం జరుగుతూనే ఉంది. అందుకే 'సాహిత్యవిమర్శ' అనేది మనకు ఒక రకంగా ఎదగలేదన్న మాట యధార్థం. పైగా సాహిత్య విమర్శకులనేవాళ్లు కూడా తమదైన కళ్ళద్దాల్లోంచే పరిశీలించడం, తమ భావజాలానికి అనుగుణంగా తోచని రచయితలను, వారి రచనలను విస్మరించడం జరుగుతోంది. మార్క్సిస్టు భావజాలపు రచనలకు పెద్దపీట వేస్తూ, సంప్రదాయ అభిజ్ఞతతో కూడినవో, మధ్య తరగతి భావజాలపు భిత్తికమీదో వెలువడిన రచననూ, సదరు రచయితలనూ చిన్నచూపు చూడడం ఒక లోపమే నిజానికి. సాహిత్య విమర్శకుడు సహృదయుడై ఉండాలి. ఇక్కడ సహృదయత అంటే ఏ రచయితనూ, ఏ రచననూ తను బేరీజు వేస్తున్నాడో ఆ రచయితకు చెందిన, ఆ రచనకు చెందిన భావజాలం పట్ల వ్యతిరేక భావన ఉన్నవాడు కాకూడదు. ఆ భావజాలం గురించిన అవగాహన ఉండాలి. విశ్వనాథ వారి రచనలను మార్క్సిస్టు దృక్కోణాలలో చూసి పనికి రానివని త్రోసిరాజనడం, ఏ శివసాగర్‌నో, చెరబండరాజునో నవ్యసంప్రదాయ ఫణితిలో చూసి విమర్శించడం అనేది హాస్యాస్పదం అవుతుంది.

తెలుగు సాహిత్య విమర్శ సరియైన దిశగా ప్రయాణించడం లేదంటే అందుకు కారణం విమర్శకులనబడేవారు తమదైన రాగద్వేషాలతో సాహిత్య విమర్శకు

పూనుకోవడమే కారణం. విమర్శకుడు నిజానికి ప్రతిభామతి. ఒక రచనను ఆకాశానికి ఎత్తేయనూగలడు. తూర్పారబట్టి ఎందుకూ పనికిరానిదని తేల్చేయనూగలడు. అతని మేధ రెండంచుల పదునుగలదే. కానీ సాహిత్య విమర్శలో మేధకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి, హృదయాన్ని విస్మరించడం సరికాదు. రచయిత ఒక రచన చేయడంలోని అతని హృదయాన్ని పట్టుకోకుండా, తమదైన కొలబద్దలతో బేరీజు వేసి విమర్శించడం విజ్ఞుల పనికాదు. తెలుగు కవిత్వంలో సూర్యుడు, తెలుగు కథల్లో, నవలల్లో స్త్రీ ఆత్మగౌరవ చిత్రణ వంటి విషయాలనెన్నుకుని విమర్శనా వ్యాసాలు వెలయించే విమర్శకులున్నారనుకుందాం. నిజమే! సమగ్ర పరిశీలనకు వారికి ఆకరగ్రంథాలు అన్ని లభించలేకపోవడం, అందరి గురించి ఉటంకించడం సాధ్యం కాదనే మాట వాస్తవమే. కాదనలేం! కానీ మౌలికంగా గుర్తించవలసిన వారిని విస్మరిస్తే వారెలాంటి విమర్శకులనుకోవాలి. ఉదాహరణకు కె.శివారెడ్డి రక్తం సూర్యుడు, శేషేంద్ర కవిత్వాన్ని ప్రస్తావించకుండా 'తెలుగు కవిత్వంలో సూర్యుడు' అనే వ్యాసం సమగ్రం కాలేదు. అలాగే కవిరాజు గురించి ప్రస్తావించకుండా ఆ కవిని ఉపేక్షించడం విమర్శకుడి లోపమవుతుంది కానీ ఆయనను ఉదాహరించకపోవడం కవికి లోటుకాదు, చేటూకాదు. అలాగే స్త్రీ ఆత్మగౌరవ చిత్రణ గురించి సాహిత్య విమర్శచేసే స్త్రీ విమర్శకులు సైతం ఇటీవలే దివంగతురాలైన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి నవలలను, కథలను విస్మరించడం జరిగితే అంతకంటే శోచనీయ స్థితిలేదు. కానీ అలాంటి స్థితే సాహిత్య ప్రపంచంలో పొడచూపుతోంది. యద్దనపూడిది వంటింటి సాహిత్యం అని తేలికచేసి చూస్తూ, తమ విమర్శ పరిధిలోకి ఆమెను, ఆమె రచనలను రానివ్వని వారున్నారు. అలా ఆవిడని ఉపేక్షించడం తమ గొప్పగా భావించేవారున్నారు. ఇలా సాహిత్య విమర్శ కునారిల్లుతోంది. ఎందరో కవులు దశాబ్దాలుగా కృషి చేసి సాహితీ రంగంలో ఉన్నా, నిన్నమొన్న వచ్చిన కొత్త కవులను, అర్భక కవులను నెత్తినెత్తుకుని, వారి మీద సాహిత్య వ్యాసాలు రాయడం, విశ్వవిద్యాలయాల్లో కూడా అస్మదీయులనుకునే వారిపైనే ఎంఫిల్, పీహెచ్‌డీ పరిశోధనలు చేయడం, చేయించడం జరుగుతున్న సంగతే! సిద్ధాంత గ్రంథాలుగా వెలువడుతున్న వాటినీ, డాక్టరేట్ పట్టాలు పొందుతున్న వారి పరిశోధన స్థాయినీ– గమనిస్తున్నప్పుడు సాహిత్య విమర్శ ఎంతగా దిగజారిందో గ్రహించగలుగుతాం. 'వడ్డించే వాడు మనవాడయితే కడపటనున్నా ఫరవాలేదు' అన్న చందాన పరస్పర అవసరాలు, వైయుక్తిక ప్రయోజనాలు, తమకు

ఒనగూరే అధికారిక లాభనష్టాలు, వీటిని అనుసరించే కొందరు రచయితలు, కవులను తలకెత్తుకోవడం, వారిపై పరిశోధనలు చేయడం, చేయించడం ఓ అనుచిత వైఖరియే అధికశాతం అమలవుతోంది. స్థాయిలేని వారికి ఒక స్థాయిని, హోదాని సాహిత్య ప్రపంచంలోనూ కల్పించే విమర్శక పెద్దలు ఎక్కువైపోతున్నారు. అనుచరగణాన్ని పెంచుకునే నాయకత్వ లాలస, సాహిత్య పీఠాధిపత్యాల ఆరాటం కొందరిలో ప్రబలి ఇలా సాహిత్య విమర్శ తప్పుదోవలు పట్టడం తటస్థిస్తూ ఉంది. కొన్ని పత్రికల సాహిత్య పేజీలు ముఠా నిలయాలుగా మారుతున్నాయనిపించడానికీ, అకాడమీలు సైతం ఏర్పాటు చేసే సాహిత్య సభల్లో, సెమినార్లలో పాల్గొంటున్న కొందరి పేర్లను చూస్తుంటే సాహిత్యకారులే నివ్వెరపోవడానికి కారణాలు గోప్యమైనవేమీ కాదు. 'క్విడ్‌ప్రోకో' అన్నట్లు పరస్పర ప్రలోభాలే పైచేయిగా కనిపిస్తూనే ఉంటాయి. తెలిసితెలిసీ సాహిత్య విమర్శకులు తమ రచనల్లో కొందరి గురించి విమర్శ చేయకపోవడమే కాదు, కావాలనే కొందరిని ఉపేక్షించి వారి ఊసెత్తక వ్యవహరిస్తుంటారు. అస్మదీయులకు, భజనపరులకు, శిష్యగణాలకు మాత్రమే చోటు కల్పిస్తుంటారు. ఒకప్పుడు 'చేరాతలు' వంటివి కూడా ఈ వైఖరిని అధిగమించలేకపోయాయి.

తాము పైకెత్తిన వారి చేతిలోనే భంగపడ్డవారున్నారు. నిజమే! ప్రతిభావంతులను గుర్తించగలిగే కాలంపోయి ప్రచారార్భాటాలతో పైకెగబ్రాకేవారి కాలం ఆసన్నమైంది. మిగతా రంగాలలోలాగానే సాహిత్య రంగంలోనూ ఈ కాలుష్యం ఆవరించింది. సాహిత్య పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న విమర్శక కాలుష్యం నివారించుకోలేకపోతే ఇప్పటికే లుక్‌కల్చర్‌తో మందగించిపోయిన బుక్ కల్చర్, సాహిత్యానుశీలనం సమాధిగతమయ్యే ప్రమాదమే ఉంది. అందువల్ల విమర్శకులు విచక్షణాపరులు, నిజాయితీపరులు, అవినీతి, అస్మదీయ ప్రీతిలేని వివేకశీలురు, రంగుటద్దాలలోంచి వీక్షించని సమ్యక్ దృష్టిపరులు కావడం అవసరం. కప్పి చెప్పే వాడు కవి, విప్పిచెప్పేవాడు విమర్శకుడు అన్నారు. విమర్శకుడు దాక్కోకూడదు, విలువల విధ్వంసకుడు కాకూడదు. కశ్మలాన్ని కడిగేవాడు కావాలి. సాహిత్య పరిరక్షకుడుగా నిలవాలి. *

**5**

**25 జూన్' 2018**

# కొడిగట్టకూడని తెలుగు మాధ్యమ దీపం

తెలుగు సాహిత్యం పట్ల నేటితరానికి ఆసక్తి సన్నగిల్లుతోందనీ, పుస్తకపఠనం మందగించి, సాహిత్య సభలవైపు కూడా యువత ఆకర్షితులు కావడం లేదనీ వినిపిస్తున్న మాటే కాదు కనబడుతున్న ఒక యథార్థం కూడాను. ఎక్కడ ఏ సాహిత్య సభ జరిగినా ప్రేక్షకుల్లో ముప్ఫై అయిదేళ్లలోపు వారు కనబడడమే గగనమై పోతోంది. సి.నారాయణరెడ్డి గారు మునుపు అన్నట్లుగా 'బుక్ కల్చర్' పోయి 'లుక్ కల్చర్' ఆక్రమించిందన్న మాట సత్యం. సాహిత్యం దాకా ఎందుకు? అసలు తెలుగు భాషే ప్రమాదంలో పడింది. సాహిత్యం లేకపోయినా భాష ఉంటుంది. ఉండాలి. భాష ఉంటేనే కదా సాహిత్య సృష్టి అనేమాట! భాషాభివృద్ధికి సాహిత్యం దోహదపడుతుంది. అందువల్ల ముందు భాషను నిలుపుకోవడం ముఖ్యం. తెలుగు మాట్లాడడమనేది నిలిచిఉన్నా, ముఖ్యంగా తెలుగు చదవడం, రాయడం రాని జనసంఖ్య తెలుగువారిలోనే నేడు పెరిగిపోతోంది. ఆంగ్ల మాధ్యమంలో చదవడం, విద్యా, ఉద్యోగాలకై విదేశీయం పట్లే మోజు ఉండడం కారణంగా– పిల్లలే కాదు, పిల్లల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఆంగ్లం రావాలని అభిలషిస్తున్నారే కానీ, తెలుగు కుటుంబంలోని తమ తెలుగు పిల్లలకు తెలుగు చదవడం, రాయడం రాకపోయినా ఫరవాలేదన్నట్లు పట్టించుకోక, పైగా అలా తెలుగు చదవనూ, రాయనూ రాకపోవడమే గొప్పగా భావిస్తున్నారు. నిజంగా ఇది చాలా శోచనీయమైన విషయం. తెలుగు కుటుంబాలలో జన్మించడం వల్ల ఇంట్లో తెలుగు మాట్లాడుకోవడం ఇంకా నిలిచి ఉంటోందేమోగానీ భాషలో వాళ్ళకు తెలుగు లిపి చదవడం, రాయడం రానివారే అనేకులున్నారివాళ. తెలుగు చదవడమే రానప్పుడు ఇంక తెలుగులో ఉన్న పుస్తకాలు, గొప్ప సాహిత్యంతో వాళ్ళకు పరిచయం ఎలా ఏర్పడుతుంది? చదివితేనే కదా సాహిత్య గ్రంథాల ప్రభావం

మాట అనేదీ, సాహిత్య రచనాసక్తి ఏర్పడటం అనేదీ సంభవించే వీలున్నది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు తమ కళాకాంతులను కోల్పోతున్నాయి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రభంజనం ఎక్కువైపోయింది. ఆ ప్రైవేటు విద్య ఎప్పుడయితే వ్యాపారాత్మకంగా మారిందో తెలుగు చదవడం, రాయడం వల్ల ప్రయోజనం శూన్యమనీ ఉన్నత విద్యా, ఉద్యోగాలకు ఆంగ్లమే తప్ప తెలుగుతో అసలు పనేలేదనే భావనతో తెలుగు భాషను ప్రక్కకు నెడుతున్నారు. హైస్కూలు స్థాయి వరకూ ప్రతి తరగతిలో తెలుగు ఒక సబ్జెక్టుగా బోధింపబడడం అనివార్యం అనే నిర్ణయం తీసుకున్నా, ఆచరణలో మాత్రం అందుకు ప్రైవేట్ యాజమాన్యాల వారి విద్యాసంస్థలు మినహాయింపు అన్నట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లే గోచరిస్తోంది. నిజానికి తెలుగు ఒక పాఠ్యాంశంగా ఉండడం కాదు, విద్యాబోధన అంతా తెలుగులోనే జరగాలి అని నిర్ణయం తీసుకుని అమలుపరిస్తే తప్ప మార్పుకు దోహదం రాదు. తెలుగు మాధ్యమం అనేదే కొడిగట్టుతున్న దీపమైపోతోంది. ఉన్నత విద్యామండలి పెద్దలే ఉన్నస్థితి పట్ల నివ్వెరపోతున్నారు. ప్రాథమిక పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో తెలుగు మాధ్యమం విద్యా సంస్థలకు ప్రాధాన్యం తగ్గిపోయింది. మోడల్ స్కూల్స్, గురుకులాలు, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలకు ఉన్న గిరాకీ తెలుగు మీడియం పాఠశాలలకు, కాలేజీలకు లేదు. ఈ ఏడాది ఇంతవరకూ తెలంగాణలో జరిగిన అడ్మిషన్లలో రెండు విడతలు కలుపుకుని కూడా డిగ్రీ కాలేజీల్లో నాలుగు లక్షల సీట్లు ఉంటే తెలుగు మాధ్యమంలో కేవలం 27,766 మందే చేరారు. ఆంగ్ల మాధ్యమంలో మాత్రం లక్షా ఇరవై అయిదు వేల 885 మందికి సీట్లు లభించాయి. నలభై నాలుగు డిగ్రీ కాలేజీల్లో అసలు ఎవరూ అడ్మిట్ కాలేదు. 188 కాలేజీల్లో ఓ పాతిక మంది విద్యార్థులే చేరారు. మూడో దశ అడ్మిషన్ల పర్వం మొదలైంది కూడా. గత ఏడాది కన్నా గవర్నమెంట్ కాలేజీల్లో చేరినవారి సంఖ్య మునుపు 29 వేలు కాగా, ఈ ఏడు మరో ఏడువేలు పెరిగిందని తెలంగాణ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పేర్కొన్నారు. ఆంగ్ల విద్య ఈ కాలాన విధాయకమే. కాదని ఎవరూ అనడం లేదు. కానీ తెలుగు భాష మాట్లాడడం, చదవడం, రాయడం తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి విద్యార్థికీ విధాయకం అనే మౌలిక ఆలోచన ప్రభుత్వాధినేతలకు లేకపోవడం, విద్యారంగంలో తెలుగు అంటే ఏదో 'తెగులు' అన్నట్లు నిరాదరించడం, తెలుగు నివారిస్తేనే ఈ తరానికి వెలుగు అన్న చందాన వ్యవహరించడం నిజంగా ఒక భాషోద్యమానికి ఊపిరులూదాల్సి ఉంది.

భాష లేనిదే సాహిత్యం మనలేదు. కవులూ, రచయితలూ తెలుగు సాహిత్యంలో కొత్తవారు రావాలంటే సాహిత్యం పట్ల ఆసక్తి, అనురక్తి, సృజన శక్తి కలిగిన తరానికి తెలుగు మాట్లాడడం ఒకటీ వస్తే చాలదు. వారు తెలుగులో రాయగలగాలి, తెలుగులో రాసినది ఏదయినా చదవగలగాలి. మరీ ముఖ్యంగా తెలుగులో ఆలోచించగలగాలి కూడాను. తెలుగు పిల్లలకు తెలుగు చదవడం, రాయడం రాదంటే వారు తెలుగులో అసలు ఆలోచించలేరంటే అంతకన్నా దౌర్భాగ్యం ఏముంది? అదేదో ఘనమని ఆ పిల్లల తాలూకు తల్లిదండ్రులు, పెద్దలు కూడా భావించడం మరీ సిగ్గుచేటు. "అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా?" అని ఒకనాడు కాళోజీ తీవ్రంగా 'నాగొడవ'లో పలికాడంటే ఆంధ్రమంటే అక్కడ తెలుగు భాష అనే ఉద్దేశంతోనే కానీ, ప్రాంతమనే ధోరణిలో కాదు. తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్నీ పరిరక్షించుకోవాలి. ఒక సాంస్కృతిక విధానంతో బాటు విద్యావిధానంలో తెలుగును నిర్బంధం చేసయినా సరే ప్రభుత్వాలు తెలుగు వెలుగుదీధితులను పరివ్యాప్తం చేయాలి. అలా హామీ ఇచ్చే నేతలనే ఎన్నికలలో పాలకులుగా ఎన్నుకుని ఆచరణలో ఆ హామీలు వారు అమలుపరిచే ఉద్యమస్ఫూర్తితో జనం పురోగమించాలి. తెలుగు భాషా, సాహిత్యాల పరిరక్షణకు, వికాసానికీ క్రమక్రమాగత చైతన్య ధనుష్ప్రాణులై ప్రజలు విజయక్రాంతి పథంలో పయనిస్తారని ఆకాంక్షిద్దాం. *

## 6

**2 జూలై' 2018**

# కవిత్వం - ఎవరి దుఃఖమో అది!

'బాధే కవిత్వం' అన్నాడు శ్రీశ్రీ. 'అలాగని పెద్ద బాధా లేదు' అన్నాడు వేగుంట మోహన ప్రసాద్. 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపుబాధ అంతా శ్రీశ్రీ బాధ' అన్నాడు చలం. బాధా పుష్పం పూసినప్పుడు దుఃఖ పరిమళం పరివ్యాపిస్తుంది. 'తీరికగా ఏడ్వనీరు నన్ను' అని దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆరోపించారు. లోకంలో దుఃఖానికి కొదవలేదు. ఆనందంలో పాలుపంచుకునే వారు ఉన్నట్లు దుఃఖానికి భుజం ఆసరా ఇచ్చేవారు ఉండకపోవచ్చు. కంటి తుడుపు చర్యలతో ఆర్తులను, దీనులను ఆదుకుంటున్నట్లు పాలకులు రూపుకడుతుంటారు గానీ, పాపులు పాపులర్ అయినట్లు ఆర్తత్రాణ పరాయణులు ఆనరు.

ఇంతకీ 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అన్నది ఆశయం. ఆ ఆశయం కవులది మాత్రమేనా! గుర్తింపబడని శాసనకర్తలకు ఆ ఆశయం ఉంటే చాలదు. అసలైన శాసనకర్తలకు, పాలకులకు ఉండాలి మరి! 'మారేది, మార్పించేదీ' పరిస్థితులు, పరిణామాలే! అయితే వాటికి హేతువులయ్యే వారు మాత్రం మనుషులే! అయితే మనుషుల్లో పరివర్తనం తేగల శక్తి రాజకీయాల కన్నా సాహిత్యానికి ఉందనే ఒక విశ్వాసం ఉంది. ఎందుకంటే ఉద్యమాలకు ఊపిరులూదినది సాహిత్యమే అయిన సందర్భాలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఫ్రెంచి విప్లవానికి, భారత స్వాతంత్ర్యోద్యమానికీ, నాలుగేళ్ళ క్రితపు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమానికీ కూడా తమ కలాల ద్వారా పెను చైతన్యం తెచ్చిన సాహితీవేత్తలూ, కళాకారులూ ఉన్నారు. మరి ఉద్యమం అంటేనే ఆవేశం అయినప్పుడు 'బాధ' అనే మాట ఎలా పొసుగుతుందనే అనుమానం కలగవచ్చు. కానీ అస్వతంత్రతను మించిన బాధ ఏముంది. 'ఏడుపులో కూడా మనకు అస్వతంత్రత ఏమి ఖర్మము' అనే ఆవేశం నుంచి పుట్టుకొచ్చే దుఃఖం

అగ్నికీలా సదృశం కాగలుగుతుంది. నీటిలోంచే నిప్పుకనుకనే 'బడబాగ్ని' అనే మాట వచ్చింది. ఎందరి కన్నీటినో పణంగా పెట్టిన బలిదానాల, ఆత్మత్యాగాల మీదుగానే ఉద్యమ ఫలితాలు ఫలించడమూ చారిత్రక సత్యమే!

'అగాధమౌ జలనిధిలోనా ఆణిముత్యమున్నటులే – శోకాలమరుగున దాగీ సుఖమున్నదిలే' అన్నాడు కవి. శోకమంటే అందుకే నైరాశ్యం అనీ, పిరికితనం అనీ అనుకోనక్కరలేదు. మంచికోసం మానవత్వం కోసం తపించే హృదయాలు కరుణరసప్లావితాలవుతాయి. అది సహజం. 'నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు' అన్నాడు అందుకే తిలక్. ఆ వెనువెంటనే అతగాడే అందుకే – 'నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు' అనగలిగాడు. అందువల్ల దుఃఖానికీ, కన్నీటికీ కవి చోటిస్తాడు. కరుణ కదలి కారిన నీరే కన్నీరు అవుతుంది. అసలు కరుణ ఒక్కటే రసమని 'ఏకోరసః కరుణ ఏవ' అని భవభూతి తేల్చి చెప్పేసాడు.

'ఎవరి దుఃఖమో అది!' అని అసలయిన కవి ఆరాతీస్తాడు. అందులో తానే ఉన్నాననీ గ్రహిస్తాడు. డాక్టర్ ఎస్.గోపి అత్యాధునిక కవితా సంకలనం పేరు 'ఎవరి దుఃఖమో అది!' అనే. తను సప్తతిలోకి అడుగుపెడుతూ గత నెలాఖరు వారంలో ఆవిష్కరించిన సంపుటి అది. దుఃఖం ఎవరిదయినా అదిమిపెట్టే ప్రయత్నం కన్న మనసు క్షాళనమవడానికి ఒక్కోసారి భోరున ఏడ్వడమే మంచిది! అని డాక్టర్లు కూడా గుండె ఆరోగ్యం రీత్యా చెబుతున్నారు. 'ఏడ్చే మగవాడిని నవ్వే ఆడదానిని నమ్మకూడదు' అనేది ఒకప్పటి మాట. పురుషుడే బలవంతుడు – ఆడది అబల అనుకునే రోజులనాటి మాట అది కావచ్చు గానీ నేడు ఎవరయినా కష్టాన్ని కన్నీటి ద్వారా బయటకు పంపేస్తే మన శరీరంలో ఉత్పత్తి అయ్యే 'కారిస్టాల్' వంటి విషరసాయనాలన్నీ తద్వారా బయటకు వెళ్ళిపోతాయట. అంతేకాదు దుఃఖం కన్నీటిలో ఉండే 'లైసోజైం' అనే అరుదైన రసాయనం శరీరంలోని హానికారక బాక్టీరియాని నిర్వీర్యం చేసేస్తుందని పరిశోధనల్లో తేలిన ప్రయోజనాత్మక అంశం.

అవతలి వారు ఏమనుకుంటారో అనే ఆలోచనను అధిగమించి సున్నిత మనస్కులుగా ఉన్న మగవారే కంటనీరెట్టుకోగలరు. అలాంటి సుకుమార హృదయులే కవులుగా, చిత్రకారులుగా తమ సృజనశక్తితో ఇతరులలోనూ మార్పు తేగల అద్భుతాలు ఇవ్వగలుగుతారు. ఇతరుల కష్టాలు కడతేర్చేందుకు సమాజసేవకులుగా, ప్రపంచపు

బాధని తీర్చే శాస్త్రవేత్తలుగానూ అలాంటి వారే మారిపోగలరు. పరుల కష్టాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నప్పుడు అవతలివారికి అలా చలించే వారిపట్ల సానుకూల అభిప్రాయం కలుగుతుంది. తమ కష్టసుఖాలను అందరూ అందరితో పంచుకోలేరు. అందుకు విశ్వాసం కావాలి. తమ కష్టం తీర్చేవారు, ఆర్చేవారు కాకపోయినా అందుకే కొందరిముందే కొందరు తమ బ్రతుకు ఆసాంతం విప్పి చెప్పుకునేంత బహిర్గతం కాగలుగుతుంటారు. ఏడిస్తే వ్యక్తిత్వం బలపడుతుంది గానీ దుఃఖం అధైర్యమూ, పిరికితనమూ కాక వాటిని అధిగమించగల ఓ రసచర్య. కన్నీరు బంధాలను నిలబెడుతుంది. ఆర్ద్రతలేని మనిషి మనిషే కాదు.

చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చూడలేవు
చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చాటలేవు

అని కాళోజీ మహాకవి ఊరకే అనలేదు.

అయితే ఏవి అసలు కన్నీళ్ళో, ఏవి మొసలి కన్నీళ్ళో గ్రహించగలగాలి. కృతకమైన ఏడ్పులూ ఉంటాయి. సినిమాల్లో శోకదృశ్యాల్లో నటించడానికి కంటికి గ్లిజరిన్ రాసుకుని కన్నీళ్ళు తెచ్చి పెట్టుకోవడం వేరు. మహానటి అదేమీ లేకుండానే ఏడ్చి ఏడ్పించగలదు కూడాను. కానీ కన్నీటిలో స్వచ్ఛత ఉండాలి. స్పందించే హృదయం మూలం దేనికైనా.

CRY. FOR GIVE. LEARN MOVE ON
LET YOUR TEARS WATER THE SEEDS OF
YOUR FUTURE HAPPINESS

- Steve Maraboli

నోరు పలకలేని, మనసు మోయలేని అక్షరాలు కన్నీళ్ళు
ఎవరి దుఃఖమో అది అంటే
కవిత్వం – సమస్త మానవాళి చిందించే అశ్రువులే

దుఃఖాశ్రువులే ఆనంద బాష్పాలుగా వికసిత పుష్పాలు కావాలన్నదే కవి ధ్యేయం. *

# 7

**9 జూలై' 2018**

# పత్రికల్లో పోటీలు

'పత్రికల పోటీలు' అంటే ఒక పత్రికకూ మరో పత్రికకూ మధ్య ఏ వ్యాపారపు పోటీనో అనుకోకండి! పత్రికలలో నిర్వహించబడే పోటీలు అనే. ముఖ్యంగా వారపత్రికలు, కొండొకచో కొన్ని దిన, మాస పత్రికలు ఈ పోటీలు నిర్వహిస్తుండడం ఒకప్పటి భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, యువ, జ్యోతి, ఆంధ్రజ్యోతి వంటి పత్రికలలో నుండి ఆనవాయితీగా వస్తున్నదే. ఒకప్పటి అలాంటి పత్రికలు– నవలలు, కథలు వంటి ప్రక్రియలలో రచయిత(త్రు)లకు పోటీలు నిర్వహించి పాఠకులకు మంచి సాహిత్యాన్ని అందించాయి. పోటీలకు నగదు బహుమతులను ఆ పత్రిక వారే ఏర్పాటు చేసి విజేతలకు పంపేవారు. కొన్ని నవలలో, కథలో తాము నిర్వహించిన ఆ పోటీలలో సాధారణ ప్రచురణకు ఎంపిక చేసినా వారికీ పారితోషికాలు ఇచ్చేవారు. మళ్ళీ ఉగాదికీ, దీపావళికీ, సంక్రాంతికీ, దసరాకీ సరికొత్త రచనల పోటీ నిర్వహించేలోగా సాధారణ ప్రచురణకు ఎంపిక చేసిన కథలవంటి రచనల ప్రచురణ కూడా పూర్తిచేసేవారు.

రచయిత(త్రు)లు కూడా నవలల పోటీ, కథల పోటీ అంటే నిజంగానే పోటీపడి మంచి రచనలు చేసే కృషి చేసేవారు. గడువు తేదీలోగా పోటీకి రచన పంపడం అంటే అది ఒక సవాలుగా, ఒక అసైన్‌మెంట్‌లా భావించి కలం సారించేవారు. న్యాయ నిర్ణేతల వడపోతల తర్వాత, సంపాదకునిదే తుది నిర్ణయమైనా నియమిత న్యాయనిర్ణేతల అభీష్టం మేరకు చక్కని నిర్ణాయక చర్చ జరిపి పోటీ ఫలితాలను ప్రకటించేవారు. ప్రథమ బహుమతి పొందిన రచన అంటే ఆ రోజుల్లో ఆ రచనకూ, ఆ రచయితకూ కూడా అంత విశిష్ట గౌరవం ఉండేది. ఆనాడు ఫొటోలు ప్రచురించడం అంటూ జరిగితే అలా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు

పొందినవారికే ఆ అవకాశం లభించేది. నిజమే! ఆ రోజుల్లోనూ ఒక్కోసారి ద్వితీయ బహుమతి పొందిన రచన అంటే మొదటి బహుమతికి అర్హమైన స్థాయిలోనే గోచరించేది కూడాను. విశ్వనాథ, అడవిబాపిరాజు వంటి వారు పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నవారే! సరే! ఒక కాలంలో రచయిత్రుల హవా సాగింది! అది ఎంతలా ఉండేది అంటే ఆడపేరుతో మగవారు కూడా రచన చేసేంతగా!. ఎందుకంటే స్త్రీల రచనలు పోటీల్లో బహుమతి యోగ్యమై అనేకం వెలువడుతుండేవి! నేడు మంచి పత్రికలు అనేకం మూలపడ్డాయి. స్వాతి, నవ్య, ఆంధ్రభూమి, జాగృతి వారపత్రికలే ముఖ్యంగా మిగిలాయి. మాస పత్రికలు ఎక్కువగా ఉన్నా అవన్నీ చిన్న పత్రికల క్రిందే జమ. కానీ అవి చేస్తున్న సాహిత్యసేవను విస్మరించలేం! విశాలాక్షి, సాహితీకిరణం, రమ్యసాహితి, నేటినిజం, రేపటికోసం, సంస్కృతి వంటి చిన్న పత్రికలు చెప్పుకోదగినవే! అలాగే కవిత్వానికి ప్రాముఖ్యం ఇస్తూ 'కవితా!', 'కవి సంధ్య' వంటి పత్రికలున్నాయి. ఆయా పత్రికల్లో కథల, కవితల పోటీలు విరివిగా ప్రకటింపబడుతుంటాయి. అయితే ఈ కాలపు విశేషం ఏమిటంటే అధిక శాతం ఈ పత్రికలలోని పోటీలు ఎవరి సంయుక్త ఆధ్వర్యంలోనో సాగుతున్నాయి. అంటే పోటీ బహుమతుల ఆర్థిక సహకారం లేదా ఆర్థిక భారం మోసేవారు బయటినుంచి ఎవరో వదాన్యులో లేదా వేరే ఏవో సాహితీప్రియత్వం గల సంస్థలో అయివుంటున్నాయి. ఉదాహరణకి, ఒక వారపత్రికవారు అరవైవేల రూపాయలు ఇస్తే కథల పోటీ సంయుక్తంగా నిర్వహించే వెసులుబాటు తమ సౌజన్యంతో కల్పిస్తున్నారు. ఏ లక్షా ఇరవై వేలో ఇస్తే నవలల పోటీ వారి సౌజన్యంతో సంయుక్తంగా నిర్వహించుకోవచ్చు. నగదు ఇచ్చేంతవరకే వ్యక్తుల, సంస్థల బాధ్యత. న్యాయనిర్ణేతలను ఏర్పాటు చేయడం, పోటీకి వచ్చిన రచనలను పరిశీలించి బహుమతులు నిర్ణయించడం అన్నీ పత్రికవారే చూసుకుంటారు. అలాగే కొన్ని చిన్న పత్రికలలో చిన్న మొత్తాలతో కూడిన–చిరుపోటీలు కథలకో, వ్యాసాలకో సాగుతుంటాయి. అయితే విచిత్రంగా కొన్ని పోటీలలో పాల్గొనడానికి పాల్గొనే రచయి(త్రు)లు ఎంట్రీఫీజు చెల్లించాలంటూ ఏ వందరూపాయలనో ఎంట్రీఫీజుగా నిర్ణయించడం, లేదా పోటీలో పాల్గొనే వారు తమ పత్రిక వార్షికచందాదారులై ఉండాలనే నిబంధన విధించడం నిజంగా విడ్డూరమే! సరే! చిన్న పత్రికల సంగతి అలా ఉంచితే, ఓ వార పత్రిక పోటీ నిర్వహిస్తే ఫలితాలు ప్రకటించి, బహుమతి స్థాయిలో లేక సాధారణ ప్రచురణకు రచనను తీసుకున్న

కథ ప్రచురణకు ముందే రచయితకు పారితోషికం చెల్లించేస్తుంటే, మరో పత్రిక పారితోషికాల సంగతి అటుంచి అసలు సాధారణ ప్రచురణకు స్వీకరించామంటూ ఏ యాభయ్యో, వందో కథల పట్టిక ప్రకటించి ఏళ్ళూపూళ్ళూ గడిచినా వాటి ప్రచురణ ఎప్పుడో అంతు బట్టని స్థితిలో రచయి(త్రు)లను నెట్టేస్తోంది పాపం!. బహుమతుల నిర్ణయం కూడా వివాదాస్పదంగా, సంపాదకుని మోనోపలీ అన్నట్లవుతోందని వాపోతున్న వారున్నారు. సంపాదకునితో కొందరు రచయితలు లాలూచీ పడుతున్నారనీ, తమకు ప్రకటించిన బహుమతి సొమ్ము ఇవ్వనక్కరలేదనీ, కానీ బహుమతి ఇవ్వమని అడిగి సాధించుకుంటున్నారనీ అంటున్నవారున్నారు. అలాగే ఎదురుడబ్బిచ్చి తమ రచనలు ప్రచురింపచేసుకుంటున్న వారున్నారట!

వీటిల్లో నిజానిజాలు ఎలా ఉన్నా అసలు ఇలాంటి వివాదం పత్రికల పోటీల విషయంలో ఏర్పడడమే శోచనీయం. అలాంటి స్థితి హేతువు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆ ఎడిటర్లదే! కానీ సాహిత్యలోకంలో ఓ దిగజారుడుతనం చోటు చేసుకుంటూండడం మాత్రం వాస్తవం! నిజాయితీ, చిత్తశుద్ధీ లేకపోవడం ఏ రంగంలోనైనా విషాదాలే! పత్రికల్లో పోటీలు పేరిట చోటుచేసుకుంటున్న అవాంఛనీయతలు గర్హనీయాలే! మరో విషయం! కవితల పోటీలనే ఫార్స్ కొన్ని చిన్న పత్రికలలో చూస్తుంటే పోటీలనేవి ఎంత నాసిరకంగా మారి పోయాయో తెలుస్తాంటుంది. కొన్ని పత్రికలు కొందరు ఆస్థాన రచయితలతో నిండిపోయినట్లుంటాయి. బహుమతులూ వారికే, స్థాయి ఎలా ఉన్న ప్రచురింపబడే రచనలూ వారివే! అలాంటప్పుడే సంపాదకత్వం అనేది కూడా ఎంత వ్యాపారాత్మకం అయిందో అనిపిస్తుంది. కొన్ని పత్రికలలో బహుమతులు పొందిన రచనలు కేవలం కొన్ని ఇజాలకు పరిమితమైనట్లుంటాయి. ఒక విశాల మానవీయ దృక్పథం, మధ్య తరగతి జీవన విలువలు కాక–పేదరికం, దళితం, కులం, మతం అనే పరిధుల్లో కుంచించుకుపోయిన రచనల్లా ఉంటాయి. అదో ఫ్యాషనై కూచుంటోంది. విశాలత్వం చూపవలసిన సాహిత్యం అలా కుంచించుకుపోవడం ఏ విధంగా గొప్పగా భావించాలో అర్థం కాదు. ఏమయినా కథల పోటీలు ఉత్తమ సాహిత్య సృష్టికి ఆలంబనం కావాలనే పాఠకులు అభిలషిస్తారు. రచయితలు అది గ్రహించాలి. *

# 8

**16 జూలై' 2018**

# ఓ గుడ్డముక్క-దిమ్మచెక్క-అవే కావాలి!

"అదుగో! అదుగో వినరా ఆ చప్పట్లు!... ఆ ధ్వని తరంగాలే కదురా ఆకలిగొన్న కళాజీవికి పంచభక్ష్య పరమాన్నాలు!... ఆ ఉత్సాహ ప్రకటనే కదురా కళాకారుణ్ణి వెర్రెత్తించేసే ఏకైక సంఘటన..." అంటాడు కీర్తిశేషులు నాటకంలో మురారి. నిజమే! కళాజీవికి అతడు వక్తగానీ, నటుడుగానీ, గాయకుడు గానీ, కవిగానీ - తాను వేదికపై నుంచి అభివ్యక్తం అవుతున్నప్పుడు, ప్రేక్షకుల 'కరతాళధ్వనులు' మించిన ఆనందహేతువులు వేరొకటి లేవు! ఇవాళ ప్రేక్షకుల రసస్థాయి కూడా సన్నగిల్లుతోంది. కాలానుగుణంగా అభిరుచులూ మారిపోతున్నాయి. రసాస్వాదనా తత్పరత కూడా మందగిస్తోంది. చప్పట్లు కూడా అడిగి కొట్టించుకోవాల్సి వస్తోంది! ఓ మిమిక్రీ ఆర్టిస్టో, మెజీషియనో అలా ప్రేక్షకులను చప్పట్లు కొట్టమని అడగడం ఎబ్బెట్టుగా ఉండకపోవచ్చుగానీ, ఓ ప్రసంగకర్తో, కవో మధ్యలో చప్పట్లు కొట్టమని అడగడం సిల్లీగానే ఉంటుంది! ఉత్సాహంతో, ఆనందంతో, రసాభినివేశంతో సహజంగా కరతాళధ్వనులు ప్రయుక్తం కావాలి. తమాషాగా-చప్పట్లు కొట్టించుకోడానికీ- శిష్యబృందాన్నీ, తమవారినీ ప్రేక్షకుల్లో అమర్చుకునే కళాకారులూ, పెద్దలూ నేడు కానవస్తున్నారట!

ఇవాళ సాహితీ సాంస్కృతిక సంస్థలకు కొదవలేదు. 'వాసి' సంగతి మృగ్యమైనా, 'రాశి' మాత్రం బానేవుంది! చప్పట్లు కొట్టే ప్రేక్షకులను ఏర్పరచగల సంస్థలే కాదు, డబ్బు పుచ్చుకుని రచయితలకూ, కళాకారులకూ సన్మానాలు చేసే సంస్థలూ ఉన్నాయి. నిజానికి సాహిత్య సేవ పేరున వెలసిన సంస్థలనేకం ఇవాళ మనుగడ సాగిస్తున్నది వాటితోనే. 'పిండి కొద్దీ రొట్టె' సామెత మాదిరిగా, పెట్టుబడిననుసరించి ముందుకొచ్చే 'స్థాయి' సంస్థలున్నాయి. ఏండ్లుగా అవార్డులు, సన్మానాలతో సుప్రసిద్ధమయిన ప్రముఖ

సంస్థలున్నాయి. చిల్లర సంస్థల సంగతి సరేసరి! ఊరూరా అనేకం!! అన్నింటినీ ఒకే గాటుకు కట్టివెయ్యలేం! ఒకప్పుడు సంస్థల పట్ల అపార గౌరవం ఉండేది. అంతటి మేలిమి కృషి చేసినవీ ఉన్నాయి. అదెలా కాదనగలం! ఇక నేటి సాహిత్య సంస్థలు సాహిత్యానికి చేసిన, చేస్తున్న సేవ ఏమిటో చెప్పలేకపోవచ్చుగానీ -ఎవరెవరికి, ఏఏ పేరున, ఏ అవార్డులు ఇచ్చాయో, సన్మానాలు చేశాయో, గ్రంథావిష్కరణలు జరిపాయో కనబడుతూనే ఉంది. పాపం! కవులు, రచయితలు – వీళ్లకేం కావాలి! ప్రధానంగా గుర్తింపు!! నన్నయ పేరు మీద నుంచి శ్రీశ్రీ, సినారె పేర్ల మీదుగానైనా ఏ సంస్థ అయినా, ఏ అవార్డునయినా నెలకొల్పవచ్చు. అది తాము ఎవరికి అభిలషిస్తే (లేదా తమ నుంచి తగిన రీతిగా ఎవరు అభిలషిస్తే) వారికి ప్రదానం చేయవచ్చు. దానిమీద ఏ నియంత్రణలూ లేవు. ప్రభుత్వం అవార్డులకు కూడా అప్లై చేసుకోవాల్సిన కాలంలో ఉన్నాం కదా! అంతటా 'ప్రైవేటీకరణ' ఎలాగూ పెరిగిపోతోంది కదా! అంచేత ఇవాళ ప్రైవేటు సంస్థలూ, ప్రైవేట్ వ్యక్తులూ ఇచ్చే పురస్కారాలూ, సన్మానాలూ పెరిగిపోయాయి.

నిజమే! ప్రజల ఆదరణే ముఖ్యం. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సంతోషించదగిన, ఆహ్వానించదగిన పరిణామమే! ఏ కవి అయినా, రచయిత అయినా ఇవాళ తన రచనలు ప్రజలలోకి వెళ్ళి వాళ్ళ సమాదరణ పొందాలని చేస్తున్న కృషి కన్నా, కొందరు విశిష్టమనుకునే వ్యక్తులు, పలు సంస్థల గుర్తింపులకూ, అవార్డులకూ అర్రులు చాచటం కాన వస్తోంది. సాహిత్య పరమావధి సన్మానానికో, అవార్డుకో అన్నట్లవుతోంది.

ముళ్లపూడి అన్నారో, ఎవరన్నారో గుర్తులేదు గానీ... ఇద్దరు తెలుగు వాళ్ళు ఉంటే మూడు సంస్థలు వెలుస్తాయిట! ఇద్దరూ కలిసి స్థాపించిన సంఘం ఒకటి. ఎవరి సంఘం వారిది మళ్ళీ చెరి ఒకటీ. వెరసి మూడు. తెలుగునేల నుండీ, విదేశీ అమెరికా నేల మీద వరకూ సంఘాల స్థాపనా సరళి ఇదే! కవులూ, రచయితలూ తెలుగువారయినప్పుడు వారే స్వయంగా సంఘాల వ్యవస్థాపకులూ అవుతూ, 'ఇచ్చి నమ్మవాయినం–పుచ్చుకుంటినమ్మ వాయినం' అన్న చందాన, పరస్పరాశ్రితాలుగా అవార్డులు, ఉత్సవాలూ అలవోకగా నిర్వహించేస్తుంటారు.

నిజమే! కవులకూ రచయితలకూ ఓ పూలబొకే లేక ఒక పూలదండ, ఓ శాలువా, ఓ జ్ఞాపిక ఇవి లభిస్తే.. అంతకన్నా ఆనందమేమి? ఏ సినీప్రముఖుడో,

ఏ రాజకీయ నేత చేతుల మీదగానో అందుకుంటే మరీ గ్లామర్ కదా! లేదూ.. పేరున్న ఓ పెద్ద కవి, రచయిత, లేదా ఓ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ చేతులమీదుగానో, లేదా ఓ అకాడమీ పెద్దయో, ఆ అకాడమీ మాజీ అవార్డు గ్రహీతతోనో అందుకున్నా కొండంత ఆనందం! రోజూ సాయంత్రం ఏదో ఓ సభావేదిక కోసం ఎదురు చూసే సాహితీపెద్దలుండనే ఉన్నారు. ప్రేక్షకులెందరున్నారన్న సంగతి ఎందుకు? ఒక్కోసారి వేదిక ముందు ఉన్నవారి కన్నా, వేదికపై ఉన్నవారి సంఖ్యే ఎక్కువ? అప్పటికీ పాపం.! సాహిత్య సభలయినా సరే... ఏ మహనీయుడి జయంతులు, వర్ధంతులు అయినా సరే.. ఆ మహనీయ వ్యక్తులకీ, వాటికీ ఏమీ సంబంధం లేకపోయినా, "సినిమా పాటలు" ఔత్సాహిక గాయనీగాయకుల చేత పాడించితే-ప్రేక్షకులు కూడతారన్న భ్రమల్లో సాహిత్య సభకు ముందు సినీ గీతాలాపనలు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాగూ వాయిద్యకారులంటూ నేడు ఏమీ అక్కర్లేకుండా, సెల్‌ఫోన్‌లో 'యాప్' సాయంతోనే పాటలు పాడేసుకునే సౌలభ్యం వచ్చేసింది కనుక, సినీగాన కచేరీలు దినమాసికాలుగా సాగిపోతూనే ఉంటాయి. కచేరీ దారి కచేరీది! సభదారి సభది. తీర్థానికి తీర్థం-ప్రసాదానికి ప్రసాదం!!

ఇవాళ చాలామంది కవులకూ, కవయిత్రులకీ, రచయితలకీ, రచయిత్రులకీ తమ రచనల మీద కన్నా, తాము చేసిన రచనకు వెంటనే గుర్తింపు, అవార్డు, కీర్తిప్రతిష్టలు అన్న 'యావ' ఎక్కువై పోతోందనిపిస్తోంది. వారి ఆ 'యావ'ను సాహితీసంస్థల నిర్వాహకులు గుర్తించి - స్వార్థం, పరమార్థం అన్నట్లు 'ప్రాయోజకులను' పట్టుకుని, ఆర్థిక వనరులు కూర్చి, సన్మానాలూ, అవార్డులూ అంటూ సభలు పెట్టి తాము లాభపడుతూ, అభిలాషాపరులను సంతృప్తి పరుస్తున్నారు. పత్రికల సాంస్కృతిక విలేకరులు కూడా కవర్లో ఓ వందో రెండు వందలో పెట్టి నగదు ముట్టచెబితే, ఓ ఫొటో అందచేస్తే, సభకు హాజరు కాకుండానే.. ఆహ్వానపత్రం ఆధారంగా, ఆ సమావేశ నివేదిక మరునాడు దినపత్రికలో వార్తగా ప్రచురించబడే సౌలభ్యం, సౌజన్యం కల్పిస్తున్నారు! ఆహ్వానపత్రంలో పేరుంటే చాలు సభకు వెళ్ళని పెద్దమనిషి ఉన్నా.. ఆయన పేరే కాదు, ఆయన ప్రసంగించినట్లుగా నాలుగు మాటలు కూడా 'అచ్చయిపోతే' మీరు 'అచ్చెరువు' చెందనక్కరలేదు. ఫలానా సంస్థ ఒక అవార్డు ఏదో ఇస్తోందని తెలిస్తే చాలు - అది తమకే కావాలనీ, అందుకు తామే సమర్థులమనీ, అవసరమైతే అలా తాము దానిని అందుకునేందుకు - ఎవరి ప్రాపకం, ఎవరి పైరవీ అవసరమో

వారిని చేరుకునే, సాధించుకునే.. మార్గం వెంట అవిశ్రాంత శ్రమ చేయగల సృజనకారులున్నారివాళ! 'పట్టుచీరల' 'మంకుపట్టు బేర' రచయిత్రులూ ఉన్నారు! కాటుక కంటి నీరు చనుకట్టుపైంబడ నేలయేడ్చెదో అని సరస్వతిని ఊరడించడానికి – కారణాలు తెలిసినా కార్యాచరణకు పూనుకోగలవారే కానరావడం లేదు! అదీ విషాదం! ఇంతకీ ఇవాళ సాహిత్యానికి గుర్తింపు ఓ గుడ్డముక్కా – ఓ చెక్కదిమ్మా అయిపోయాయి. మూడుపదులు నిండని యువకవికీ 'జీవన సాఫల్య పురస్కారం' లభిస్తోంది. అదీ వైఖరి! *

# 9

**23 జూలై' 2018**

# ప్రాచీన సాహిత్య అధ్యయనం అక్కరలేదా?

తెలుగులో భావవ్యక్తీకరణ చేయాలనే సంకల్పమే ఈ తరానికి కొరవడుతోంది. మాట్లాడటం అనేది ఓ మేరకు నిలిచివుంది గానీ, తెలుగులో రాయడం అనేది తగ్గిపోతోంది. తెలుగు చదవనూ, రాయనూ రానివారు పుట్టుకకు తెలుగువారే కానీ అలాంటివారు చాలామంది ఉన్నారు. సరే! పోనీ తెలుగు రాయడం వచ్చిన వారైనా ఏ మేరకు అందులో భావవ్యక్తీకరణ సామర్థ్యంతో ఉన్నారంటే అదీ సందేహాస్పదంగానే ఉంది. భావ వ్యక్తీకరణ సామర్థ్యానికి గీటురాయి భాష మీదగల పట్టు. కవిత్వం పక్కన పెట్టేయండి! చక్కని తెలుగు వచనం ఎంత మంది రాయగలుగుతున్నారు. ఒకప్పుడు కనీసం బంధుమిత్రులు పరస్పరం తెలుగులో ఉత్తరాలైనా రాసుకునేవారు. నూతన సాంకేతిక పరిణామాలు లేఖారచనకూ దూరం చేశాయి. ఇక సాహిత్య సృజనాభిషులైన యువతా అరుదుగానే ఉంటోంది. తెలుగు సాహిత్యం పట్ల, పుస్తక పఠనం పట్ల, రచనాభిలాష పట్ల మొగ్గు చూపుతున్న వారు ఉన్నారు. అస్సలు లేకుండా ఏమీలేరు. వారికి మార్గ నిర్దేశం లభిస్తే బానే ఉంటుంది.

తెలుగు వెలుగులు మసకబారుతున్నాయంటే అందుకు ప్రధాన కారణం విద్యారంగమే! అధిక సంఖ్యాకులు తెలుగువారున్నా ఒకప్పుడు తెలంగాణలో నిజాం ప్రభువు ఉర్దూభాషకే ప్రాధాన్యం ఇచ్చి ఆ భాషాభివృద్ధి లక్ష్యంగానే ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించాడు. ఉన్నత విద్య కూడా ఉర్దూభాషలోనే సాగేటట్లు చూశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి నిజాం తన కాలంలో ముస్లిమేతరుడెవ్వరినీ అధికారిగా నియమించలేదు కూడా! తెలుగుకు జరుగుతున్న నిరాదరణను సహించలేకనే అప్పట్లో ఆంధ్ర మహాసభ, ఆంధ్ర సారస్వత పరిషత్, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వంటి సంస్థలు ఏర్పడ్డాయి. కానీ నేడు

పరిస్థితి మారింది. విశాలాంధ్ర ఏర్పడ్డాక తెలుగు భాషా వికాసానికి కృషిజరిగినా ఆంధ్రమే నాగరిక తెలుగు అని, తెలంగాణ భాష పట్ల చులకననూ, నిరాదరణనూ చూపిన కారణం కూడా, తెలంగాణ రాష్ట్ర సాధనకు భిత్తికగా నిలిచింది. నేడు రెండు తెలుగు రాష్ట్రాలున్నాయి. అయితే భాష పరిస్థితి ఏమిటన్నదే తెలియరాని స్థితి. భాషా సాంస్కృతిక విధానం అంటూ ఏర్పడుతున్న సూచనలు కానరావటం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి స్వయంగా తెలుగు సాహిత్య విద్యార్థి అయివుండీ భాషా వికాసానికి, భాషాభివృద్ధికి చేస్తున్నదేమిటన్నది ఒక ప్రశ్నార్థకంగానే ఉంది.

విద్యార్జన చేస్తున్నప్పుడే విద్యార్థులకు భాషపట్ల అభిరుచి, అభినివేశం, పట్టు ఏర్పడాలి. కేవలం పరీక్షలు రాసి పాసవడం కాదు. భాషలో మాట్లాడనూ, రాయనూ అభివ్యక్తి సామర్థ్యం ఏర్పడాలి. కేవలం పాఠ్యపుస్తకాలే కాక ఇతరేతర సాహిత్య గ్రంథాలను చదవడం, అలాగే రచనవంటి సృజనాత్మక సామర్థ్యాలు ఏర్పడటం విద్యార్థి దశలోనే జరగాలి. ఒకప్పుడు తరగతి గదిలో భాషను బోధించే తెలుగు అధ్యాపకుల పట్ల, ఉపన్యాసకుల పట్ల గౌరవం ఉండేది. భక్తిశ్రద్ధలు కొంతమేరకయినా ఉండేవి. భాషా పండితులే విద్యార్థులకు పాఠ్యాంశ బోధన నెపంతో తెలుగు సాహిత్యం పట్ల, వివిధ సాహిత్య ప్రక్రియల పట్ల మక్కువ కల్పించేవారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీలు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచుతుండేవి. విద్యాలయాలు వార్షిక సంచికలు ప్రకటించి అందులో విద్యార్థులు రాసిన రచనలకు చోటు కల్పించి ప్రోత్సహించేవారు. అవి తదనంతర కాలానికి వారికి గొప్ప స్మరణికలుగా నిలిచేవి. భావ వ్యక్తీకరణ నిపుణతకు భాష మాత్రమే దోహదం. తెలుగువాచకంలో నన్నయదో, పాల్కురికిసోమనదో ఓ పద్యం పాఠ్యాంశంగా ఉందనుకోండి. పద్యం యొక్క పద విభజన, అన్వయం, అర్థం, తాత్పర్యం అందులోని రసం, అలంకారం, ఛందస్సు, రీతి, పాకం, శయ్య, వ్యాకరణం ఇన్ని అంశాలు వివరించడానికి వీలుంది. తద్వారా ఆ బోధనా క్రమంలో విద్యార్థికీ భాషా జ్ఞానం చెప్పుకోదగినట్లుగా అలవడే అవకాశం ఉం(డే)ది. అలాగే ఏ వెంకటేశ్వర వచనమో, పంచతంత్రం వచన భాగమో ఉండినట్లయితే-వచనరచనా ఫణితి, పదప్రయోగనైపుణి, సంధులు, సమాసాలు వంటివన్నీ నేర్చే వీలుండేది. పద్యం ఎలా చదవాలి అనే పద్ధతి అలవడేది. గ్రుక్కతిప్పుకోకుండా, పానుగంటి వారి ఏ సాక్షి వ్యాసవచనమో చదివే పటుత్వం నేర్చేవారు. అర్థంకాని దాన్ని అధ్యాపకుడు అర్థావబోధకు తెచ్చేవాడు. ప్రాచీన సాహిత్య గాథావలోకనం చేసి, ఆపై పాశ్చాత్య విద్యను కూడా అభ్యసించిన కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ

వంటివారి ఆధునిక రచనలు పాఠ్యాంశాలుగా ఉన్నా, రాయప్రోలు, విశ్వనాథ వంటి వారి నవ్య సంప్రదాయ రచనలు ఉన్నా పాఠం చెప్పడానికి అధ్యాపకునికీ, వినడానికి విద్యార్థులకూ కేవలం పరీక్షార్థమన్న దృష్టి మాత్రమే కాక భాష నేరుస్తున్న, సామర్థ్యం సాధిస్తున్న భావన ఉండేది. ఇవాళ ఏ వచన కవితో, మినీకవితో పాఠాలుగా పెడితే చదవగానే అర్థమై పోతుంటే, పాఠంగా ప్రత్యేకంగా ఏం చెప్పాలో, ఆ రచన ద్వారా ఏం నేర్వాలో తెలియని వైఖరే ఉంటోంది. 'ప్రాచీన సాహిత్యం చదవనవసరం లేదు' అనే సామర్థ్యం సాధించగల నైపుణీ మందగిస్తోంది. గ్రాంధిక భాష అనవసరమనీ మాట్లాడుకునే వ్యవహారిక భాషలోనే చదువుకుంటే చాలనీ, ప్రాంతీయతలకూ, మాండలికాలకూ మాత్రమే పాఠ్యపుస్తకాల్లోనూ చోటు కల్పించడం అనివార్యంగా చేశాక, ఇంక తము రోజూ చుట్టూ వినే, మాట్లాడే భాషే పాఠ్య పుస్తకంలో ఉండి, పరీక్షలు రాయడానికీ అదే వినిమయం చేయగల వీలున్నప్పుడు ప్రత్యేకించి భాష అభ్యసించేదేమున్నదిలే! అనే తూష్ణీభావం విద్యార్థులకు కలిగితే విడ్డూరమేమీ లేదు. గ్రంథస్థ భాష అంటూ ఒకటుంటే అది నేర్చే క్రమం అంటూ ఒకటుంటుంది. మన ప్రాచీన తెలుగు కవులు, రచయితలు, వారి గ్రంథాలు, వాటిల్లోని అంశాలు, ఆ భాషాస్థాయి వంటివి అధ్యయనం చేసే విద్యార్థులకు భాషపట్ల, భావ వ్యక్తీకరణపట్ల ఏర్పడగలిగే స్థాయికీ, ఆ ప్రాచీన సాహిత్య పఠనం ఏమీలేక నిరసించి, కేవలం తదనంతర కాలపు, ఆధునిక కాలపు రచయితల రచనలు మాత్రమే చదువుకున్నవారి భాషా స్థాయికీ, వ్యక్తీకరణకూ అనివార్యంగా బోలెడు తేడా ఉంటుంది. అధ్యయనశీలత కూడా ఒకప్పటి రోజులకూ, నేటికీ కుంటుపడుతున్న వైనం ద్యోతకమవుతూనే ఉంది. ప్రాంతీయ భాషలు, మాండలికాలు, యాసలు వద్దని ఎవరూ అనడం లేదు. కానీ ప్రామాణికంగా గుర్తించబడిన విలువలను త్రోసి రాజనుకుంటే నష్టపోయేది ఈ తరమే. నిఘంటువులు, పదకోశాలు కొత్తవి తయారు చేసుకోవచ్చు. కానీ ఒకప్పుడు ఉన్నవాటిల్లోని పదాలను శ్మశానగతం చేసుకొని, ఉపయుక్తం కాని పరిస్థితికి నెట్టివేసి విస్మరించినట్లయితే పదసంపద, భాషా సంపద చేజేతులా కోల్పోయినవారమవుతాం. నిజానికి ఆంధ్ర ప్రాంతమైనా, తెలంగాణ ప్రాంతమైనా, రాయలసీమ ప్రాంతమైనా అంతా తెలుగే! మన తెలుగులో అపారమైన పదసంపద ఉంది. అందరూ అన్నిటినీ అభివ్యక్తిలో వినియోగించుకోవచ్చు. అందువల్ల ప్రాచీన సాహిత్య అధ్యయనం త్రోసి రాజనక స్వీకరిస్తూ, ఆధునిక తెలుగు వికాసానికి బాటలు వేసుకోవడం తెలుగు భాషాభివృద్ధికి మేలు చేస్తుంది. ఆ నిధిని చేజార్చుకోవడం కేవలం అవివేకం! *

# 10

**30 జూలై' 2018**

# 'రికార్డింగ్ డ్యాన్సులు

'ఫలించిన వృక్షమునకే రాతి దెబ్బలు' అన్నట్లుగా మంచి చేసేచోట విమర్శలు ఎదురవుతూండటం సహజమే! నిస్వార్థంగా, నిజాయితీగా మంచి పనికి పూనుకోవడం ఎవరు చేసినా అభినందనీయం. కానీ ఏవో స్వార్థ ప్రయోజనాలు పురికొల్పినప్పుడు మంచిపనిగా అనిపించేదయినా జరిగే తీరు వేరొకలా తోస్తుంది.

ఇప్పుడున్నది ప్రచారార్భాటాల కాలం! ఆవగింజంత ప్రతిభ ఉన్నా గుమ్మడికాయంత ప్రచారం చేసుకోవడం ఎక్కువైంది. నిజమైన ప్రతిభావంతులు గుర్తింపు కోసం ఆరాటపడరు. తమకు మంచి అనుకున్నది మౌనంగా చేసుకుపోతుంటారు. మౌనంగానే ఎదగమని మొక్క చెప్పిన రీతి వారికి ఆదర్శం. కానీ కొందరి వ్యవహార సరళి అదికాదు. ఏది చేసినా గొప్పగా, మునుపటికి విలక్షణంగా, అందరి దృష్టిలో ఏదో రీతిగా పడే ఓ ఆర్భాటంగా నిర్వహించటం వారి ధోరణి. అందులో మంచి లేదా అంటే ఉండి ఉండవచ్చు. కానీ దానికన్నా చేసిన ఆర్భాటమే తెరకెక్కుతుంది. బహుశా ఆ నిర్వాహకులకు కావలసిందీ అదే కావచ్చు.

ప్రపంచంలో 'గిన్నిస్ బుక్'కు ఒక ప్రసిద్ధి ఉంది. అందులో అన్ని రికార్డులు చోటు చేసుకుంటుంటాయి. అందుకని ఎప్పటికప్పుడు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ సరికొత్తగా నిర్మితమై వెలువడుతూ ఉంటుంది. బాగా పొడుగ్గా గోళ్లు పెంచుకోవడం, జుట్టుపెంచుకోవడం, ఏదో ఇనుపముక్కలు తినేయడం, ఇలాంటి వాటి నుంచి–ప్రపంచంలో అతి పొట్టిమనిషి, అతి పొడుగు మనిషి, అత్యధిక బరువున్న మనిషి, ఎక్కువకాలం జీవించిన మనిషి అంటూ ఆ గిన్నిస్‌బుక్‌లో నమోదవుతుంటాయి. అలాగే క్రీడారంగంలో రికార్డు, ఇతరత్రా అనేక రంగాల్లోని అత్యద్భుత విజయాలు

మునుపటి రికార్డ్స్‌ను ఛేదిస్తూ కొత్తగా జరిగితే, ఆ పాతవాటి స్థానంలో సరికొత్తవి చేరుస్తూ సాగడం 'గిన్నిస్‌బుక్' వ్యవహారం.

అన్నమయ్య లక్షగళ సంకీర్తనలు, కూచిపూడి ప్రదర్శనలు గిన్నిస్‌బుక్‌కు ఎక్కేలా నిర్వహించిన సిలికానాంధ్ర గురించీ, దాని మహదానంద సంధానకుడి గురించీ తెలుగునాట తెలియని వారు లేరేమో! ప్రభుత్వమే స్వయంగా కూచిపూడి అభివృద్ధికి బాధ్యతలప్పచెప్పి గొప్ప హోదా కల్పించింది. 'అసలాయన డ్యాన్సర్ ఏమీ కాదు, కూచిపూడికి ఆయనకూ ఏమీ సంబంధం లేదు. నృత్యగురువు అనిపించుకున్న కీ.శే. వెంపటి చినసత్యం గారి పేరు చెప్పుకుని ఆర్థిక అవకతవకలు జరిగాయి' అని చినసత్యంగారి కుమారుడే ఆరోపణలు చేయడం జరిగింది. కానీ భారతీయ నృత్య, సంగీతాలకు అమెరికాలో సైతం విశేష ఖ్యాతిని చేకూర్చి, ఎందరినో వాటిపట్ల అనురక్తులను చేసి, గౌరవాదరాలెందరికో కళాకారులకు అందించిన వ్యక్తిగా కూచిభొట్ల కృషికి నీరాజనాలిచ్చినవారున్నారు. కూచిపూడిలో సంజీవని పేర వైద్యం నిరుపేదలకు సైతం అందివచ్చే బృహత్సేవకు ఆయన తలపెట్టి సమకట్టినమాట వాస్తవం. కానీ గిన్నిస్ రికార్డుల కోసం ఆయన చేసిన కార్యక్రమాలు నిజంగా ఆ స్థాయిలో నభూతో అనిపించేవిగా చేసినా, నిజమైన నృత్య సంగీత విజ్ఞులు కొందరికి, అది ప్రచారార్భాట వ్యవహారంగానే తోచింది.

ఇవాళ తెలుగునాట ఈ రికార్డుల మోజు పెచ్చరిల్లుతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. 'గిన్నిస్‌బుక్' కాదుగానీ అలాంటి 'బుక్'లు ఇప్పుడు చాలా వచ్చేసాయి. రికార్డుల పేర కొత్తకొత్త సంస్థలు పుట్టుకొచ్చాయి. అవి ఎడాపెడా 'రికార్డు' పట్టాలు, పత్రాలు పంచి పెట్టేస్తున్నాయి. ఒకాయన ఆగకుండా ఇరవై నాలుగు గంటలు ఏకధాటి ఉపన్యాసాలిస్తాడట. ఒకాయన అధికసంఖ్యలో సమీక్షలు రాశాడట. ఒకరు ఒకేసారి పెద్దసంఖ్యలో గ్రంథాలు ఆవిష్కరిస్తారు. ఇవన్నీ ఇప్పుడు రికార్డులకెక్కిపోతాయన్నమాట! ప్రతిదీ ఒక 'రికార్డింగ్' డ్యాన్స్ అయిపోతోంది. గిన్నిస్‌బుక్ వదిలేయండి. లిమ్కా బుక్ ఆఫ్ తెలుగు రికార్డ్స్, తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్, యునీక్ వరల్డ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇలా అనేక సంస్థలు 'రికార్డ్స్' ఈవెంట్స్ అంటూ పత్రాలు, గుర్తింపులు ప్రదానం చేసేస్తున్నాయి. పాతికవేలో, యాభైవేలో ఇస్తే డాక్టరేట్స్ ప్రదానం చేసే అమెరికన్ యూనివర్సిటీలు ఎన్నో పుట్టుకొచ్చాయి.

కీర్తికి షార్ట్‌కట్‌గా 'విత్తం' ఉండాలేగానీ, పట్టాలకు, బిరుదులకు, రికార్డు యోగ్యతా పత్రాలకు కొదవలేదు. భాషాభూషణులు, సాహిత్య చక్రవర్తులు బొడ్డూడని కుర్రకవులూ, రచయితలూ కూడా అయిపోతున్నారు. ఏ సిద్ధాంత గ్రంథమూ కష్టపడి రాయకుండానే, గౌరవ డాక్టరేట్‌లతో అలరారిపోయే అవకాశాలు, అందుకు రెడీగా ఉన్న యూనివర్సిటీలు బోలెడు వచ్చేశాయి.

రికార్డుల 'యావ' పెరిగిపోతోంది. ఏటికేడాదీ ఓ పుస్తకం వెలువరిస్తూ నిరంతర కవిగా వెలుగొందినవారి స్ఫూర్తి అంటూ శతాధిక గ్రంథాలను అచ్చొత్తించేస్తున్న వారూ బయలుదేరారు. వాసికన్న రాశి ముఖ్యం మరి 'రికార్డి'ంగ్ డ్యాన్స్‌కు. రికార్డు కోసం ఎక్కువ ఇడ్లీలు తినడం దగ్గర్నుంచి, ఎక్కువకాలం ఎక్కిళ్ళు పెట్టడం. దీర్ఘచుంబనమే కాక దీర్ఘ విరేచనాలు కూడా ఇప్పుడు రికార్డుల కెక్కేస్తాయేమో! ఆశ్చర్యపోనక్కర్లేదు. తెలుగువాడయి ఉండి అసలు తెలుగు మాట్లాడలేకపోవడం, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలేవీ తెలియకపోవడం కూడా భవిష్యత్తులో 'రికార్డు'కెక్కే పరిస్థితులూ వచ్చేయచ్చు. పద్దెనిమిది పర్వాల భారతం రాసిన వ్యాసుడు ఏ గిన్నీస్ బుక్ రికార్డు కోసమో రాయలేదు. నరాంకితం కాకుండా రామభద్రుడికి పోతన భాగవతం అంకితం చేయడం ఏ 'రికార్డు'కీ ఎక్కడానికి కాదు. మంచి జరగాలి. మంచికి గుర్తింపు రావాలి అన్నది సమాజంలో సహజంగా విస్తరిల్లాలి. కాలానికి నిలబడేది, కలకాలం గుర్తుండేది హృదయగతం కావాలి. "రాజు మరణించె ఒక తార రాలిపోయె! కవియు మరణించె ఒక తార గగనమెక్కె" అని జాషువాకవి అన్నట్లు రికార్డింగ్ డ్యాన్స్‌లు కాక జనావళి హృదయానంద తాండవం ఏ కళకయినా సార్థకం! *

11

6 ఆగస్టు' 2018

# మరల ఇదేమి రామాయణమన్నా..!

ఆస్తికులకయినా, నాస్తికులయినా ఉపయుక్త గ్రంథంగా ఉండడం మాత్రమే కాదు, మరల మరల పలురీతులుగా లిఖింపబడుతూ తరతరాలకు ఒక సార్వకాలిక సంచలన విషయంగా ఉన్నది ఏదయినా ఉందంటే అది ఒక్క 'రామాయణం' మాత్రమేనేమో! రామాయణ కాలం ఇప్పుడు లేదు. అసలు రామాయణం జరగనే లేదనీ, అది ఒక కల్పిత కథ అనీ భావించేవారూ ఉన్నారు. అలాగే అనుకున్నా ఎప్పటి కల్పితగాధో ఇప్పటికీ సమాజంలో ప్రభావోపేతంగా, సజీవంగా నిలవడం సమకాలీనంగానూ చర్చనీయాంశమై సంచలనాత్మకం కావడం విశేషం!

రామాయణం వాల్మీకి రచన. ఆ వాల్మీకి ఏమీ అగ్రవర్ణం వాడు కాదు. జన్మతః ఒక బోయవాడు. దారిదోపిడీలు చేసుకుంటూ బ్రతికేవాడనీ అంటారు. అలాంటి వ్యక్తి నారదుని ఉద్బోధ కారణంగా రామ నామాన్ని అది కూడా 'మరామరా' అని అపసవ్యంగా జపించి, తన కృషితో ఋషిగా, మహాపురుషుడుగా ఎదిగిన మనిషే! క్రౌంచపక్షులలో ఒకదానిని వేటగాడు సంహరించగా ఆ జంటపక్షి విలాపాన్ని తట్టుకోలేక ఆ నిషాదుడిని శపించే తపోబల సంపన్నుడై ఆ శోకం శ్లోకంగా ఆవిర్భవించడంతో రామాయణ కావ్య రచనకు సమకట్టాడు. వాల్మీకి–రామాయణం జరుగుతున్న కాలంలోనే ఉన్నాడు. అంతేకాదు ఉత్తర రామాయణంలో సీతకు తన ఆశ్రమంలో ఆశ్రయం ఇచ్చి గర్భవతి అయిన ఆమె కవలలుకు జన్మనిచ్చాక ఆ లవకుశులను పెంచి, వారికి విద్యాబుద్ధులు నేర్పించి, వారిచేతే రామాయణ గాథను పాడించి ప్రాచుర్యంలోకి తెచ్చిందీ వాల్మీకే! మరి అలాంటప్పుడు రామాయణం జరిగిందనే భావన లోకంలో ఏర్పడటం, రాముడు ఆదర్శనీయునిగా, పురుషోత్తమునిగా అనేకులచే భావింపబడటం తరతరాలుగా వస్తున్న విషయమే! రామాయణం కల్పిత

కథ అయితే దాని రచయిత అయిన వాల్మీకి అందులో తనను తాను ఒక పాత్రగా చేసుకుని రాసుకున్న కథ అవుతుంది. అప్పుడూ అది ఆత్మకథనాత్మక మైనదన్నప్పుడు జరిగిందనేదే సత్యనిష్టమౌతుంది. ఆత్మకథలో అబద్ధాలు, అతిశయోక్తులు చొరబడితే అది రచయిత వ్యక్తిత్వానికీ 'మచ్చ'యే!

ఎలా చూసుకున్నా రామాయణం వేసిన ప్రభావం సామాన్యమైంది కాదు. పితృవాక్య పరిపాలన, భ్రాతృవాత్సల్యం, దాంపత్య స్నేహం, మైత్రీ సంపద, బంటురీతి ఇలాంటి వాటికెన్నింటికో రామాయణ పాత్రలు అనేకం ఒక 'ఐకాన్'గా ఉన్నాయి. ఇప్పటికీ రామచంద్రమూర్తి, రామారావ్, శ్రీరామ్, రాఘవరావు, సీతారాం, సీతాపతి, సీతారామస్వామి అంటూ లోకంలో రాముడి పేర్లు పెట్టుకుంటూనే ఉన్నారు. ఆ మాటకు వస్తే కైక, మంథర, రావణ, శూర్పణఖ, మారీచుడు, లంఖిణి వంటి పేర్లు మినహాయించి రామాయణంలోని అనేక పాత్రల పేర్లను తమ పిల్లలకు నామధేయాలుగా సంతరించుకుంటున్న సంస్కృతి సమసిపోలేదు.

నిజమే! వాలివధ, శూర్పణఖ ముక్కుచెవులు కోయడం, శంబూక వధ, సీత అగ్నిపరీక్ష, సీతాపరిత్యాగం వంటి రామాయణ అంశాలు ఇప్పటికీ ధర్మవిచార పరీక్షలో చర్చనీయాంశాలుగా, రాముని పాత్ర ఔన్నత్యం అర్థం చేసుకోవడానికి కొందరికి మరీ ప్రతిబంధకాలుగానే ఉన్నాయి. 'ధర్మం' పేరున శ్రీరాముని చర్యలు కొన్ని అవగాహనకు రావడం సామాన్యుడికి అంతుబట్టని విషయాలుగానే ఉన్నాయి. ఎందరు, ఎన్నిరకాల, ఎలా సమర్థింప చూసినా, ఆమోదయోగ్యమై మనఃస్థిమితం చెందని వారున్నారు.

'మరల ఇదేల రామాయణమటన్న' అంటూ విశ్వనాథ వివరించి–'రామాయణ కల్పవృక్షం' రచించి, 'జ్ఞానపీఠం' పొందిన తెలుగుగడ్డపైనే 'రామాయణ విషవృక్షం' రాసి రంగనాయకమ్మ తమదైన పంథాలో ప్రాచుర్యం పొందారు. రామాయణాన్ని ఇప్పటికే ఎందరో పండితులు పద్యంలో, వచనంలో వివిధ ప్రక్రియలలో వెలువరించారు. వాల్మీకి మూలం ఆధారంగానే వందలాది రామాయణాలు వచ్చాయి. మొల్ల వంటి రచయిత్రి సరేసరి! నేటి ఆధునిక కాలంలో అందునా మార్క్సిజం రామాయణం చూసే కోణంలో మార్పులు ననలెత్తాయి. రామాయణానికి మతం రంగు పులిమి, హైందవధర్మంకు ఆచరణాత్మక గ్రంథం అనే విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు రామాయణ పాత్రలనూ, కథనాల్నీ పునర్మూల్యాంకనం పేరుతో, వర్తమాన రీతులకూ

నేటి సామాజిక న్యాయాలకూ గీటురాయి వైఖరి చేసి మాట్లాడే, రచించే వైఖరి పెరిగిపోతోంది. సరికొత్త వివాదాలకు, సంచనాలకూ రామాయణం ఆస్పదం అవుతోంది. రామునికన్నా సీత రావణాసురుడి దగ్గరే ఉండిపోతే బాగుండేదని కత్తిమహేష్ చేసిన వ్యాఖ్యలు సరికొత్తగా ప్రకంపనాలు తెచ్చాయి. పరిపూర్ణానందస్వామి ఖండనలూ వివాదమయ్యాయి. అటు కత్తిమహేష్, ఇటు పరిపూర్ణానందస్వామి ఇద్దరూ శాంతిభద్రతలకు విఘాతం పేరున నగర బహిష్కరణకు గురి అయ్యారు. 'రామాయణం' తరతరాల సంచలనం అనడానికి 'వర్తమానం' దర్పణమైంది. లంకలో సీత రావణాసురుడి పాలనలోనే సురక్షితంగా ఉందనీ, ఆమె మనసులో ఆయన పట్ల ప్రేమ కూడా ఉందనీ గతంలోనూ కథలు వచ్చాయి. అదే! రాయబడ్డాయి. రాముని కన్నా రావణాసురుడినే సిసలైన నాయకుడిగా సంభావించడం నేటికీ తమిళనాట ప్రచులితంగా ఉంది. చెప్పవచ్చేదేమిటంటే రామాయణ ప్రస్తావనో, ప్రసక్తో లేకుండా, మంచికో, చెడుకో రామాయణం మౌలికంగా నిలువకుండా నేటికీ సమాజం సాగడం లేదు. మొన్నటికి మొన్న సిరిసిల్ల జిల్లాలో అభివృద్ధి పనులను ఆరంభిస్తూ మంత్రి కె.తారకరామారావు (ఆయనదీ రాముడి పేరే) రాముడి పాలనలోనూ శిస్తు ఉందనీ, కానీ తమ ప్రభుత్వం రైతులను అలాంటి బాధలు లేకుండా ఆదుకుంటోందనీ ప్రసంగించారు. అసలైన ప్రభుత్వం అంటే 'రామరాజ్యం' అనే భావన ఒక స్థిరీకృత వ్యవహారమే! తాము అధికారంలోకి వస్తే 'రామరాజ్యం' స్థాపిస్తామని వివిధ పార్టీలు నేటికీ అంటూనే ఉన్నాయి. రాజ్యంలోని ఓ రేవడు అన్న మాటకే ధర్మపత్నిని – ఆమె గర్భవతి అని కూడా చూడకుండా, పరిత్యజించిన రాముడు ప్రజాస్వామ్యం కోసం ధర్మ పరిరక్షణ నిమిత్తమే అలా చేశాడని విశ్వసించలేనప్పుడు – సీతను అవమానించినందుకు, రేవడుకు దేశ బహిష్కరణ విధించడం ఆనాడు రాముడు చేసి ఉంటే రామాయణం ఏమయ్యేదో మరి! *

**12**

**13 ఆగస్టు' 2018**

# సభావేదికల ఔచిత్య విచార చర్చ!

ఇక్కడ కేవలం సాహిత్య సభా వేదికల గురించే ప్రస్తావిస్తున్నాను సుమా! ఒకప్పుడు సాహిత్య సభలు, సమావేశాలు అంటే అభిమానులు తరలివెళ్లేవారు. జంటనగరాల్లో యువభారతి సంస్థ లహరి సమావేశాలకు – ఆ ఉపన్యాసాలు వినడానికి, వానపడుతున్నా గొడుగులు వేసుకు మరీ వెళ్ళి వినడం ప్రత్యక్షానుభవమే! అప్పట్లో సాహితీ సంస్థలు ఏవయినా ఉపయుక్త సభలతో సాహితీపిపాసను తీర్చేవిగానూ, సాహిత్యాభిరుచిని పెంచేవి గానూ వ్యవహరించేవి. విద్యార్థి రచయితల సంఘాలు యువతను సాహిత్య సృజనపథగాములను చేసేవి. ఆ సమావేశాలు, ఆ సభా వేదికలు అలా పెద్దల మార్గదర్శకత్వంలో విషయసంపన్నతతో ఉండేవి. 'తేహినో దివసాగతాః'

నేడు సాహితీ సాంస్కృతిక సంస్థలు అనేకం ఉన్నాయి. అయితే వాటిల్లో చాలావాటి సభలు – సమావేశాలు అన్నీ సన్మానాలకు, అవార్డు ప్రదానాలకూ, గ్రంథావిష్కరణలకు, జన్మదినోత్సవ వేడుకలకు అన్నట్లుగా సాగుతుంటాయి. పేరుకు సాహిత్య సంబంధ సభే అయినా, సభా ప్రారంభానికి ముందు సినిమా పాటల సంరంభమే! ఔత్సాహిక గాయనీ గాయకుల గానాలే! అవేవీ ముందు ఏ రిహార్సల్స్ చేసుకున్నవో కాదు. 'అప్పటికయ్యది'.. అన్న బాపతే! మోకాలికీ.. బోడి గుండుకూ ముడిపెట్టినట్లుంటాయి కొన్ని. ఇక ఏ సభకు అయినా 'అధ్యక్షుడు' ప్రధానం. సభా నిర్వహణ చేయవలసింది ఆయనే! సంస్థ కార్యకర్త వేదికపైకి ముందుగా పిలవవలసింది అధ్యక్షుడినే! కానీ నేడు ముఖ్య అతిథిని ముందుగా పిలవడం, ఆ ముఖ్య అతిథి సాహిత్య రంగంకు ఏ మాత్రం సంబంధం లేని వాడుగా కూడా చాలా సమావేశాల్లో ద్యోతకం కావడం, మామూలైపోయింది. నిజానికి ఖాళీ వేదికపైకి ముఖ్య అతిథిని

ముందు పిలవడం గౌరవం కానేకాదు. అధ్యక్ష స్థానంలో వ్యక్తి ముందు వేదికపైకి ఆహ్వానింపబడి, ఆపై ముఖ్య అతిథిని పిలిచినప్పుడు అధ్యక్షుడు ఆ అతిథిని సాదరంగా వేదికపై రిసీవ్ చేసుకొని, ఉచితాసనంపై కూర్చోబెట్టడం మర్యాద! కానీ అధ్యక్షుడిని పిలిచాక తమను పిలిచారని అలిగే ముఖ్య అతిథులూ, తమనే ముందు వేదికపైకి పిలవాలని కార్యకర్తలను ఆదేశించే పెద్దలూ తయారయ్యారు! అంతెందుకు ఆహ్వాన పత్రంలో తమ పేరు కన్నా ముందు వేరేవారి పేరు వేశారని ఆహ్వానపత్రాన్ని చింపేసి, కార్యకర్తల మీద విరుచుకుపడిన సోకాల్డ్ సాహితీ పెద్దలూ ఉన్నారంటే నివ్వెర పోనక్కరలేదు. తమ పేరుతో బాటు, తమ బిరుదులు, పదవులు ఆహ్వాన పత్రంలో వేయాలనీ, వేదికపైకి అలానే పిలవాలనీ కొందరి ఆదేశం!

తాము ఒక పదవిలో, అధికారంలో ఉన్నంత మాత్రాన వయసులోనూ, అనుభవంలోనూ తమకన్నా పెద్ద అయిన వారి పేరు తర్వాత కాక, ముందే తమ పేరు ఆహ్వాన పత్రంలో వేయాలని పట్టుబట్టేవారూ, వేదికపైకి వారి కన్నా తమనే ముందు పిలవాలనీ, తాము మాట్లాడాకే మిగతా వారిని మాట్లాడించాలని ఏ మాత్రం తేడా వచ్చినా ఆ సాహితీ సంస్థల నిర్వహకుల మీద యాగీ చేసే మహనీయులూ ఉన్నారనీ, కొందరు ఔత్సాహిక సాహిత్యసంస్థల నిర్వాహకులే చెబుతున్నారు. సమావేశం నిర్వహించుకోవడానికి ఆర్థిక సహకారం అందించినందుకో, వేదికను ఉచితంగా ఇచ్చినందుకో ఆహ్వానపత్రంలో తమ పేరు ఎక్కడ ఉండాలో, వేదికపై తమ ఆసనం ఎక్కడ ఉండాలో నిర్దేశించడం ఎలాంటి విజ్ఞతో వారికే తెలియాలి. అలాంటివారూ ఉన్నారుగా మరి!

సరే! వేదిక మీద ఎంతమంది ఉన్నారో, ప్రేక్షకులుగా అంతమంది అయినా లేని సమావేశాలూ జరుగుతూనే ఉన్నాయి. ముఖ్య అతిథి, విశిష్ట అతిథి, గౌరవ అతిథి, ఆత్మీయ అతిథి, ప్రత్యేక ఆహ్వానితులు, సభా ప్రారంభకులు, ఆవిష్కర్తలు అంటూ వేదిక ఎక్కించేవారి సంఖ్యకు ఒక నియతి అంటూ లేదు కదా! రెండు వరుసల కుర్చీలు వేసి ఎవరిని గౌరవించదలిచారో ఆ సాహిత్య మహనీయులను రెండవ వరుసలోకి నెట్టి, వేదిక ముందు రాజకీయవేత్తలూ, వ్యాపారవేత్తలూ, ఆర్థికవేత్తలూ, స్వచ్ఛంద సంస్థల పెద్దలూ, రికార్డు నమోదంటూ ఆ సంస్థల ప్రతినిధులూ ఆసీనులై సభానిర్వహణ చేయడం విడ్డూరమని అన్పించకపోవడమే విడ్డూరం. ఇదంతా ఇవాళ ఒక యాంత్రిక వ్యవహారమై పోయింది.

ఒక్కోసారి జ్యోతి ప్రజ్వలనం (దానిని ప్రకాశనం అవడమే సబబు) అనేది ఒక ఫార్స్‌గా సాగుతుంది. వేసిన నాలుగైదు వత్తులు ఎవరెవరు వెలిగించాలో స్పష్టత ఉండదు. కొవ్వొత్తి లేకపోతే ఆ అగ్గిపుల్లలు గీయడం, అవి ఆరిపోతుండడం, వేదికపై ఫ్యాన్లూ అవీ ఆపి మళ్ళీ వెలిగించడం.. ఇదో తంతు! జ్యోతి ప్రకాశంకు పాదరక్షలు విడిచేవారు కొందరు. ఆ పాదరక్షలతోనే కానిచ్చేవారు కొందరు. ప్రార్థన క్లుప్తంగా ఉండక ఒక్కసారి సంగీత కచేరీ కీర్తనలా సాగించేవారు కొందరు. నిజంగా అవసరమా ఇదంతా? అంటే సాగుతోంది అంతే! ఇక సాహిత్య సాంస్కృతిక సంస్థలు నిర్వహిస్తూండే కొన్ని సమావేశాలకు, సభలకు అధ్యక్షుడు అని ఉన్నా, ఈ రోజుల్లో 'సభానిర్వహణ' అని మరొకరు ఉంటుంటారు. ఒక రకంగా అది 'యాంకరింగ్' లాంటిదే! సదరు సభల్లో అధ్యక్షుడి పాత్ర కూడా తనను పిలిచినప్పుడు మాట్లాడి కూర్చోవడమే! అదే అధ్యక్షోపన్యాసం! మిగతా తతంగం అంతా మళ్ళీ సభా నిర్వాహకుడే చూసుకుంటాడన్నమాట! గ్రంథావిష్కరణ సభల్లో ఒక్కసారి ఆవిష్కర్త పాట్లు పాపం చెప్పనలవి కావు. ఏ కత్తెరయో లేకుండా – ఆ ప్యాకెట్ విప్పడం, అందునా వయస్సు పైబడిన ముఖ్య అతిథి గారికి చాలా కష్టం! అంతంత పీటముడులు వేసిన రంగుల కాగితాలతో ఆ పుస్తకాలు బంధింపబడి ఉంటాయి మరి. పుస్తకం మొత్తం ప్రింటవలేదని, తెల్లకాగితాలతోటి పుస్తకమే ఆవిష్కరించేసేవారూ ఉన్నారు. గ్రంథ సమీక్ష అనో, పరిచయం అనో నిర్దేశింపబడిన వ్యక్తి తీరా మాట్లాడే సమయానికి ఏమీ మిగలకుండా అప్పటికే ఆవిష్కర్త, అధ్యక్షుడు, విశిష్ట అతిథులు, ముఖ్య అతిథులు, గౌరవ అతిథులు పుస్తకం గురించీ, రచయిత గురించి చెప్పేసే ఉంటారు! పుస్తక ఆవిష్కరణ జరగగానే గ్రంథ సమీక్షయో, పరిచయమో చేయించడం పద్ధతి కానీ, దానిని నేడు ఎవరూ పాటిస్తున్న దాఖలాలలు కనబడవు! అలాగే అసలు పుస్తకం, దాని రచయిత గురించి వదిలేసి, అసలు సమావేశ సందర్భం, సంకల్పం విస్మరించి వేదికపైకి వచ్చిన ముఖ్య అతిథినో, అధ్యక్షుడిని గురించో లేక ఏ సినీరంగ వ్యక్తియో వేదికపై ఉంటే – ఆ సెలబ్రిటీ గురించో మాట్లాడే వక్తలున్నారు. అదేం ఔచిత్యమో అర్థంకాదు! అలాగే మాట్లాడే ప్రతి వక్తా ప్రారంభంలో వేదికపై ఉన్న ప్రతి ఒక్కరి పేరునూ ప్రస్తావించాలా? వేదికపై ఉన్నవారి పేర్లు అన్నీ తెలియని వారూ వేదికపై ఉంటుంటారు. తమ ప్రస్తావనలో కొందరి పేర్లు మరిచేవారు, విస్మరించేవారూ, అసలు సంస్థ పేరునో, నాటి సమావేశ సందర్భాన్నో వేదిక వెనుక బ్యానర్ చూస్తే

తప్పు గుర్తుండి చెప్పలేనివారు ఆ సభావేదికపై ప్రముఖంగా ఆసీనులై ఉంటుంటారు కూడా. ఇక కొందరి వక్తల ప్రసంగవాచాలత ప్రేక్షకశ్రోతల సహనానికి పరీక్షయే! వేదికపై తమ పాత్ర ఎంత? తాము ప్రసంగించాల్సింది దేని గురించి, ఏ మేరకు అన్న అవగాహన వక్తలకు ఉండాలి. ప్రేక్షకులచేత చప్పట్లు కొట్టించుకునే జిమ్మిక్కులు, లేదా అడిగి మరీ చప్పట్లు కొట్టించుకునే వైఖరులు కొందరివి. ప్రేక్షకులు రసాస్వాదనా తత్పరులై, స్వయంగా కరతాళధ్వనులు చేయగల రసజ్ఞులు కూడా కరువవుతున్నప్పుడు సభలో 'ప్రేక్షకపాత్ర' అలాగే ఉంటుంది మరి!.. సభా ప్రారంభం అన్న సమయానికే జరుగుతుందన్న నమ్మకం నేడు ఎవరికీ ఏ కోశానా లేదు. సమయపాలన చాలా ముఖ్యమన్న సంగతి అంతా గ్రహించగలగాలి. సభ ఆసాంతం ఆసక్తిగా నిండైన ప్రేక్షకులతో సాగాలంటే వేదికపై ఉన్న వారందరికీ ప్రసంగ ఔచితి, సమయ ఔచితి తెలియాలి! ఏమయినా మొక్కుబడి సభల్లా కాక సాహిత్యసభలు ఉపయుక్త ఔచితీమంత సభలుగా రాణించాలని కాంక్షిద్దాం! *

13

20 ఆగస్టు' 2018

# 'బజారు' మనుషులౌతున్న ప్రముఖులు

అదేదో చిత్రం సంభాషణలో చెప్పినట్లు – "భగవంతుడు మనుషులను ప్రేమించమనీ, వస్తువులను వాడుకోమనీ సృష్టించాడు. కానీ మనం వస్తువులను ప్రేమిస్తూ, మనుషులను వాడుకుంటున్నాం". వర్తమాన ప్రపంచంలో అన్ని రంగాల్లో ఈ వైఖరి ప్రబలుతూ ఉంది. మరీ ముఖ్యంగా మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగానే రూపెత్తుతున్న ఈ కాలంలో వస్తు సంస్కృతే ఆధిపత్యం వహిస్తోంది. ప్రస్తుతం కన్స్యూమరిజం విపరీతంగా పెరుగుతూ ఉంది.

ఒక వస్తువు నాణ్యత మాట ఎలా ఉన్నా, కంటికి నదురుగా కనబడాలి. 'ఆకర్షణ' అనేది మూలధాతువై కూర్చుంటోంది. అందుకే అణాకానీ సరుకే అయినా ఆకర్షక ప్యాకింగ్‌లో చుట్టి అర్థరూపాయికి అంటగట్టే జిమ్మిక్కులు సాగుతున్నాయి. పెరిగిన సాంకేతిక విలువలూ అందుకు దోహదం చేస్తున్నాయి. సరుకులోని సారం, నాణ్యత మాట ఎలా ఉన్నా ప్రచారార్భాటం ప్రాధాన్యం వహిస్తోంది. ఒకప్పుడు హ్యాండ్ కంపోజింగ్ జరిగి, ఏ ట్రెడిల్ మిషన్ మీదో అచ్చయిన పుస్తకం ఇవాళ డీటీపీతో, స్కానింగ్‌లతో, అధునాతన ప్రింటింగ్ మిషన్ల మీద అందంగా, అట్టహాసంగా క్షణాలలో అచ్చుఅయి వచ్చేస్తోంది. కానీ ఒకనాటి సాహిత్య గ్రంథాలలోని 'ఆత్మ' ఏదో నేటి గ్రంథాలలో లోపించినట్లే అనిపిస్తోంది అంటే అందులో అతిశయోక్తి ఏమీలేదు. ఎంత ప్రముఖులు, ఏ సెలబ్రిటీలు ఆ గ్రంథాలకు మున్నుడులు, అభిప్రాయాలు సంతరించినా, ఏ రికార్డులకెక్కేలా ఆవిష్కృతమైనా పసలేని రచనలు పల్లకీమోతలతో రాణించగలవనుకోవడం భ్రాంతియే! ఈ మాయామేయ జగంబులో అలాంటివే మెరుపులు మెరుస్తున్నాయంటే అది మేడిపండ్ల నిగారింపే! మనం మనుషులను ప్రేమించడం లేదా అంటే లేకేం! ఎందరు సినీహీరోలకు అభిమాన సంఘాలు పెట్టలేదూ! వారిపై అభిమానంతో వారి సినిమా విడుదల రోజు ఎంత

హంగామా చేయలేదూ! వారిపేర రక్తదానాలు చేయలేదూ! అలాగే ఎందరు నేతలను అమ్మ అనీ, అన్న అనీ నెత్తికెత్తుకోలేదూ! వారిపట్ల వీరాభిమానంతో ఎందరు వారికి ఏ కష్టం వచ్చినా తాము చలించిపోయి వారికోసం పూజలు, హోమాలు చేసి కొండకచో వారిపట్ల అభిమానంతోనే ఆత్మహత్యలు చేసుకోలేదూ! ఎందరు సెలబ్రిటీలకు పాలాభిషేకాలు చేయడం లేదూ! ఇదంతా మనుషులను ప్రేమించడం కాదా? అని అడిగితే సమాధానం ఏమిటి? అందుకే కదా అన్ని రంగాలలోనూ నాయకులూ, వారికి బృందాలూ ఏర్పడేది. చివరకు ఇది భక్తికి కూడా వ్యాపించడం వల్లనే కదా ఇవాళ దేశంలో స్వాములు, బాబాలు, కొల్లలుగా వారి ఆశ్రమాలు, భక్త జన సందోహంతో పరిఢవిల్లుతున్నాయి. ఏదో ఒక ప్రత్యేక శాఖ సంతరించి తామూ నాయకులైపోయి, తమకు అనుయాయులను పెంచుకునే తపనలు, తాపత్రయాలు అన్నిరంగాలలో వలె సాహిత్యరంగంలోనూ చాలానే వచ్చాయి. ఏదో ఓ ప్రక్రియావైవిధ్యానికి తమనే నాందిగా–మరో పదుగురినీ, ఆ మాటకొస్తే వీలైనంత ఎక్కువ మందిని ఆ అనుసరణలోకి లాగడానికి తమ చేతిలోని ఓ సాహిత్య పీఠమో, అధ్యాపకత్వమో, పత్రికా నిర్వహణమో ఉపయుక్తం చేసుకుని కీర్తి కిరీటాలు తగిలించుకుంటున్నవారు ఉంటున్నారంటే అందులో వింత ఏముంది?

ఇలా ప్రేమింపబడే, అభిమానింపబడే, ఆరాధింపబడే ప్రముఖులను, సెలబ్రిటీలను కూడా అందుకే వస్తు సంస్కృతి వినియోగించుకుంటోంది. వ్యాపారాభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌లు అంటూ సినీరంగ ప్రముఖులను కంపెనీలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. సినిమా, క్రికెట్ ఈ రెండింటి రంగాలలోని ప్రముఖులనూ తమ వ్యాపార ప్రకటనలకు వాడుకోవడం, అందుకోసం లక్షలు, కోట్లు చెల్లించడానికి బడా వ్యాపారసంస్థలు సిద్ధపడిపోవడం చూస్తూనే ఉన్నాం. ఆ హీరోల, క్రీడా సెలబ్రిటీల గ్లామర్‌ను వాడుకోవడమంటే తమ వస్తువులను జనం చేత ప్రేమింప చేసుకోవడానికి, వారు ప్రేమించే మనుషులను వాడుకోవడమే మరి! తమ అభిమాన హీరోయో, హీరోయినో, క్రీడాకారుడో, క్రీడాకారిణియో వాడుతోంది కదా అని ఆ టూత్‌పేస్ట్‌లకు, సబ్బులకు, ఔషధాలకు, ఇతరేతర వస్తువులకు తామూ వినిమయదారులం కావాలనే కాంక్షను ప్రోద్బలం చేసి, ఆయా వస్తువులను కొనుగోలు చేసేలా ఆకర్షించడానికే ఆ వ్యాపార ప్రకటనలూ, అందుకోసం ఆ ప్రముఖులకు లక్షలు చెల్లించడాలూ! నిజానికి సమాజం పట్ల బాధ్యతగల వారు డబ్బుకోసం ఇలాంటి వ్యాపార ప్రకటనా ప్రలోభాలకు లోనుకాకూడదు. సినీ తారల సౌందర్య రహస్యం అంటూ ఒక 'లక్స్' సబ్బు దశాబ్దాలకు పైగా సినిమా హీరోయిన్లను తమ ప్రకటనల్లో వినియోగిస్తోంది. నిజానికి ఒక

వస్తువు నాణ్యతా ప్రమాణాలు, ఒక వ్యాపార సంస్థ నిలకడ, నిజాయితీ తెలియకుండా, కేవలం వారు తనకు డబ్బు ఇస్తున్నారని వాటికి ప్రచారం చేయడం, తనను అభిమానించే వారినందరినీ మభ్యపెట్టడం అని ఆ సెలబ్రిటీలు గ్రహించలేకపోవడం వస్తు సంస్కృతికి అమ్ముడుపోవడమే. అమ్మకాలకు కొమ్ముకాసే 'బజారు' మనుషులుగా దిగజారడమే! తెలుగునాట ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి అగ్రహీరోలు గానీ, శివాజీ గణేశన్, రాజ్‌కపూర్, రజనీకాంత్, కమల్‌హాసన్, కన్నడ రాజ్‌కుమార్, ప్రేమ్‌నజీర్‌వంటి వెండి తెరనేలిన ప్రేక్షక నీరాజనాలందుకున్న విశిష్టులుగానీ ఏనాడూ ఇలా వ్యాపార ప్రకటనల్లో పాలుపంచుకోలేదు. ధనార్జన కన్నా నైతిక బాధ్యత ముఖ్యమని తలపోసినవారు తప్పుడు వాగ్దానాలివ్వరు. ప్రకటనల జోలికి పోరు. వస్తు సంస్కృతిలోని మోసాలకు మద్దతివ్వరు. కానీ ఈనాడు రియల్‌ఎస్టేట్ బిజినెస్‌లకు సైతం కె.విశ్వనాథ్‌లాంటి దర్శకులు, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వంటి గాయకులు, సిరివెన్నెల సీతారామశాస్త్రి వంటి కవులు, సుమలాంటి టీవీ యాంకర్లు వ్యాపార ప్రకటనలు ఇచ్చేస్తూండడం శోచనీయమే. మూతబడిన డొకోమో ఫోన్‌లకు రామ్‌చరణ్ తేజ ఒకప్పుడు ప్రచారమిచ్చాడు. కోట్లాది రూపాయలు మోసం చేసిన నీరవ్‌మోదీ, మెహుల్ చోక్సీల కంపెనీలకు బాలీవుడ్ తారలెందరో పోటీపడి ప్రకటనలిచ్చారు. అమితాబ్‌బచ్చన్ ప్రజా సంక్షేమార్థం ప్రభుత్వ పథకాలకు ప్రచారం ఇవ్వడం సబబు కావచ్చునేమో గానీ, ఇవాళ అనేకరకాల వ్యాపార ప్రకటనల్లో వాడుకోబడుతున్నాడు. నగలను ఫలానా చోట కొనమని లేక కుదువబెట్టమని చెబుతున్న తెలుగుహీరోలు, హెయిరాయిల్స్‌కు, బనీన్లకు ఆఖరికి టాయిలెట్ క్లీనింగ్ వస్తువులకు కూడా ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్స్‌గా తయారైపోతున్న వారిని చూస్తుంటే నిజంగా మనుషులను వాడుకోవడం, అందునా సెలబ్రిటీలను వాడుకోవడంలో మార్కెట్ సంస్కృతి ఎంత ఆధిపత్యం సాధించిందో కదా అని అనిపించకమానదు. తమ అభిమాన హీరోలు, పెద్దలు చెప్పారని వ్యాపార ప్రకటనల మాయాజాలంలో పడి, రియల్ ఎస్టేట్ మోసాలలో పడి బలి అవుతున్న, నష్టపోతున్న ప్రజలకు ఆ అంబాసిడర్‌లు ఎలాంటి హామీ, పూచీకత్తు వహించరని గ్రహించాలి. ప్రకటనల ఆకర్షణల్లో పడి అవసరంలేని వస్తువులను కూడా కొని డబ్బు వృథా చేసుకోకుండా వివేకం పెంచుకోవాల్సింది కూడా ప్రజలే! వినియోగదారులారా మేల్కొనండి మరి! *

14

**27 ఆగస్టు' 2018**

# వాళ్ళకేం కావాలో నిజంగా తెలుసా మీకు?

అవును! బాలసాహితీ వేత్తలనబడే వారికి వేస్తున్న ప్రశ్నే ఇది. స్త్రీలు రాసింది స్త్రీవాదసాహిత్యం, దళితులు రాసింది దళితవాద సాహిత్యం అంటున్నాంగానీ, బాలలు రాసిన సాహిత్యాన్ని 'బాల సాహిత్యం'గా అనడం లేదు సరికదా! పిల్లలకు ఏం కావాలని పెద్దలు అనుకుంటున్నారో, పిల్లలు ఎలా ఉండాలనీ, ఎలా పెరగాలనీ తాము ఆశిస్తున్నారో, అందుకు అనుగుణంగా వారికోసం పెద్దలు రాస్తున్నదే 'బాలసాహిత్యం'గా చెలామణిలో ఉంటోంది! అకాడమీలు సైతం బాల సాహిత్యం పేర పెద్దలు రాసినదాన్నే గుర్తిస్తూ, బేరీజువేస్తూ బాలసాహిత్య అవార్డులు సైతం ప్రకటిస్తున్నారు.

ఇంట్లో ఉన్నట్లే బయట పిల్లలు ఉండకపోవడం ఎంత సహజమో ఒకప్పటి బాల్యానికి, ఈనాటి బాల్యానికి కూడా బోలెడు అంతరం ఉంది. కాలం మారుతున్న కొద్దీ, తరం మారుతున్న కొద్దీ 'బాల్యావ్యస్థ' తీరుతెన్నులు మారిపోతుంటాయి. ఉమ్మడి కుటుంబాలు మాయమై, 'అమ్మా–నాన్నా–నేను' అన్నతరహాగా కుటుంబాలు పెరిగి అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు, బాబయ్యలు, అత్తయ్యలు, మామయ్యలు వంటి వారంతా, ఎప్పుడోగానీ ఇంటికి రాని బంధువులుగా మారిపోయాక, పిల్లల బాల్యం కూడా నేడు కుంచించుకు పోతోంది. ఇంట్లో వీడియోగేమ్స్, టీవీలో కార్టూన్ షోలు, సెల్‌ఫోన్, కంప్యూటర్ ఇవే పిల్లలకీ–బడిచదువులు, హోంవర్క్‌లు తరువాత వినోద, కాలక్షేప  ఉపకరణాలయ్యాయి.

పిల్లలకు అమ్మలు, అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు కథలు చెప్పే కాలం క్రమేపీ కుంచించుకుపోవడమో, కనుమరుగవడమో జరుగుతోంది. ఒకప్పుడు చందమామ, బాలమిత్ర వంటి పత్రికలు పిల్లల పఠనాభిరుచిని తీర్చేవి. నిజానికి

అప్పుడూ వాటిని పెద్దలే ఎక్కువగా చదివి అందులోని కథలను పిల్లలకు చెప్పేవారు. బేతాళ కథల్లోని ప్రశ్నలు ఆలోచనకీ, తర్కానికి తావిచ్చేవి.

ఇవాళ పిల్లలు పుట్టంగానే వారు చూస్తున్న వాతావరణం ఒకప్పుడు లేదు. చెరువులు, మామిడి తోటలు, పొలాలు, బావులు, పశుసంపద వంటివి ఒకప్పటి బాల్యానికి అందివచ్చినంతగా నేటి పిల్లలకు అందుబాటులో ఉన్నది తక్కువ. నగరీకరణం పెరిగింది. నిజానికి గాలీ, నీరూ కూడా ఇవాల్టి బాల్యానికి ఏసీలతో మినరల్ వాటర్ బాటిల్స్‌తోనే ముడిపడిపోతున్నాయి. చదివే కార్పొరేట్ పాఠశాలల్లో ఆట మైదానాలు లేకపోయినా ఏసీ గదులు, కంప్యూటర్లు తప్పక ఉంటున్నాయి. ఆంగ్ల మాధ్యమం అనివార్యమైపోతూ పసిప్రాయం నుంచే ఇంగ్లీష్ రైమ్స్ వల్లె వేసినట్లుగా పద్యాలో, శ్లోకాలో వల్లెవేయగల సామర్థ్యమూ సన్నగిల్లుతోంది. అమ్మనాన్నతో కలిసి భోజనం చేయడమే కుదరని పిల్లలు వారితో కలిసి ఆడిపాడే సమయం ఎక్కడిది?

పెయింటింగ్ పుస్తకాలు, కామిక్ బుక్స్, హారీపోటర్ వంటి గ్రంథాలు అందుబాటులో ఉంటాయి గానీ, తెలుగుకు ప్రాముఖ్యం తగ్గిపోతున్నప్పుడు పాఠ్యపుస్తకాల్లోనే తెలుగు చదవని స్థితి తెచ్చుకున్నాక, ఇతరేతర తెలుగుపుస్తకాలు చూసే, చదివే వీలు ఎక్కడుంది వాళ్ళకు. సరే! ఇంట్లో పిల్లలకు కథలు చెప్పే పెద్దలు ఉన్నారనే అనుకున్నా వాళ్ళు వీళ్ళని కూర్చోబెట్టి "అనగనగా ఒకరాజు, ఆ రాజుకు ఏడుగురు కొడుకులు, ఏడుగురు కొడుకులూ వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చారు" అని చెప్పడం మొదలు పెడితే 'ఊ' కొట్టడానికి వీళ్ళు పాత కాలం పిల్లలు కాదు. అసలు ఇప్పుడు రాజులు ఎక్కడున్నారనో, అసలు ఆ రాజుకు ఏడుగురు కొడుకేలేమిటి? కుటుంబ సంక్షేమం తెలియదా అనో, రాజుకుమారులు వేటకు వెళ్ళడం ఏమిటనో, వేటకు వెళితే పులులో, సింహాలో వేటాడాలి గానీ ఈ చేపల గోలేమిటి అనో, ఏడుగురు వేటకు ఎందుకు వెళ్ళడం? ఒకరు వెళ్ళి మిగతావారు కనీసం వేరువేరు పనుల మీద పనికొచ్చే పనులకు వెళ్ళవచ్చుకదా అనో ప్రశ్నించే పిల్లతరమే ఈనాడు సాక్షాత్కరిస్తోంది. ఒకప్పటి 'విశ్వాసం' కథ వినడంలో, విని అంగీకరించడంలో నేటి పిల్లలకు లేదన్నది ప్రాథమికంగా గుర్తించాలి. అందుకే దెయ్యాల కథలు చెప్పి ఇవాళ 'బూచి' అంటూ పిల్లలను భయపెట్టడమూ కష్టమే! ఎందుకంటే టీవీ సీరియల్స్‌కు, క్షుద్రశక్తుల సినిమాలకు అడిక్ట్ అవుతున్న నేటి పిల్లలను భయపెట్టే అంశాలూ మారిపోతున్నాయి. ఇవాళ చందమామను చూపిస్తూ వెండిగిన్నెలో గోరుముద్దలు తినిపించేకాలం అంతరించిందా! చందమామ కన్నా టీవీలో ప్రకటనలే

వారిని కట్టిపడేసేవవుతున్నాయి. జంతువులతో కూడిన పంచతంత్రం వంటి కథలు కూడా ఇవాళ కొత్తరూపెత్తుకోవల్సిందే. కొంగ–నక్క–పాయసం కథ చెబితే 'స్ట్రా' వేసి తాగేయచ్చు అనే తెలివిగల పిల్లలున్న కాలం ఇది. అందువల్ల 'బాలసాహిత్యం' అనగా పిల్లల కోసం, వారు చదవాలని కోరుకుంటూ రచనలు చేస్తున్న పెద్దలు తమ సంవిధానాన్ని తామే సంస్కరించుకోవాలి. తప్పదు.

నిజమే! బొమ్మల పుస్తకాలు, బొమ్మలు పిల్లలను ఆకర్షిస్తాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం పుస్తకాలను కూడా ఆడియో, వీడియోలుగా ధ్వనులతో, మాటలతో ఆకర్షించే వీలుంది. 'వినదగునెవ్వరుచెప్పిన' అనే మాట విలువైనది. అందువల్ల పిల్లలకు సాహిత్యం వినిపించేదిగా, కనిపించేదిగా ఆకర్షించినట్లు ఇవాళ చదివి, ఆలోచింపచేసే రీతిలో అందడం తక్కువైపోయింది. నేటి పిల్లల ఊహాశక్తి, తెలివితేటలు, ఆకళింపు చేసుకొనే సామర్థ్యం మునుపటి పిల్లలకన్నా మెరుగైనవి, పరిణామశీలమైనవి. ఇవాల్టి సాహిత్యం మానవ సంబంధాలను పెంపుచేసేదిగా పిల్లలకు, ప్రధానంగా అందవలసిన అగత్యం ఎక్కువగా ఉంది. అదీ కాక వారిలోని సృజన శక్తులకు ఊతమిస్తూ, వారిచేత కలం పట్టించి వారికి ఇష్టమైన సాహిత్యం 'బాలసాహిత్యం'గా వెలుగుచూడవలసిన ఆవశ్యకత నేడు ఉందనిపిస్తోంది. పిల్లలకు నీతులు, సత్ప్రవర్తన నేర్పడం ఇవన్నీ అవసరమే! వారి వ్యక్తిత్వ వికాసంలో అవి ప్రధానాంశాలు కావున వారిచే చదివించి, ఆలోచింపచేసి ప్రభావితం చేయగల పెద్దల రచనలు తప్పక వెలుగు చూడాల్సిందే! అసలు అందుకే–వారి పాఠ్యాంశాలే తదనుగుణంగా రూపొందించ వలసిన అక్కర ఎక్కువగా ఉందని 'కంటెంట్ రైటర్స్' గుర్తించాలి. డిజిటల్ అక్షరం కన్నా చేతివ్రాత అక్షరం విలువ పిల్లలు గుర్తించేలా చేయడం ప్రాథమికంగా జరగాలి! అచ్చు పుస్తకం విలువ అచ్చంగా తెలిస్తే వారిలో పఠనాశక్తి తప్పక అంకురించి మొగ్గతొడుగుతుంది. బాలసాహిత్యం "ఫర్ ద చిల్డ్రన్: బైదచిల్డ్రన్" అని ఇరుపార్శ్వాలుగా ప్రవహించడం అవసరమేగాని, పిల్లల ప్రపంచం అనేది వారితోనే, వారివల్లనే, వారిదిగా రూపొందడం, ఆ 'బాలనందం'లోనే పెద్దలూ స్వచ్ఛ మనస్కులై వారితో మమేకమై ఆనందించడం అభిలషించదగిన పరిణామం. ఒక నిఘానేత్రం మీకు ఉంచుకుని పిల్లలను స్వేచ్ఛగా ఎదగనీయండి, విహరించనీయండి. అంతా మీ వల్లే జరిగిందనీ, తామేదో కోల్పోయామనీ అనుకునే భావన వారికి మిగల్చకండి. *

15

**3 సెప్టెంబర్' 2018**

# పూల దండ(గ)లు

అరవై రెండేళ్లు పూర్తిచేసుకొని సెప్టెంబర్ 2న 63వ పుట్టినరోజు జరుపుకోవాల్సిన మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ సినీనటుడు నందమూరి హరికృష్ణ సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా, అతివేగంగా కారునడిపి ప్రమాదానికి గురై ఆగస్టు 29న దుర్మరణం పాలయ్యారు. తన పుట్టినరోజునాడు పుష్పగుచ్ఛాలు, పూలదండలు తీసుకురావద్దనీ, దానికయ్యే ఖర్చును వరదలు, వర్షాలవల్ల నష్టపోయిన వారి కుటుంబాలకు అందచేయాలనీ కోరుతూ అభిమానులకు ముందస్తు లేఖ కూడా రాసిపెట్టారు. కానీ ఆ పుష్పగుచ్ఛాలు, పూలదండలు చివరకు ఆయన భౌతికకాయాన్ని ముంచెత్తాయి.

అభినందనలకు, అంతిమ వీడ్కోలులకు కూడా నేటి వ్యవస్థలో అధికంగా వినియోగింపబడుతున్నవి పుష్పగుచ్ఛాలు, పూలదండలే! జన్మదిన వేడుకలకు, వివాహాది శుభకార్యాలకు, ప్రముఖులను స్వాగతించడానికి, వీడ్కోలు ఇవ్వడానికి, సభావేదికలను, మంటపాలను అలంకరించడానికి పువ్వులపై జరుగుతున్న ఖర్చు అంతా ఇంతా కాదు. వరదల వల్ల నష్టపోయిన ఏ కేరళ రాష్ట్రం ఉందో, పూల ఉత్పత్తి లేకపోయినా దేశం మొత్తం మీద అధికశాతం పువ్వుల వినియోగం జరిగేదీ పూలవ్యాపారం అధికంగా జరిగేది కేరళలోనే. 'బొకే'లనబడే పుష్పగుచ్ఛాలు నిత్యం నగరాలలో లక్షలాదిగా ఖర్చుచేయబడుతున్నాయి. ఒక్క ముంబై నగరంలోనే మామూలు రోజుల్లోనే తొంభైవేల డజన్ల ఫ్లవర్ బొకేలు కనీసం అమ్ముడైపోతున్నాయట!

నిజానికి ఆలోచించి చూస్తే ఒక్క రోజులో వాడిపోయే పుష్పగుచ్ఛాల మీద, పూలదండల మీద అంతంత ఖర్చు పెట్టుకోవడం సబబేనా అనిపిస్తుంది. అభిమానాన్ని, కృతజ్ఞతలను చాటుకోవడానికి, అభినందనలు అందించడానికి పుష్పగుచ్ఛాలు, దండలు,

ఇచ్చి పుచ్చుకోవడం తప్ప వేరే మార్గం లేదా? నిజమే! పూలు స్వచ్ఛతకి, అందానికి ఆలవాలాలు. కానీ వాటి ఆయుష్షు అల్పకాలం. అనల్పమైన హృదయాభినందనలు తెలపడానికి ఒక్క రోజుకే వాడిపోయే వాటి వినియోగం వ్యవస్థలో ఎంతగా స్థిరీకృతమై పోయిందో తలుచుకుంటే ఆశ్చర్యంగానే ఉంటుంది.

కరుణశ్రీ గారి 'పుష్పవిలాపం' ఘంటశాల గళాన ఎంత ప్రాచుర్యం పొందిందో ఎరుగని తెలుగువారెవ్వరు? "ఊలుదారాలతో గొంతుకురిబిగించి – గుండెలో నుండి సూదులు గుచ్చికూర్చి – ముడుచుకుందురు కురుల ముచటమమ్మ – అకట! దయలేని వారు మీ యాడువారు' అని ఆయన ఏ ముహూర్తంలో అన్నారోగానీ ఇప్పుడు జడలో పువ్వులు పెట్టుకునే అమ్మాయిలు తగ్గిపోయారు. నేటికాలం ఆడపిల్లల తీరేవేరయింది. జుట్టు విరబోసుకోవడాలు లేదా బాబ్డ్ హెయిర్‌లు! రెండు జడల దాకా ఎందుకు ఒంటిజడలే హుళక్కి! ఇంక జడలో పూలు, పూలజడలు అనేవి 'క్వచిత్తు'గా మారాయి. గాగ్రాలు, మిడ్డీలు, ప్యాంట్లు, జీన్స్‌లు ధరించే పాపలు పాపం పూలజోలికి వెళ్ళడం తగ్గిపోయింది. కానీ డెకరేషన్లకూ, ఫంక్షన్లకూ, గ్రీటింగ్‌లకు పువ్వులే మూలాధారం! ఆన్‌లైన్‌లో ఆర్డరిస్తే ఒకరి పుట్టినరోజుకో, పెళ్ళిరోజుకో వారి ఇంటితలుపు తట్టి మరీ మన పక్షాన పూల గుత్తి అందించే సంస్కృతి అద్భుతంగా విస్తరించింది. పూల వ్యాపారం మూడుపూలు ఆరుకాయలుగానే విరాజిల్లుతోంది! కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి.

నిజానికి పువ్వులు చెట్టుకున్నప్పటి అందమే వేరు! పుష్పోద్యాన వనసంచారాల ఆనందమే వేరు. పూల మొక్కలపై నుండి గాలి మోసుకొచ్చే సుగంధం రసానుభూతిదాయకం. బంతులు, చేమంతులు, సంపెంగలు, మల్లెలు, కనకాంబరాలు, గులాబీలు వేటి అందం వాటిది. వేటి విలువ వాటిది. నిజానికి ఔషధాల్లోనూ ఉపయుక్తమయ్యే పూలున్నాయి. కిటికీ ముందు గులాబీలు వాటి ముళ్ళతో రక్షణ వ్యవస్థకూ తోడ్పడేవే! అలాంటి పువ్వులను మనిషి ఇవాళ పూర్తి వ్యాపారాత్మకం చేసేశాడు. ఆలయంలో దేవుని అర్చనకు, పూజకు ఉపయుక్తం కావాలని ఆరాటపడే పువ్వులు అమ్మాయిల జడలను అలంకరించడం లేక ప్రచారార్భటుల ఏ అనామక నేత కంఠాన్నో పడే దౌర్భాగ్యం ప్రాప్తిస్తోందని పాపం ఎంత కుమిలిపోతున్నాయో!!

'మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ
జీవితమెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోయె;
మా యౌవన మెల్ల కొల్లగొని ఆ పయి చీపురుతోడ చిమ్మి
మమ్మావలపారవోతురు గదా!...'

అని వాపోయే పుష్ప విలాపానికి పాపం నేడు అంతెక్కడుంది. చిన్న పూల బొకే నుండి గజమాల వరకూ సభావేదికల మీద వృధా అవుతున్నవెన్నో! బంధుమిత్రుల నుండి బోలెడు కానుకలు వస్తాయని ఆశపడి ఒకాయన ఎంతో ఖర్చుపెట్టి ఓ వేడుక జరుపుకుంటే, అందరూ 'పూలబొకేలు' రకరకాల పరిమాణాల్లో పట్టుకొచ్చి ఇచ్చి విందారగించి పోయారట! ఎంగిలి విస్తళ్ళతో బాటు ఆ పుష్పగుచ్ఛాల అంతిమ గమ్యమూ 'చెత్తకుండీ'యే అయింది కదా!

కీర్తిశేషులైన నాస్తికోద్యమ నేత 'గోరా' (గోపరాజు రామచంద్రరావు) అందుకే ఆ రోజుల్లో పూలస్థానంలో కాయగూరలకు ప్రాముఖ్యం ఇచ్చారు. పెరట్లో కూరగాయల మొక్కలు పెంచడాన్నే ఉద్యమంగా చేశారు. కూరగాయల దండలు వేయండి ఫర్లేదు అన్నారు. నిజమే! పుష్పం బదులు ఒక 'ఫలం' చేతికి ఇస్తే అది అత్యవసరపు ఆకలినైనా తీరుస్తుంది. కానుకలుగా, అభినందనలతో మిఠాయిలు, ఫలాలు ఇవ్వడం ఔచిత్యమే! ఇవాళ 'స్వీట్స్' తినడం కూడా నిషిద్ధంగా నియంత్రించుకుంటున్నవారు ఉన్నారు. వాటికి బదులు 'డ్రైఫ్రూట్స్' ఇచ్చినా సబబేనేమో!

ఏమయినా 'పుష్పవిలాసము' పట్టినంతగా నేటికీ చాలా మందికి 'పుష్పవిలాపము' ఆనడం లేదు. వాటి ఆర్తి కదిలించడం లేదు. ప్రతి అడ్డమైన సందర్భానికీ నేటికీ బలి అవుతున్నది పుష్పగుచ్ఛాలు, దండలే. ఆడంబరానికి చిహ్నంగా మారిపోయాయి అవి. ఒక పూలబొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుకున్నామని లేక అభినందనలు అందించేసామని చేతులు దులిపేసుకోవడం సాగిపోతోంది. పువ్వుగా విచ్చుకుని పరిమళాలు వెదజల్లవలసింది, స్నేహ సుగంధాలు పరివ్యాప్తం చేయాల్సిందీ మనుషుల మనసులూ, హృదయాలు కానీ ఈ లాంఛనప్రాయపు పుష్పసరణి కాదు. ఇంకా ఇది కరుణశ్రీ కలం చెప్పిన ఈ శప్తవ్యవస్థే!

బుద్ధదేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి?
అందమును హత్యచేసెడి హంతకుండ
మైలపడిపోయెనోయి! నీ మనుజ జన్మ. *

16

10 సెప్టెంబర్' 2018

# కొన్ని 'చెత్త' కబుర్లు

ఆ మధ్య సోషల్ మీడియాలో ఓ వీడియో హల్‌చల్ చేసింది. అదేమిటంటే ప్రధాని నరేంద్రమోదీ ఒక పుస్తకావిష్కరణ సభలో పాల్గొంటూ తను ఆవిష్కరిస్తూ కట్‌చేసిన రిబ్బన్‌ను, ఆ పుస్తకాలను ప్యాక్ చేసిన కాగితాన్ని తన లాల్చీజేబులో కుక్కుకున్నారు గానీ వేదికమీద పడేయలేదు. "స్వచ్ఛభారత్" అన్న పిలుపునకు ఆదర్శంగా ఆయన చేసిన ఆ చర్య కొందరిని దిగ్భ్రమాశ్చర్యాలకు గురిచేసింది. నిజానికి స్వచ్ఛత, పరిశుభ్రత అనేది మనుషుల స్వభావాల్లో ఉండడం ముఖ్యం. తను, తన పరిసరాలు బాగుండాలని చెత్తను ఇతరుల పరిసరాలలోకి నెట్టేసేవారే ఎక్కువ. నిజానికి ఆ స్వభావమే ఎక్కువ ప్రమాదకరం. ఇంటి బాల్కానీలలోంచి చెత్తను బయటకు విసిరేసేవారు, ప్రయాణిస్తున్న వాహనాల కిటికీల నుండి వ్యర్థాలను రోడ్లపై పారేసేవారు, అరటి పండు తిని తొక్కను చుట్టుపక్కలకి గిరాటేసేవారు మన దేశంలోనైతే కోకొల్లలు. అందునా ప్లాస్టిక్ వ్యర్థాలు మన దగ్గరే ఎక్కువ. అమెరికాను, సింగపూర్‌లను మెచ్చుకునే మనవారు అక్కడి పరిశుభ్రతా సంవిధానాలను మాత్రం ఇక్కడ పాటించరు. ప్రభుత్వాల బాధ్యతలతో బాటు ప్రజల సహకారం స్వచ్ఛందంగా అవసరమని గుర్తించాలి. ఇంటింటికీ పొడిచెత్త, తడిచెత్త అని రెండు డస్ట్‌బిన్‌లు ఇవ్వడం, కూడళ్ళలో చెత్తకుండీలు ఏర్పరచడం హైదరాబాద్ నగరంలో జరిగిన మాట వాస్తవం. ఇరవైవేల మంది పారిశుద్ధ్య కార్మికులు రోజుకు నాలుగు టన్నులకు పైగా పోగయ్యే చెత్తను హైదరాబాద్ రోడ్లపై ఊడుస్తూనే ఉన్నారు. కానీ డంపింగ్ యార్డ్‌లకు చెత్తను తరలించడంలో ఒక్కోసారి అలసత్వం కనబరిచే మున్సిపల్ అధికారులున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాలలో చెత్త పేరుకుపోయి కనిపిస్తూనే ఉంటుంది. రోడ్లపై విచ్చల విడిగా చెత్త

వేసేవారికి భారీ జరిమానాలు వేయడం, వసూలు చేయడం చేస్తేగానీ పరిస్థితులు ఒక్కసారి  బాగుపడవనిపిస్తుంది.

భారతదేశ రాజధాని ఢిల్లీ నగరంలో ఒకరోజు పోగయ్యే చెత్త 257 బోయింగ్ విమానాల బరువుంటుందని, అంటే తొమ్మిదివేల మెట్రిక్ టన్నుల బరువని నిపుణులు చెబుతున్నారు. ఈ చెత్తను బయట పారబోస్తే పదమూడు మిలియన్ చదరపు అడుగులు అంటే డబ్బై ఎకరాల భూమి ఆక్రమిస్తుందట. అంటే ఆ స్థలంలో 2500 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు నిర్మించవచ్చని చెబుతున్నారు పర్యావరణ నిపుణులు. చెత్తవల్ల పర్యావరణం కలుషితం అవుతుందనీ, అది అనారోగ్యహేతువనీ వేరే చెప్పాలా? ఇవాళ సాహిత్య సాంస్కృతిక పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే 'చెత్త' గురించి కూడా ఆలోచించాల్సి ఉంది. నిజానికి కవిత్వం పేర వచ్చేంత చెత్త మరోటి లేదనిపిస్తోంది. ఏదో పెద్ద పొడిచేస్తామన్నట్లు ఉండే పెద్ద పత్రికల్లో ఆశ్రిత పక్షపాతాల వల్ల వచ్చే తడిచెత్త వదిలించుకోవడం కష్టం. నిజానికి చిన్న పత్రికలు కొత్తవారినీ వర్ధిష్టులనూ ప్రోత్సహిస్తున్న ఆర్ద్రత (తడి)కి మెచ్చుకోవచ్చుగానీ అక్కడి పొడిచెత్త ఏరివేయగలిగేదేగానీ, 'పరిమాణం'లో ఎక్కువ అనేది యధార్థమే! కవిత్వం పేర ఎక్కువ చెత్త పేరుకోవడానికి కారణం– నానీలు, రెక్కలు, హైకులు వంటి లఘు ప్రక్రియలు ఏవో నాలుగు పంక్తులు గిలికి, వాటిపేర చెలామణీ చేసేసుకుంటూ అవార్డులు, రివార్డులు అంటూ ఎగబడే కాలుష్య దోహదకారులవే అన్నాడు ఒక సాహిత్య విమర్శకుడు. ఛందోబద్ధపద్యం, అంతర్లయాత్మక వచన కవిత్వం రాయలేని ప్రతి అర్భకుడూ కవి కావడానికి పాపం దారులు వేసిపెట్టినవి లఘుకవితా ప్రక్రియలే!

పద్యం – మలబద్ధకం

నానీ – నీళ్ల విరేచనం

అన్నాడొకాయన. నిజానికి సాహిత్య విమర్శకుడు ఒక పారిశుద్ధ్యకార్మికుడుగా తడిచెత్త, పొడిచెత్త వేరుచేస్తూ, చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తూ, సాహిత్య వీధులను పరిశుభ్రపరిచేవాడిగా ఉండాలి. కానీ తగిన వేతనం లేదని సమ్మెచేసేవాడిలా అవుతున్నాడు. సేవాభావంతో పారిశుద్ధ్య పనులకు పూనుకోవాలని గాంధీజీ అన్నారు. కానీ రెండు చెంపలూ వాయగొట్టినా, ఇవాళ సేవాభావం కరువై 'నా కేంటీ' అనే స్వార్థయోచనే బలపడుతోంది. డబ్బుకోసం గడ్డి తినే మనుషులున్నారు. అవినీతి

అన్ని రంగాలలో లాగానే సాహిత్యక్షేత్రంలోను చేరింది. పెద్దపెద్ద పత్రికల సంపాదకులే నిజంగా 'సంపాదకులు' (ఆర్జనాపరులు) 'వసూల్ రాజా'లవుతున్నారని కొన్ని వాస్తవాలు బహిర్గతమవుతూనే ఉన్నాయి. 'చెత్త' సరుకునయినా అందమైన 'ప్యాకింగ్'లలో అందించే 'కింగ్'లు ఉన్నప్పుడు సరుకు నాణ్యత నాసిరకంగానే లభిస్తుందిగానీ అసలు విలువైనది అందకుండానే పోతుంది. నిజమే! 'చెత్త'కు అలవాటు పడిపోతున్నాం! కాలుష్యంతో సహజీవనం చేసేస్తున్నాం. "పంది బురద మెచ్చు – పన్నీరు మెచ్చునా" అన్నట్లు తయారవుతున్నాం.

మనదీ ఒక బ్రతుకేనా
కుక్కలవలె నక్కలవలె
సందులలో పందులవలె

అని శ్రీశ్రీ వంటి మహాకవి నిలదీసినా దులిపేసుకొని, 'నా ఇచ్ఛయేగాక నా కేటి వెఱపు' అన్నట్లు సాగిపోయే ధోరణే సాగుతోంది.

'చెత్త'ను చేసినట్లే – సాహిత్యవ్యర్థాలనీ, మనలనూ కూడా 'రీసైక్లింగ్' చేసే కాలమేనా మున్ముందు కావాలని అనిపిస్తోంది. ఈ 'కాలమ్' కొంచెమైనా ఆ వివేచనకు తోడ్పడితే చాలుమరి! *

# 17

17 సెప్టెంబర్' 2018

# సన్మాన శాలు(వా)లు

దీని తస్సాదియ్యా! కేవలం కొద్దిసేపు భుజాలమీద జాలువారినంత మాత్రాన సభావేదికల మీద ఈ శాలువా తెచ్చిపెట్టే ఆనందం, ఆపాదించే గౌరవం ఇంతింత అనరానివి కదా! 'శాలువా' అంటే చలికాలం వెచ్చదనం కోసం కప్పుకునే ఉన్ని వస్త్రం అనేదానికన్న మిన్నగా, "సన్మానచిహ్నం'గా మారిపోయి చాలాకాలమై పోయింది. కాలంతో నిమిత్తం లేకుండా, మండు వేసవి రోజుల మధ్యాహ్నపు సభల్లోనయినా 'సత్కారం' అంటే చాలు 'శాలువా'లు సిద్ధం! కవి, గాయక, పండిత సత్కారాలు అంటే, కళాకారులకు సన్మానాలు అంటే 'శాలువా' కప్పితేనే సమగ్రత అనే భావన! అదే ఒక సంతుష్టి!

కీ.శే. విశ్వనాథ సత్యనారాయణగారికి జ్ఞానపీఠం వచ్చిన కొత్తలో కాబోలు! ఏదో ఊరిలో ఆయనను సత్కరించి నిర్వాహకులు 'శాలువా' కప్పారు. ఆయన స్పందన ప్రసంగంలో 'ఇన్నాళ్టికి మా ఆవిడ సంతోషించే పని జరిగింది. ఎప్పటి నుంచో మా ఆవిడ వడియాలు ఎండబెట్టుకోవడానికి ఓ మంచి గుడ్డముక్క కావాలంటోంది. మీరివాళ అది నాకు కప్పి మహోపకారం చేశారు" అన్నారట! ఆ శాలువా వడియాలు ఎండబోసుకునే గుడ్డముక్కలా, నాసిరకంగా ఉందని ఆయన ఎద్దేవా చేసిన చమత్కారవైఖరి అది!

నిజానికి ఇవాళ అనేక సభల్లో శాలువాలు అంటూ చాలామటుకు కప్పుతున్నవి – ఏవో 'మెఱుపుల వస్త్రాలే' కానీ అవి నిజానికి చలికి ఆగేవి కావు. పెద్దగా ఉపయుక్తమయ్యేవి కావు. కాశ్మీరీ శాలువాల నాణ్యతవేరు. అసలు 'శాలువా' విశేషం ఏమిటంటే అది ఎరిగినవారూ నేడు తగ్గిపోతున్నారు. ప్రార్థనలు, పండుగలు

సందర్భంగా జ్యూయిష్ ప్రజలు 'తలిత్' అనబడే ఈ శాలువాలు కప్పుకోవడం ఆచారంగా ఉండేది. జర్మనీ, లాటిన్, అమెరికాల్లో శాలువా జానపద దుస్తుల్లోని భాగం. ఐరోపా మహిళలు ఫ్యాషన్ వస్త్రంగా భావించి వినియోగించేది ఇది.

మన దేశంలో కాశ్మీరీ శాలువాలు ప్రసిద్ధం. సాదా ఊలు, పష్మీనా ఊలు, షాతుష్ ఊలు అని మూడు రకాల ఊలు శాలువాలలో – షష్మీనా ఊలువి అతి ప్రసిద్ధం. ఎంతో మృదులంగా ఉంటాయి. టిబెటియన్ భాషలో 'పషమ్' అంటే లోపలిభాగం అని అర్థమట! 'పష్మీనా' శాలువలే 'కష్మీరీ' శాలువలుగా సుప్రసిద్ధాలు. యంత్రాల మీదకాక ఒక్కొక్క పోగు చేర్చి కాశ్మీరీ మహిళలు అల్లే 'పష్మీనా శాలువాలు' అతి విలువైనవి! హిమాలయసానువుల్లో తిరిగే మేకల నుంచి తీసిన ఊలు ఈ 'పష్మీనా'! యూరోపియన్లకు రెండువందల ఏండ్ల క్రితమే వీటి విలువ తెలుసు. పష్మీనా శాలువా అంటే ఉంగరంలోంచి దూరిపోయేంత మృదువుగా ఉంటుంది. కానీ వాటి వెచ్చదనం మాత్రం చలికాలంలో అనుపమానం! మనిషి వెంట్రుక మందం డబ్బై అయిదు మైక్రాన్లు ఉంటే, పష్మీనా మేక వెంట్రుక మందం పన్నెండు లేక పద్యాలుగు మైక్రాన్ల మేరకే ఉంటుంది. కానీ ఆ ఉన్ని వెచ్చదనం శీతాకాలంలో అత్యద్భుతం!

19వ శతాబ్దంలో మొఘల్, బ్రిటీష్ చక్రవర్తులు, బ్రిటీష్, డచ్, ఫ్రెంచ్ వర్తకులకు ఈ శాలువాలు బహుమతులుగా ఇచ్చేవారట! ఈ శాలువాలలో ఒకే రంగుదారంతో అల్లినవీ, రంగురంగుల దారాలతో అల్లినవేకాక, ఎంబ్రాయిడరీలతో కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఎంబ్రాయిడరీవి చైనాలో ఎక్కువట! చైనా క్రేప్ శాలువాలు, కుచ్చిళ్ళతో కూడిన పట్టుశాలువాలు ప్రసిద్ధం.

సరే! నిజంగా అలాంటి విలువైన శాలువాలు సన్మానాల్లో కప్పితే చలికాలంలో ఉపయుక్తంగా ఉంటాయి. కానీ 'మాయాజలతారు' మెరుపుల శాలువాల హడావిడే ఎక్కువ! అసలు 'శాలువా' కప్పకపోతే ఏం? అనీ, వెళ్ళిన ప్రతి సభలో ఓ మెరుపుల శాలువా ఇస్తుంటే ఇవన్నీ ఏం చేసుకునేది? అని బెంగపడే సాహితీవేత్తలూ ఉన్నారు. తనకు వచ్చిన శాలువాలన్నీ జమచేసి ఓ మూణ్ణెల్లకో, ఆర్నెల్లకో ఒక షాపులో తిరిగి అమ్మేసుకునేవారని ఒక దివంగత సాహితీ ప్రముఖుని గురించి చెప్పుకునేవారు కూడాను. శాలువాల 'రీసైక్లింగ్' అన్నమాట!

చలికి ఆగే మంచి శాలువాలు ఇలా సాహిత్య సభల ద్వారా జమ అయినవాటిని, ఓ డిసెంబర్ చలిరాత్రి కార్లో వేసుకుని, నగరవీధుల్లో తిరుగుతూ, పేవ్‌మెంట్ల మీద

వణుకుతూ నిద్రపోతున్న అభాగ్యులకు కప్పిరావడం గొప్పకు చెబుతున్న మాటకాదు. కానీ ఓ సంతృప్తినిచ్చిన స్మృతికిణాంకం! అందువల్లే మెరుపుల వస్త్రాల శాలువాలంటే ఉపయుక్తం కాగలవిగా తోచవు. అప్పటికే శ్రీమతి అటువంటివి పనిమనుషులు, పారిశుద్ధ్య స్త్రీ కార్మికుల తాలూకు ఆడపిల్లలకు గౌన్‌లో, పరికిణీలో కుట్టించి తొడిగితే బాగుంటాయని వితరణ గావిస్తూనే ఉంటుంది.

నిజమే! కప్పిన శాలువా భుజం మీద సభ అయ్యేంతవరకయినా ఉంచుకోవడమే జరగదు. పోనీ చలికి ఆగే మంచి శాలువా అయితే, శీతాకాలపు సభలయితే, కప్పుకొని కూర్చోవచ్చు! అసలు కొందరికి 'శాలువా' అనగానే భగ్నప్రేమికుడు గడ్డం పెంచుకుని, కప్పుకొని, ఎండిన చెట్టు దగ్గర పాటపాడే ఏ సినిమాలో అక్కినేనియో గుర్తొస్తాడు. లేదా ఖళ్ళు ఖళ్ళుమని దగ్గే, శాలువా కప్పుకున్న గుమ్మడి గుర్తొస్తాడు. అంత ఖర్చుపెట్టి శాలువాలు కప్పే బదులు, దానికయ్యే ఖర్చును నగదుగా బహూకరిస్తే దారి ఖర్చులకయినా పనికివస్తాయని భావించే వారున్నారు. ఒక్కోసారి అదీ నిజమే కదా అనిపిస్తుంది! వేదిక మీద శాలువాలు తక్కువపడితే ఒకరికి కప్పిన దాన్నే తెరవెనక్కు తీసుకెళ్ళి మళ్ళీ వచ్చి మరొకరికి కప్పే దృశ్యసాక్షాత్కారాలు అనుభవంలోనివే కొందరికి.

ఇటీవలే చేనేత శాలువాలు రంగ ప్రవేశం చేశాయి. నిజానికి నేత కార్మికులకు, పారిశ్రామికులకు అండగా, వారికి ఉపాధి లభించేలా వాటిని ప్రోత్సహించడం ఆహ్వానించదగింది! పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు చేనేత ఇక్కత్ వస్త్రాలకు ఖ్యాతి లభించాలని, నేత కార్మికులకు ప్రోత్సహించేందుకు మొన్నమొన్ననే ఖైరతాబాద్ వినాయకుడికి పొడవైన భారీ శాలువాను తయారు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం కనుముకల గ్రామశివారులో పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో మగ్గంపై వినాయకుడికి ఈ శాలువాను కాషాయరంగులో ఇరవై అయిదు మీటర్ల పొడవు, నలభై అంగుళాల వెడల్పుగల వస్త్రంతో మగ్గంపై టై అండ్ డై వెరైటీలో, పదివేల ఖర్చుతో ఈ శాలువా తయారుచేసి వినాయకుడికి సమర్పించడం విశేషం!

–ఏమయినా శాలువాలు జాలువార్చుతున్న కీర్తిదీధితులుకు లొంగని వారెవ్వరు? కానీ అర్హుల భుజాలను అవి నాణ్యమైనవిగా అలంకరించేవిగా ఉండాలి సరేగాని, నిజంగా విధాయకాలా అని ఆలోచించాల్సిందే! *

18

24 సెప్టెంబర్ 2018

# కులం వ్యాకులానికి కా(కూడ)దు

ప్రతి మనిషికీ స్వయం నిర్ణయాధికారం ఉండవలసిన ప్రధానాంశాలు రెండు. ఒకటి వివాహం. తాను తన జీవితాన్ని ఎవరితో పంచుకుంటాననేది. రెండవది మత విశ్వాసం. ఇక్కడ మతము అంటే మార్గమనే. తాను దైవాన్ని విశ్వసించడమా లేదా విశ్వసిస్తే ఏ దైవ మార్గానుసరణం చేయదలచిందీ లేక ఆస్తికత్వ మార్గంలో కాక నాస్తిక పథాన్ని అనుసరించదలచిందీ అనేది. దురదృష్టవశాత్తు మానవ సమాజంలో ఈనాటికీ ఈ స్వయం నిర్ణయాధికార ప్రతిపత్తి అందరికీ సమానంగా సమకూరడం లేదు.

ఎవరి కర్తకు ఎవరు బాధ్యులు అనీ, ఎవరు చేసిన కర్మ వారే అనుభవించాలని చెబుతూనే తమ పెత్తనమే, తమ నిర్ణయాధికారమే చెల్లుబాటుకావాలనే వారే అంతకంతకు విస్తరిస్తూ, బలపడే దుర్మార్గ వ్యవస్థ పెరుగుతూనే ఉంది. నిజానికి కుటుంబ వ్యవస్థ మునుపటి వలె ఉమ్మడి కుటుంబంగా లేక చిన్న చిన్నవిగా విభాజితమై పోతూనే ఉంది. కుటుంబ పెద్దరికం, కుటుంబ గౌరవం అనే వాటికి నేడు మునుపటి స్థాయి, సామర్థ్యం ఉండవలసిన ఆగత్యం కూడా లేదు. సమాజం ఎంతో పరిణామశీలమవుతోంది. కానీ కొందరు మనుషులే ఇంకా ఇంకా కుంచించుకుపోతున్నారు.

ప్రేమ పెళ్ళిళ్ళపై పడగెత్తుతున్న కులోన్మాద ఘటనలు చూస్తుంటే ఎక్కడికి పోతున్నాం మనం? అనే ప్రశ్న ఉదయించక మానడం లేదు. అభ్యున్నతి సాధించవలసిన చోట అగాధపాతాళ కుహరాలలోకి పడిపోతున్నామన్న భయంకర వాస్తవం బహిర్గతమవుతోంది. నిజానికి జరగుతున్న సంఘటనలు వైయక్తికాలనో, ఏవో రెండు కుటుంబాలకు చెందినవనో సర్దిచెప్పుకునేవి కానేకావు. ఇన్నేళ్లయినా,

భగవంతునిగా కొలిచే శ్రీకృష్ణుడు వంటి వారి భాగవత పురాణగాథలు, వాటి సారాంశం ఆకళింపు చేసుకున్నామంటున్నా, నేటికీ ప్రేమ వివాహాల్లో కుల నిర్మూలన సాధ్యపడకపోవటం అత్యంత విషాదమే.

మిర్యాలగూడ ఘటనలో తండ్రి కిరాతకానికి ప్రేమించి పెళ్ళాడిన భర్తను కోల్పోయిన అమృతవర్షిణి ఆవేదనతో అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చేదెవరు? కులాంతర వివాహం చేసుకున్న తనను ప్రోత్సహించి సమర్థిస్తే సమాజంలో తండ్రి గౌరవాదరాలు పెరుగుతాయి. కాని వేరు కులం వాడని అల్లుడిని హత్య చేయిస్తే పరువుప్రతిష్ఠలా? అని అడిగింది తాను. సర్వమానవ సమానత్వం, వసుధైక కుటుంబకం అనేవి అంతిమంగా సాధించవలసిన గమ్యం అంటూనే మనుషులంతా ఒకటే అనే ఆ భావనకు ప్రచోదకాలుగా నిలిచే కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించవలసింది పోయి కులవివక్షను ఇంకా ఇంకా పాతుకుపోయేలా చేస్తున్న అహంకారాలను శిక్షించి నిలువరించగలమా?

యువతలో తమ జీవిత భాగస్వామిని ఎన్నుకోవడంలో కుల, మత ప్రాతిపదికలను అధిగమించి నిలిచే సాహసిక సంసిద్ధత నేడు ఎంతో బలీయంగానూ, విస్తారంగానూ ఉంది. నిజానికి ఆహ్వానించదగిన సానుకూల పరిణామం ఇది. కానీ యువ జంటల్లో ఒకరు అగ్రవర్ణంవారు, మరొకరు దళితులయితే వారి ప్రేమ, పెళ్ళి అనేవి ఇరుకుటుంబాల మధ్య సమస్యాత్మకంగా మారడమే విపత్కర పరిణామాలకు హేతువవుతోంది. అభ్యుదయ ప్రగతిశీల శక్తులు ఇన్నేళ్ళుగా వ్యవస్థలో కులనిర్మూలనకు, సమసమాజ మానవీయ ఐక్యతకు చేస్తున్నకృషి వేగవంతమయ్యిందన్న భావనలు బలపడకుండా, కులంపేర–రాజకీయాల్లో, సంఘంలో ఒక ఉన్మాదం బలీయమవుతుండడం కానవస్తోంది. మారుతీరావులు, మనోహరాచారిలు పెచ్చరిల్లుతున్నారు. సమాజానికి హితవు చెప్పవలసిన మతగురువులు, ప్రవచనకర్తలు అలాంటివారిని నిలువరించే బోధనలు చేయడం లేదు సరికదా, గతానుగతిక భావజాలానికి కొండొకచో ప్రోదికల్పించేవారిగా మిన్నకుంటున్నారు. ఇప్పటికీ ఆడపిల్ల తనకు ఎవరు భర్తగా కావాలో నిర్ణయించుకునే అధికారం లేనిదిగా కట్టడి చేయబడడం, స్వతంత్రించి ముందుకెడదామన్నా అవరోధాలు కల్పించడం, తమను కాదని సాహసించి తన మార్గం వేసుకుంటే అహం దెబ్బతిని పరువు ప్రతిష్ఠలు, కుటుంబ గౌరవం అంటూ కూతురు ఎన్నుకున్న యువకుడినో, ఆఖరికి కన్నకూతురినో లక్ష్యం

చేసుకొని హింసాత్మక చర్యలకు పాల్పడడం జరుగుతూండడం సభ్య సమాజానికి తలవంపులు కాక మరేమిటి? ఎక్కడికీ ప్రస్థానం అన్న వివేచన కలగనక్కరలేదా?

పిల్లల మీద ప్రేమ ఉన్నవారు పిల్లల ప్రేమను అంగీకరించినప్పుడే ఆ ప్రేమ ఉన్నవారు, ఆ ప్రేమికులను అంగీకరించినప్పుడే తమ గౌరవమర్యాదల ప్రేమను పెంచుకున్న వారవుతారు. పిల్లలకు స్వేచ్ఛనివ్వడం అంటే వారిలో స్వయం నిర్ణయాధికార శక్తిని పెంచడం. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తల్లిదండ్రులు తమకు అండగా ఉంటారనీ, తమ నిర్ణయాలను ఆమోదించి ప్రోత్సహిస్తారనీ పిల్లలకు పెద్దలపట్ల విశ్వసనీయత ఉండాలి. ఆ విశ్వసనీయతను పెద్దలు నిలుపుకోవాలి. జీవితం జీవించడానికే గానీ అనవసర అహాలతో, పౌరుషాలతో, పట్టింపులతో అతలాకుతలం చేయడానికీ, చేసుకోవడానికీ కాదు. కులం వ్యాకులం కలిగించడానికి కాదు. ప్రేమలు విస్తరించడానికి కానీ సంకుచితత్త్వంతో కుంచించుకు పోవడానికి కాదు. పగలు, ద్వేషాలు సమస్యలకు పరిష్కారాలు ఎప్పటికీ కావు. 'దురంత పద్మవ్యూహాలవల్ల కానిది – రవ్వంత అనురాగం వల్ల అవుతుంది' అని కవి సినారె అన్నట్లుగా అహంకారాలను అణచుకొని, తాము లేనప్పుడూ తమ పిల్లల జీవితం ఉంటుందనీ, అది వారు కోరుకున్నట్లుగా ఆనందదాయకంగా సాగాలంటే వారికి తమ ఆశీస్సులు, ప్రేమాభిమానాలు పంచి ఇవ్వాలే తప్ప, తమ కట్టడులనూ, పెత్తనాలను రుద్దకూడదనీ పెద్దతరం గుర్తించి వర్తించాలి. మనుషుల్లోఈ మార్పునకు అనుగుణంగా సంస్కృతీ, సాహిత్యమూ, రాజకీయాలు నిలవాలి, ఆచరణకు తోడ్పడాలి. *

**19**

**1 అక్టోబర్' 2018**

# చిత్తమెచట భయసహితమో!

"చిత్తమెచట భయశూన్యమొ

శీర్షమెచట ఉత్తుంగమొ...

ఆ స్వేచ్ఛా స్వర్గానికీ ఓ తండ్రీ! నా దేశాన్ని మేల్కొల్పుము" అని విశ్వకవి రవీంద్రుడు ప్రార్థించాడుగానీ, నిజానికి ఆ భావనలోని అంతరార్థం బోల్తా కొట్టి, ఇవాళ 'భయం' అనేది లేకుండా, నడిరోడ్డు మీద నచ్చనివాడిని గొడ్డలితో నరికి చంపేసి, తలెత్తుకొని తిరిగే స్వేచ్ఛ, దేశం నిండా విస్తరిస్తోంది. 'ఆ స్వేచ్ఛే కదా కోరుకున్నది' అన్నట్లుగా వ్యవస్థ బరితెగిస్తోంది!

నిజమే! భయం మానసిక స్థితి. మానసిక నియంత్రణకు బద్ధులయ్యే–మనుషుల ప్రవర్తన ఉంటూ ఉంటుంది. నిజానికి 'భయమో, భక్తియో పెద్దలపట్లా, భగవంతుని పట్లా ఉండాలి' అని మనవాళ్లు అన్నారు. అందుకే చిన్నప్పుడు బహుశా పిల్లలకు పెద్దలు భయం కూడా నేర్పిస్తారేమో! 'బూచి' అనో, తప్పు చేస్తే పైనుంచి దేవుడు చూస్తుంటాడనో భయం నేర్పడానికి చూసేవారు. అసలు మనిషికి ఆరు ప్రాథమిక భయాలుంటాయనీ, ఏదో ఒకటి ప్రతిఒక్కరినీ ఎప్పుడో ఒకప్పుడు వెన్నాడుతూ ఉంటుందనీ – నెపోలియన్ హెల్ అనే రచయిత పేర్కొన్నాడు. దారిద్ర్యం, అనారోగ్యం, ప్రేమరాహిత్యం, విమర్శ, వృద్ధాప్యం, మృత్యువు అనే అంశాలకు సంబంధించి భయాందోళనలుంటూ ఉంటాయనీ, మిగతా భయాలు వీటిలో అంతర్భాగాలేననీ ఆయన అన్నాడు.

దారిద్ర్యం భయపెట్టకూడదనుకుంటే కష్టించి పనిచేసే నైజం ఉండాలి. ఆరోగ్యం పట్ల అలక్ష్యం తగదు. కానీ దాని గురించి లేని రోగాలు ఊహించుకుని భయపడకూడదు. తాను ఒంటరిననీ, తనకెవరూ లేరనే భావం భయమై మనిషిని

దుర్బల పరుస్తుంది. తాను సంఘజీవిననీ, తనకోసం సమాజం ఉందనీ, సమాజం కోసం తానున్నాననీ మనిషి గుర్తించాలి. అలాగే మనం చేసే పనులు, తీసుకునే నిర్ణయాలు మంచివి అయినప్పుడు లోకులేదో విమర్శిస్తారనే భయం అక్కర్లేదు. ఉన్నత లక్ష్యాలతో అంతఃకరణశుద్ధిగా ఉంటే భయపడక్కర్లేదు. తన అనుభవాన్ని, జ్ఞానాన్ని వివేచనను సమాజ సంక్షేమానికి వినియోగిస్తూ వృద్ధాప్యం గురించిన భయదూరుడు కావచ్చు మనిషి.

భయాలన్నింటిలో మృత్యుభయం మరీ పెద్దది. అసలు మృత్యువు కంటే దాని గురించిన భయమే 'చచ్చే చావు' అన్నారు పెద్దలు. తన కళ్ళముందు అనేకమంది మరణాలను చూస్తూ ఒకనాటికి తనకూ అది అనివార్యమని తెలిసీ, క్షణికవైరాగ్యంతో, మళ్ళీ జీవనాభిరుచితో ఆశావహుడవుతుంటాడు మనిషి.

"ఎంతో ఆరాటపడుతూ జీవింతుమౌర

మృతియె లేకున్న రుచి ఏది బ్రతుకులోన"

అంటాడు గాలిబ్ మహాకవి. మృత్యువు వయోధిక్యతతో సహజంగా సంభవిస్తే సంతోషించాలి. 'అనాయాసేన మరణం – వినాదైన్యేన జీవితం' అన్నది ఆశించదగినదే.

కానీ – అసహజ మరణాలు, ప్రమాదాలలో మరణాలు, హింసాత్మక మరణాలు నివారించదగినవి కాగలగాలి. అతి వేగంగా వాహనాలు నడపడం, తమ మాట చెల్లుబాటుకాలేదనో, తమ అభీష్టాన్ని కాదని వ్యవహరించారనో, అవతలివారిని శత్రుభావంతో మట్టుపెట్టడం వంటి విషయాల్లో తమ నేరానికి తగిన శిక్ష ఉంటుందనే భయం ఉండవలసిందే! అది లేకపోవడం వల్లే తాము ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనీ, తమ ధన సంపత్తితో–చేసే అకృత్యాల నుండీ, చట్టం నుంచి తప్పించుకోవచ్చనే 'భయరాహిత్యం' సరియైనది కాదు! భయాన్ని పారద్రోలవలసిన అంశాలు ఉన్నట్లే – తప్పక తన సంక్షేమం కోసం, సమాజ సంక్షేమం కోసం భయపడవలసిన అంశాలున్నాయి. ఇక్కడ భయం యొక్క ఆవశ్యకత ఎందుకంటే అలాంటి భయం ఉండడం వల్ల – తప్పుదారి పట్టకుండా ఉంటారనే. ఎన్ని పాపాలు చేసినా దేవుడి హుండీలో విలువైన కానుకలు వేసి పోగొట్టుకోవచ్చనే 'రికామీ' తనం పనికిరాదు. అలాగే తన అధికారం, పలుకుబడి, ధనం వల్ల నీతికీ, ధర్మానికీ, న్యాయానికీ వ్యతిరేకంగా తాను తన అభీష్టం మేరకు ఏది చేసినా చెల్లుబాటైపోగలదన్న 'ధీమా' పనికిరాదు. అక్కడ భయం ఉండాల్సిందే!

పరువు ప్రతిష్ఠల పేరిట తమ పిల్లలు ఇతర కులాల వారిని ప్రేమించి పెళ్ళాడితే సహించలేక – తమ పిల్లలు ప్రేమించినవారినో, పెళ్ళాడినవారినో, లేక స్వయంగా తమ పిల్లలనో దారుణంగా హింసించి చంపుతున్న పెద్దలకు ఆ ధైర్యం ఎక్కడ నుండి వస్తోంది? వారికి 'పాపభీతి' ఉండనక్కరలేదా? భయభీతులు ఏ కోశానా లేకపోవడం కూడా హృదయకాఠిన్యానికి, హింసానేర ప్రవృత్తులకూ మూలం అవుతున్నట్లయితే 'భయశూన్యత' కాక, విధిగా 'భయమే' ఆహ్వానించదగింది కాదా మరి!

నిజమే మూఢవిశ్వాసాల నుండి హేతువు, తర్కంతో భయరాహిత్యం కావాలి! రోడ్డు ప్రమాదాలో, రైలు, విమాన ప్రమాదాలో జరుగుతున్నాయని – సదరు ప్రయాణాలే తాను చేయనన్న అనవసరపు భయాలు దరిచేరకూడనివే! నీతిగా, నిజాయితీగా, ధర్మబద్ధంగా బ్రతుకుతున్నప్పుడు అలా బ్రతకలేనివారి వల్ల ప్రతి బంధకాలు ఎదురవుతున్నప్పుడు భయపడి తన పంథాను మార్చుకోవలసిన ఆగత్యం లేదు. కానీ అలజడి, ఆందోళన కూడా కొన్నింట అవసరమే! శ్రీశ్రీ ఒకే చోట అన్నట్లు–

అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం

అన్నది – అన్యాయాలు, అక్రమాలు, అవినీతితో కూడిన వ్యవస్థపట్ల కాగలగడం సమసమాజ స్థాపన కోసమే, సామ్యవాద వ్యవస్థ కోసమే! అంతేకానీ మానవీయతే కడకు నిలచి వెలిగేది కాగలగాలి. ప్రేమ, కరుణ, సహనం, సామరస్యం, శ్రేయస్సు మూలకందంగా – మనిషి కోసం మనిషి నిలబడాలి. అందరూ కలిసి జీవించాలి. పగలు, ద్వేషాలు పెంచే, హింసా, నేరమూ పెంచే – ఎలాంటి చర్యలపట్లయినా, నేరాలకు శిక్ష ఉంటుందన్న భయం, చట్టం నుంచి తప్పించుకోలేమన్న భయం, అన్నిటి కన్నా మిన్నగా దైవం పట్ల కాకున్నా తన అంతఃకరణానికి తాను సమాధానం చెప్పుకోవాలన్న భయం మనిషికి ఉండే తీరాలి. 'చిత్తమెచట భయసహితమో' అక్కడే సువ్యవస్థ సమాయత మయ్యేట్లయితే – తండ్రీ! ఇవాళ కొంచెం ఆ భయాన్ని మేల్కొలుపు అనే ప్రార్థిద్దాం మరి! *

**20**

**8 అక్టోబర్' 2018**

# ఏది 'సుప్రీం'? - ఎవరు 'సుప్రీం'?

మన చట్టాలకు కొదవలేదు. శాసనాలకూ కొదవ లేదు. నిత్య పరిణామశీలమైన సమాజం కోసం రాజ్యాంగంలో ఎన్నో సవరణలూ ఇప్పటికే జరిగాయి. ఇవన్నీ మనిషి కోసం, అతని స్వేచ్ఛకోసం, అవరోధాలు లేని అభ్యుత్థాన జీవనం కోసమే అనడం, అనుకోవడం చేస్తూనే ఉన్నాం.

ఏది న్యాయం? ఏది ధర్మం? అనేది ప్రశ్నార్థకమయ్యే సందర్భాలు అనేకానేకం అనూచానంగా తటస్థిస్తూనే ఉన్నాయి. న్యాయం కోసమే పౌరులు కోర్టులకెక్కుతారు. అది న్యాయస్థానంపై గల విశ్వాసం. ప్రతి తీర్పు నుండీ సమాజానికి ఒక ఊర్పు లభించాలి. ఊర్జితము సమకూడాలి. అందునా అత్యున్నత న్యాయస్థానం అంటే 'సుప్రీం' కోర్టు తీర్పులు నిజంగానే తిరుగులేనివిగా సంభావిస్తాం. న్యాయశాస్త్ర సూక్ష్మాలు ఉంటాయి. అయితే వాటికే పరిమితం కాకుండా–సమాజంలోని మానవీయ సంబంధిత సమస్యలను విశాల పరిధిలో, అంతే విశాల దృక్పథంతో అవలోధనంచేసి, రాజ్యాంగ అంతరాత్మ నిర్దేశాలకు నిదర్శనంగా తీర్పులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఇవ్వగలిగి, ఆ తీర్పులు సమాదరింపబడగలగాలి.

నలభై అయిదవ ప్రధానన్యాయమూర్తిగా మనదేశపు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నుండి గత మంగళవారం జస్టిస్ దీపక్ మిశ్రా పదవీ విరమణ చేశారు. సుప్రీంకోర్టుకు అత్యధిక కాలం అంటే 1978–85 వరకు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నది జస్టిస్ యశ్వంత్ విష్ణు చంద్రచూడ్. ఆయన కుమారుడు జస్టిస్ ధనంజయ్ యశ్వంత్ చంద్రచూడ్ ప్రస్తుతం సుప్రీంకోర్టులోనే న్యాయమూర్తిగా ఉన్నారు. దేశ 46వ చీఫ్ జస్టిస్‌గా ఈశాన్య భారతం నుంచి తొలిసారిగా అత్యున్నతి పదవిని జస్టిస్ రంజన్ గోగోయ్ చేపట్టారు. బహుశా 2022లో ఆయన స్థానంలో జస్టిస్ చంద్రచూడ్ చేరతారు.

ఎవరు 'సుప్రీం' అంటే నిజానికి ప్రధానన్యాయమూర్తులుగా వారు వ్యవహరించి వెలువరించిన తీర్పులే చెబుతాయి మరి. 'సత్యానికి రంగులేదు. అది బయటకు కనిపించినట్లు ఉండదు. న్యాయానికి మానవీయ కోణం ఉండాలి. మానవీయ దృక్పథం ఉండాలి' అని పదవీ విరమణచేస్తూ వ్యాఖ్యానించారు జస్టిస్ దీపక్ మిశ్రా. జస్టిస్ మిశ్రా వ్యక్తి స్వేచ్ఛను నిలబెట్టారని కొనియాడిన భారత 46వ ప్రధాన న్యాయ మూర్తి గోగోయ్ "కులపరంగా, మతపరంగా సిద్ధాంతాలు ఆలోచనాపరంగా మనం మునుపెన్నడూ లేనంతగా చీలిపోయాం" అన్నమాట నూరుపాళ్ళ యథార్థం. "నైతికత అనే గీటురాయి మీద నమ్మకాల్ని నిరంతరం సమీక్షించాలి" అని ఆయన అన్నమాట ఇవాళ మరీ ప్రాధాన్యం గలది అవుతోంది.

నిజమే! 'వ్యక్తిస్వేచ్ఛ' అన్నదానికి ప్రాముఖ్యం కల్పిస్తూ 10-50 ఏళ్ళ మధ్యనున్న మహిళలు కూడా శబరిమలై సందర్శించ వచ్చునన్న సుప్రీంతీర్పును – 'ఈ సుప్రీంకోర్టు తీర్పు మాకొద్దు' అంటూ కేరళ మహిళలే గళమెత్తి, "మేం అయ్యప్ప గుడికి వెళ్ళం. రాజ్యాంగానికి శతాబ్దాల పూర్వమే సంప్రదాయాలున్నాయి." అంటూ తిరువనంతపురం పందళంలో భారీ నిరసన ర్యాలీ జరిపారు. 'సంస్కృతిని ధ్వంసం చేయవద్దు, సదాచారాలను కాల రాయవద్దు' అంటూ మహిళలు, యువత నినాదాలు చేశారు. అవును ఎవరు సుప్రీం? జనావళి నమ్మకాలు కాదా? వ్యక్తి నిలబెట్టుకోవలసిన నైతికత కాదా? అన్న ప్రశ్న ఉదయిస్తోంది. జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోనే 'వివాహేతర సంబంధం' చట్ట ప్రకారం నేరం కాదన్న తీర్పు వెలువడింది. "సుప్రీమే చెప్పింది నువ్వెంత" అంటూ చెన్నైలో ఓ భర్త బరితెగించి భార్యముందే నిర్దయగా, కటువుగా చెలరేగిపోయాడు. పోలీసులు, చట్టమూ తనకు సాయంరావన్న భర్తమాటల వల్ల కలిగిన ఆవేదనతో ఆ భార్య ఫ్యాన్‌కు ఉరేసుకుని చచ్చిపోయింది. అది 'సుప్రీం' పుణ్యమే అయి కూచోవడం లేదా?

పదవీవిరమణ చేసిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా కాలంలోనే ఈ దేశంలో చారిత్రాత్మక తీర్పులు కొన్ని వెలువడ్డాయి. మానవ హక్కుల సంఘాలు కూడా ఆయనను అభినందించాయి. తరతరాల విశ్వాసాలను, సూత్రాలను తెగటార్చిన తీర్పులుగా సంచలనాత్మకమైనవి ఉన్నాయి. స్వలింగ సంపర్కం నేరంకాదని తీర్పు ఇస్తూ సెక్షన్ 377 కొట్టివేయడం, వివాహేతర సంబంధాలు చట్ట ప్రకారం నేరం కాదని తీర్పునివ్వడం, అలాగే మహిళలు ఎవరయినా శబరిమల

ప్రవేశించవచ్చునని తీర్పునివ్వడం – సంచలనాలు కలిగించాయి. అదే సమయంలో ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యతను చేర్చడం, ఆధార్‌కార్డు రాజ్యాంగబద్ధమే కానీ అన్ని విషయాలలో అవసరం కాదని తేలడం, 18 ఏళ్ళు దాటిన వ్యక్తి తనకునచ్చిన వ్యక్తిని జీవితభాగస్వామిగా ఎంపిక చేసుకోవచ్చని తీర్పునివ్వడం, నిర్భయకేసులో నలుగురికి ఉరిశిక్ష విధించడం, చట్ట సభల్లో నేరగాళ్లు ప్రవేశించకుండా పార్లమెంటే చట్టం చేయాలని సూచించడం, కోర్టుల విచారణ ప్రత్యక్ష ప్రసారానికి అనుమతినిస్తూ, ఇది సుప్రీంకోర్టుతోనే ప్రారంభం అనడం... జస్టిస్ దీపక్‌మిశ్రా హయాంలోని ముఖ్యమైన తీర్పులే! అలాగే మూకోన్మాదానికి కఠినదండన విధిస్తూ తీర్పునివ్వడం కూడా జరిగింది.

జస్టిస్ దీపక్‌మిశ్రా భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఏడాదిపై ఒక నెల అంటే పదమూడు నెలల కాలంలో ఇంత 'సుప్రీం'గా వ్యవహరించడం, అనేక వివాదాలు ముసురుకునేలా చేసింది. అంతేకాదు దేశ చరిత్రలో తొలిసారిగా జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గోగోయ్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ మదన్‌లోకూర్ అనే నలుగురు న్యాయమూర్తులు దీపక్‌మిశ్రా పనితీరును ఎండగడుతూ మీడియాకి ఎక్కారు. ఆఖరికి మిశ్రాపై అభిశంసనకు అరవై అయిదు మంది పార్లమెంటు సభ్యులు తీర్మానం ప్రవేశపెట్టేంత వరకూ పరిస్థితి వెళ్ళింది.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిసే 'సుప్రీం' కాదని, ప్రజల విశ్వాసాలు, నైతికత తీర్పులకతీతంగా 'సుప్రీం' కావచ్చుననీ, మనిషి ఆస్తికునిగా ఒక 'సుప్రీం' పవర్ ఉందని విశ్వసిస్తున్నప్పుడు, తీర్పులు కాక మానవుని తీరులు, మానవత్వపు తేరులు మరోలా సాగుతాయని సంఘటనాత్మక శకం నిరూపిస్తూనే ఉంది. కొత్త చీఫ్ జస్టిస్ రంజన్ గోగోయ్ – "నైతికత అనే గీటురాయి మీద నమ్మకాల్ని నిరంతరం సమీక్షించాలి. ఎక్కడైనా, ఎప్పుడైనా అనుమానం లేదా ఘర్షణ తలెత్తినప్పుడు ఈ నైతికతే ప్రభావితం చేస్తుంది. అదే నిజమైన దేశభక్తి" అని వ్యాఖ్యానించడం ఒక ఆశావహ 'సుప్రీం' న్యాయవ్యవస్థకు ఊపిరులూదేదిగానే తోస్తోంది. ఉదాత్త సంప్రదాయాలకు ఊనిక అన్పిస్తోంది. *

**21**

**15 అక్టోబర్' 2018**

# (చెడ) తిట్టుకుందాం రా!

అధికారులు కనుసన్నల్లో మెలిగేవారయితే ప్రభుత్వం అసలుదయితేనేం, ఆపద్ధర్మంది అయితేనేం? ఒక్క ఎన్నికల కమిషన్ తప్పిస్తే మిగతా అన్ని శాఖలూ తమ పనులు తాము చేసుకుంటూ పాలన ఉన్నట్లుగానే ప్రజాసంక్షేమం కొనసాగిస్తూండాల్సిందే కదా! ఎన్నికలు ప్రకటింపబడ్డాయి కనుక 'కోడ్'కు వ్యతిరేకంగా ఏవీ జరగకూడదని ఎన్నికల కమిషన్ నిఘా వేసి ఉండాలి. దానికన్నా ముందు దాని అసలు పని ఓటర్ల జాబితా సంసిద్ధత. ఆ జాబితాలో ప్రతి ఒక్క పేరుకీ ఇంక బోలెడు ప్రాధాన్యత. ఇప్పుడు సదరు ఓటర్ మహాశయుడే పరమ సుప్రీం!

'ఏదయా మీ దయా మా మీద లేదు' అంటూ దసరా పద్యాలయినా ఇప్పుడు ఓటరు మహాశయుడి దయాదాక్షిణ్యాల కోసం ప్రాకులాటపైనే ఉన్నాయి. అధికారం 'హస్త'గతం చేసుకోవాలనే ప్రతిపక్ష కూటమి ఒకటయితే తమ అధి'కార్ల' వేగం తమనే తిరిగి గమ్యం చేర్చి హౌస్ 'ఫార్మ్' చేయిస్తుందని ఫార్మ్‌హౌస్ అధినేత పార్టీ ఆకాంక్ష. నిజమే! ఎవరి స్ట్రాటజీలు, ఎవరి స్కెచ్‌లు వారికి ఉంటాయి. రెండు రాష్ట్రాలుగా విడిపోయి తెలుగువారు ప్రాంతాలుగా వేరయినా భాషా, భావాలుగా, తెలుగు వారిగా ఏకత్రితం కావాల్సింది పోయి ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్ పేరిట, ప్రాంతీయతా ధోరణులు రెచ్చగొట్టడం, ఆంధ్రులను తిట్టడం, ఆ రాష్ట్ర సారథి చంద్రబాబును 'బట్టేబాజ్' అంటూ దుర్భాషలాడటం తాజాతాజాగా మళ్ళీ తెరకెక్కుతున్న సందర్భం.

తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలవల్లా, సంక్షేమ పథకాలవల్లా, పాలనా సామర్థ్యత వల్ల తిరిగి అధికారంలోకి రావడానికి తమ విజయాలను, అభివృద్ధి పరిచయ సభలను విస్తృత పరుచుకోవడం కాక ఎన్నికల సందర్భం అంటేనే

'తిట్లపర్వం'గా దూషణ తిరస్కారాలే ధ్యేయంగా ఎన్నికల ప్రచార ప్రణాళిక రూపెత్తడం చిత్రమే! చంద్రబాబును తిట్టడం వల్ల తెలంగాణలో తెలంగాణావారు కూటమి పార్టీలవారికి కాక తమకే ఓట్లు వేస్తారన్న నమ్మకమా? లేక సెటిలర్స్‌గా ఉన్న ఆంధ్రులు చంద్రబాబు అక్కడ రాష్ట్రాభివృద్ధికి చేస్తున్నది ఏమీలేదని ఇక్కడ కేసీఆర్ గులాబీనే మళ్లీ ఆఘ్రాణిస్తారన్న ఆలోచనా? కారణం ఏమిటో తెలీదుకానీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సభలలో తన ప్రసంగభాషను తాను చదువుకున్న తెలుగు సాహిత్య భాషా స్థాయిలో కాక వీధినల్లాల దగ్గర తిట్టుకునే, కొట్టుకునే జనం స్థాయికి తెచ్చేసారు.

అసలు ఓట్లు అభ్యర్థించే తీరూ, తరీఖా ఏమిటనేది ఏదయినా ఉందా? ఎన్నికల కమిషన్ దానికి మార్గనిర్దేశక సూత్రాలు ఏమీ విధించలేదా? తమకు ఓటు వేయమని అడగడం ప్రధానం కాక, ఎదుటివారికి వేయవద్దని అడగడం ప్రధానమైపోవడం విశేషం! ఎంతసేపూ ఎదుటివారి మోసం, వంచన, నడవడి వీటిని ప్రధానం చేసి మాట్లాడటం, జరిగిపోయినవాటికి వారిని చెడామడా తిట్టడం వారే అభివృద్ధి నిరోధకులుగా, తమ పాలనా మార్గానికి కంటకులుగా చిత్రించే యత్నం చేయటం ఇది కన్పిస్తోంది తప్ప మళ్లీ తమకే అధికారం ఎందుకు కట్టబెట్టాలో, అందువల్ల రాష్ట్ర ప్రజలకు కలిగే మేళ్లు ఏమిటో విశదపరిచి చెప్పగల, విశ్వాసం ప్రోది చేయగల విలువైన మాటలు, వినిపించకపోవడం, వినిపించినా తిట్ల పురాణం మధ్యలో అవే పిట్టకబుర్లుగా కానరావడం విషాదమే!

ముందస్తు ఎన్నికలకు ఎందుకు సమాయత్తం అయినదీ, ఎంతో విలువైన అనుకూలమైన కాలాన్ని ఎందుకు కత్తిరించేసి వచ్చే ఏడాది మేలో ఎప్పుడో జరగవలసిన ఎన్నికలను ఇప్పుడే ఎందుకు ప్రజలకు విధాయకంగా మార్చిందీ సరియైన సమాధానం లభించనేలేదన్నది ప్రతిపక్షాల ఆరోపణే కాదు మెజారిటీ ప్రజల అభిప్రాయం కూడాను. 'ముందస్తు' ఎన్నికలు ప్రకటించి మంచిపని చేశారు అని ప్రజలు నిజంగా భావిస్తున్నారా? సరే! ఎన్నికల వేళ కనుక సొంత పార్టీలోని అసమ్మతులను బుజ్జగించుకోలేకపోతే నిరసనలు, అలకలు, పార్టీ ఫిరాయింపుల కప్పదాట్లు ఇవన్నీ మామూలే! ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమగీతాలు అల్లిన కలాల చేత ఇప్పుడు కేసీఆర్ ఎన్నికల ప్రచారోద్యమ గీతాలు రాయించే ప్రయత్నంలో పడ్డారు. మరి ఆ గీతాల్లో కూడా బూతులు ఉంటాయో, అనుభూతులు ఉంటాయో విని తీరాల్సిందే!

దూషణ, భూషణ, తిరస్కారాలు ఆశీస్సులుగా తలచేవారికి 'ఛాన్స్'లు దక్కుతాయన్న ఆశ ఉండడం తప్పేమీ కాదు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులుగానీ, మిత్రులుగానీ ఉండరన్నమాట నిజమే! భుజం మీద కండువా మారడం బట్టి ఏ భుజకీర్తులు దక్కుతాయో వెంటనే చెప్పలేకపోయినా, స్వరం మారుతుంది. మాట 'వరుస' మారుతుంది. ప్రసంగం మునుపటి 'కళ' విడిచి, అంతవరకూ జరిగిన ధోరణుల పట్ల 'కళ వళ' పడుతుంది. కొత్త 'కలవరం'తో కొత్త 'కలకలం' సంతరింపబడుతుంది. మొన్నటి దాకా మహాత్ముడన్న నోటితోనే మహాపాపాత్ముడు అంటు మునుపు లేని 'నెరసులు' కనబడతాయి.

అసలు ఎన్నికల ప్రసంగాల కోసం ఒక ప్రత్యేక పదకోశం, నిందా నిఘంటువు తయారుచేయాల్సిన ఆగత్యం ఉందని మాట'కారులు' ఎందరో భావిస్తున్నారు. లక్షకుపైగా పదాలతో తెలంగాణ బృహద్నిఘంటువు తయారీ అని రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఊరిస్తున్నారే గానీ ఇంత వరకూ అందుకు సంబంధించి ఏ ప్రయత్నమూ ఎక్కడి నుంచీ ఊపందుకున్న దాఖలాలు లేవు. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, తెలంగాణ అధికార భాషా సంఘం, తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు ఆ దిశగా ఎవరు ఏమి ఆలోచిస్తున్నారో ఏమీ తెలియదు. కానీ కేసీఆర్ భాషాకోశం మటుకు జనబాహుళ్యంలోకి ఆయన ప్రసంగాల రూపంలోనే 'ఆడియో రిలీజ్' అంత అట్టహాసంగా బట్టబయలవుతోంది. ఎదుటి వారి దృష్టిని మనవైపు మరల్చుకోవడానికి మననుంచి ఒక అపసవ్య హావమో, భావమో, పద ప్రయోగమో పనిచేసినంత సులభంగా మరేవీ పనిచేయవని విశ్వాసం కుదురుకునేలానే పరిణామాలు పక్వమవతున్నాయి. మాటల హోరు, తిట్ల జోరు ఎన్నికల పోరుకు నాంది ప్రస్థావనలవుతున్నాయి. పూర్వం పురాణేతిహాసాల చిత్రాలలో అసలు బాణాలతో యుద్ధం చేసుకోవడానికి ముందు ఒకరినొకరు దెప్పిపొడుచుకుంటూ మాటల యుద్ధం చేయడం శ్రీకృష్ణార్జున యుద్ధం నుండి తెలిసిందే! సొంత బావమరుదులే, స్నేహితులే, అన్నదమ్ములే ఎవరైనా ఈ తిట్ల పురాణపు ఎన్నిక అగచాట్లకు కాక అభివృద్ధి బాటలకే అంటే ఇంకేమంటాం? *

## 22

**22 అక్టోబర్' 2018**

# మీ(రె)టూ!....

'నేనున్నూ...!'

అంటారో – లేక 'నాకున్నూ!' అంటారో గానీ

ఎవరయినా ఎప్పుడయినా ఎక్కడయినా ఎలాగయినా ధైర్యంగా బహిర్గతమై చెప్పాలనీ, దాపరికం వద్దనీ, అందువల్ల మార్పునకు దోహదం రాదు సరికదా నష్టం మరింత ఎక్కువనీ ఒక ఉద్యమ స్ఫూర్తితో నేడు వినిపిస్తున్న పదం 'మీ టూ!'

సమాజంలో, అందునా పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీలకు లైంగిక వేధింపులు అనేవి ముఖ్యంగా వారు పనిచేసే కార్యాలయాల్లో ఎదురవడం అనేది ఒక సహజాత విషయంగా మారింది. ఒక్క ఆఫీసుల్లో అనే కాదు ఈ వేధింపులు ఎప్పుడయినా, ఎక్కడయినా ఎదురుకావచ్చు. 'చెప్పకుంటే చేటు' అనో, భయభీతులవల్లనో అలాంటి ఘటనలను పదుగురికీ చెప్పుకోవడం మాట అటుంచి, తమలో తామే దాచుకొని సర్దుకుపోలేక సతమతమవుతున్న వారెందరో!

నిజానికి 'మీ టూ' ఉద్యమస్ఫూర్తికి బీజావాపనం జరిగి ఏడాదయింది. సరిగ్గా ఈ అక్టోబర్ నెలలోనే 2017లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఒక 'హాష్‌ట్యాగ్'గా సోషల్ మీడియాలో వైరల్ అయింది. అమెరికన్ నటీమణి 'అలిస్సా మిలనో' ట్విట్టర్‌లో ఈ పదబంధాన్ని విస్తృత పరిచింది. అమెరికా సామాజిక ఉద్యమ వనిత, కమ్యూనిటీ ఆర్గనైజర్ అయిన తరానా బర్కె 2006లోనే ఈ పదబంధం తొలుత ప్రయోగించింది. లైంగిక వేధింపుల సమస్య తీవ్రతను లోకవిదితం చేసి పరివ్యాప్తం చేసేందుకు గత ఏడాది అలిస్సామిలనో అక్టోబర్ 15న 'మీటూ' అనే హాష్‌ట్యాగ్ పదాన్ని ట్వీట్ చేసింది. ఆ రోజు రెండు లక్షల సార్లు ట్వీట్ అయి అక్టోబర్

16 నాటికి ఫేస్‌బుక్‌లో అయిదులక్షల సార్లు 4.7 మిలియన్ల మంది 12 మిలియన్ల పోస్ట్‌లలో కేవలం 24 గంటలలో ప్రయుక్తమైంది. యునైటెడ్ స్టేట్స్‌లో 45 శాతం మందికి ఈ పదం వినిమయం చేసే సన్నిహితులెవరో ఒకరు ఉన్నట్లు తెలిసింది.

'సానుభూతితో సాధికారత' అన్న భావనతో తరానా బుర్కే ఒక పదమూడేళ్ళ బాలిక లైంగికంగా తనకు జరిగిన వేధింపును, తనపై జరిగిన దాడిని వివరించి చెప్పినప్పుడు దానికి ప్రతిగా ఆ అమ్మాయితో 'మీటూ' అని చెప్పాననీ, ఆ పేరునే డాక్యుమెంటరీ అందుకే తీసాననీ చెప్పింది.

నిజమే! ప్రపంచవ్యాప్తంగా అనునిత్యం లైంగిక వేధింపులకు గురి అవుతున్నవారు, లైంగికదాడుల పాలవుతున్నవారు వయసుతో, వృద్ధాప్యంతో నిమిత్తం లేకుండానే ఎందరో స్త్రీలు ఉన్నారు. మహిళలను లైంగికంగా ఏదో రూపేణా వేధించే వారు తారసపడుతూనే ఉన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని, వేధింపును ధైర్యంగా, గొంతెత్తి చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోయే ఆడవాళ్ళెందరో ఉన్నారు. మన దేశంలోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో లైంగిక వేధింపులను అరికట్టేందుకు, నిరోధించేందుకు, చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఊపందుకుంది. తమకు జరిగిన వేధింపును బహిర్గతం చేసుకునే ధైర్యాన్ని స్త్రీలలో కలిగించడానికి ఈ 'మీటూ' స్ఫూర్తి ప్రచులితమవుతోందీనాడు.

మగవాళ్ళు కూడా ఈ ఉద్యమానికి దన్నుగా నిలుస్తున్నవారున్నారు. తమవల్ల జరిగిన తప్పిదాలను బహిరంగంగా ఒప్పుకొని ఇప్పటికయినా సంస్కారాన్ని అలవరచుకునే దిశగా పరివర్తితమవుతామంటున్న వారున్నారు. నిజానికి ఇలా స్త్రీలను వేధించుతూ లైంగికంగా మిస్‌బిహేవ్ చేస్తున్నవారిలో రాజకీయంగా, సామాజికంగా సంఘంలో కీర్తి ప్రతిష్టలు ఆర్జించిన వారెందరో ఉండటం అచ్చెరువును కలిగించే విషయమే కాదు. అత్యంత హేయమూ, విషాదమూ అయిన సంగతి కూడాను. గవర్నర్ హోదాలో ఉన్న ఒకప్పటి తివారీ లాంటివారు, జర్నలిజం ప్రముఖుడైన నేటి ఏజే అక్బర్ వంటివారు ఇలా ఎందరో లబ్ధప్రతిష్ఠితులు, సెలబ్రిటీలు అనుకున్నవారు ఆడవారి పట్ల అనుచితంగా ప్రవర్తించే వెకిలిబుద్ధుల వారుగా బండారాలు బయటపడుతూండడం సంచలనమవుతోంది.

నిజానికి తమపై జరిగిన వేధింపులను స్త్రీలు బహిర్గతం చేయకపోవడం కొందరికి మరింత అలుసు అవుతోంది. తమపై జరిగిన వేధింపును చెప్పడమే

కాదు, తెలిసినప్పుడు తమ భర్తలు, అన్నలు, నాన్నలు వంటివారి ఇలాంటి అనుచిత వ్యవహారశైలిని సహితం స్త్రీలు నిజాయితీగా ప్రకటించాలి. నేనున్నూ ఈ లైంగిక వేధింపుల పాలయిన దాననే ననీ, నాకున్నూ అలాంటి అనుచిత సందర్భం ఎదురయిందనీనూ స్త్రీలు వారు ఏ వయసు వారయినా సరే నిర్భయంగా, నిజాయితీగా, నిర్ద్వంద్వంగా వెల్లడించాలి 'మీటూ' అంటూ. కాలం ఆ పీడకల వంటి ఘటననో అనుచిత చర్యనో తానే మాన్పుతుందని అనుకోకుండా 'మీటూ' అంటూ వెల్లడించి బహిర్గతం చేస్తే తద్గతహేతువయిన వారెవరయినా సరే, ఎంతటి వారయినా సరే వారి బండారాలు బయటపడతాయి. ముఖ్యంగా స్త్రీలు ఉద్యోగం చేసే ఆఫీసుల్లో, కార్యాలయాల్లో లైంగికవేధింపులు ఉండని ఒక స్వచ్ఛవాతావరణం నెలకొనే వీలుంటుంది. 'వివాహేతర సంబంధం' చట్టరీత్యా నేరంకాదన్న సుప్రీంకోర్టు తీర్పు మగవారికి మరింత వెసులుబాటును కలిగించేదిగా మారకూడదు. సమ్మతితో ఏర్పడే సంబంధాలకన్నా వేధింపులతో, బెదిరింపులతో, వంచనాకాపట్యాలతో అటువంటి సంబంధాలకు తెగబడి ఎగబడేవారికి భయభీతులో, కనువిప్పుయో కలిగే విధంగా మార్పురావాలి. మీరెటూ అని వారిని నిలదీసి నిగ్గుదేల్చాలి. 'నేను ఏక పత్నీవ్రతుడిని, భార్య ఒక్కతే.. మిగతా సంబంధాలన్నీ ఇతరేతర లైంగిక బంధాలు అని బోరవిరుచుకు తిరిగే పురుషాధములకు తగిన శాస్తి జరిగేలా 'మీటూ' ఉద్యమం స్ఫూర్తి తరంగాలను మీటాలని అభిలషిద్దాం. *

**29 అక్టోబర్' 2018**

# మార్పు నా(?)తీర్పు

అయోధ్యలో రామాలయం, అందరి అకౌంట్‌లలో వెనక్కు తెచ్చిన స్విస్ బ్యాంకుల్లో దాచిన నల్లధనం వాటా డబ్బు సంగతేమోగానీ, మోడీగారి హయాంలోనే హిందువుల విశ్వాసాలకు, అవినీతి నిరోధకాలకు సంబంధించిన విఘాతాలు అనూహ్యంగా పెరిగిపోయాయి.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అనగా సీబీఐ అంటే అందరికీ ఒకప్పుడు గొప్ప గౌరవం ఉండేది. అవినీతి పరులకు, నేరస్థులకు సింహస్వప్నంగా ఉండేది. ఒక కేసు సీబీఐకి అప్పగించబడింది అంటే తిరుగులేని న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఉండేది. సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాపై అవినీతి కేసు నమోదు కావడం సిగ్గుచేటుకాగా, ఆయన ప్రధాని మోడీకి సన్నిహితుడు కావడం వల్లనే సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మకు ఉద్వాసన పలికారనీ, నిజానికి ఇదిపైకి కనబడుతున్న కారణంగానీ అసలుకి వేలకోట్ల రూపాయల రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణంపై ప్రాథమిక దర్యాప్తునకు అలోక్‌వర్మ సిద్ధం కావడం వల్లనే ఆయన తప్పించబడ్డారనీ గుసగుసలేం ఖర్మగానీ, బలమైన అనుమానంగానే మాట్లాడుకుంటున్నారు. ప్రభుత్వం కోరుకున్నట్లు చేయడం లేదనే తనను తప్పించారని అలోక్‌వర్మ సుప్రీంకోర్టుకెక్కేసారు కూడాను.

ఇప్పుడు సుప్రీంకోర్టు నిర్ణయాలు అనేకం మునుపెన్నడూ లేనంత నివ్వెర పరిచేవిగా, పరంపరాగత విశ్వాసాలకు తూట్లు పొడిచేంత స్వేచ్ఛాయుతంగానూ వెల్లడవుతూ వస్తున్నాయి. మానవ హక్కులే మూలకందంగా అవి సంచలనాత్మకాలే అయినా సరియైన నిర్ణయాలుగా భావించేవారూ, ఆహ్వానిస్తున్నవారూ ఉన్నారు. ఆ

తీర్పులను హిందూమత విశ్వాసాలకు తీవ్ర అఘాతంగా తప్పుపడుతున్నవారూ ఉన్నారు.

తాజాగా దీపావళి రాత్రి రెండుగంటలు మించి పటాసులు కాల్చకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు కూడా సంచలనం కలిగిస్తోంది. పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు దీనికి సంతోషించి స్వాగతిస్తుండగా, అసలు దీపావళి రోజు రాత్రి లక్ష్మీపూజచేసి ఆ తరువాతనే అంటే అర్ధరాత్రివేళకే పటాసులు కాల్చడం ఆచారమనీ, ఈ తీర్పు అందుకు ప్రతీఘాతమని అంటున్నవారున్నారు. ఎన్ని గంటలు టపాకాయలు కాల్చుకోవాలో చెప్పిన సుప్రీంకోర్టే రేపు ఎన్ని టపాకాయలు కాల్చుకోవాలో, ఏ టపాకాయలు కాల్చుకోవాలో, వద్దో, ఎప్పుడు తలంటుకోవాలో, కుంకుడుకాయలతోనా లేక షాంపూతోనా, దేనితో తలంటుకోవాలో కూడా నిర్ణయించి తీర్పులు ప్రకటిస్తుందేమోనని ఎద్దేవా చేస్తున్నవారూ ఉన్నారు.

మోడీ హయాంలో సుప్రీం తీర్పుల తీరుతెన్నులు ఇలానే సంచలనంగా వచ్చాయి. వస్తున్నాయి మరి. ముఖ్యంగా వివాహేతర సంబంధాలు చట్టప్రకారం తప్పుకాదనడమూ, అలాగే శబరిమలైలో ఏ వయసు స్త్రీలకయినా ప్రవేశార్హత ఉందనడమూ అనూచానంగా వస్తున్న విశ్వాసాలను ధిక్కరించి ఇచ్చిన తీర్పులుగానే సంభావింప బడ్డాయి. అనేకులు వాటిని నైతిక సూత్రాల ప్రాతిపదికమీదా, అయ్యప్పభక్తుల విశ్వాసపు భిత్తిక మీదా తప్పుబట్టారు. సుప్రీంకోర్టు తీర్పు అనుచితమని అయ్యప్ప భక్తివిశ్వాసాల కూటమిలోని స్త్రీలే వ్యతిరేక ర్యాలీలు చేశారు. వివాహేతర సంబంధాలను సుప్రీంకోర్టు సమర్థించినట్లు కావడంతో కాముకులకు కలేజా పెరిగినట్లయింది.

అసలు వేటికయినా 'నిర్ణాయక శక్తి' ఎవరనేది? ఏమిటనేది? ఒక ప్రశ్న. ప్రభుత్వం అన్నీ తనకనుసన్నల్లో మెలగాలనుకుంటే ఇంక ఆ వ్యవస్థల స్వతంత్ర్య ప్రతిపత్తి ఉనికి, స్వయం నిర్ణయాధికారం ఎలా సాధ్యమవుతాయి. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు, మీడియాకు కూడా ప్రధాన మూలాధార స్తంభాలుగా విలువ ఉంది. కానీ ఆ విలువలను దిగజారుస్తూ మీడియా క్రమేపి ఎలా పతనమవుతోందో న్యాయవ్యవస్థ కూడా అలానే దిగజారుతోందా అనే సందేహాలు ప్రబలుతున్నాయి. తాజాగా సీబీఐ పరిణామాలు కూడా దీనికి ఉదాహరణమే. 'సుప్రీంతీర్పు'లు అంటే

తిరుగులేనివనే భావన ఉంది. కానీ ఆ తీర్పులు నేడు తరతరాల ప్రజల విశ్వాసాలను తప్పుపట్టేవిలానూ, వాటికి ప్రతి బంధకాలుగానూ వెల్లడవుతూ ఉండడం సమాజంలో మేధోమధన హేతువవుతోంది.

సుప్రీం తీర్పులు ఏవయినా శిరోధార్యాలు కావల్సిందేననీ, మానవస్వేచ్ఛా, హక్కుల పరిరక్షణ కోసమే ఇన్నాల్టికి సరియైన తీర్పులు అవి సంచలనాత్మకాలనిపించినా వెలువడుతున్నాయనీ, సమాజంలో ఇది ఆహ్వానించదగిన పరిణామమనీ అభినందించేవారూ ఇబ్బడిముబ్బడిగానే పెరుగుతున్నారు. తాము చేసిన విపరీత పోకడలకు, చేష్టలకు మద్దతు లభిస్తున్నప్పుడు 'సుప్రీం'ను 'సుప్రీం' అంటూ తలెత్తుకోరా మరి? అని హేళన చేస్తున్నవారూ ఉన్నారు.

అసలు ప్రతిదానికీ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవలసిన పరిణామాలు ఎందుకు వస్తున్నాయన్నది మౌలిక ప్రశ్న. అయినదానికీ, కానిదానికీ కోర్టులకెక్కడం, విషయాలను సుప్రీంకోర్టుదాకా లాగడం చేస్తున్నది ఈ వ్యవస్థలోని వ్యక్తులే కదా! వ్యక్తులతో సంబంధం లేకుండా సుప్రీంకోర్టు అయినా దేనిలోబడితే దానిలో జోక్యం చేసుకోదు కదా! అసలు మనలో విచక్షణ, సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకునే నైజం ఉంటే, కోర్టులకెక్కవలసిన పరిస్థితి ఎందుకు వస్తుంది? సమాజం గతిశీలమైనది. పరిణామశీలమైనది. కాలానుగుణంగా మంచి, చెడు, నీతి, న్యాయము అనేవాటి కొలబద్ధలూ మారిపోతుంటాయి. ఎప్పటికీ ఏది ఉచితమో, అనుచితమో సంఘమే నిర్ణయిస్తూంటుంది. సంఘం అంటే ప్రజా సమూహమే కదా! అత్యధికులు చేతులెత్తినంత మాత్రాన ఒకటి న్యాయం కాజాలదన్నది ఎంత సత్యమో, నేడు సుప్రీంకోర్టు తీర్పుగా వెలువడినంత మాత్రాన అది శిరోధార్యమైన సహేతుక నిర్ణయం కాదన్న భావనలూ బలపడుతున్నాయంటే మన న్యాయ వ్యవస్థ పటిష్టతా ప్రశ్నార్థకమవుతున్నట్లే! ప్రతి మార్పు తీర్పుతో ఉదయించదన్నది మాత్రం సత్యం! *

24

**5 నవంబర్' 2018**

# సభానంతర సభలు

'తను రాసిపారేసిన కవితలు గుబాళిస్తుంటే తను తాగిపారేసిన సీసాల సంగతి మనకెందుకు' అనుకోవడం వల్లనే ఉదాత్త విలువల దిశానిర్దేశం చేయవలసిన కవులు, రచయితలు పలువురు ఆ ఆదర్శాలవంటివి ఏవయినా తమ రచనల్లో మాత్రమే కానీ, ఆ ఆదర్శాలను తాము అనుష్ఠించి చూపనక్కరలేదనే భావనతో, రచనకూ జీవితానికీ పొంతన కుదరని, కుదుర్చుకోని, కుదుర్చుకోనవసరం లేదనుకునే ద్వంద్వ ప్రమాణాలతో పచ్చితాగుబోతులుగా, తిరుగుబోతులుగా తయారవుతున్న వారున్నారు.

నిజానికి ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన కొందరు వ్యసనపరులై ఆరోగ్యాలను క్షీణింప చేసుకుని అర్థాయుష్కులై అమరులయిన వారున్నారు ఈ రచనా ప్రపంచంలోనే. 'చెప్పేటందుకే నీతులు ఉన్నాయి' అన్న చందాన వ్యవహరించేవారు కనబడినంతగా, అన్నది ఆచరించి చూపేవారూ, ఆశయదీప్తిని నిజాయితీగా ప్రకాశించేవారూ సకృత్తుగా మారిపోతున్నారు.

శ్రీశ్రీలా కవిత్వం రాద్దామని సిగరెట్టు, మందు అలవర్చుకుంటే వ్యసనపరుడవడం ఖాయంగానీ, కవికావడం మాత్రం సందేహాస్పదమే! కానీ రచయితయో, కవియో కావడానికి అవి ఆవశ్యకాలుగా భావించేవారున్నారు. అదృష్టవశాత్తూ బహుశా ఈ జాడ్యం పాలయిన రచయిత్రులు మాత్రం రచయితలూ, కవులతో పోలిస్తే తక్కువేలెండి!

నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుక
ప్పురవిడెమాత్మకింపయిన భోజనమూయలమంచ మొప్పుత
ప్పరయు రసజ్ఞులూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరికినగాని యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే!

అని అల్లసాని పెద్దనగారన్నారని ప్రాచుర్యంలోని సంగతి. సూక్తిసుధార్ణవం అనే కన్నడ గ్రంథంలో క్రీ.శ. 1240 ప్రాంతంలోనే దీని మూలం కనబడుతుంది.

నిరుపహతిస్థలం మృదుతరాసన మొళ్ళుణిసింపుదంబులం
నరపిద పుస్తకప్రతతి లేఖకవాచక సంగ్రహం నిరం
తర గృహనిశ్చితస్థితి విచారక సంగతి సత్కళత్రసా
దరతయి నుళ్ళ సత్యవియు మీసునదాగదే కావ్యవార్థియం

అని బుద్ధిమంతుడైన ఆ కన్నడకవి 'మీదుతరాసనం' అనీ, సత్కళత్ర సాదరత – మంచి భార్య సాదరంగా చూసుకోవడం అనీ, 'ఇంపుదంబులం' అనీ, 'నిరంతర గృహనిశ్చితస్థితి' అనీ, 'ఒళ్ళు ఉణిసి' అంటే మంచి భోజనం అనీ మాత్రమే కవిత్వం రావడానికి కావలసినవిగా చెప్పుకుంటే మన తెలుగు కవి (ఇంతచేసీ అనువాదకవి)కి ఏకాంతం, ఉయ్యాల మంచం, భార్యకాదు చెలికత్తె తెచ్చిచ్చే కర్పూరతాంబూలం ఇవన్నీ ప్రాథమికాలయ్యాయి. నిజమే ఏ కవికి గానీ, రచయితకు గానీ ఊహ తెలియంగల లేఖకు పాఠకోత్తములు మాత్రం లభిస్తేనే ఆయనగారు రాసిన రచనలకు ప్రాచుర్యం, ప్రయోజనమూ లభిస్తాయి. అంటే మంచి విమర్శకులు, రచన గురించి వివరించి చెప్పగల వక్తలు కావాలి. శ్రీ భైరవభట్ల కామేశ్వరరావు గారు తన తెలుగు పద్యం బ్లాగులో ఓ ఆరేళ్ళక్రితం ఈ కన్నడ – తెలుగు పద్యసామ్యాలను ఉటంకించి చెప్పారు.

ఇవాళ ఓ కవియో, రచయితో తన గ్రంథాన్ని ప్రముఖల చేత ఆవిష్కరింప చేసుకోవడం, పత్రికా సంపాదకుల చెలిమితో పత్రికల్లో సమీక్షలు వచ్చేలా చూసుకోవడం, అందులోనే సంతృప్తి పొందడం జరుగుతోంది. ఎందుకంటే పుస్తకాలు అమ్ముడవుతాయన్న నమ్మకం లేదు. అందుకే మహా అయితే ఓ అయిదు వందల కాపీలు సొంతఖర్చుతో వేసుకొని, రివ్యూలకు పంపుకోవడం, సాటి సాహితీవేత్తలకు, సాహితీ ప్రియులకు పంచుకోవడం చేస్తుంటాడు. తన గ్రంథంపై సమీక్షలు రావడానికి కూడా పత్రికల సంపాదకులను మంచిచేసుకుంటే తప్ప పుస్తకసమీక్ష వస్తుందన్న నమ్మకమూ లేదు. ఏ సాహితీ దిగ్గంతునిగా పేరుగాంచిన పెద్దమనిషినో పుస్తకా విష్కరణకు పిలిపించుకుని, అలాగే పుస్తకంపై మాట్లాడడానికి పేరున్న ఏ కవినో,

రచయితనో ఆహ్వానించుకొని ఉన్న ఊళ్ళో సభ జరుపుకోవాలన్నా ఆ పెద్దలకు రాను పోను రైలు ఏసీ క్లాసు ప్రయాణ చార్జీలు, ఏసీ హోటల్ గది వసతి సౌకర్యం, భోజనం ఇవన్నీ తాను ఖర్చుపెట్టుకోవాలసిందే. ఏ వదాన్యుడో కార్యక్రమ ప్రాయోజకునిగా లభిస్తే ఆర్థికంగా ఫరవాలేదు గానీ లేదా 'దమ్మిడీ ముండకు ఏగానీ క్షవరం' అన్న ఒకప్పటి సామెతలా పరిస్థితి తయారవుతుంది. (సామెత ఉటంకింపుకు క్షమించాలి). సభకన్నా 'సభానంతర సభ' నిర్వహించడం మరీ కష్టం. రాత్రి హోటల్ గదిలో మందు పార్టీ అనేదే ఆ సభానంతర సభగా ఖ్యాతి కెక్కుతోంది! హోటల్ గది కాకపోతే మరెక్కడో ఏకాంత ప్రదేశం. ఆ సౌకర్యాలన్నీ లభిస్తేనే అదే అదే.. వచ్చిన వారికి సమకూరుస్తేనే సభ విజయవంతం అయినట్లు. కవి, రచయిత భవిష్యత్తు– మీడియావారిని ఎలా చూసుకున్నాడన్నదానిమీద ఆధారపడే, మరునాటి పేపర్లో వార్త అయినా, సభతాలూకు ఫొటో అయినాను! సాంస్కృతిక విలేఖరులకు ఇవ్వవలసినన్నీ ఇస్తేనే, నగదు కవరు మరీ ముఖ్యంగా ఇవ్వగలిగితేనే ప్రచారపర్వం రాణకొస్తుంది.

ఇందులో తప్పేముంది? సభతాలూకు విజయోత్సవం ఈ సభానంతర సభ అనుకుందామన్నా అందులో ఎన్ని రసాభాసలు జరుగుతాయో, మనుషుల అసలు స్వరూపాలు, బలహీనతలు ఎలా బహిర్గతమవుతాయో మామూలు జనం ఊహించలేకపోవచ్చు కూడా. సభా వేదిక మీద గొప్ప సంస్కారిగా, మహోన్నతునిగా, ఆదర్శనీయునిగా, మార్గదర్శిగా కనబడే మహనీయ వ్యక్తి, సాహిత్యలోకనాయకుడు ఆ సభానంతర సభలో తన నిజరూప సాక్షాత్కారం అందిస్తాడు. దానికీ జేజేలు పలికే వంది మాగధులూ ఉంటారు. కలుసుకోవడాలూ, కలబోసుకోవడాలూ ఈ రెండవ అంకంలో అసలు 'పంకం' ఏమిటో చక్కగా అంటిస్తాయి. ద్వంద్వ ప్రవృత్తులు, అసలు ముఖాలు అగుపిస్తాయి. కవులకు, రచయితలకూ సమీపంగా వెళ్ళడం వల్ల అసలు సాహిత్యం పట్ల అభిరుచినీ, కవుల పట్ల అభిమానాన్నీ కోల్పోయినవారున్నారు. యాభైఏళ్ళ క్రితం ఓ కాలేజీ కుర్రాడు పరీక్ష పాసయ్యాక ఇంట్లో వాళ్ళు వాహనం కొనుక్కోమని డబ్బులిస్తే శ్రీశ్రీపై అభిమానంతో మద్రాసు రైలెక్కివెళ్ళి, ఆయనను ఆ వెళ్ళిన రోజు రాత్రి చూసినప్పటి పరిస్థితిని జీర్ణించుకోలేక సాహిత్యం అన్నా, సాహితీపరులన్నా వెగటుపుట్టి వెనుదిరిగి ఇక ఆ జోలికి వెళ్ళని విషయం ప్రత్యక్షంగా

తెలుసు. అప్పుడు అతను అమాయక జీవి మరిపాపం!. ఈనాడు సాహిత్య ప్రపంచం, సాహిత్య రాజకీయాలు, సాహిత్య స్థితిగతులు, సభాకార్యకలాపాల వ్యవహార సరళి, సభానంతర సభల విషయాలు తెలిస్తే, చూస్తే 'ఇదింతే' అని రాజీ పడలేకపోతే ఆశాభంగం చెందే జీవులే ఎక్కువ ఉంటారు. కానీ సమాజం నేడలా లేదు. 'పొగత్రాగడం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం' అనేమాట సినిమాల్లోనూ, చానెల్స్ దృశ్యాల్లోనూ ఒక నామ మాత్రావశిష్టపు వాక్యమేగానీ ఆ రచనావాక్యపు ప్రభావం ఏమీ లేదు. దృశ్యం రంజకంగా లోబరుచుకుంటూనే ఉంటుంది. ఈ దిగువ సభలే కీర్తి ఎగువసభల సోపానాలు మరి! *

# 25

**12 నవంబర్' 2018**

# ఎప్పటికెయ్యది ప్ర'స్తుతము'...!?

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఎవరూ ఉండరు అనే మాట నిజమే కావచ్చు. కానీ పార్టీపరంగా 'మౌలిక విలువలు' అంటూ కూడా ఉండవా? వ్యక్తులు పార్టీలు మారుతుంటారు. నిజానికి అది కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమే అనేది జనాలకు తెలియంది కాదు. తామున్న పార్టీలో తాము ఆశించిన ప్రయోజనాలు, కోరిన పదవులు, హోదాలు లభించకపోవడం వల్లనే అసమ్మతి కలుగుతోంది. తాము చేయదలచిన ప్రజాసేవకు అవరోధం కలుగుతోంది అనే మిష పెట్టి, అధినాయకత్వం పట్ల విశ్వాసం సడలి ఏవో విలువల కోసం పార్టీ మారుతున్న 'కలర్' ఇవ్వడం, భుజం మీద కండువా మార్చుకోవడం మామూలై పోయింది.

ఒక పార్టీలోంచి మరో పార్టీలోకి ఎందుకు మారుతున్నారు అన్నదానికి తమను ఎన్నుకొన్న నియోజకవర్గ ప్రజలకు సరియైన సమాధానం చెప్పవలసిన బాధ్యత కూడా తమకు ఉందని ఈ పార్టీ ఫిరాయింపుదారులకు అనిపించదు. ప్రజలూ అంతే! పార్టీ మారుతున్న నేతను నిలదీసే వారేరీ? అనుచరగణాలు ఉంటాయి గానీ అవి తందానతాన బాపతే! 'ఎస్ బాస్' అనడమే గానీ మార్పునకు హేతుబద్ధతను అభిలషించే నైజం ఎక్కడ?

అభ్యర్థుల వైయక్తిక వ్యవహార సరణులు ఇలా ఉండగా పార్టీల పొత్తులు మరో పెద్ద ప్రహసనం! ఎవరు ఎవరితో ఎందుకు పొత్తుకడతారో 'ఎంతకాలమిటు సహించి' అటు పోకుండా ఉంటారో వారికే తెలీదు. ఈ పార్టీల పొత్తులు సమష్టిగా ఆశించేది అధికారంలో ఉన్నవారిని పడగొట్టడం, తాము అధికారంలోకి రావడం అనేది స్పష్టం. ఎన్నికల వేళ ఈ సమీకరణాలు చిత్రవిచిత్ర మలుపులు

తిరుగుతుంటాయి. అంతవరకూ బద్ధశత్రువులు అనుకున్నవారు చేతులు కలుపుతారు. చెలిమిబలిమితో ఉన్నవారనుకున్నవారు చెదిరిపోతారు. ప్రాంతీయ పార్టీల హవాలు రాష్ట్రాల్లో బాగా వీచడం మొదలెట్టాయి గత కొంతకాలంలోనే. తొలిరోజుల్లో జాతీయపార్టీలు అనుకున్న వాటికే రాష్ట్రాల్లోనూ మనుగడ ఉండేది. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు రాష్ట్రాల్లోనూ పెత్తనం సాగించడంలో చూపిన వివక్షతల వల్లే రాష్ట్రాల్లోని స్థానికతకు ఆఘాతం కలగడం ఎప్పుడయితే మొదలయ్యిందో అప్పుడే తమ 'ఆత్మగౌరవ' నినాదంతో ప్రాంతీయ పార్టీలు వేళ్ళూనుకుంటూ వచ్చాయి. ముఖ్యంగా కేంద్ర రాజకీయాలను ఉత్తరభారతం శాసించేదిగా ఉండటం దక్షిణాది రాష్ట్రాల్లో పెనుమార్పులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కేంద్రంతో ఢీకొనేలా ప్రాంతీయ పార్టీల ప్రాబల్యాన్ని పరిఢవిల్లచేశాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అప్రతిహతంగా ఉన్న కాలంలో వారి వ్యవహార సరళికి అడ్డూ ఆపు లేని తరుణంలోనే అంతవరకూ సినిమా రంగంలో ఓ అగ్రనాయకునిగా ఉన్న నందమూరి తారకరామారావు 'తెలుగుదేశం' పార్టీని స్థాపించి తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో కేవలం తొమ్మిది నెలల్లో విజయఢంకా మ్రోగించి, కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకున్న విషయం చరిత్ర ఎరిగిన సత్యం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమే కాంగ్రెస్ పార్టీ విలువలపై సవాలుగా, ఒక నూతన విలువల ప్రాతిపదికన ఏర్పడింది. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, ఆయన పాలనా వ్యవహార సరళి సరికొత్త రాజకీయానికి తెరతీసాయి. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయమూలాలు తెలుగుదేశం పార్టీలోనివే. అంటే ఆయన రాజకీయాల మౌలిక విలువలు ఆ పార్టీలో చేరి సమకూర్చుకున్నవే!

తెలంగాణలో ముందస్తు ఎన్నికలకు తెరతీసిన కేసీఆర్ ఆ మౌలిక విలువల ప్రాతిపదికనే కావచ్చు, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగానే ఇప్పటికీ ఉన్నారు. నిజానికి తెలంగాణ ఆవిర్భావానికి పోరాడి సాధించడం అనేది ఉన్నా, అది కాంగ్రెస్ పార్టీ కారణంగా సాధ్యమైందన్న మాట కాదనలేనిది. ఒక దశలో తమకు ప్రత్యేక రాష్ట్రం మాత్రమే ముఖ్యమనీ, తెలంగాణ ఏర్పడితే తమ టీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడానికయినా అభ్యంతరం లేదనీ అన్న కేసీఆర్ – తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసమే తాను నెలకొల్పిన టీఆర్ఎస్ పార్టీ అస్తిత్వాన్ని పోగొట్టుకోరాదని

సంకల్పించి మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలికి కాంగ్రెస్‌తో విభేదించి ఉండడానికే కట్టుబడ్డారు. తెలంగాణ ఇచ్చిందీ, తెచ్చిందీ తామేనంటూ కాంగ్రెస్ ఊదరగొట్టి తనకు బలమైన ప్రత్యర్థిగా నిలవడానికి 'మహాకూటమి'కి సమకట్టిందని తెలిసి కూడా వెరవని కలేజాతో కేసీఆర్ సాగిపోతున్నారు.

తెలుగుదేశం పార్టీ స్థాపన తర్వాతే అంతవరకూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న చంద్రబాబు నాయుడు మామ ఎన్టీఆర్ పార్టీలో చేరారు. పార్టీలో ఒక ప్రాధాన్యతా స్థానానికి రావడం వల్లనే మామకే వెన్నుపోటు పొడిచిన అల్లుడుగా అభివర్ణింపబడినా పార్టీ ప్రయోజనాల కోసమే తాను పగ్గాలు చేజిక్కించుకున్నానని మొత్తానికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగగలిగారు. 'తెలుగుదేశం' పార్టీ విలువల అస్తిత్వం చంద్రబాబులో నిజానికి గాఢంగానే ఉండి ఉండినట్లయితే, ఇవాళ ఏ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సరికొత్త విలువల మూలకందంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందో ఆ కాంగ్రెస్ పార్టీతోనే 'మహాకూటమి'గా ఎన్నికల పొత్తుకు సమాయత్తమవుతారా? అని నివ్వెరపోతున్నవారున్నారు. చంద్రబాబు రాజకీయ మూలాలు కాంగ్రెస్‌లోంచి వచ్చినవి కనుకనే ఇవాళ తెలుగుదేశం పార్టీ 'ఆత్మగౌరవ' వ్యవహారం తుంగలో తొక్కి రాహుల్‌గాంధీతో 'కూటమి' కట్టడం నిజంగానే పరిహాసాస్పదం అనుకుంటున్న వారున్నారు.

నిజానికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సహకరించిన కాంగ్రెస్‌తో కేసీఆర్ పొత్తు పెట్టుకుంటేనూ, కాంగ్రెస్ పార్టీపై ధ్వజమెత్తి, జనతాపార్టీతో నడిచిన ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ అధినేత అయిన చంద్రబాబు మోడీకి స్నేహహస్తం చాస్తేనూ ఎవరూ ఆశ్చర్యపోరేమో!

కానీ రాజకీయం అంటేనే సామాన్యుడికి అర్థంకాని బ్రహ్మపదార్థంగా, కేవలం అతడొక 'ఓటరు' తప్ప, రాజకీయాలను శాసించగల దిశానిర్దేశకునిగా ఎదగగలిగే క్రియాశీల పౌరుడు కాలేకపోతున్నాడన్న స్థితియే దేశంలో పాతుకుపోతోంది కనుక ప్రజలింకా 'గొర్రెల మంద'లానే పాలకుల పాలబడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజ మినహాయించి అధికారస్వామ్యం, ధనస్వామ్యం, నేరస్వామ్యం, హింసాస్వామ్యం తరగలెత్తుతున్నాయి. ఓటు అనే ఆయుధ వినియోగ విన్నాణం ప్రజలకు సమకూడాలని ఆకాంక్షిద్దాం. *

# 26

19 సెప్టెంబర్' 2018

# నా(మి)నేషన్ దందాలు!

ఓడిపోతామని తెలిసినా కొందరు ఎన్నికల బరిలోకి దిగుతుంటారు. నామినేషన్ల ఘట్టం ఊపందుకున్న ఇప్పుడు, పార్టీ టికెట్లు దొరికినవారు అనుచరులతో సహా వెళ్ళి, అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేయడం సరేసరి! సొంత పార్టీలో టిక్కెట్టు దొరక్కపోయినా రెబెల్ అభ్యర్థులుగా రంగంలోకి దిగే వారు కొందరయితే, స్వతంత్ర్య అభ్యర్థులుగా నామినేషన్లు వేసేవారు ఇంకొందరు.

మహాకూటమి పక్షాల మధ్య సీట్ల పంపిణీలో గందరగోళం చెలరేగనే రేగింది. కూటమిలో ప్రధాన నిర్ణాయక పాత్ర పోషించిన కాంగ్రెస్ మిత్రపక్షాలకు కేటాయించిన సీట్లపట్ల సీపీఐ ముందే మండిపడింది. ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలోని టీజేఎస్ కూడా తమకు కేటాయించిన వాటితో సర్దుకోక పన్నెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కూటమిలోని కాంగ్రెస్, టీడీపీ, తెలంగాణ జనసమితి నుంచి టిక్కెట్టు ఆశించిన నేతలు పలుచోట్ల రెబల్స్ అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు.

ఇలా రెబెల్స్ బరిలోకి దిగి నామినేషన్లు వేయడం, స్వతంత్ర్య అభ్యర్థులుగా మరికొందరు పలుచోట్ల నామినేషన్లు వేయడం ఎన్నికలలో కొత్తేమీ కాదు. ఎవరయినా పోటీ చేయవచ్చు. గెలుపు అవకాశాలు తమకే ఉన్నాయన్న ధీమాతోనే వారంతా నామినేషన్లు వేసి బరిలోకి దిగుతున్నారనుకుంటే మాత్రం మనం పప్పులో కాలేసినట్లే! ఎందుకంటే ఈ నామినేషన్లు వ్యవహారంలో కూడా ఒక 'దందా' ఉంది. అసమ్మతి విభేదాలు, స్వతంత్ర్య అభ్యర్థుల పోటీ, అనేవి గెలుపు సంగతి మాట అటుంచి, ఓట్లు చీలికకు దారితీస్తాయన్నమాట మాత్రం ఎంతో కొంత నిజం! ఎందుకంటే గెలిచిన అభ్యర్థి ఓడిన అభ్యర్థిపై ఎన్ని ఓట్ల తేడాతో గెలిచాడన్నది కూడా పట్టించుకునే విషయమే కదా! కేవలం ఒకటి, రెండు ఓట్ల తేడాతో గెలిచేవారూ ఉండచ్చు. ఓడేవారూ

ఉండచ్చు. ఈ అసమ్మతి విభేదాలను తమ విజయావకాశాలకు అనుకూలంగా మలుచుకోవాలన్న తాపత్రయం, ప్రయత్నం అధికార పార్టీకే ఉంటుంది. ఈ అసమ్మతి పరిణామాలను తమకు సానుకూలంగా మలుచుకోవడానికి టీఆర్ఎస్ పావులు కదుపుతోంది. టీఆర్ఎస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా కూటమి నుంచి బరిలోకి దిగిన అభ్యర్థి కాక అవే పక్షాల నుంచి తిరుగుబాటు అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలను అందించాలని టీఆర్ఎస్ తాజాగా ముందుకు వెడుతోందట! ప్రధాన ప్రత్యర్థికి వచ్చే ఓట్లను తిరుగుబాటు అభ్యర్థులు చీలుస్తారు. దానితో తమ విజయావకాశాలు మరింత మెరుగుపరుచుకునేందుకు టీఆర్ఎస్ రెబెల్స్‌తో చర్చించి చివరి వరకు వారు బరిలోనే ఉండేలా, మధ్యలో నామినేషన్ ఉపసంహరించుకోకుండా ఉండేలా ఒప్పించడానికి మధ్యవర్తులను రంగంలోకి దింపుతోంది. ఆ మధ్యవర్తుల్లో బడా పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు ఉన్నారట!

రాజకీయాల్లో ఒకటి ప్లస్ ఒకటి రెండు కాదని, అది ఒక్కోసారి జీరో కూడా కావచ్చని మంత్రి కేటీఆర్ సూత్రీకరించారు. ఒక పార్టీని అభిమానించేవారి ఓట్లు మరో పార్టీకి బదిలీ కావనీ, ఒకే పార్టీలో ఒకే స్థానానికి ఒకరు టిక్కెట్టు లభించీ, మరొకరు రెబెల్‌గా పోటీచేస్తే ఆ పార్టీ ఓట్లు ఆ ఇద్దరికీ చీలుతాయనీ ఒక సూత్రీకరణం. ఆ మాట ఎలా ఉన్నా అసలు తాము నామినేషన్లు వేయడం కొందరికి ఓడిపోతామని తెలిసీ ఒక సరదా! అది ఒక తరహా దందా! తాము నామినేషన్ ఉపసంహరించుకుంటే ఎంత డబ్బు సంపాదించగలమని ఆలోచించేవారు కొందరయితే, ఉపసంహరించుకోకుండా ఉండడానికి ఎవరి నుండి ఎంత డబ్బు సంపాదించవచ్చనే ఆలోచన మరికొందరిది. అవును! బయటకు కనబడవు గానీ లోపాయికారీ వ్యవహారాలు ఇలాంటివి చాలానే ఉంటాయి. 'రెబెల్‌గా నిలబడి ఓట్లు చీలిస్తే నీకు ఇంత డబ్బు ఇస్తామ'ని అధికార పార్టీ ఆశపెట్టచ్చు. 'నీవు నామినేషన్ ఉపసంహరించుకుంటే ఇంత ముట్టచెబుతా'నని తనపై రెబెల్‌గా ఉపసంహరించుకోవడానికి ఆ పార్టీ అభ్యర్థే బేరసారాలు చేయవచ్చు. ఎన్నికల సమయంలో డబ్బుల లావాదేవీలు, పార్టీ ఫండ్స్ పేర వసూళ్ళు అనధికారంగా ఎన్ని జరుగుతాయో సామాన్యుడు ఊహించలేడు కూడా!

ప్రత్యర్థి పార్టీల తిరుగుబాటు అభ్యర్థులకు, నేతలకు గాలం వేసే పని అధికార పార్టీ మధ్యవర్తులయిన పారిశ్రామికవేత్తలకు, కాంట్రాక్టర్లకు అప్పగించడంలోని

మతలబులు ఇవే! కూటమి పక్షాల మధ్య జరుగుతున్న పరిణామాలను తమకు అనుకూలంగా మలుచుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలతో టీఆర్ఎస్‌లో విజయం పట్ల ధీమా పెరుగుతోందిట! బలమైన పోటీ ఇవ్వాలంటే కూటమిలో ఐక్యత ఉండాలి.

గడ్డిపోచలు పేని
గట్టిఏనుగునేని
కట్టువాడే జ్ఞాని
ఓ కూనలమ్మ!

అన్నాడు ఆరుద్ర. బలమైన ప్రత్యర్థిత్వం ఇవ్వాలంటే కూటమి 'జ్ఞాని' కాగలగాలి మరి! గడ్డిపోచలనిపించేవయినా సరే, ఒకటిగా కూడితే ఆ పటుత్వం వస్తుంది. కానీ రాజకీయాలలో ఆ 'పేనుడు' సాధ్యం కాదనీ, కాకూడదనీ ఆశించేవారే ఉంటారు. తమ స్వలాభమే ముఖ్యం ఎవరికయినా. ఓడిపోవడానికి సిద్ధపడడంలో కూడా లాభం చూసుకోవడమే రాజకీయం! అదే నామినేషన్స్‌లోని దందాలో దాగిన వ్యవహారం.

ఇజము నెరిగినవాడు
నిజము చెప్పనినాడు
ప్రజకు జరుగును కీడు
ఓ కూనలమ్మ!

ఓటు అనేది ప్రజల చేతిలోని బలమైన ఆయుధం. అయితే అది కాకి నోటిలోని మాంసం ముక్కలాంటిది. దాన్ని ఒడుపుకోవడానికి నక్కలు శతథా ప్రయత్నిస్తాయి. పొగడ్తలు, భజనలే కాదు ఎన్ని రకాల ప్రలోభాలు పెట్టాలో అన్నీ పెడుతూనే దానిని ఎలాగయినా కైవసం చేసుకోవాలని ఎన్నికల గోతి కాడ కాచుక్కూచ్చోవడం వాటి అలవాటు. ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యే రాజకీయపుటెత్తుగడలను తుత్తినీయలు చేసి క్రమక్రమాగత చైతన్య ధనుష్పాణులై ఓటర్లు పురోగమించగలిగితే అంతకన్నా కావల్సిందేముంది. నామినేషన్లలో దాగిన దందాలే కాదు, నేతల ద్వంద్వాలు, రాజకీయాల కాపట్యాలు నశించి అసలయిన 'విజయక్రాంతి' లభిస్తుందని ఆకాంక్షిద్దాం. *

## 27

**26 నవంబర్' 2018**

# దిగజారుతున్న విలువల వలువలు

విలువలా? అంటే ఏమిటి. విలువ అంటే 'రేట్' అంటారా? అదే 'ధర'. అయితే సరే! పార్టీ టిక్కెట్టు సంపాదించడానికి ఎంత విలువ అయినా రెడీయే! ఓటుకు పౌరుడికి ఎంత 'విలువ' ఇచ్చి కొనుక్కోవాలో మేం నిర్ణయించుకోగలం! ఇప్పుడంతా రాజకీయాల్లో ఈ తంతు నేతలేగానీ విలువ అంటే 'వాల్యూ' అనుకునే వారెవరూ లేరు. అసలు రాజకీయాల్లో విలువలు క్రమేపీ భ్రష్టుపట్టిపోతూనే ఉన్నాయి. ఎన్నికల్లో హుందాతనం లేదు. ప్రచారాల్లో సంయమనం లేదు. అసలు ప్రజాస్వామ్యం అన్నదాని పట్ల గౌరవం ఉన్నట్లే కనబడదు. ప్రజలను తాము ఉద్ధరించడానికే పుట్టాం అన్నట్లుగా నేతల వ్యవహార సరళి ఉంటోంది కానీ ప్రజలవల్లనే తాము ఈ స్థితిలో ఉన్నామనిగానీ, పదవులు, అధికారులు, సంపాదించిన ఆస్తులు తమకు వాళ్ళు పెట్టిన భిక్షేననీ అనుకునే వాడొక్కడు లేదు. ప్రజలను తమ రౌడీయిజంతో భయపెట్టయినా ఓట్లు దండుకోగలమన్న ధీమా కొందరిది. కులం పేరునో, మతం పేరునో తమతో కలసివచ్చి, ఓట్లు తమ వర్గం వారు తమకే కుమ్మరిస్తారన్న భరోసా కొందరికి.

స్వాతంత్ర్య ఫలాలు ఏమైపోతున్నాయి. డబ్బై ఒక్క ఏండ్లు నిండిన స్వతంత్ర్య భారతదేశం నిజంగానే ఆదరణకు నోచుకోని 'వృద్ధ'గా మారుతోందా? పాలనలో దార్శనికత, సంస్థల నిర్మాణం, నీతి, నైతిక విలువలను ఆచరించడం, నిరాడంబరంగా జీవించడం ఇవి ఒకప్పటి నేతల జీవిత లక్ష్యాలు. వావిలాల గోపాలకృష్ణయ్య వంటి వారు నేడెక్కడ? మానవ హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ జ్ఞాపకం చేసుకున్నట్లుగా దాదాపు మరణశయ్యపై ఉన్న ఆయనను చూడటానికి గుంటూరు వెళ్ళినప్పుడు వావిలాల హరగోపాల్‌ను పట్టుకుని విలపించారట.

'భారత స్వాతంత్ర్యం కోసం మేము పోరాడింది దేశాన్ని దోపిడీదారులకు అప్పగించడానికా? దేశ పరిస్థితులను చూస్తుంటే నాకు ఇంకా బతికి అవినీతిపరులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఉంది. సమాజంలో పెరిగిన అన్యాయం, అమానుష సంఘటనలు నన్ను తీవ్రంగా కలచివేస్తున్నాయి' అంటూ హరగోపాల్ ఉన్నంతసేపూ కంటనీరెట్టుకుని విలపిస్తూనే ఉన్నారట! ఆ తరువాత రెండు రోజులకే ఆయన అస్తమించారు.

దేశం కోసం, దేశసంక్షేమం కోసం ఇవాళ ఆర్తి చెందుతున్న వారెవరున్నారు? 'దేశభక్తి' అనే మాటే బూతుగా అయిపోయినట్లయింది. వందేమాతర గీతం మీదనే కాదు జాతీయగీతం జనగణమనపై కూడా గౌరవం లేదు. జాతీయపతాకం ఏడాదికి రెండుసార్లు ఎగరేసే గుడ్డముక్కగా తప్ప గుర్తింపే లేదు. స్వాతంత్ర్యం కోసం ఆత్మార్పణలు చేసిన నాయకులందరిలో ఇవాళ దోషాలు ఎంచడం లేదా తమకు అనుకూలంగా ఎలా వాడుకోగలం అని ఆలోచించడం తప్ప వారి ముఖాలను కూడా పోలిక పట్టలేనితరం తయారైంది.

ఇవాల్టి నాయకులంతా నాటి విలువలకు ఏనాడో తిలోదకాలు ఇచ్చేసారు. ధనార్జనే నేటి ధ్యేయం. సంస్థలను నిర్వీర్యం చేయడం వీరికి చేతనవును. ఇవాళ రాట్నాలకు, ఖాదీ వస్త్రాలకు విలువలేదు. అవి కాంగ్రెస్ పార్టీ అవశేషాలు అనుకుంటారు. స్వాతంత్ర్యోద్యమ దీప్తిని ఉన్నతీకరించిన పత్రికలు ఏనాడో ఆగిపోయాయి. ఇవాళ ఫోర్త్ ఎస్టేట్ అనబడే పత్రికల ధోరణులు, లక్ష్యాలు అన్నీ వ్యాపారాత్మకాలు, ధనార్జనా హేతువులే కానీ ప్రజా చైతన్యంగానీ, ప్రజా సంక్షేమంగానీ వాటి దృష్టికాదు. పత్రికా స్వేచ్ఛ అనేది పైపై మాటేగానీ శ్రీశ్రీ అన్నట్లు 'పెట్టుబడికి కట్టుకథకి పుట్టిన విషపుత్రిక'ల్లాగా వ్యవహరించేవే ఎక్కువ. ఏదో ఒక దానికి కొమ్ముకాసేవే ఎక్కువ. ఒకప్పుడు విలువల కోసం పదవులను త్యాగం చేసిన నాయకులను చూసిన మనం, నేడు పదవుల కోసం ఎలాంటి విలువలనయినా త్యాగం చేసే నాయకులను చూస్తున్నాం. తెలంగాణ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన పౌరహక్కుల నేతలు అరెస్టయినా నోరు మెదిపే వారూ, వరవరరావు వంటి వ్యక్తి అరెస్టుని వ్యతిరేకిస్తూ మాట్లాడిన ఒక్క రాజకీయ నాయకుడూ లేడన్నదీ వాస్తవం! వారికి వారి సంపాదనలే ముఖ్యం. ఆవిర్భావం నాటికి ఆర్థిక స్వావలంబనతో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ 2.2 లక్షల కోట్ల అప్పుల స్థితిలోకి నెట్టి వేశాడని ఒకప్పటి కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరమే చెప్పారు.

రాజకీయాల్లో చైతన్యం లేకపోవడానికీ, ప్రభుత్వ పాలనల్లో పటిష్టత లేకపోవడానికీ అవి 'ముసలికంపు' కొట్టడం కారణం అంటున్న వారున్నారు. నిజానికి పెద్దల అనుభవం, మార్గదర్శకత్వం జాతిని నీతి నిజాయితీలతో ముందుకు నడపగలిగేవి కాగలగాలి. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు అరవై ఏళ్ళుగానీ రాజకీయ నేతలకు మాత్రం పదవీ విరమణ వయస్సు అనేది లేదు. గెలిస్తే అయిదేళ్ళు ఇష్టారాజ్యం. వయస్సుతో నిమిత్తం లేకుండా ఎన్నికల్లో నిలబడి గెలిచినప్పుడల్లా పదవీ అధికారాల అవకాశాలు వారివే!

ఇవాళ ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థుల్లో అధికశాతం అరవై ఏళ్ళు పైబడినవారే. కొందరు డబ్బైలు కూడా దాటేసారు. నిజానికి దేశాన్ని శాసించే ఇలాంటి ప్రధానరంగంలో, సామాజికంగా మార్పుతేగల సాహిత్యాదిరంగంలో యువత పాత్ర మరీ తక్కువగా ఉండడం నిజంగా అచ్చెరువు కలిగించే సంగతి! యువకులు రాజకీయాలపట్ల మొగ్గుచూపి దూసుకురాకుండా అడ్డుపడుతున్నదీ ఈ రాజకీయ వ్యవస్థే అనిపిస్తుంది. ఎందుకంటే రాజకీయానికి పెట్టుబడి ప్రజాభిమానం కాక ధనం అయికూర్చుంది. నిరుద్యోగి రాజకీయాల్లోకి దిగి ఎన్నికల బరిలో నిలుచోగలిగే పరిస్థితి ఎక్కడుంది? కుటుంబ వారసత్వంగా వచ్చే స్త్రీలు, యువకులే రాజకీయపథంలోనూ తారసపడుతున్నారుగానీ ఇతరత్రా కనబడేవారు తక్కువ. జయప్రకాష్ నారాయణ, మాజీ సీబీఐ అధికారి లక్ష్మీనారాయణ వంటి వారి పేర్లు రాజకీయ ఆదర్శంగా తలుచుకోవడానికి బాగుంటున్నాయి గానీ వారికి అధికారం తలుపుతట్టే స్థితిగతులు సందేహాస్పదాలే! పవన్ వంటి వారిది సినిమా గ్లామర్ తప్ప విలువల విషయంలో బోలుతనమే! సామాజిక న్యాయమంటూ ప్రజారాజ్యం పార్టీ అంటూ తలెత్తిన చిరంజీవి తెచ్చిన విలువలేమిటో రాజకీయాలు చూపనే చూపాయి. జాతీయ పార్టీలలో కనబడే కాసింత విలువల ఛాయలయినా, ప్రాంతీయ పార్టీల్లో ఈనాడు కుదరుకోవడం లేదు. ప్రత్యర్థిని వ్యక్తిగతంగా పడదిట్టే, పడగొట్టే వైఖరే తప్ప విలువల ప్రాతిపదికన ఉన్నతమై కనబడే నేతలే మృగ్యమైపోతున్నారు. 'నిన్నూ, ఈ దేశాన్ని బాగాచేయడం నా వల్ల కాదు' అని అదేదో సినిమా డైలాగునే దేశభక్తిగలవారు కంటనీరు పెట్టుకుని వావిలాలలా వలవల ఏడ్వడం తప్ప చేయగలిగేదేమీ లేదా అంటే ప్రజాచైతన్యంతో 'ఓటు'హక్కు వినిమయం కావడంలోనే సమాధానం ఉంటుంది. *

**28**

**3 డిసెంబర్' 2018**

# 'కుక్క బతుకు' వ్యవస్థ

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఓ పవిత్ర క్రతువు అయితే, ప్రచారసరళి వేదఘోషలానో, ఉదాత్తమంత్రోచ్చారణలాగానో ఉండాలిగానీ, ప్రత్యర్థులను దుమ్మెత్తి పోసుకోవడంలో పరస్పరం కుక్క మొరుగుళ్ళలా ఉంది తప్ప, వాతావరణం హుందాగా కనబడుతున్న ఛాయలు తక్కువగానే ఉన్నాయి.

నాయకుడి మీద విశ్వాసం గలిగితే అనుచరులు ఎవరయినా తోక ఊపుకుంటూ వెంటతిరుగుతారు. అయితే విదిల్చే బిస్కెట్ ముక్కలకు ఆశపడే తమ విశ్వాసాన్ని వారి పట్ల ముడుపుగట్టడం పాపం! ఈ మూగజీవాలకే చెల్లింది. ప్రజలు గొర్రెల మంద అన్నారుగానీ అభ్యర్థికి ఓటేసి గెలిపించిన పాపానికి అయిదేళ్ళ వరకూ ఎన్నుకున్న ఇంటి కావలికుక్కలానే ఉండాల్సి వస్తోంది జనం.

'మనదీ ఒక బ్రతుకేనా కుక్కలవలె....' అని శ్రీశ్రీ వంటి మహాకవి ఆర్తి ప్రకటించాడు గానీ, మనకు విదేశీ సంస్కృతి అలవాటై 'ఇండియాలో మనిషిగా పుట్టడం కన్న అమెరికాలో కుక్కలా బ్రతకడం సుఖం' అనుకుంటున్న చందాన అమెరికా కుక్కలాగా ఇక్కడ స్వదేశంలో ఉన్నా బ్రతకాలనే యావ పెరుగుతోంది. బుష్‌గారు ఒకప్పుడు తన కుక్కకు 'ఇండియా' అని పేరు పెట్టాడని తెలిసి ఏమి చేయగలిగాం! 'కుక్క బ్రతుకు' అని మనం దైన్యాన్నీ హైన్యాన్నీ కలిగిన జీవనం గురించి బాధపడతాం. అమెరికాలో కుక్కలకు ఉన్న సౌకర్యాలు కూడా ఇక్కడ కొందరు మనుషులకు పాపం అందుబాటులో లేవన్నది వాస్తవంగా గోచరమవుతున్నదే!

కుక్కలకు ప్రత్యేక వసతులు, కుక్కలకు ప్రత్యేక పార్కులు, కుక్కలకు ప్రత్యేక హోటళ్ళు, కుక్కలకు ప్రత్యేక ఆసుపత్రులు, కుక్కలకు అందాల పోటీలు, కొన్నిచోట్ల

కుక్కలకు ప్రత్యేక అనుమతులూ ఇవన్నీ అమెరికాలో అతి మామూలైన విషయాలు. మనలాగా అక్కడ కుక్కను అది, ఇది అంటే కూడా వారు ఊరుకోరు. వారి నామధేయంతోనే పేర్కొనాలి. అలాగే వాటిని పలకరించాలన్నా ఆ ఇలాకా వారి యజమానుల అనుమతులు తీసుకోవాలి. అక్కడ కుక్కలు ఇంటిసభ్యులు. పిల్లలెంతో – ఆ మాటకొస్తే పిల్లలకన్నా అధిక ప్రేమపాత్రులు.

మన దగ్గరే.... ఇప్పటికీ మున్సిపాలిటీ బండ్లు వచ్చి వీధికుక్కలను పట్టుకోవాల్సిందే! ఇక్కడి కుక్కలకు విచ్చలవిడితనం ఎక్కువ. గ్రామసింహాలని వ్యవహరించినా వాటి గర్జింపులకు, కాట్లకు గురి అయి బాధపడేవారు కొల్లలు. 'కుక్క కాటుకు చెప్పుదెబ్బ' అన్నారుగానీ అదేమీ చికిత్సా కాదు. పరిష్కారమూ కాదు. బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు చేయించుకోవాల్సిందే. రాబిస్ వ్యాధికి మందు అందుబాటులో ఉంటుందన్న నమ్మకం కూడా లేదు మన ఆసుపత్రులలో. ఊరకుక్కలు, పిచ్చికుక్కలు ఉన్నంతగా పెంపుడు కుక్కలు ఉన్నట్లు లేదు. 'బివేర్ ఆఫ్ డాగ్స్', 'కుక్క ఉన్నది జాగ్రత్త' అన్న బోర్డులు బోలెడు కనబడతాయి. వృద్ధులను ఆశ్రమాలకు తరలిస్తారుగానీ, ఇక్కడి ఆధునిక యువత కుక్కల పెంపకంపై ఇటీవల బాగా మోజుపడుతున్నారని ఇటీవల ఓ సర్వేలో తేలింది.

కుక్కల స్వభావాలు కూడా కాలానుగుణంగా మారుతుంటాయట! 'చిత్తకార్తె కుక్కలు' అని మనకో సామెతలాంటిది ఉంది. 'కామోద్రిక్తత'కు ఓ ప్రతీకగా దాన్ని ఉపయుక్తం చేయడం ఉంది. నిజమే! వావివరసలేమీ ఆ జాతికి అక్కర్లేదు. 'కామాతురాణాం 'న భయం న లజ్జా' అన్న తరహాలో నడివీధిలో చెలరేగిపోవడం వాటి స్వభావమే! కానీ ఇవాళ మనుషులు కూడా అంతకన్నా హీనంగా పతనమవుతున్నారు. స్త్రీలపై అత్యాచార వార్తలు నడివీధి చెలరేగు తరహా వార్తలు లానే ఉంటున్నాయి. అసలు జర్నలిజంలో ఒక మౌలిక అంశం ఉంది. అదేమిటంటే 'కుక్క మనిషిని కరిస్తే వార్త కాదు', 'మనిషి కుక్కను కరిస్తే వార్త' అని. వార్త యొక్క స్వభావం చెప్పడానికి దాన్ని ఉపయుక్తం చేస్తూండడం చాలా కాలంగా ఉన్నదే! 'కుక్కలా పడి ఉండడం' అనేమాట కూడా ఉంది. మేకలూ, గొర్రెలే కాదు కుక్కలు కూడా పాపం మూగజీవాలే అనేవారున్నారు. అయితే సమాజం ఇవాళ ఏ స్థాయికి దిగజారిందో, మగవాడి మదం ఎంత హైన్యానికిచ్యుతమయిందో తెలిపే వార్త గత నెలాఖరులో పేపర్లలో వచ్చింది.

ముంబై నగరంలో నలుగురు దుండగుల పైశాచికానందానికి, వారి సామూహిక అత్యాచారానికి ఒక కుక్క బలైపోయింది. ముంబై మల్వానీ ప్రాంతంలో తిరిగే ఒక మగ కుక్కకు స్థానికురాలయిన సుధాఫెర్మాండజ్ రోజూ ఆహారం పెట్టేవారు. నవంబర్ 20న ఆమె ఆహారం తీసుకెళ్ళి కుక్క కోసం వెతకగా చర్చి సమీపంలో ఆ శునకం మూలుగులు వినిపించాయి. హుటాహుటిన ఆమె అక్కడకు చేరగా రక్తపుమడుగులో ఉన్న ఆ కుక్క కనబడింది. వెంటనే వెటర్నరీ హాస్పటల్‌కు తరలించారు. వైద్యులు నిర్ఘాంతపోయే విషయం ధృవీకరించారు. శునకంపై మద్యం మత్తులో దుండగులు సామూహిక అత్యాచారం చేశారని, మర్మాయవాల తీవ్రరక్తస్రావ హేతువదేననీ చెప్పారు. ఆ సంగతి నిజమేనని ఒక రిక్షావాలా ప్రత్యక్షసాక్షిగా విశదరిచాడు. ఆ కుక్క నోరు కట్టేసి లైంగికంగా దుండగలు చిత్రహింసలకు గురి చేశారని, తాను అక్కడకు చేరుకుని వారిని పట్టుకోగా తనని దూషిస్తూ తనపై దాడికి పాల్పడి పరారు అయ్యారనీ ఆ రిక్షావాలా వివరించాడు. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆ కుక్క ప్రాణాలు విడిచింది. అత్యాచారం చేసిన దుండగులు కుక్క ఆడదో, మగదో కూడా తెలీని మద్యం మత్తులో  పైశాచికానందంతో గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారంటే మనిషి ఎటు పోతున్నాడు, ఏమై పోతున్నాడు అనుకోవాలి? కుక్కలకు కూడా రక్షణలేని వ్యవస్థలో జీవిస్తున్న మనం అమానవీయత పరాకాష్ట చేరుకుంటున్నందుకు గర్విద్దామా? గర్హిద్దామా? 'ప్రజాస్వామ్యమా వర్థిల్లు' అని ఎలా గొంతెత్తి నినదించేది? శునక 'అవస్థ' నుండి సువ్యవస్థకు ఎప్పటికి ఎదిగేది? ఎలా రాణించేది? *

**10 డిసెంబర్' 2018**

# రేపటి వెలుగు కోసం...

ఇప్పుడిక రేపటి ఫలితాల కోసం నిరీక్షణ. గెలుపు ఓటములు దైవాధీనాలు అన్నారు గానీ, ఎన్నికల విషయంలో మాత్రం ప్రజాధీనాలు. ఓట్లువేసిన అధికశాతం ప్రజల అభీష్టం మేరకే నిర్ణయం జరుగుతుంది. ఓటు హక్కు వినియోగించుకోని వారికి ఆశించే అర్హత లేదు గానీ, ఫలితాల కోసం అందరిలాగానే వారూ ఎదురుచూస్తారు. కానీ తాము ఓటు వేసిన అభ్యర్థి గెలుపు గురించిన ఆత్రం ఓటరుకు ఉంటుంది. సరే! నిలబడిన అభ్యర్థుల సంగతి చెప్పనవసరమే లేదు. వారిది నరాలు తెగిపోయే ఉత్కంఠ. ముందస్తు సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ ఎన్ని జరిగినా, ఏవే ఊహాగానాలు ఎంతెంత జరిగినా అసలు ఫలితాల మీదే అందరి దృష్టి! ఎందుకంటే అదే అసలు సిసలు నిర్ణాయక శక్తి.

అనుకున్నామని జరుగవు అన్నీ
అనుకోలేదని ఆగవు కొన్నీ
జరిగేవన్నీ మంచికనీ
అనుకోవడమే మనిషి పనీ

అని ఎంత ఎవరు సరిపెట్టుకుందామనుకున్నా అనుకూల ఫలితాలకోసమే అందరి ఆశా! విజయవార్త వినడం కోసమే అందరి నిరీక్షణా! ఎన్నికల ఫలితాలు అనూహ్యమైన మార్పులు తెచ్చేవి అయినా, కాకున్నా అలాంటి పెనుమార్పు అభిలషించేవారు కొందరయితే, ఉన్నదేదో బాగానే ఉంది, ఇది ఊడిపోకపోతే చాలు అనుకునేవారు ఇంకొందరు.

ఇరవై తొమ్మిదో రాష్ట్రంగా తెలంగాణ అవతరించాక తెలంగాణలో ఇవి తొలి శాసనసభా ఎన్నికలు. నిజానికి ఇంకా కొంతకాలం గడువు ఉన్నా ముందస్తు ఎన్నికలను తెచ్చి పెట్టింది కేసీఆర్. తన టీఆర్ఎస్ పార్టీ విజయం మీద ఆయనకున్న నమ్మకం, ప్రజలు తమనే తిరిగి ఎన్నుకొని మళ్ళీ అధికారం అప్పగిస్తారన్న ధీమా ముందస్తుకు తలపడ్డాయి. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజాఫ్రంట్ అంటూ ఇతర పార్టీలు కూటమిగా ఏర్పడి అధికార టీఆర్ఎస్ పార్టీని గద్దెదించడం ధ్యేయంగా ప్రచారహోరెత్తాయి.

కారు అయితే ఆ నలుగురికే చోటు. హస్తం అందరినీ దీవిస్తుంది అంటూ కాంగ్రెస్–అసలు తెలంగాణ ఇచ్చిందీ తెచ్చిందీ తామేననీ, రాష్ట్రాభివృద్ధికి తమ పాలనకు తరుణం ఇది అనీ ఘోషించింది. సోనియాగాంధీ, రాహుల్ స్వయంగా ఎన్నికల ప్రచారంలో నడుం బిగించారు. పత్రికల్లో పూర్తిపేజీల ప్రకటనలతో చెలరేగారు.

తననూ, తన పార్టీని చావు దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్న కూటమి కారణంగా, ఈ ఎన్నికల ఫలితాలు కేసీఆర్‌కు జీవన్మరణ సమస్యయే! ఉద్యమకారునిగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు మూలాధారనాడిగా నిలచి, ప్రభుత్వం స్థాపించిన కేసీఆర్ పాలనకు ఇప్పుడు ప్రజల తీర్పు ఎలా ఉండగలదన్నదే ఆయన నిరీక్షణ! ఒక విధంగా కేసీఆర్‌కూ, టీఆర్ఎస్ పార్టీకీ ఇది 'పునరుత్థాన నిరీక్షణ'. కేసీఆర్ పాలనకు ఈ ఎన్నికల ఫలితాలే తీర్పు చెప్పేవి. తెలంగాణ సెంటిమెంట్ ఇంకా ఎంత బలీయంగా ఉంది అనేది కూడా ఈ ఫలితాలు నిర్ణయించగలుగుతాయి.

ఈ ఫలితాల తరువాత తాను జాతీయ రాజకీయాల వైపు దృష్టిసారిస్తామని ప్రముఖ మీడియా పర్సన్ రాజ్‌దీప్‌సర్దేశాయ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ చెప్పడం చూస్తే తన గెలుపు తథ్యమని ఆయన భావనగానే తోస్తుంది. కానీ 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతుందా' అని కేసీఆర్ జాతీయస్థాయి నేతృత్వం గురించిన ఆరాటం కొందరికి పరిహాసాస్పదంగా తోచవచ్చు. 'ఏమో గుర్రం ఎగరావచ్చు' అనేది నిరీక్షణలోని ఆశకు ఓ అంచు. 'ఎగిరిపోతే ఎంత బాగుంటుంది' అనేది కూడా ఓ పరిణామోత్సాహం! పాలనలో కేసీఆర్ ప్రాంతీయ దృష్టి స్థిరపడకుండానే, అప్పుడే తన జాతీయతా దృష్టి గురించి కలలు కనడం ఆత్మవిశ్వాసమో, అతి విశ్వాసమో ఈ ఫలితాలు ఎలాగూ విశదపరుస్తాయి.

కేసీఆర్ పాలనలో కవులు, కళాకారులు కొందరయినా లక్షలార్జించి లక్షణంగా

పదవులతో, పేరుప్రతిష్టలతో ఎదిగారు గానీ, సామాజిక ప్రజలకు ఒనగూడింది ఏమిటనీ, నిరుద్యోగ యువత ఆశలు అడియాసలుగానే ఉన్నాయనీ, కాగితపు లెక్కల్లో తప్ప రైతులకు ఒనగూడిందేమీ లేదనీ అనేవారున్నారు. తెలంగాణ గ్రామసీమలు అభివృద్ధినోచుకోక అలానే ఉన్నాయనీ, ఆర్థికంగా రాష్ట్రం ఆవిర్భావం నాటికి పటిష్టమై ఉండగా కేసీఆర్ పాలనలో వేలకోట్ల అప్పుల బారినపడి అసహాయంగానే ఉందనీ అంటున్నవారున్నారు. తెలంగాణ ఉద్యమంలో మడమతిప్పక పనిచేసిన కోదండరాం, గద్దర్ వంటివారెందరో కేసీఆర్‌కు వ్యతిరేకంగానే ఈ ఎన్నికల్లో గళమెత్తి పనిచేశారు. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ పార్టీలు తెలంగాణ భవిష్యత్తును తమ ప్రజాఫ్రంట్‌కు అందించమంటూ చేతులుచాచాయి.

ఎన్నికల ప్రచారసభలకు, నాయకుల రోడ్డుషోలకు జనం బాగానే వచ్చారు. అందరి ఆశలకూ తమ ఉనికితో ఊపిరులూదారు. మొన్నటి శుక్రవారం ఏడవతేదీ తమ ఓటువేసే కార్యక్రమంలోనూ గుర్తించదగిన శాతంలోనే పాలుపంచుకున్నారు. వారి నిర్ణాయకశక్తి యంత్రబద్ధమై రేపటి లెక్కింపునకు సిద్ధంగా ఉంది. అభ్యర్థుల గెలుపు, ఓటములు, ప్రజల తీర్పు రేపు తెలిసిపోతాయి. తెలంగాణ భవిష్యత్ చిత్రపటం రేపు ఆవిష్కృతమవుతుంది. ప్రజావిజయక్రాంతి ఏమిటో పరిఢవిల్లుతుంది. *

30

24 డిసెంబర్' 2018

# పుస్తకాల సంత(సం)

ఇప్పుడంతా రాజ్యమేలుతున్నది మార్కెట్ సంస్కృతి! వ్యాపారమే ప్రధానం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా బలం పుంజుకుంటున్నప్పుడు సిద్ధాంతాలు, నిబద్ధతలు అన్నీ గాలికి ఎగిరిపోయే పేలపిండి తంతే!

ఏటా పుస్తకాల సంత ఒకటి జరుగుతుంది. హైదరాబాద్‌లోనూ, విజయవాడలోనూ జరిగే జాతీయ పుస్తక ప్రదర్శనలు మార్కెట్‌లోకి ఏ కొత్త పుస్తకాలు వస్తున్నాయో తెలుగుకోవడానికి బాగా ఉపకరిస్తున్నాయి. ప్రచురణ సంస్థలు, పుస్తకవ్యాపారులు స్టాల్స్‌ని నెలకొల్పి అమ్మకాల కోసం ఆరాటపడతారు. కానీ కవులూ, రచయితలూ తమ సొంత డబ్బుతో సొంతంగా పుస్తకాలు వేసుకోగలరేకానీ అమ్ముకోవడం చేతనైనవారు బహు తక్కువ. మునుపు ప్రచురణకర్తలు రచయితలకు పారితోషికం చెల్లించి మరీ వారి రచనలను పుస్తకాలుగా ముద్రించేవారు. అమ్మకాలు తమవే అయినా ఆయా రచయితలకు రాయల్టీ చెల్లించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సృజనాత్మక సాహిత్యం అంటే కవిత్వం, కథలు, సాహిత్య వ్యాసాలు వంటి గ్రంథాలు ప్రచురించే ప్రచురణకర్తలు లేరు. ఉన్నా తాము పెట్టుబడి పెట్టరు. ఆ రచయిత నుండో లేక ఏ ప్రాయోజితుల నుండో ముద్రణావ్యయం లభిస్తే తమ సంస్థ ప్రచురణగా వెలువరించడమే మహోపకారంగా భావించేవారున్నారు. అప్పుడయినా ఆ గ్రంథాల అమ్మకంపై తమకు నలభైశాతమో, యాభైశాతమో కమీషన్ ఇస్తేనే ఆ పుస్తకాలు అమ్ముతారు. అమ్మిన తర్వాత కూడా రచయితకు రావలసిన సొమ్ము అందుతుందా అంటే అనుమానమే!

హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ పుస్తక ప్రదర్శన పుస్తక ప్రేమికులతో కళకళలాడుతున్న మాట నిజమే! ఏర్పాటు వేదికల మీద

గ్రంథావిష్కరణలూ జరుగుతున్నాయి. (మరెక్కడో ఆవిష్కృతమైన గ్రంథం మళ్లీ ఇక్కడ పునరావిష్కరణ చేసుకునే సౌలభ్యాలు లేకపోలేదు లెండి!) స్టాల్స్‌లో రచయితలు తమ పుస్తకాలు అమ్మకానికి పెట్టాలంటే కూడా కొంత సొమ్ము కట్టాలట! అమ్మకం కోసం ఇచ్చే కమీషన్ ఎలాగూ ఇవ్వాల్సిందే! ఇంతచేసీ పుస్తకం అమ్మకానికి పెట్టడానికి చెల్లించాల్సిన రుసుమంతయినా పుస్తకాల అమ్మకం వల్ల లభిస్తుందా అన్నది సందేహమే!

ప్రదర్శన స్టాల్‌లో తన పుస్తకం సందర్శకులకు కనపడేలా ప్రామినెంట్‌గా డిస్‌ప్లే చేయడం లేదని వాపోతున్న కవులూ, రచయితలూ ఉన్నారు. అక్కడ కూడా ఆశ్రితపక్ష పాతాలూ, పలుకుబడి ప్రాధాన్యతలే! ఒకప్పుడు సోవియట్ రష్యా, చైనా గ్రంథాలు ప్రజలలో సామాజిక, శాస్త్రీయ, గతి తార్కిక భౌతికవాద దృక్పథాన్ని పెంచే గ్రంథాలు, అభ్యుదయ సాహిత్యం మాత్రమే లభించే విశాలాంధ్ర ప్రచురణాలయం వంటి స్టాల్స్‌ల రూపురేఖలు నేడు మారిపోయాయి. ప్రగతిశీల సాహిత్యం మాత్రమే నవచేతన, నవ తెలంగాణ వంటి బుక్‌స్టాల్స్‌లో లభిస్తుందనుకుంటే పొరపాటే! అనవరతం ఆర్.ఎస్.ఎస్‌ను ఆడిపోసుకునే సీపీఐ, సీపీఎం కమ్యూనిస్టు పార్టీల పుస్తక స్టాల్స్‌లో కూడా భక్తి, ఆధ్యాత్మిక గ్రంథాలు ఉండడం– ఏది వ్యాపారానికి ఉపయుక్తమో దానిని వాడుకోవడమనే మార్కెట్ సంస్కృతికి కాపు కాయడమే. ప్రజలలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సాహిత్యాన్ని తీసుకొస్తున్నామని చెప్పుకునే కమ్యూనిస్టు వామపక్ష భావాల సంస్థలు ఇప్పుడు భక్తి, ఆధ్యాత్మిక గ్రంథాలు, వాస్తు, ధ్యానం, యోగ వంటి గ్రంథాలకు నిలయంగా మారాయి. ఆధ్యాత్మిక గ్రంథాల అమ్మకాలు బాగున్నాయని భక్తి పుస్తకాలు బాగా అమ్ముడుపోతున్నాయనీ వారూ సంబరపడుతున్నారు.

వంటల పుస్తకాలూ బాగా అమ్ముడవుతున్నాయట! కవిత్వ గ్రంథాలకు దుమ్ముపడుతుంటే వ్యక్తిత్వ వికాస గ్రంథాలు చెలామణిలో ఉన్నాయి. ఇప్పటికీ యద్దనపూడి, యండమూరి, మల్లాది వెంకటకృష్ణమూర్తి వంటి వారి నవలలకే డిమాండ్ ఉంది. సహకార పద్ధతిన స్టాల్ నెలకొల్పి తమ పుస్తకాలు అమ్ముకోవడానికి ఆరుగురు కార్టూనిస్టులు పూనుకోవడం, అలాగే ఒకప్పుడు మహిళా రచయిత్రుల కోసం ప్రత్యేక స్టాల్ పెట్టినవారు గతం నేర్పిన పాఠాలతో ఇతరత్రా స్టాల్స్ వారితో మమేకమై తమ గ్రంథాలను అమ్మకాలకై ప్రదర్శనకు ఉంచడం కనబడుతున్న ఓ మార్పు.

సివిల్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఉపయోగపడే పుస్తకాలకు అమ్మకాలు బానే ఉంటున్నాయట! నేటి సమాజంలో మహిళా సాహిత్యం పెరగవలసిన అవసరం ఉందని బుక్‌ఫెయిర్‌లో సంగెం లక్ష్మీబాయి వేదికపై నుండి జరిగిన 'ఆధునిక తెలుగు సాహిత్యంలో బహుజని' వంటి సదస్సుల్లో మహిళా రచయిత్రులు ఎలుగెత్తారు. ఉత్పత్తి కులాల సాహిత్యం కూడా ముందుకు రావాలని అభిలషించారు.

నిజానికి ఎన్ని పుస్తక ప్రదర్శనలు జరిగినా యువతలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెరగడం లేదు. అందునా కెరీర్‌కు సంబంధించినవి కాక ఇతరత్రా సృజనాత్మక సాహిత్యం పట్ల, ఆ గ్రంథాలు చదవడం పట్ల, అభిరుచి కలిగినవారి శాతం దయనీయంగానే ఉంది. ఇప్పటికీ యాభై, అరవై ఏళ్ళు పైబడినవారే పుస్తకాలు చదివే పాఠకులుగా ఉన్నారు. అందువల్ల సహజంగానే ఆ వయోధికపాఠకులు కోరుకునే ఆధ్యాత్మిక, భక్తి సాహిత్యం, నోములు, వ్రతాల వంటి పుస్తకాలే వ్యాపారాత్మకంగానూ లభిస్తున్నాయి. బాలలకు ఒక్క నిమిషం తెలుగు వంటి పోటీలు పెట్టుకొని తెలుగు భాష నిలబెట్టుకునే తాపత్రయాలే బుక్‌ఫెయిర్‌లోనూ అనివార్యంగా మారినరోజులివి. గ్రంథాలయ దీప్తి కొడిగడుతోంది. ప్రభుత్వపరంగా కవులకూ, రచయితలకూ వారి గ్రంథాలు కొనుగోలు చేసే ప్రోత్సాహక పథకాలూ ఏవీ లేవు.

తెలంగాణలో తెలుగు భాషా సాహిత్యాలకు ఉన్న ఆదరణ పాటిదైనా ఆంధ్రప్రదేశ్‌లో లేదన్న మాటా ఉంది. ముందస్తు ఎన్నికలతో పునరుత్థాన వైభవం పొందిన కేసీఆర్ ప్రభుత్వం తెలుగు కవులు, రచయితల పుస్తకాలను కొనుగోలుచేసి, గ్రంథాలయాల వికాసం కలిగించి భాషా సాహిత్యాల పరిరక్షణ కలిగిస్తుందని ఆకాంక్షిద్దాం. *

31

1 జనవరి' 2019

# కొత్తదారిలో.. మన హైదరాబాద్

కొత్త శతాబ్దికి కూడా ఓటు హక్కు వచ్చేసింది. అవును! మరో ఏడాది కాలగర్భంలోకి తరలిపోయింది. ముందస్తుగానే ఎన్నికలకు తరలి గులాబీ పూవులాగా విచ్చుకుంది. 18 నిండి 19లోకి ప్రవేశిస్తున్నాం నేటి నుండి.

హైదరాబాద్ మహానగరం గత ఏడాది అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. విద్యుత్ సరఫరాలోనే కాదు. తాగునీటి పథకాలు పూర్తిచేయడంలోనూ కీలక పురోగతి జరిగింది. ప్రధానంగా ఔటర్ రింగ్‌రోడ్డులో ఉన్న 190 పంచాయతీలు, నగరపాలక సంస్థలకు నీరందించే పనులకు మోక్షం దొరికింది. 11 శివారు మున్సిపల్ సర్కిళ్ళు గ్రేటర్‌లో విలీనమయ్యాయి. ఆ రెండువేల అయిదు వందల కిలోమీటర్ల దారిలో తాగునీటి పైప్‌లైన్లు ఏర్పడ్డాయి. యాభై ఆరు భారీ స్టోరేజీ రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది. సుమారు వెయ్యి కాలనీలకు, బస్తీలకు నీరందించడం 'ఈ నగరానికి ఏమయ్యింది?' అంటే సంతోషదాయకమైంది మరి.

హైదరాబాద్ 'మెట్రో' సిటీ అనిపించుకునేలా ఈ ఏడే అత్యంత రద్దీ ఉండే పదహారు కిలోమీటర్ల ఎల్బీనగర్– అమీర్‌పేట్ మార్గంలో మెట్రో ప్రాజెక్టు పూర్తి అయ్యి మియాపూర్ వరకూ నేరుగా మెట్రో రైలు ప్రయాణం చేయగల అవకాశం దొరికింది. 29 కిలోమీటర్ల మార్గంలో ట్రాఫిక్ ఇక్కట్లు అనేవేవీ లేకుండా కేవలం ఓ యాభై నిమిషాల్లో ప్రయాణించే అవకాశం నగరవాసులకు దక్కింది. కొత్త సంవత్సరంలో అమీర్‌పేట, హైటెక్‌సిటీ మార్గంలోనూ మెట్రోరైళ్ళ సందడి మొదలవుతుంది మరి!

లింగంపల్లి, పటాన్‌చెరువు తదితర చోట్లకు గోదావరి జలాలను సరఫరాచేసేందుకు ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి పటాన్‌చెరువు వరకు భారీ

రింగ్‌మెయిన్ పైప్‌లైన్ పనులు రూ.400 కోట్ల అంచనావ్యయంతో చేపట్టడం గత ఏటి మరో విశేషం.

హైదరాబాద్ మహానగరం ఒకప్పుడు ప్రశాంతత భగ్నమయ్యే ఘటనలతో అట్టుడికిపోతూండేది. గత ఏడాది నగరంలో నేరాలు గణనీయంగా తగ్గడం ఓ శుభపరిణామమే! కాసయితే హత్యకేసులు మాత్రం ఎనిమిది శాతం పెరగడం శోచనీయం. నగర కొత్వాల్ అంజనీకుమార్‌గారు వెల్లడించిన వివరాల ప్రకారం నగరంలో రోడ్డుప్రమాదాలు, గతంతో పోలిస్తే రోడ్డు ప్రమాదాల మృతుల సంఖ్య తగ్గుదల పట్టింది. ఒకప్పుడు నగరం రోడ్ల మీద గంటకు సరాసరి వేగం 18 కిలోమీటర్లు ఉండగా గత ఏడాది అది 25 కిలోమీటర్లకు చేరిందట. అయితే సైబర్ క్రైమ్ పెరుగుతుండడం ఓ నివారించవలసిన కొత్త పరిణామం. నగర రక్షక వ్యవస్థలో గత ఏడాది సిటీ రాపిడ్ యాక్షన్ ఫోర్స్, వెరీ ఫాస్ట్ యాప్, ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్, ఉమెన్ ఆన్‌వీల్స్ వంటి బృందాలు రంగంలోకి కొత్తగా దిగాయి. మొత్తానికి ఆరుశాతం నేరాలు నగరంలో తగ్గాయి అని నగర సీపీ అంజనీకుమార్ వార్షిక నివేదిక విడుదల చేశారు.

దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా 'ట్విన్‌టవర్స్' పేరుతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో పోలీస్ టవర్స్ నిర్మాణం పూర్తికావస్తోంది. ఈ కొత్త సంవత్సరంలో 83.4 మీటర్ల ఎత్తయిన ఈ జంట భవనాలను ప్రారంభిస్తారు. అలాగే వందకోట్ల వ్యయంతో నగరంలోని 250 జంక్షన్లలో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలులోకి రానుంది. ఈ సంవిధానం అమలులోకి వస్తే ట్రాఫిక్ నిర్వహణ మరింత సులభతరం అవుతుంది. వాహనదారులు తమ గమ్యం చేసుకునే సమయం గణనీయంగా తగ్గడం, ట్రాఫిక్ జామ్స్ దాదాపు కనుమరుగు చేయగలగడం సాధ్యమవుతుంది.

ఇక చారిత్రక హైదరాబాద్ నగరంలో పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ పచ్చదనం, పరిశుభ్రత కోసం శ్రద్ధ పెట్టడం జరుగుతుండడం మరో గుర్తించదగిన పరిణామం.

నగరంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని 'గ్రీన్‌బిల్డింగ్స్' అంటే హరితభవనాల నిర్మాణం కొంత ఊపందుకుంటోంది. సౌరశక్తి వినియోగం, పునర్వినియోగ విధానంలో మురుగునీటి శుద్ధి, స్వచ్ఛమైన గాలి, వెలుతురు గ్రీన్‌బెల్ట్ కొత్త నిర్మాణాల్లో భాగం అవుతున్నాయి. హరిత భవనాల నిర్మాణానికి 20

శాతం అధికంగా ఖర్చు అవుతున్నప్పటికీ, ఆ భవనాల నిర్వహణ వ్యయం క్రమేపీ తగ్గే వీలుండడం వల్ల సదరు భవన నిర్మాణాలు చేయడానికి సంస్థలు పూనుకుంటున్నాయి. ప్రభుత్వపరంగా రాయితీలు లభించేటట్లయితే ఆయా సంస్థల నిర్మాణాలు మరింత జోరుగా ఉంటాయి.

మన దేశంలో 35 శాతం గ్రీన్‌బెల్ట్‌తో ప్రస్తుతం ప్రణాళికబద్ధ నగరుగా చండీఘడ్ తొలిస్థానంలో ఉంది. మన నగరంలో ఇంకా హరితం ఎనిమిది శాతానికే పరిమితమై ఉంది. అందువల్ల హరిత భవనాలు రాబోయే రోజుల్లో మరింతగా నిర్మింపబడవలసిన ఆగత్యం ఉంది.

ఇది హైదరాబాద్ ఇది హైదరాబాద్
ఇది భిన్న సంస్కృతులు ఎదిగిపూచిన పాదు

అని డాక్టర్ సి.నారాయణరెడ్డి ఒకప్పుడు నగర వైభవకీర్తి కవితాత్మకం చేశారు. హైదరాబాద్ మహానగరం తెలంగాణ రాజధాని. 2014 నుంచి పదేళ్ళపాటు ఉమ్మడి అస్తిత్వం ఉంటుందని అన్నా, నగరసంపద అంతా తెలంగాణదే! ఇప్పటికీ ఢిల్లీ కంటే హైదరాబాద్‌కే దేశరాజధాని కాగలిగిన స్థాయి ఉందని విశ్వసిస్తున్న వారెందరో ఉన్నారు. హైదరాబాద్‌ను కనీసం యూనియన్ టెరిటరీగా ఉంచినా బాగుండేదని భావిస్తున్న వారూ ఉన్నారు.

నిజాంపాలన నుంచి హైదరాబాద్ విముక్తమయినా నిజానికి హైదరాబాద్‌లోని ప్రగతి మూలాధారాలన్నీ నిజాం కాలం నాటివిగా ఉన్నాయనడంలో అతిశయోక్తిలేదు. అందుకే భాగ్యనగరమన్న పేరు సార్థకంగా నిలిచింది. అయితే ఆ నాటి భాగ్యాలు వేరు. ఈ నాటి భాగ్యాలు వేరు. తెలంగాణ ఆదాయవనరుల భాగ్యం నేటికీ హైదరాబాద్ మీదే ప్రధానంగా ఆధారపడి ఉంది. నగరం ఎందరెందరినో, ఎక్కడెక్కడి నుండి వలస వచ్చినవారినో చేరదీసి ఆదుకుంది. నగరంతో అనుబంధం పెనవేసుకున్న జీవితాలు కోకొల్లలు. సాహిత్యం, కళలు, సంస్కృతి, ఆచారవ్యవహారాలు అన్నిటి కూడలి ఈ మహానగరం. నగరం నీడలో సేదతీరుతున్న ప్రాణులు అసంఖ్యాకం. తెలుగువారి గుండె చప్పుడు నగరంతో పెనవేసుకుపోయిందన్న మాట వాస్తవం! 2019 కొత్త సంవత్సరం అందరికీ, అన్నింటా సుఖ, సంతోషప్రదం కావాలని శుభాకాంక్షలు. *

**32**

**7 జనవరి' 2018**

# 'రా(హుల్)ఫెల్' డౌన్ డౌన్!

'బోఫోర్స్ కుంభకోణం మీ ప్రభుత్వాన్ని కూల్చింది. రాఫెల్ కొనుగోలు ఒప్పందం మోడీ ప్రభుత్వాన్ని మళ్ళీ అధికారంలోకి తీసుకువస్తుంది' అని రక్షణ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ మొన్న శుక్రవారం పార్లమెంట్‌లో తమ ఉపన్యాసంతో నిజంగానే యుద్ధభేరి మ్రోగించారు! ఇటీవల జరిగిన ఎన్నికలలో మూడు రాష్ట్రాలను కైవసం చేసుకున్న ఆనందంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కొంత మాటల్లోనూ రాటుదేలిన మాట వాస్తవమే. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందనీ, ఆ విషయం మీద చర్చించకుండా మోడీ పారిపోతున్నారనీ, రాఫెల్‌పై దర్యాప్తు జరపకూడదని సుప్రీంకోర్టు ఎక్కడా అనలేదని రాహుల్ అంటూ తాము అధికారంలోకి వస్తే క్రిమినల్ నేరం క్రింద బాధ్యులను శిక్షిస్తామని చెలరేగిపోయారు.

రక్షణ శాఖ అభ్యంతరాలను కూడా కాదని మోడీ నిర్ణయం తీసుకుని, అనిల్ అంబానీ సంస్థకు కాంట్రాక్టు దక్కేలా చేశారని, యుద్ధవిమానం ధరను రూ. 1600 కోట్లుగా నిర్ణయించి యూపీఏ ప్రభుత్వ హయాంలో 126 విమానాల కొనుగోలు అనుకుంటే దానిని 36కు తగ్గించి దేశభద్రత అంశాన్ని పరిగణించినట్లు లేదని రాహుల్ ఎద్దేవా చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీప్రభుత్వాన్ని కూలద్రోయడానికి రాఫెల్ కుంభకోణం అస్త్రాన్ని కాంగ్రెస్ సానబెట్టడం చేస్తోంది.

రాఫెల్ ఒప్పందంపై రాహుల్ సవాళ్ళను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తన రెండు గంటల సుదీర్ఘ ప్రసంగంలో దీటుగా ఎదుర్కోవడం అందరి అభినందనపాత్రమయ్యింది. పార్టీకి ముడుపులు ముట్టనందుకే కాంగ్రెస్ తమ యూపీఏ

ప్రభుత్వ హయాంలో యుద్ధవిమానాల కొనుగోలు కాంట్రాక్టును తొక్కిపెట్టి పార్టీ డబ్బుల కోసం దేశభద్రతనే ప్రమాదంలో పడవేసిందనీ, పొరుగునవున్న చైనా, పాకిస్థాన్ వైమానిక దళాలు పెద్దఎత్తున కొత్త విమానాలు కొనుగోలు చేసుకుని అదే సమయంలో తమ స్థితిని మెరుగుపరుచుకుంటూంటే, భారత వైమానిక దళాన్ని బలహీన స్థితికి నెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నిర్మల వివరించారు.

యూపీఏ 2007లో బేరమాడినప్పుడు యుద్ధ విమానం ధర రూ. 526 కోట్లు కావచ్చు కానీ పండ్ల ధరలే ఏటికేడాదిగా మారిపోతున్నప్పుడు ఈ ధర తాము వైమానిక దళ పటిష్టతకు కట్టుబడి సమాయత్తమైనప్పుడు రూ. 1600 కోట్లకు చేరినా వెనకడుగు వేయలేమని అన్నారు. నిజానికి యూపీఏ బేరమాడిన ధరకన్నా ఇప్పటి లెక్కల్లో ఇది తొమ్మిది శాతం తక్కువేనని, పైగా తాము బేరమాడిన యుద్ధవిమానం శస్త్రసహితమైన మరింత మెరుగైనదనీ, కాంగ్రెస్ హయాంలో 18 విమానాల కొనుగోలుకే ప్రతిపాదనలు చేస్తే భారత వైమానికదళం అవసరాలు, అభ్యర్థనలమేరకే 36 విమానాలు కొనుగోలుచేయడం జరుగుతోందన్నారు. ఈ 2019లోనే మొదటి యుద్ధవిమానం రాఫెల్ దేశానికి వచ్చేస్తోందనీ, మూడేళ్లలోగానే 36 యుద్ధ విమానాలతో మన వైమానిక దళం దేశభద్రతలో మరింత పరిపుష్టమవుతుందనీ ఆమె వెల్లడించడం నిజంగా ప్రజానందదాయకమే!

రాహుల్ ఊరికే గగ్గోలు పెడుతున్నారుగానీ ఆయనకసలు ఈ విషయంపై సీరియస్‌నెస్ ఉందా అని నిర్మల అడిగిన ప్రశ్న సహేతుకంగానే తోస్తోంది. ఎందుకంటే పార్లమెంట్‌లో ఈ అంశంపై మునుపు అరుణ్‌జైట్లీ మాట్లాడుతుంటే కాంగ్రెస్ సభ్యులు పేపర్ విమానాలు విసిరారు. మొన్న శుక్రవారం రాఫెల్ డీల్‌పై చర్చలో భాగంగా అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై మాట్లాడుతుంటే రాహుల్ గాంధీ కన్నుగీటి 'కొట్టుకొట్టు కన్నుగొట్టు' అన్న పిల్ల చేష్టలు చూపారు. ఆరు నెలల క్రితం లోక్‌సభలో ప్రధాని మోడీ వద్దకు వెళ్ళి ఆయన్ను హత్తుకుని వచ్చి కూర్చుంటూ తన పక్కనే ఉన్న జ్యోతిరాదిత్య సింధియా వైపు చూసి కన్నుగొట్టిన వైనం జనం ఇంకా మరిచిపోలేదుకదా! ఈ వ్యవహారసరళి మరి రాహుల్‌ను పెద్దమనిషి తరహాలో నిలబెట్టేదిగా కాక 'ఫెల్‌డౌన్' చేసేదిగానే ఉంది.

మోడీ గాని, నిర్మలాసీతారామన్ గాని రాహుల్ వలె సంపన్న కుటుంబాల నుంచి వచ్చిన వారు కాదు. కానీ వారిని అబద్ధాలకోరులుగా, దొంగలుగా

అవమానించటం వారి వయసునూ, పెద్దరికాన్ని దృష్టిలో ఉంచుకునయినా రాహుల్ వంటి యువ నేతలు చేయాల్సిన పనికాదు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందాన్ని కాంగ్రెస్ తమ హయాంలో పదేళ్ళు నానబెట్టింది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పద్నాలుగు నెలల్లో ఖరారు చేసింది. 2002లో భారత వైమానికదళం 42 స్క్వాడ్రన్‌ల యుద్ధవిమానాలు కలిగి ఉండేది. 2007కు 36. 2015కు 33 స్క్వాడ్రన్‌లకు తగ్గిపోయాయి. ఈ కాలంలోనే మన పొరుగున ఉన్న చైనా అయిదోతరం యుద్ధవిమానాలు 400 చేకూర్చుకోగా, పాకిస్థాన్ ఎఫ్-16 విమానాలను రెట్టింపు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టు హాల్‌కు దక్కకపోవటం గురించి మాత్రమే వగచుతూ ప్రధానికి ఆశ్రితపక్షపాతం అంటగడుతున్నారనీ, అనిల్ అంబానీ సంస్థకు సెట్‌ఆఫ్ కాంట్రాక్టు దక్కడంలో గూడుపుఠాణీ ఏమీలేదని విశ్వసనీయత చేకూరడం అవసరం. నిజానికి ఆ దిశగా రక్షణ మంత్రి మరింత వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది. రాఫెల్‌పై కాంగ్రెస్‌ది అసత్య ప్రచారం అని త్రిప్పికొట్టడంలో నిర్మలాసీతారామన్ చూపిన వాగ్ధాటి నిజంగా ప్రతిపక్షంపై యుద్ధవిమానంలా దూసుకుపోయిందన్న మాట మాత్రం నిజం. *

33

**14 జనవరి' 2019**

# సమానత్వ సాధన పథంలో...

స్వాతంత్ర్య సముపార్జన చేసి డబ్బైరెండేళ్ళవుతున్నా సమానత్వ దిశగా ప్రజలు పురోగమించడం అనేదీ, కుల, మత, ప్రాంతపరంగా వివక్షలేని దశకు చేరుకోవడమనేదీ ఇంకా జరగనే లేదు. అందుకే ఇంకా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉన్నాం తప్పిస్తే. ఇంకా రిజర్వేషన్ల దయాదాక్షిణ్యాల మీదే అనేకులు బ్రతుకుతున్నారు తప్పిస్తే ప్రతిభే ప్రాతిపదికగా అన్నింటా పోటీపడి ఎదిగే దశకు చేరుకొనేలేదు.

ఇవాళ విద్యా, ఉద్యోగాల కోసం అనేకమంది దృష్టి అమెరికా వంటి విదేశాలపై ఉండడానికి, అక్కడకు వెళ్ళిన మనవారు అనేకమంది సొంతగడ్డకు తిరిగిరాకుండా అక్కడే స్థిరపడిపోవాలని అభిలషించడానికి ఉన్న ముఖ్య కారణాల్లో ఇది కూడా ప్రధానమైనదే. అమెరికాలో డిగ్నిటీ ఆఫ్ లేబర్ ప్రశ్నలేకుండా ప్రతి ఉద్యోగానికీ గౌరవం ఇస్తారు. మనవాళ్ళు అక్కడికెళ్ళి హోటళ్ళలో, ఇతరత్రా ఉద్యోగాలలో పనిచేస్తారు కానీ అదే పని మనదేశంలో చేయడానికి వారికి మనస్కరించదంటే అదే కారణం! ఇక్కడ అధికారాలు, పాపులారిటీ, సంపాదన బట్టి మనుషులను గౌరవించే తీరు మనది. అందుకే ధనార్జన చేసిన నేరస్తులు, బడాబడా మోసాలు చేసి సంపన్నులై కూచున్నవారు కూడా గౌరవింపబడతారు. నేర చరితులు నేతలు అవుతారు. స్కాములు చేసిన వారు, బ్యాంకులను మోసగించి ఎదిగినవారు నిర్భీతిగా సంచరిస్తారు. జైళ్ళు కూడా వారికి విలాస గృహాలుగా మారగల్గుతాయి.

అమెరికాలో ఉద్యోగాలు రిజర్వేషన్ల ఆధారంగా ఇవ్వరు. అర్హతలే వారికి అవకాశాలు ఇస్తాయి. ఇప్పటికీ మన దేశంలో కులం, లింగం ఆధారంగా రిజర్వేషన్ల అమలు ఉంది. ముఖ్యంగా కులప్రాతిపదికన, వెనుకబడిన వర్గాల పేరున సంవత్సరాల తరబడి ప్రయోజనాలు పొంది సంపన్నులైన వారు కూడా ఇంకా తమ సంతతి కోసం రిజర్వేషన్లు అమలు కావాలనే ప్రాకులాడుతుంటారు. అగ్రవర్ణాలలోనూ

పేదలున్నారు. నిజానికి బ్రాహ్మణకులంలో ఆర్థికంగా వెనుకబడినవారు ఈనాడు ఎందరో ఉన్నారు. ప్రధాని మోడీ సరికొత్తగా కొత్త కోటాతో ఆర్థికబలహీన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తూ లోక్‌సభలో 323 ఓట్ల భారీ మద్దతుతో బిల్లుకు ఆమోదం లభింపచేసి రాజ్యాంగానికి సవరణ సయితం కావించి 15, 16 అధికరణాలకు 124వ సవరణతో మరో క్లాజును కూడా జోడించి, జాతితో సంబంధం లేకుండా ప్రతి పేద వ్యక్తికీ గౌరవంగా జీవితం గడిపే అవకాశం కల్పించడం, వారు సాధ్యమైనన్ని అవకాశాలు అందుకునే విధంగా మార్గం సుగమంచేయడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అభిభాషించారు. నిజానికి మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతం పరిమితిని దాటకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉంది. ఆర్థిక బలహీన వర్గాలకు రిజర్వేషన్ల బిల్లు సుప్రీంకోర్టు నిర్దేశించిన కోటా పరిమితిని ఉల్లంఘించదు అనీ, ఎందుకంటే ఆర్టికల్ 16(4)లో చెప్పబడిన కుల ఆధారిత రిజర్వేషన్లకే ఆ పరిమితి అనీ, అది షెడ్యూల్డ్ కాస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి చెందినవనీ, ఈ బిల్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించింది అనీ ఈ వర్గాల ప్రస్తావన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15, 16ల్లో లేదనీ ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సమానత్వసాధనకే ఈ బిల్లు అని వివరణ ఇచ్చారు.

మన దేశంలో విద్య, ఉద్యోగ దరఖాస్తుల్లో కులం, మతం గురించి అడుగుతుంటారు. కానీ అమెరికాలో అది నేరం. అక్కడ వాటి ప్రస్తావన దరఖాస్తుల్లో ఎక్కడా ఉండదు. కులం, రంగం, లింగం ఆధారంగా ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని అమెరికా రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. మన దేశంలోనే ఇప్పటికీ బోలెడు రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్ కోసం ఈ కులవివక్షను ఇంకా పెంచిపోషిస్తున్నాయి. అమెరికాలో నేటికీ ద్విపార్టీ వ్యవస్థే! అధికారం అయితే రిపబ్లికన్లుది లేదా డెమొక్రాట్లుది. మన దగ్గర రాష్ట్రాలలో సైతం పదుల సంఖ్యలో పార్టీలున్నాయి. ప్రజాస్వామ్యం పేరుతో నయినా నిజంగా ఇన్ని పార్టీలు, ప్రజలకు ఇంత గందరగోళం అవసరమా అనిపిస్తూ ఉంటుంది. సుప్రీంకోర్టు తీర్పు ఉన్న తమిళనాడు వంటి రాష్ట్రాలు కొన్ని కులాధారిత రిజర్వేషన్లను యాభైశాతానికి మించి అమలుచేసుకునే వెసులుబాటును కల్పించుకుని కొనసాగిస్తున్నాయి.

నిజానికి 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించాక భారత రాజ్యాంగం ముసాయిదా కమిటీకి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఛైర్మన్ అయ్యారు. మతం, జాతి, కులం, లింగ, పుట్టిన ప్రదేశం ఆధారంగా వివక్షను భారతరాజ్యాంగం నిషేధించింది.

అందరు పౌరులకు సమాన అవకాశాలు కల్పిస్తూ రాజ్యాంగం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించారు. నిజానికి అయిదేళ్ళకోసారి రిజర్వేషన్లను సమీక్షించాలన్న ఆనాటి సంకల్పం రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్లు ప్రతిసారీ పొడిగింపబడుతూనే వచ్చాయి. జనవరి 26, 1950న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

1979లో మండల్ కమిషన్ ఏర్పడింది. 1980లో మండల్ కమిషన్ నివేదికను సమర్పించింది. వెనుకబడిన తరగతుల కోటాలను 22 శాతం నుంచి 49.5 శాతానికి పెంచుతూ కోటాల్లో మార్పులకు సిఫార్సు చేసింది. బీసీలకు కూడా ప్రయోజనం కలుగుతూ 2006 నాటికి వెనుకబడిన తరగతిలో ఉన్న కులాల సంఖ్య 2297కు పెరిగింది. మండల్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వోద్యోగుల్లో అమలు పరిచినపుడు 1990లో దేశవ్యాప్త ఆందోళనలు సాగాయి. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన రాజీవ్‌గోస్వామి ఆత్మాహుతికి ప్రయత్నం చేశాడు. 1992 ఇందిరా సాహ్నే కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్‌లను సమర్థించింది. మన దేశంలో రిజర్వేషన్లకు ఇంకా ఇతర ప్రమాణాలు కూడా ఉన్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం వారికి, వికలాంగులకు, క్రీడాకారులకు, ప్రవాస భారతీయులకు, వివిధ సంస్థలు పోషించే అభ్యర్థులకు, సైనికదళాల్లో గతంలో పనిచేసినవారికి, విధుల్లో మరణించిన సాయుధదళాల సిబ్బందిపై ఆధారపడిన వారికి, కులాంతర వివాహాల్లో జన్మించినవారికి, ప్రార్థనా ప్రదేశాల్లో సందర్శనలకు, రవాణా వ్యవస్థలో స్త్రీలు, వృద్ధులు, వికలాంగుల సీట్లకు, టిక్కెట్టు చార్జీల్లోనూ ఇలా రిజర్వేషన్లు అనేక రూపాలలో పరిఢవిల్లుతున్నాయి. ఏమయినా రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాలను వాస్తవిక ప్రాతిపదికన తీసుకుంటూ, రిజర్వేషన్లను దశలవారీగా తొలగించేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికను ప్రకటించాలని కోరుతున్నవారూ ఉన్నారు.

భారతదేశం పేద దేశం కాదనీ, అభివృద్ధి చెందుతున్న దశ నుండి త్వరలోనే అభివృద్ధి చెందిన సమానత్వ వ్యవస్థ స్థాయి దేశంగా పరివర్తిత మవుతుందనీ ఆశించడం నేరం కాదు కదా! *

# 34

**21 జనవరి' 2019**

# చంద్రునిపై మొలకెత్తిన చైనా పంట

చందమామలో అవ్వ ఉందనీ, ఆ అవ్వ నూలు వడుకుతూ ఉంటుందనీ చిన్నప్పుడు కథలు విన్నవాళ్ళం. 'చందమామ రావే!' అనే పాట అమ్మ పాడుతూంటే విని పెరిగినవాళ్ళం. చందమామ చుట్టూ బోలెడు కథలు, కల్పనలు మన సాహిత్యం నిండా అనుభూతులను ఆరబోశాయి.

యాభై ఏళ్ళు క్రితం 1969లో మానవాళి చరిత్రలోనే మహత్తర అధ్యాయంగా చంద్రునిపై మానవుడు అడుగుపెట్టడంతో నిజానికి చంద్రుని చుట్టూ అల్లుకున్న భావనలకు–అదొక గ్రహం అనీ, రాళ్ళు రప్పలతో నిండి ఉందనీ, జీవరాశి ఉనికిజాడలు లేవనీ విఘాతం కలిగిన మాట కాదనలేని వాస్తవమే! అంతకాలం మనకు అందకుండా నింగిని తొంగిచూస్తూ ఊరిస్తూ, కవ్విస్తూ తనపై కవిత్వం చెప్పించుకుంటూ, చిన్న పిల్లలను మురిపిస్తూ, యువతకు ప్రేమ పాఠాలు నేర్పిస్తూ, సూర్యుని నుండి అరువు తెచ్చుకున్న ప్రకాశాన్ని వెన్నెలల పేర విరజిమ్ముతూ కేవలం మన ఊహల్లోనే ఉంటూ, చందమామ రావే అని పిలిచినా రాకుండా తనను చేరాలనే మానవజాతి ఆశలు అడియాసలు గానే ఉంటాయనుకున్నట్టున్న చంద్రుడు మానవుడే తనను చేరడంతో తన రహస్యం బట్టబయలయిందని అవాక్కయ్యాడేమో!

నిజానికి రోదసీయానానికి చెప్పుకోదగిన నాందీవాచకం పలికింది నాటి సోవియట్ యూనియన్, 1957 అక్టోబర్ 4వ తేదీన సోవియట్ యూనియన్ తొలిసారిగా అంతరిక్షంలోకి స్ఫుత్నిక్‌ను ప్రయోగించింది. ఆ తర్వాత 1961 ఏప్రిల్ 12వ తేదీన సోవియట్ యూనియనే తొలిసారిగా మానవునితో కూడిన ఉపగ్రహాన్ని పంపింది. అలా తొలిసారిగా అంతరిక్షంలో ప్రయాణం చేసి, భూప్రదక్షణం చేసి సురక్షితంగా దిగి, ప్రపంచాన్ని దిగ్భ్రాంతిలో ముంచింది యూరీగెగారిన్.

అలా మొదలై – యాభై ఏళ్ళక్రితం 1969 జూలై 16 బుధవారం నాడు అమెరికా – అపోలో 11 మహత్తర యాత్రను ముగ్గురు అమెరికన్ వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్, మైఖేల్‌కాలిన్స్‌లతో తలపెట్టి, జులై 20వ తేదీ 1969 ఆదివారం అర్ధరాత్రి (అంటే మనకు 21వ తేదీ సోమవారం ఉదయం) విజయవంతంగా ఈగిల్ చంద్రనౌకలో చంద్రునిపై నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు పాదం మోపేలా చేసింది. కాలిన్స్ మాతృనౌకలో చంద్రుని కక్ష్యలో పరిభ్రమిస్తూ ఆ మహాద్భుత దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూశాడు. భూమి నుండి బయలుదేరిన ఈ ముగ్గురు వ్యోమగాములు 102 గంటల 45 నిమిషాల 42 సెకన్లకు చందమామపై అడుగుపెట్టారు.

చంద్రోపరితలం బూడిదరంగులో ఉందనీ, అక్కడక్కడా కొంతభాగం ముదురురంగులో ఉందనీ, చంద్రునిపై గల బండలలో చాలా బండలు పది అడుగులకన్నా పెద్దవనీ, తాము చదునుగా ఉన్న ప్రాంతంలో అడుగిడామని అయిదునుంచి యాభై అడుగుల వరకూ ఉన్న బిలాలు ఎక్కువగా ఉన్న చోట ఉన్నామనీ, రకరకాల కోణాలు గలవి, రకరకాల ఆకృతుల్లో రాళ్ళు ఉన్నట్లు, రాళ్ళ ఉపరితలం మెత్తగా పౌడర్లా ఉందనీ ఇలా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ , ఆల్డ్రిన్‌లు వివరించిన కబుర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. చంద్రగోళపు ధూళినీ, రాళ్ళను వారు సేకరించి తెచ్చారు. అక్కడ గాలిని కూడా ఒక ప్రయోగపెట్టెలో బంధించి సీల్‌చేశాడట ఆల్డ్రిన్. తమ చంద్రనౌకను కాలిన్స్ విహరిస్తున్న మాతృనౌకతో అనుసంధించుకుని మహత్తర యాత్రా విజేతలై జులై 24వ తేదీ వ్యోమగాములు భూమికి చేరుకున్నారు. శాస్త్ర పరీక్షలన్నీ ముగిసాక నెలరోజులకు అంటే ఆగస్టు 10వ తేదీ రాత్రి క్వారంటైన్ నివాసం నుండి విడుదలై తమ తమ స్వగృహాలకు వారు చేరుకున్నారు. తదాదిగా చంద్రునిపై మానవుడు జీవనం సాగించగలడా అన్న దిశగా శాస్త్రపరిశోధనలు ఊపందుకొని సాగుతూనే ఉన్నాయి.

జీవపదార్థం జాడలేని చంద్రునిపై ఇప్పుడు చరిత్రలోనే తొలిసారిగా చైనా శాస్త్రవేత్తలు అద్భుతాన్ని సృష్టించే ప్రయత్నం చేసారు. చంద్రునిపై మనిషి పాదం మోపిన యాభయ్యవ ఏట ఈ 2019 జనవరి 4వ తేదీ శుక్రవారం చంద్రమండలం అవతలిభాగం 'ఇట్‌కెన్ బేసిన్' అనే చీకటిగా, గుట్టలు, లోయలతో నిండి ఉండే ప్రాంతంలో చాంగే – 4 అనే రోవర్‌ను దింపారు. భూమి నుంచి మనకు కనిపించే

చంద్రుడిపై నేల వెలుగులు చిమ్ముతూంటుంది కానీ అవతలి భాగం అందుకు విరుద్ధంగా చీకటిగా ఉంటుంది. ఆ చీకటి ప్రాంతంలో పత్తిగింజలు మొలకెత్తేలా చేసి చైనా చంద్రునిపై పంట పండించిన ఘనతను సాధించింది. రోవర్‌చాంగ్ – 4 పదిరకాల విత్తనాలను తీసుకువెళ్ళింది. దీనిలో భాగంగానే ప్రత్యేకమైన వాతావరణం, ఉష్ణోగ్రత వద్ద పత్తిగింజలు మొలకెత్తాయిట! రోవర్ వాటిని తన కెమెరాలో ఫొటోలు తీసింది. చైనా నేషనలఁ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సీఎన్ఎస్ఏ) పత్తిగింజ మొలకెత్తిన ఫొటోను విడుదల చేసింది. మరో వందరోజుల్లో పత్తిగింజలు మరిన్ని మొలకెత్తేలా చేయడమే కాక ఆలుగడ్డలు, డ్రోసోఫిలా తదితరాలు కూడా చంద్రునిపై పండుతాయని ప్రకటించింది. చంద్రుడి ఉపరితలం నుంచి రాళ్ళు, మట్టి నమూనాలను మరింత సేకరించేందుకు ఈ ఏడాది చివరికి చాంగే – 5 మిషన్ ప్రయోగించాలనీ, అలాగే చాంగే – 6ను చంద్రుడి దక్షిణ ధృవ అన్వేషణకు పంపాలనీ, ఆ దక్షిణ ధృవ ఉపరితలాన్ని, అక్కడి వాతావరణాన్ని, మూలక మిశ్రమాలను స్టడీ చేసేందుకు చాంగే – 7ను రోదసిలోకి పంపాలనీ అలాగే చాంగే – 8 ద్వారా చంద్రుడి ఉపరితల సాంకేతిక విశ్లేషణపై దృష్టి సారించాలని చైనా నిర్ణయించి 2020 నాటికి చైనా శాస్త్రవేత్తలు చంద్రుడిపై కాలుమోపడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

చైనా శాస్త్రవేత్తలు 'లూనార్ బయోస్పియర్' పేరిట ఒక స్థూపాకార డబ్బాను అల్యూమినియం మిశ్రమంతో తయారు చేశారు. 18 సెంటీమీటర్ల పొడవు, 16 సెంటీమీటర్ల వ్యాసంతో మూడు కిలోల బరువున్న దానిలో గింజలు, నీళ్ళు, పోషక ద్రావణాలు ఉంచి నిరంతర పర్యవేక్షణ కోసం కెమెరాను, డేటా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను, ఇన్సులిన్ లేయర్‌ను ఏర్పరచి సోలార్ ఎనర్జీ వెళ్ళేలా ఓ ట్యూబ్‌ను కూడా ఏర్పాటు చేశారు. వెలుతురు లేని సమయంలో మొక్కలకు శక్తి సోలార్ ప్యానెళ్ళ ద్వారా అందుతుంది. చైనా ఈ నెల 4న పంపిన రోవర్ చంద్రుడి ఉపరితలం మీదకు చేరడంతోనే జీవపదార్థ తయారీ (పత్తిగింజలమొలక) ప్రక్రియ ప్రారంభమైంది. చంద్రునిపై ఈ పంటల పరిశోధన వెనుక చైనాకు చెందిన 28 యూనివర్సిటీలున్నాయట. 2036 నాటికి చంద్రుడిపై నివాసం ఏర్పాటే లక్ష్యంగా చైనా దూసుకుపోతోంది. తన శక్తి సామర్థ్యాలతో అమెరికాలాంటి విదేశాల్లోనూ, మన దేశంలోనూ చైనా (బజార్‌లతో) ఇప్పటికే వారి ఘనతను చాటుకుంటోంది. చంద్రమండలంపై కూడా చైనా తన పంట పండించుకోబోతోందేమో మరి! *

35

28 జనవరి' 2019

# ఆరిపో(రే)ని దారి దీపం గాంధీ

'ఇందిరమ్మ ఇంటి పేరు కాదురగాంధీ, ఊరికొక్క వీధి పేరు కాదురగాంధీ కరెన్సీ నోటు మీద - ఇలా నడిరోడ్డు మీద మనం చూస్తున్న బొమ్మ కాదుర గాంధీ భరతమాత తలరాతను మార్చిన విధాతరా గాంధీ-తరతరాల యమయాతన తీర్చిన వరదాతరగాంధీ'

అని సిరివెన్నెల 'మహాత్మ' సినిమాలో పదేళ్ళ క్రితం రాసిన పాట విస్మృతి లోకి పోతున్న గాంధీ మార్గాన్ని ఈ తరానికి ఒకసారి తట్టిలేపింది. గాంధీ, నెహ్రూల వల్లనే ఈ దేశం ఇంతలా ఇంకా వెనుకబడి ఉందని భావించే వారు పెరుగుతున్నంతగా ఈ మాత్రమేనా విలువలతో దేశం నిలిచి ఉండడానికి వారే కారణమని భావించే వారు మాత్రం తరిగిపోతూనే ఉన్నారు.

ప్రస్తుతం మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల సంవత్సరం సాగుతోంది. ఎల్లుండి జనవరి 30 గాంధీ 61వ వర్ధంతి. ఈ నూట యాభయ్యవ జయంతి ఏటనే భారత రాజకీయాల్లోకి ప్రియాంకా గాంధీ క్రియాత్మక ప్రవేశం నెహ్రూ వంశంలో 11వ వారసురాలిగా సంభావింపబడుతోంది. నిజానికి గాంధీ అనే నామముద్ర తప్ప నామమాత్రావశిష్టంగా నయినా ఆ విలువల విశ్వాసం ఉందా అన్నది సందేహాస్పదమే గానీ, చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకునే వ్యాపారానికి మరో గాంధీ తోడయిందని మేలమాడేవారు కొందరు కాగా, ప్రియాంకాగాంధీ రాజకీయ ప్రవేశం కేంద్రంలోని ప్రభుత్వానికి వణుకు పుట్టిస్తోందని గాంధీ ఇంటిపేరు కాని మరో రాహుల్ మహాశయుని ఉవాచ!

ఇంతకీ జాతిపితగా సంభావింపబడిన గాంధీజీకి, ఆయన సందేశానికి ఈ తరం తిలోదకాలిచ్చినట్లేనా! గాంధీపథం కనుమరుగవుతున్నట్లేనా అంటే.. ఇప్పటికీ

ఆయనపట్ల, ఆయన మార్గం పట్ల అపార విశ్వాసం గల వారూ, గాంధీయే ఒక దైవంగా భావిస్తున్న వారూ ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014లోనే నల్గొండ జిల్లాలో హైదరాబాద్ నుంచి 75 కిలోమీటర్ల దూరంలో మొత్తం నాలుగున్నర ఎకరాలలో 'మహాత్మాగాంధీ గుడి' అంటూ ఆలయ నిర్మాణం జరిగింది. ఆరుగురు సభ్యులతో కూడిన ట్రస్టు ఉంది. విరాళాల సేకరణ ద్వారా ఈ ఆలయ నిర్మాణం సెప్టెంబర్ 2014లో పూర్తయింది. సందర్శకుల విరాళాలతోనే పూజారి జీతం, ఆలయ ఖర్చులు సాగిపోతున్నాయి. రెండంతస్తుల ఈ ఆలయం రెండో అంతస్తులో ప్రధానాలయం ఉంది. క్రింది అంతస్తులో మహాత్ముని విగ్రహంతో సందర్శకులకు ధ్యానమందిరం ఉంది. ఒక గ్రంథాలయం కూడా ఏర్పరిచారు. గాంధీజీ జీవితం, ఆయన బోధించిన సూక్తులకు సంబంధించిన పుస్తకాలతో పాటు భగవద్గీత, బైబిల్, ఖురాన్ గ్రంథాలున్నాయి.

ఆలయాన్ని సందర్శించే యువత మహాత్ముని గూర్చిన విషయ పరిజ్ఞానం పొందగలుగుతున్నారని ట్రస్ట్ చైర్మన్ శ్రీపాల్‌రెడ్డి అంటున్నారు. ఆలయపూజారి ఉదయం ఆరు గంటలకు సుప్రభాతంతో ఆలయ ద్వారాలు తెరిచి, నిత్యం పదహారు రకాల పూజలు నిర్వహిస్తున్నారట. గాంధీ నిజంగా దైవ స్వరూపుడనీ, ఆలయ సందర్శనానంతరం తన కూతురుకు వివాహం జరిగిందనీ ఓ రాజస్థాన్ వ్యాపారవేత్త, బెంగళూరు నుంచి తెలుగు రాష్ట్రానికి తాను ఎన్నాళ్ళగానో అభిలషించిన బదిలీ గాంధీ ఆలయ సందర్శనంతో సాకారమైందని ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినీ ప్రకటించారట! ఆలయ ప్రాంగణంలోని మర్రి చెట్టుకు భక్తులు కుంకుమ రంగురిబ్బన్లు కట్టి తమ కోరికలు తీర్చమని మహాత్ముని ప్రార్థిస్తున్నారట!

వింతగానూ, విడ్డూరంగానూ, వెర్రితనంగానూ, అంధవిశ్వాసంగానూ, కొట్టిపారేసే వారున్నా గాంధీ ఆలయం భక్తులతో నేటికీ విరాజిల్లుతోంది. "రక్తమాంసాలతో నిండివున్న ఇలాంటి బక్కపలచటి వ్యక్తి, ఘనకీర్తిని సాధిస్తూ ఒకప్పుడు ఈ భూమి మీద నడిచాడు అంటే రాబోయే తరాలవారు నమ్మజాలకపోవచ్చు" అని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీ గురించి ఏనాడో అన్నాడు. "గాంధీ అనే పదం ఒక వ్యక్తి పేరుగా కాకుండా నేటికల్లోలిత ప్రపంచంలో ఒక జీవిత విధానానికి సంకేతంగా రూపొందింది" అని ప్రపంచ ప్రసిద్ధ రచయిత్రి పెరల్‌బెక్ అంది. జీసస్, బుద్ధుడు వంటి వారి తరువాత అహింసకు ఒక పర్యాయమైనవారు గాంధీజీ. 'మన మహాత్ముడు'

వంటి గ్రంథం ద్వారా శ్రీ ఎం.వి.ఆర్ శాస్త్రి వంటి జర్నలిస్టు రచయిత గాంధీ జీవితంలోని అనేక కోణాలను, వైరుధ్యాలను విశదం చేసినా, రిచర్డ్ అటెన్‌బరో దర్శకత్వంలో బెన్ కింగ్స్‌లే గాంధీపాత్రలో 1982లో విడుదలైన గాంధీ చిత్రం, మేకింగ్ ఆఫ్ మహాత్మా చిత్రం, అలాగే సంజయ్‌దత్ మున్నాభాయ్, చిరంజీవి శంకర్‌దాదాలుగా వచ్చిన 'గాంధీగిరి' చిత్రాలు ఈ తరాన్ని మహాత్ముని సందేశపథం గురించి పునర్మూల్యాంకనం చేశాయనక తప్పదు.

రాజస్థాన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ నరేశ్‌దధీచ్ సామాజిక మాధ్యమమైన 'ట్విట్టర్' ద్వారా యువతకు గాంధీ కథను, జీవితాన్ని, సందేశాన్ని అందిస్తూ ఫేస్‌బుక్ ఖాతాలోనూ గాంధీ సందేశాలను విస్తృత పరుస్తున్నారు. తపాలశాఖ గాంధీ 150వ జయంతి సందర్భంగా వెలువరించిన వృత్తాకారపు తపాలా బిళ్ళలతో ఇప్పటికి గాంధీపై విడుదలైన తపాలా బిళ్ళల సంఖ్య 65కు చేరుకుందిట! మోడీ 'స్వచ్ఛభారత్' పరికల్పనకు మూలాధారనాడి గాంధీ సందేశస్ఫూర్తియే! గాంధీ జీవితచరిత్ర మలయాళ అనువాదం రికార్డు స్థాయిలో 2010 నాటికే 7.78 లక్షల విక్రయాలు జరిగిందట. తెలుగు సాహిత్యంపై గాంధీజీ ప్రభావం కుత్తుకబంటిగా ఉందనాలి. కీ.శే. మొదలి నాగభూషణశర్మ గారే కాక ఈ విషయంపై పరిశోధనా గ్రంథాలు వెలువరించిన వారున్నారు. తుమ్మల సీతారామమూర్తి గారు గాంధీపై ఆరుకావ్యాలు వెలువరించి గాంధీ కవిగా పేరొందారు. గాంధీ 150వ జయంతి సందర్భంగా జంటనగరాల ప్రముఖ సాహితీ సంస్థగా ఖ్యాతిగాంచిన యువభారతి గాంధీగారి 150 సూక్తులతో ఒక చిరుగ్రంథం వెలువరించడమే కాక యువకవి సమ్మేళనం 'దేశం – జాతిపిత సందేశం' పేర నిర్వహించి ఆ కవితా సంకలనాన్ని ఈ జనవరి 30న విడుదల చేస్తోంది.

'గాంధీ' అన్న రెండక్షరాలకున్న ఒక మాంత్రిక శక్తి ఇంకా సజీవమేనన్న భావనకు ప్రియాంకాగాంధీ రాజకీయ ప్రాధాన్యత కూడా తాజా సాక్ష్యమని కాంగ్రెస్ శ్రేణులు సంబరపడుతున్నాయి! ఏమయినా 'ఇలాంటి నరుడొకడిలాతలంపై నడయాడిన నాటి సంగతి నమ్మరానిదని నమ్మకముండే ముందు తరాలకు చెప్పండి' అని సినీకవి అన్నట్లు అంటరానితనాన్నీ, అంతఃకలహాలనీ అంతం చేసేందుకే తన ఆయువంతా అంకితం చేసిన గాంధీ మార్గం – ఆరిపో(లే)ని దారిదీపం! *

36

2 ఫిబ్రవరి' 2019

# మెరటుగాని జోలి ముప్పును తెచ్చురా!

'దూరపు కొండలు నునుపు' అన్న మాట ఈ నాటిది కాదు. కానీ తెలిసి తెలిసి ఆ మోజుతో తరలి పరుగులు తీయడం అనేది నేటికీ విస్తరిస్తున్న అవివేకమే!

అమెరికా అటంచు అఱ్ఱు చాచగనేల
అమెరికా జాతి అసలు లేదు
అచటనున్న మెరిక లిచటివారేనయా
బాల! వినుము, కనుము పూలబాట

అంటూ విజయవాడ శాతవాహన కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు పింగళి కవివంశ వారసులు శ్రీ పింగళి వెంకట కృష్ణారావుగారు డబ్భై ఏళ్ళ వయసులో నవీనంగా బాలబాలికల కోసం సంతరించిన 'పూలబాట' శతకంలో సుద్దులు చెప్పినట్లుగా, మనవారు అమెరికా అమెరికా అంటూ ఆరాటపడుతుంటారు. నిజానికి ఆ దేశానికి సొంతమైన జాతి లేదు. అందరూ వలసవచ్చినవారే. అక్కడివారిలో మెరికలైనవారు మన భారతీయులే. నేడు తెలుగు కుటుంబాలనేకం నుంచి ఒకరో ఇద్దరో పిల్లలు అమెరికాలో విద్యకోసమో, ఉద్యోగం కోసమో తరలిపోయి అక్కడ స్థిరపడాలని చూస్తున్నవారే! అందుకే మన తెలుగు రాష్ట్రాల్లో ఆంగ్ల విద్య ప్రాముఖ్యం అంతకంతకూ పెరిగి తెలుగులో విద్యార్జన, తెలుగులో విద్యాబోధన క్రమేపీ మందగిస్తోంది.

ఆంగ్లభాష అనిన అఱ్ఱులు చాచకు
మాతృభాష తెలుగు మరువవద్దు
భుక్తికొరకు నేర్వ పొరపాటుకాదోయి
బాల! వినుము, కనుము పూలబాట

అని కవి ఇంగ్లీషు చదువుల కోసం ఎగబడడాన్నీ, ఉద్యోగాలకై ఆంగ్లవిద్యార్జన అనివార్యమయినా తల్లి భాష తెలుగును మరవరాదనీ ఇక్కడి మన పిల్లలకే హితవు చెప్పుకోవలసి వస్తోంది మరి!

డాలర్లలో సంపాదించాలనే ఆరాటమే మన పిల్లలను, ఆ పిల్లలను ఆ దిశగా ఎగదోస్తున్న మన పెద్దలను నేడు బలీయంగా పట్టి కుదుపుతోంది అని అంగీకరించక తప్పదు. విద్య కోసం అమెరికా వెళ్ళి, అక్కడే ఉద్యోగాలు సంపాదించి స్థిరపడిపోవాలనీ, వివాహం చేసుకున్నా అమెరికాలోనే జీవించాలనే ఆకాంక్ష, ఆత్రమూ పెరిగిపోవడము వల్లనే అడ్డదారులు తొక్కయినా సరే, అక్కడే ఉండిపోవాలని ప్రయత్నించే వైఖరులు వచ్చాయి. అమెరికా విద్యార్థి వీసా పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిని వలపన్ని పట్టుకోవటానికి అమెరికా హోంలాండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు 'పేపర్‌చేజ్' పేరుతో ఒక రహస్య ఆపరేషన్ ప్రారంభించారు. అందులో భాగంగా నాలుగేళ్ళ క్రితం మిషిగన్‌లో ఫార్మింగ్టన్ హిల్స్‌లో ఒక నకిలీ యూనివర్సిటీని సృష్టించారు. ఆ యూనివర్సిటీలో సిబ్బంది, అధ్యాపకులు, తరగతులు, కోర్సులు ఏమీ లేవు. కానీ ఆ యూనివర్సిటీలో విద్యార్జన పేరిట అమెరికాలో అక్రమంగా నివశించాలనుకునేవారిని, విద్యార్థి వీసాల పేర ఇమ్మిగ్రేషన్ కుంభకోణాలకు పాల్పడేవారినీ పట్టుకోవడమే లక్ష్యం. దూరపు కొండలు నునుపు మోజుతో అమెరికాలో చదువుపేర ఫీజులు చెల్లించి ఎఫ్.1 వీసాలతో ఇమ్మిగ్రేషన్ అధికారుల వద్ద విద్యార్థి హోదాను చూపి అమెరికాలో ఉండడానికి, పనిచేయడానికి రాచబాట వేసుకునే క్రమంలో ఈ ఉచ్చులో చిక్కుకున్న వారిలో అత్యధికం మన తెలుగువాళ్ళే కావడం నిజంగా సిగ్గుచేటు. దౌర్భాగ్యం. అమెరికా విసిరిన ఈ వలలో ఆరువందలమంది అరెస్టయ్యారు. అక్రమ విద్యార్థులకు అమెరికా విడిచి వెళ్ళడానికి డెడ్‌లైన్ ముంచుకొస్తోంది. అమెరికాలోని తెలుగు సంఘాలు బాధితులకు న్యాయ సహాయం అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. బాధిత విద్యార్థుల వీసాస్టేటస్ ఫ్రీజ్ అయినట్లే. మరి ప్రత్యామ్నాయాలేమిటో చూడాలి. అరెస్టయిన వారిని విడిపించడానికి బెయిల్ బాండ్ల కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. నిజానికవి దొరకడం చాలా కష్టం కూడాను.

నిజానికి తెలియక ఈ ఉచ్చులో ఇరుక్కున్న వారికి సాయపడే కృషి అక్కడి తానా వంటి సంస్థలు చేపట్టాయి. కానీ కొందరు అక్రమాలకు పాల్పడి తెలిసీ తప్పుచేశారు. అమెరికాలో రిక్రూటర్లుగా వ్యవహరించి అరెస్టయిన ఎనిమిది మంది తెలుగు విద్యార్థులున్నారట. చట్ట విరుద్ధం అని తెలిసీ, ఫీజులు కట్టి, కట్టించి అమెరికా మోజుతో ఇలా అగచాట్లు పడడం ఒక విధంగా స్వయంకృతాపరాధం కాదా మరి!

ఇప్పటికీ అమెరికా అంతటా విమానల రద్దు, రీషెడ్యూలింగ్ సాగుతోందట. రేపటిలోగా భారత్‌కు తిరిగిరాకపోతే స్టేటస్‌ను పూర్తిగా కోల్పోయి నిషేధం వేటుకు గురయ్యేవారున్నారు. ఉల్లంఘన పీరియడ్ కనుక మొదలయితే ఎఫ్.1 విద్యార్థి వీసా నుంచి హెచ్.1బి వీసాకు మారడం కూడా చాలా కష్టమట! ఓ విద్యార్థి చదువుమానేసి అక్రమంగా ఉద్యోగం సంపాదించి రూల్స్‌ను అతిక్రమిస్తే అసలుకే ఎసరువస్తుంది మరి! ఎఫ్.1 విద్యార్థులు వారానికి 15 గంటల ఆన్ క్యాంపస్ ఎంప్లాయ్‌మెంట్‌కు, ఎమ్.1 వీసాగల వారు క్యాంపస్‌లోనూ, వెలుపలా ఇమ్మిగ్రేషన్ విభాగం అనుమతితో పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకోవడానికీ, అలాగే జే. 1వీసా విద్యార్థులు వర్క్ అండ్ స్టే కింద అమెరికాలో విదేశాంగశాఖ అనుమతి పొందిన స్పాన్సర్ చేసే సంస్థలో ఉద్యోగం సంపాదించుకోవడానికే అర్హులు.

గత ఏడాది అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తెచ్చిన ప్రభుత్వ చట్టం ప్రకారం 180 రోజులకు మించి అక్రమంగా అమెరికాలో ఉంటున్నవారు ప్రాసిక్యూట్ చేయబడి, మళ్ళీవారు అమెరికాలో అడుగుపెట్టకుండా మూడు నుండి పదేళ్ళు నిషేధంకు గురి అవుతారని స్పష్టం చేసింది. ఆ 180 రోజుల గడువు రేపు ఫిబ్రవరి 5వ తేదీతో ముగుస్తోంది. స్టేటస్ అతిక్రమిస్తే నిషేధం పాలవుతారన్నది ఆ నిబంధన. ఈ నిబంధన వల్ల దెబ్బతినే భారతీయ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది ఉన్నట్లు మన ప్రవాస భారతీయులే చెబుతున్నారు. నిషేధం వేటుకు గురికాకుండా స్వదేశానికి తిరిగిరాగలిగితే అక్కడికది అదృష్టమే! నిజానికి భారత్‌లో చదువుకొని అమెరికాలో ఉద్యోగాలు చేయడం గౌరవప్రదమనీ, అమెరికాలో చదువుకున్నవారు అక్కడ తప్ప ఉద్యోగాల్లో మరెక్కడా ప్రతిభావంతంగా ఇమడలేరనీ అంటున్న వారూ ఉన్నారు. అమెరికా చదువుల మోజు రుచి శుచి లేని చిరుతిండివంటిదే!

రుచియటుంచు బయట శుచిలేని చిరుతిండ్లు
ఆరగింప వ్యాధులంటుకొనును
అమ్మచేతి వంట అమృతము వంటిది
బాల! వినుము, కనుము పూలబాట

అని పింగళి వెంకట కృష్ణారావుగారు అన్నట్లు మేధోవలసలు వదులుకొని అనవసర డబ్బు వ్యామోహాలు లేక, మానవీయ ఆత్మీయతానురాగాలు కలిగి 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న రీతి మన దేశాభ్యున్నతికై మనవారు ఉద్యమించవలసిన తరుణం ఆసన్నం అయింది మరి! *

## 37

11 ఫిబ్రవరి' 2019

# సోమవారం సాహిత్య పేజీ(చీ)లు

సాహిత్యం అధికశాతం పత్రికల ద్వారానే పెంచి పోషింపబడుతూండడం అనేది ఇప్పటి మాట కాదు. తెలుగు పత్రికల ఆవిర్భావకాలం నుండి ఉన్నదే. నిజానికి పత్రికల మనుగడ సాహిత్యం మీదా, రచయితల మీదా ఆధారపడి సాగిపోయేదే! కాలిక పత్రికల్లో దినపత్రికలు అనేవి ప్రత్యేకించి దైనందిన వార్తలకు ఉద్దేశింపబడినవి. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, స్థానిక వార్తలను వాటివాటి పరిమితుల మేరకు, అభిరుచుల మేరకు అవి అందిస్తూ ఉంటాయి. కానీ వార, మాసపత్రికల వంటివి పూర్తిగా సాహిత్య సంబంధులే. సాహిత్య గతమైన వివిధ ప్రక్రియలకు అవి స్థానం కల్పిస్తుంటాయి. అయితే వాటిల్లో రాజకీయ, సాంస్కృతికాది అంశాలకూ చోటుండవచ్చు. కేవలం వార్తలకు అవి ఉద్దేశింపబడినవి కావు.

అయితే దినపత్రికలు కూడా తమ ఆదివారం అనుబంధాలను ఒక వారపత్రిక స్థాయిలో రూపొందించి అందిచడం చూస్తూనే ఉన్నాం. ఏవో కొద్ది దినపత్రికలకు మినహాయిస్తే ఆదివారం అనుబంధాలు పలు వార్తాపత్రికలకు ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఏ ముహూర్తాన ఎవరు మొదలెట్టారో ఇదమిద్ధంగా తెలియకున్నా డైలీన్యూస్ పేపర్స్‌లో దినపత్రికల సాహిత్యపేజీ అనేది పలు పత్రికలు అందిపుచ్చుకున్నాయి. సోమవారం నాడు సాహిత్య పేజీ ప్రచురించడం అనేది మొదలయింది. అనేక దినపత్రికలలో సోమవారం సాహిత్య పేజీలు ప్రత్యేక మకుటంతో వస్తున్నవి ఉన్నాయి. వివిధ అనీ, సాహితి అనీ, కలం అనీ, గవాక్షం అనీ, దర్వాజ అనీ ఇలా ఏదో పేరుతో దినపత్రికల సాహిత్య పేజీ కనబడుతుంది.

సాహిత్య పేజీలు అన్నీ సాహిత్య 'పేచీ'లుగా ఉన్నాయని అనడం లేదు గానీ, అధికశాతం అందించే రచనలు ముఖ్యంగా వ్యాసాలు ఆయాపత్రికల పాక్షిక అభిరుచుల

మూసలో కనబడతాయి తప్పితే సాహిత్యం యొక్క విశాల ప్రాతిపదికను ప్రతిఫలింపచేసేవిగా కానరాకపోవడం విషాదం. సరే! ఆయా పత్రికల ఆస్థానకవులు బాపతుగా కొందరి కవితలే ఆ పేజీలో తరచుగా చోటుచేసుకుంటూంటాయి.

యువతకు సాహిత్యంపట్ల అభిరుచిని పెంచేవిగా, ఆ రంగంలో కృషిచేసేందుకు ప్రోత్సహించేవిగా కానరావల్సిన సాహిత్యపేజీలు ఆ కర్తవ్యం విస్మరించినట్లే కనబడుతూ, కొన్ని ప్రత్యేక కూటములుగా, కొన్ని సాహిత్యవర్గాల మౌత్‌పీస్‌లుగా మారిపోవడం వల్లనే సాహిత్యం జోలికి పోని పత్రికలే బెటర్ అనిపించేలానూ ఉంటోంది. అందుకే నూతనంగా పాదుకొన్న కొన్ని ఇటీవలి దినపత్రికలు ఆ బాటలోనే సోమవారం సాహిత్య పేజీ అనే ఊసే ఎత్తడం లేదు. సోమవారం కాక వారంలో మరేరోజో సాహిత్యపేజీని ఎందుకు ఇవ్వకూడదో తెలీదుగానీ, ఆ ప్రయోగం చేసీ మళ్ళీ తామూ సోమవారవ్రత మహాత్మ్యంలోకే వచ్చినవీ ఉన్నాయి.

సాహిత్యం విషయంలో వర్ధిష్ణులకు ప్రోత్సాహం ఇస్తున్న పత్రికలుగా నేటి నిజం, సాహితీకిరణం, విశాలాక్షి, అష్టాక్షరి, గణేష్, కవిత, కవిసంధ్య వంటి కొన్ని పత్రికలు కనబడుతున్నా వాటి విస్తృతి పరిసీమితమే. స్థాయి విషయంలో వాటిని పట్టించుకోని వారే ఎక్కువ. కానీ పేరెన్నికగన్న అనేక ప్రముఖ దిన, వార పత్రికల కన్నా అవి చేస్తున్న సాహిత్యసేవ, కలిగిస్తున్న అభిరుచి అభినందించదగినదే. ఊహించేమేధ, రాటుదేరిన కలం, స్పందించే హృదయాన్ననుసరించి వచ్చి బలీయమవుతాయని కవి దాశరథిగారు అన్నట్లు ఒక దిశానిర్దేశం చేసేలా సాహిత్యపేజీలు, పత్రికలు ఉండాల్సిన అగత్యం ఉంది. ప్రాచీనసాహిత్యం అంటేనే కొందరికి పడదు. వామపక్షభావజాలమే సాహిత్య సర్వస్వం అనుకునేవారు కొందరు. మైనారిటీ కులాలను, మతాలను కాపుకాసుకుంటూ మిగితాదంతా హిందూత్వ, అగ్రవర్ణ ఆధిపత్యమనే వైషమ్య భావనలను ప్రోదిచేస్తూ పబ్బంగడుపుకునే వారు కొందరు. అదే సెక్యులరిజం పేర అభ్యుదయమనే చింతనతో వ్యవహరించేవారు కొందరు.

నిజానికి సాహిత్యం విశ్వశ్రేయోదాయకమనే భావన పోయి నేడు కులాలుగా, మతాలుగా, ప్రాంతీయతలుగా చీలిపోతోందనిపిస్తోంది. తదనుగుణమైన ముఠాధోరణులు ప్రబలుతున్నాయి. సాహిత్యం రాజకీయాలు లేకుండా ఉండదనే మాట నిజంకావచ్చుగానీ, ఇంతగా సాహిత్య రాజకీయాలు ప్రబలిపోవడమే చేటు.

తెలుగువారు రెండు రాష్ట్రాలుగా విడిపోయాక సాహిత్యం కూడా విడిపోక తప్పదనే ధోరణులు కొందరిలో వేళ్ళూనుకు పోతూండడం విషాదం. తెలుగు అక్షరాలు అవే! వాటిని ఆంధ్రా, తెలంగాణ అంటూ పంచుకోవడం ఉండదు. అలాగే తెలుగు సాహిత్యమూ అందరిదీ. తెలుగుకవులు, తెలుగు గ్రంథాలు ఏ ప్రాంతం వారు రాసినా, ఎక్కడి నుంచి వచ్చినా అవి అందరిసొత్తుగా భావించనవసరం లేదా! అసలు దినపత్రికలకు కూడా ముందు నుండీ అనేక ప్రాంతాలవారీ ఎడిషన్లు ఉండగా కొన్ని పత్రికలు అక్కడ ఒక పేరునా, ఇక్కడ ఒక పేరునా విడగొట్టి ప్రచురించడం సెంటిమెంట్ కోసమా? వ్యాపారం కోసమా? అని సందేహం వెలిబుచ్చినవారున్నారు. పత్రికల్లో అక్కడి ప్రాంతం వార్తలు ఇక్కడ, ఇక్కడి ప్రాంతం వార్తలు అక్కడ ప్రచురించడం దోషం ఎందుకు కావాలి? అందునా సాహిత్య, సాంస్కృతిక అంశాలు అందరికీ విస్తరించవలసినవే కదా! దినపత్రికల సాహిత్యపేజీలు, ఆదివారం అనుబంధాలు అలాగే వార, మాస పత్రికలు ప్రాంతీయ భావనలకతీతంగా అన్ని రకాల సాహిత్యాన్ని, కళలనూ అందరికీ అందించవలసిన అవసరం లేదా? సాహిత్య విజయక్రాంతి తెలుగు రాష్ట్రాలంతటా దేదీప్యమానం కాగలగాలి. స్థానికతను, ప్రాంతీయతను పరిపాలనా సౌలభ్య రాజకీయాలకు పరిమితం చేసి, తెలుగు సాహిత్య, సాంస్కృతిక వికాసాన్ని ఏ ఆధిపత్య ధోరణులకూ తావివ్వక, తల ఒగ్గక 'అందరి తెలుగు-అందరికీ తెలుగు' అన్న లక్ష్యంతో భాషా, సాహిత్య విస్తరణకు సమాయత్తం కాగలగాలి. విడిపోయి, ముక్కలు ముక్కలుగా స్థాయిలో పడిపోవడం జరగకుండా, సమష్టిగా తెలుగు వికాసానికి జాతీయంగా, అంతర్జాతీయంగా తెలుగు వెలుగులకూ కృషి చేయాలి. అప్పుడే ఆరుద్ర అన్నట్లు "తెలుగు మాట్లాడే దీపాలు తెల్లవార్లూ వెలుగుతుంటాయి". *

**18 ఫిబ్రవరి' 2019**

# అమ్మ(భాష)ను కోల్పోవద్దు!

ఏ ప్రఫుల్ల పుష్పముల పూజ చేసితినో
ఇందు పుట్టినాడ! కలదయేని
పునర్జన్మంబు కలుగుగాక
మధుర మధురంబయిన తెలుగు మాతృభాష

అని రాయప్రోలు వారన్నట్లు తెలుగు మాతృభాషగా గల వారందరూ అదృష్టవంతులే! నిజానికి ఇవాళ తెలుగు వారెందరో అంతర్జాతీయంగానూ ఖ్యాతిగాంచి విరాజిల్లుతున్నారు. కానీ విషాదం ఏమిటంటే ఆ భాష క్రమేపీ అంతరించిపోతున్న భాషల పట్టికలో చేరిపోతూండడమే!

ఎవరి తల్లి భాషయినా గొప్పది. ఎవరయినా తమదైన భాషలో భావావేశాలను అభివ్యక్తీకరించినట్లుగా, జ్ఞానసముపార్జనం చేయగలిగినట్లుగా మరో భాషలో చేయలేరు. చేసినా – ఆ ప్రజ్ఞ మాతృభాష కారణంగా సమకూడేదే కాగలుగుతుంది. అందుకే మాతృభాషల ప్రాముఖ్యాన్ని గుర్తించే యునెస్కో అంతర్జాతీయంగా ఫిబ్రవరి 21ని మాతృభాషాదినోత్సవంగా 1999 నవంబర్ 17న తీర్మానించి అమలులోకి తెచ్చింది. వచ్చే గురువారం ఇరవయ్యవ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోబోతున్నాము. భాష విషయకంగా అందునా మన మాతృభాష అయిన తెలుగు విషయకంగా నేటి తెలుగు రాష్ట్రాలు రెండింటికీ ఒక స్పష్టమైన అవగాహన, భాషా సాంస్కృతిక విధానం ఉండవలసిన ఆగత్యం ఉంది. కానీ ఆ విషయకంగా తెలంగాణ కొంతవరకు మేలయినదిగా ద్యోతకమవుతున్నా నవ్యాంధ్రప్రదేశ్ మాత్రం అంత ఆశావాహకంగా కనబడడం లేదనే ఆర్తిని అక్కడి విజ్ఞులే అనేకమంది

ప్రకటిస్తున్నారు. తెలంగాణలో కూడా– విద్యావిధానంలో ఉన్నత పాఠశాల స్థాయి వరకు మాతృభాష తెలుగు బోధన అనివార్యమన్నారు గానీ, అది ఒక సబ్జెక్ట్‌గా తప్ప తెలుగు మాధ్యమంలో విద్యాబోధన అనేది అనివార్యంగా ప్రకటింపబడలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు విధాయక పాఠ్యాంశంగా ఉంటే చాలదు. అన్ని మాధ్యమాల పాఠశాల తరగతుల్లో తెలుగు ఉండి తీరాలి. అంతేకాదు! తెలుగు రాష్ట్రాలు రెండింటా తెలుగు మాధ్యమంలో విద్యాబోధన అనివార్యం కాగలగాలి. ఆంగ్లభాషను కాదని ఎవరూ అనడం లేదు. వద్దని ఎవరూ అనడం లేదు. ఆ ఇంగ్లీషు చదువులు సైతం మాతృభాషలో బోధించడం వల్లనే సంపూర్ణవికాసం సాధ్యమవుతుంది. ఈ విశ్వాసం అందరిలో బలీయంగా నేడు పాదుకోవాల్సి ఉంది. పాలకులు తద్గత చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఎవరి మాతృభాష అయినా గౌరవింపదగినదే, అభివృద్ధి చెందవలసినదే! ఈ విషయం గుర్తించే గిడుగువారు ఎప్పుడో సవరభాషకు వ్యాకరణం సంతరించారు. ఎనిమిది గిరిజన భాషలకు పదకోశాలు, వ్యాకరణాలు డిజిటలైజ్ చేయబడడం శుభపరిణామమే! ఆదిలాబాద్ జిల్లా గోండులు తమదైన మాతృభాషకు గల లిపిని ఇటీవల వెలికితీశారు. తెలుగురాష్ట్రాలకావలగల పలురాష్ట్రాలలో గోండులు నివసిస్తున్నారు. వారు అక్కడి వ్యవహారంలో గల భాషను అనుసరిస్తున్నారు. కానీ ఎప్పుడైతే ఈ గోండు మాతృభాష లిపి అక్కడకు కూడా వ్యాప్తి కాగలుగుతుందో అప్పుడే గోండు మాతృభాషగా గలవారి జీవనవికాసం, విజ్ఞానపథ గమనం సాధ్యమవుతాయి. ఇలానే ఇతర మాతృభాషలు కూడాను. నిజమే! ఇప్పటికీ లిపిలేని భాషలున్నాయి. వాటిని మాట్లాడే వారు మాత్రం ఉన్నారు. వారివారి మాతృభాషా వికాసానికి 'లిపి' దోహదపడుతుంది. ఆ దిశగా వారు కృషి చేసి నిర్మించుకోవలసిన అగత్యాన్ని గుర్తించాల్సిందే!

మాతృభాషను నిర్లక్ష్యం చేయడం కారణంగానే భావాభివ్యక్తులు ఛిన్నమై, ఛిద్రమై మానవ సంబంధాలకు ప్రమాదం వాటిల్లుతోందనేది నేడు గుర్తింపబడుతోంది. అందుకే ఆయా మాతృభాషల వారు తమతమ భాషల పరిరక్షణకూ,పునర్వికాసానికీ కృషి చేస్తూ, సాటివారిని సమాదరిస్తూ సాగాలనే సందేశం ఐక్యరాజ్య సమితి ఈ మాటు విడుదల చేసింది.

నిజమే! ఏ భాష అయినా సంపూర్ణంగా వికసించాలి అంటే, నిలద్రొక్కుకుని విస్తరించాలి అంటే ఆ మాతృభాషీయులు తమ భాషలో మాట్లాడటం, చదవటం, రాయటం, ఆలోచించటం అనే నాలుగు పార్శ్వాలలోనూ పురోగమించాలి. సాధికారులవ్వాలి. మనం పలుమార్లు చెప్పుకున్నట్లు దురదృష్టవశాత్తు ఇవాళ అనేక తెలుగు కుటుంబాలలోని తెలుగు పిల్లలకు తెలుగు చదవడం, రాయడం రా(వడంలే)దు. మాతృభాషలో విద్యాబోధన వారికి ఆ మాధ్యమంలో జరుగకపోతూండడమే దానికి కారణం. ఆంగ్ల విద్యా వ్యామోహంలో పెద్దలే తమ పిల్లలను అలా తెలుగుకు దూరం చేస్తున్నారు. అందువల్లే ఆ పిల్లల్లో భావోద్వేగాల అభివ్యక్తి, కుటుంబ ప్రేమలు, మానవీయ సంబంధాలు దెబ్బతింటున్నాయని గ్రహించలేకపోవడం విషాదం. తెలుగులో మాట్లాడగలిగినంత మాత్రాన సరిపోదు. నిజానికి ఆ తెలుగు మాట్లాడడం కూడా ఇవాళ అనేకుల్లో సంకర భాషగానే ఉంటోంది. తమ ప్రాంతపు తెలుగు యాసను, మాండలికాన్నయినా వారు పరిరక్షించుకునే పలుకులు పలకలేకపోతున్నారు. తెలుగు అనేదే తమ మాతృభాష అని కాక, రాజకీయపు రెచ్చగొట్టుడుల కుట్రలతో తమ భాషే వేరు అని ఒక ప్రాంతపు తెలుగువారు అనుకోవడం కూడా ఒక వైపరీత్యమే. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ఇలా ప్రాంతాలవారీగా భాష ఉచ్చారణలో, పద ప్రయోగాలలో వైవిధ్యం ఉన్నా అంతా తెలుగుభాషయేననీ, అందరి మాతృభాషా తెలుగే అనీ తెలుగురాష్ట్రాల ప్రజలంతా వివేకంతో ఉండనవసరం లేదా? ఏ దరఖాస్తు ఫారాలలో మదర్‌టంగ్ అనే కాలమ్ ఉన్నా అక్కడ తెలుగు అని రాసుకోవాలిగానీ తమ ప్రాంతం పేరు కాదు కదా! పాలకులను తెలుగువారందరూ భాషా సాంస్కృతిక విధానం గురించిన స్పష్టతకై నిలదీసి, మాతృభాష అమలు అయ్యేలా, భాషా వికాసానికై కంకణబద్ధులు కావాలి! అదీ తక్షణ కర్తవ్యం.

మాతృభాషను పరిరక్షించుకోలేకపోవడం అంటే అమ్మను, అమ్మ భాషనూ కోల్పోవడమే! ఢిల్లీకి రాజయినా ఒక తల్లికి కొడుకే అన్నట్లు ఎంత ప్రపంచఖ్యాతి చెందినవాడయినా అమ్మ బిడ్డడే! అమ్మనూ, అమ్మ తెలుగునూ ఆదరించి హృదయస్థం చేసుకోవడమే మానవీయం. *

# 39

**25 ఫిబ్రవరి' 2019**

# బతికుండగానే బయోపిక్‌లు... చిత్రమే మరి!

ఒక్కోసారి ఒక్కో 'ట్రెండ్' వస్తూంటుంది. అది ముఖ్యంగా ఫ్యాషన్ ప్రపంచంలో కనబడుతూంటుంది. వస్త్ర ప్రపంచంలో ముఖ్యంగా స్త్రీల దుస్తుల్లో కొత్తకొత్త ఫ్యాషన్లు వస్తూంటాయి. సరే! 'కొత్త ఒక వింత–పాత ఒక రోత' అనే మాట ఉండనే ఉన్నది. ఈ 'ట్రెండ్' అనేది సినిమారంగంలోనూ కనబడుతూంటుంది. చలన చిత్రాలు ఏటా అనేకం పలుభాషల్లో వెలువడుతున్నాయి. ఒక భాషలోని సినిమా వేరే భాషలోకి డబ్బింగ్ చేయడమో, లేదా రీమేక్ చేయడమో సినీ పరిశ్రమలో మామూలే! తమాషాగా ఒక భాషలో 'హిట్ట'య్యింది వేరే భాషలో 'ఫట్' కావచ్చు. బాలీవుడ్, టాలీవుడ్ అంటూ హాలీవుడ్ స్థాయిలో సినిమాలు తీయాలని తాపత్రయపడటం మన దగ్గర చూస్తూనే ఉన్నాం. 'బాహుబలి' లాంటి తెలుగుచిత్రాలు ఆ స్థాయివిగా పేరు తెచ్చుకున్నవి ఉన్నాయి.

సినిమాల తయారీలో ఒక ట్రెండు ఉంటూంటుంది. ఒకప్పుడు తెలుగులో నవలాచిత్రరాజాల ట్రెండ్ నడిచింది. అక్కినేని, వాణిశ్రీ వంటివారు వెండితెర నవలా నాయక, నాయికలుగా వెలుగొందిన రోజులున్నాయి. మొదట్లో పౌరాణిక చిత్రాలే ఎక్కువగా వచ్చాయి. తెలుగులో ఆ తరువాతనే సాంఘికాలు వచ్చాయి. జానపదచిత్రాలు రాజ్యమేలిన బంగారుకాలమూ తెలుగు సినీపరిశ్రమ చూసింది. ఇప్పుడు పౌరాణికాలూ, జానపదాలూ తీసే సాహసం చేసేవారు లేక అవి కనుమరుగయ్యాయి. అలాగే చారిత్రక చిత్రాలూ రుద్రమదేవి వంటివి మినహా ఈ కాలంలో తక్కువగానే వస్తున్నాయి. ప్రేమకథాచిత్రాలకు ఎప్పుడూ కొరతలేదు. దానికెప్పుడూ పెద్దపీటే! అయితే క్రైమ్, హారర్ ట్రెండ్ కూడా కొనసాగకపోవడం లేదు. అయితే తెలుగులో ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్ 'బయోపిక్'లది. 'మహానటి'

తెలుగు తెరనేలిన అభినేత్రి సావిత్రిపై 'బయోపిక్' బహుళ జనాదరణ పొందడంతో ఇక బయోపిక్‌ల ట్రెండ్ ఊపందుకుంది. ఒక మహాత్మాగాంధీపైనా, భగత్‌సింగ్‌పైనా, టంగుటూరి ప్రకాశంపైనా గతంలో వారి జీవిత కథల ఆధారంగా చిత్రాలు వెలువడ్డాయి. నిజానికి సావిత్రి ఒక మామూలు సినీతార. (ఆ మామూలులో గొప్పతనం వేరే ఉంది లెండి!) జెమిని గణేశన్‌ని, అతను ఆ సరికే వివాహితుడని తెలిసీ పెళ్ళాడింది. దానితో ఆమె జీవితం ఎలా మలుపులు తిరిగిందీ, ఆమె దాతృత్వ గుణం వంటివి ఆమెను ఆర్థికంగానూ ఎలా పతనమయ్యేలా చేసిందీ భావిసినీతారలకు ఒక గుణపాఠం అనుకునే వైఖరీ ఉంది. అందువల్లనే ఆమె జీవితకథ 'బయోపిక్'గా రాణించింది. ఎందుకంటే మరీ ముఖ్యంగా ఒక తరాన్ని తన అందంతో, నటనతో అపరిమితంగా ఆకట్టుకొని సినీప్రేక్షకుల హృదయాలను కొల్లగొన్న తార ఆమె. ఏడాదిబాటు కోమాలో ఉండే చివరకు కనుమరుగయిన ఆమె విషాద జీవనం ఎందరినో కదిలించే కథనం. కీర్తిసురేష్ సావిత్రిపాత్రలో ఒప్పి, నప్పి 'మహానటి' బయోపిక్ బాగా ఆడింది.

కథానాయకుడు ఎన్టీఆర్, మహానాయకుడు ఎన్టీఆర్ పేరున– వెండితెర హీరోగానే కాక తెలుగునాట రాజకీయాలనే మలుపుతిప్పిన మహామనిషి నందమూరి తారకరామారావు బయోపిక్ రెండు భాగాలుగా అతని తనయుడు బాలకృష్ణయే తండ్రి పాత్రలో నటించగా తెరకెక్కించారు. ఎన్టీఆర్ రాజకీయాల్లో ప్రవేశించేవరకూ మొదటి భాగంగా, ఆయన రాజకీయ పార్టీ పెట్టి సినిమారంగం నుంచి రాజకీయ రంగప్రవేశం చేసిన అనంతరపు జీవిత కథనంతో రెండో భాగం గత శుక్రవారమే విడుదలయ్యింది. ప్రత్యక్షంగా ఎన్టీఆర్‌ను చూసిన తరంను మెప్పించడం నల్లేరుమీద బండినడకేమీ కాదు. కానీ తండ్రి అడుగుజాడల్లో సినిమా హీరో అయిన బాలకృష్ణ తండ్రి పాత్రలో స్వయంగా సినిమాలో వేయడం వెండితెరపై ఇంతవరకూ జరగని విశేషమే అనాలి! గ్లామర్ ఉన్న వ్యక్తులపై బయోపిక్‌లు నిర్మించడం అభిమానులకు ఆనందదాయకమైన విషయం కాకుండా ఎలా ఉంటుంది. ఎన్టీఆర్ రాజకీయాల్లో స్థిరపడ్డాక ఆయన జీవితంలోకి ప్రవేశించిన లక్ష్మీపార్వతి వల్ల కలిగిన పరిణామాలను రాంగోపాల్‌వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' అనే చిత్రంగా రూపొందించారు. ఇది ఎన్టీఆర్‌పై మరో బయోపిక్ అంటున్నారు గానీ ఒక రకంగా అది లక్ష్మీపార్వతి 'బయోపిక్' కూడా, కావచ్చునేమో! వర్మ స్టైయిల్ ఏమిటో వెండితెరపై వేచి చూడవలసిందే!

తెలుగుదేశం పార్టీ స్థాపించిన ఎన్టీఆర్ రాజకీయ ఆధిపత్యాన్ని ముఖ్యమంత్రులను మార్చే సంస్కృతిగల కాంగ్రెస్ పార్టీ నుండే వచ్చిన రాజశేఖర్‌రెడ్డి నిలువరించి విజయకేతనం ఎగరవేసిన కాలం ఉంది. ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదంతో ప్రాంతీయపార్టీ పెట్టి ప్రఖ్యాతుడైన రామారావుగారి తెలుగుదేశం పార్టీని, ఆయన అల్లుడు చంద్రబాబు ఆధిపత్యాన్ని కాంగ్రెస్ నేత రాజశేఖర్‌రెడ్డి ఎలా ఎదురొడ్డి నాయకుడిగా ఎదిగిందీ కూడా అసాధారణ విషయంగా భావింపబడింది కనుకనే 'యాత్ర' పేరుతో తీసిన వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 'బయోపిక్' మమ్ముట్టిని వైఎస్ఆర్. పాత్రలో నిలిపి ఆసక్తికరంగా చిత్రీకరించి విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఈ 'చిత్రం' ఏ మేరకు మేలు చేయగలదో చూడాలి. ఎన్టీఆర్ బయోపిక్‌లో కష్టాలు చిత్రీకరింపబడలేదంతగా కనుకనే ఆశించిన విజయం లేదంటున్న వారున్నారు. ప్రస్తుతం తెలుగులో అరడజనకు పైగా బయోపిక్‌లు తెరకెక్కే ఆలోచనలు సాగుతున్నాయి. వాటిల్లో ఎస్వీరంగారావుపై, దాసరి నారాయణరావుపైనే కాక జీవించి ఉన్న చిరంజీవి, కె.విశ్వనాథ్‌లపై కూడా బయోపిక్‌ల నిర్మాణం ఆలోచనలు సాగుతున్నాయన్నమాట ప్రచులితంగా వినబడుతోంది. అలాగే నారా చంద్రబాబునాయుడుగారు కూడా 'చంద్రోదయం' పేరిట తనపై తీయదలచిన బయోపిక్‌కు ఆమోదం తెలిపేసారనే మాట వినబడుతోంది. దివంగత మహనీయుల బయోపిక్‌లు అంటే కొంతమేరకు అర్థం చేసుకోగలంగానీ బ్రతికుండగానే ఈ బయోపిక్‌ల ట్రెండ్ ఏమిటో చిత్రమే మరి! బహుజన పార్టీ నాయకురాలు మాయావతి తానే తన శిలావిగ్రహాలు ఆవిష్కరింపచేసుకున్నట్లు 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం' అంటే బతికుండగానే బయోపిక్‌లు నిర్మింపచేసుకోవడమే జీవితాశయం అవుతున్నవారున్నారేమో! 'బయోపిక్'లకు ఓ పెద్ద నమస్కారం మరి! *

# 40

**4 మార్చి' 2019**

# ఎవ్వారయుపేక్ష సేసిరటి వారల చేటగు...!

**కా**శ్మీర్‌లో పుల్వామా ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ గడ్డపై జైషే మహమ్మద్ ఉగ్రవాద శిబిరాన్ని భారతవైమానిక దళం భస్మీపటలం చేయడం పెను సంచలనం సృష్టించింది. ఆత్మాహుతి దాడిద్వారా మన భారత సీఆర్పీఎఫ్ జవాన్లను నలభైమందిని పొట్టనపెట్టుకున్న పన్నెండవరోజు తెల్లవారేసరికల్లా కర్మకాండ పూర్తిచేయడం పాక్‌కు తిరుగులేని గుణపాఠం చెప్పినట్లయింది.

పన్నెండు సుఖోయ్, మిరేజ్-2000 భారత యుద్ధవిమానాలు, వాయుదళానికి చెందిన డ్రోన్‌లు పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫక్తూన్ ఖాస్ ప్రాంతంలోని బాలాకోట్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ముజఫరాబాద్, చాకోటి ప్రాంతాల్లోని పాక్ ఉగ్రవాద శిక్షణా శిబిరాలపై బాంబుల వర్షం కురిపించి, వందలాది ఇస్లామిక్ ఉగ్రవాదులు, వారి శిక్షకులు, కమాండర్లను ఖతం చేయడంతో బాటు మూడు ఆల్ఫా-3 కంట్రోల్ కేంద్రాలను ధ్వంసం చేశాయి. పాక్ యుద్ధ విమానాలు ఎదురుదాడి చేయలేక తోక ముడిచాయి కూడాను! అయితే పాక్ - 'ప్రతీకారేచ్ఛ'తో తమ విమానాలతో భారత భూభాగంలోకి చొరబడేందుకు ఒకేసారి ఎనిమిది ఎఫ్-16లు, నాలుగు మిరాజ్-3, నాలుగు చైనా తయారీ జేఎఫ్-17 థండర్ ఫైటర్లనూ, వాటికి రక్షణగా మరో 8 విమానాలను రంగంలోకి దించడాన్ని పసిగట్టిన భారత వైమానిక దళాలు అప్రమత్తమయ్యాయి. శత్రువిమానాలు నియంత్రణ రేఖను దాటి సుమారు 10 కిలోమీటర్ల లోనికి ప్రవేశించడంతో భారత వైమానిక దళం వాటిని తరిమికొట్టడానికి, నాలుగు సుఖోయ్-30, రెండు మిరాజ్ -2000, రెండు మిగ్ -21, బైసన్ విమానాలు రంగంలోకి దింపింది. నింగిలోనే 'వేట' మొదలయింది. మిగ్-21 బైసన్‌లలో ఒక దానిని నడుపుతున్న వింగ్ కమాండర్ అభినందన్ పాక్- ఎఫ్-16ను వేటాడిన

క్రమంలో పాక్ క్షిపణి దాడికి పారాచూట్ సాయంతో కిందికి దిగి వారికి బందీ అయ్యారు. ఆయన పాక్‌గడ్డపై ఉన్నానని గ్రహించిన వెంటనే మన రక్షణ రహస్యాలు వెల్లడి కాకుండా తన దగ్గర ఉన్న మ్యాప్‌లను, ఇతర పత్రాలను తడిపేసి, కొన్ని మింగేసి జాగ్రత్త పడ్డారు. అభినందన్‌ను పాక్ ఎంత హింస పెట్టినా ఆయన ప్రతికూల పరిస్థితుల్లోనూ మొక్కవోని ధైర్యంతో పాక్ ఆర్మీ అడిగిన ప్రశ్నలకు ఏ మాత్రం బెరుకు లేకుండా, స్పష్టంగా నిజమైన దేశభక్తి గల భారత పౌరుడిగా, సుశిక్షితుడయిన సైనికుడిగా సమాధానాలివ్వడం నిజంగా గర్వకారణం!

భారత్ చర్యలను చైనాతో సహా పలు ప్రపంచ దేశాలు తప్పుపట్టకపోవడం, భారత దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను పాకిస్తాన్ గౌరవించాల్సిందే. అంతర్జాతీయ సంబంధాలకు భంగం కలిగించే దుందుడుకు చర్యలకు ఎంతమాత్రం మద్దతు పలికేది లేదు అనడంతో, ఉద్రిక్తతలను ఆపే ప్రయత్నంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహాయక చర్య–పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పాక్ పార్లమెంట్‌లో అభినందన్ విడుదల గురించి ప్రకటన చేయక తప్పలేదు. 'ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఓ శాంతి సంకేతంగా అభినందన్‌ను శుక్రవారం నాడు విడుదల చేస్తున్నాం. శాంతి స్థాపన లక్ష్యంగా చర్చలకు తొలి అడుగుగా మా కస్టడీలో ఉన్న భారత్ పైలెట్‌ను అప్పగిస్తున్నాం' అని పాక్ ప్రధాని ప్రకటించడం భారత్‌కు విజయకేతనమే! అభినందన్‌కు ఎన్ని అభినందనలు తెల్పినా తక్కువే!

భారత ప్రధానిగా మోదీ నిర్వర్తించిన ఈ వ్యవహారం అంతా రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు ఉపయుక్త చర్యగా కేవలం రాజకీయంగా చూస్తున్న వారున్నారు. భారతదేశం శాంతికాముక దేశం అనీ, పాక్ భూభాగంలోకి మనం దురాక్రమణ చేయడం ఏమిటనీ గత నలభైఏళ్ళుగా ఇలా భారత్ ఎప్పుడూ వ్యవహరించలేదనీ తప్పుపడుతున్న వారూ ఉన్నారు. పుల్వామా ఉగ్రదాడికి ఇలా ప్రతీకారం తీర్చుకోవడం, ప్రాణానికి ప్రాణం తీయడం పద్ధతి కాదనీ, పాక్‌కు చెందిన దాదాపు మూడువందల మందిని సంహరించడం, అదీ వారి స్థావరాలలోకి చొరబడిచేయడం ఏమిటనీ అన్నవారూ ఉన్నారు. ఇది సామాన్య పాక్ ప్రజలపై జరిగినదాడి కాదు. ఉగ్రవాద నిరోధక దాడి మాత్రమే. టెర్రరిజం అణచివేతకు చర్యలు తీసుకోవడం మన మౌలిక

శాంతి కాముక భావనలకు అవరోధమేమీ కాదు. చర్యకు ప్రతిచర్య అనివార్యం కాక తప్పని పరిస్థితులుంటాయి. 'మా మీద ఇలా దాడి జరిగింది చూడండి' అంటూ ఐరాసకు మొరపెట్టుకోవడం సమస్యకు పరిష్కారం కాదు. శత్రువును నిలువరించడానికి శత్రువే లక్ష్యం కావాలికానీ ఉపేక్ష చేయడం కూడా ఒక రకమైన పిరికితనమే అని గాఢంగా విశ్వసించడం వల్లనే మోదీ ఈ నిర్ణయం తీసుకొని వ్యవహరించారన్నది గ్రహించాల్సి ఉంది.

సమాజంలో సత్యం, ధర్మం దారుణంగా పతనమవుతూ ఉంటే దానిని నిరోధించే శక్తి కలిగి ఉండీ ఉపేక్ష చేస్తే, ఆ ఉపేక్ష ఫలితం తమ పతనానికీ, సర్వ అనర్థాలకూ కారణమవుతుంది. ఈ విషయాన్నే మహాభారతంలోని పద్యం ఒకటి మనకు విశదపరుస్తోంది.

సారపు ధర్మమున్ విమలసత్యముఁ పాపము చేతన్ బొంకుచేఁ
పారముఁ పొందలేక చెడఁబాఱినిదైన యవస్థ దక్షులె
వ్వారులుపేక్ష సేసిరిది వారల చేటగు గాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడిన్

అంచేత ఉపేక్ష అనేది శాంతి మంత్రం కాజాలదు. దేశం గొప్పదని పడక్కుర్చీ కలలు కనడం పద్ధతి కాదు. శాంతిని లక్ష్యించినప్పుడు శాంతి కోసం యుద్ధం చేయక తప్పదు. అదీగాక రెచ్చగొట్టే చర్యలకు ఒకరు పాల్పడుతున్నప్పుడు చేతులు ముడుచుకు కూర్చోవడం, మరెవరికో మొరపెట్టుకోవడం సరికాదు. సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. కశ్మీర్ సమస్యను ఎప్పటికప్పుడు మరింత జటిలమయ్యే దుందుడుకు చర్యలకు పాక్ ప్రభుత్వమే పాల్పడుతున్నప్పుడు నిష్కారణంగా మన నలభైమంది జవానులను ఆత్మాహుతి దాడితో పొట్టన పెట్టుకున్నప్పుడు, మన జవాన్లకు కొవ్వొత్తుల ప్రదర్శనలతో నివాళులు ఘటించడంతో ఎలా సరిపోతుంది. వారి అమరత్వాలను కీర్తిస్తే చాలదు మరి!

నిజమే! ఎలాంటి పరిస్థితులకయినా సిద్ధపడే యుద్ధాన్ని ఆహ్వానించాలి. జయాపజయాల విచికిత్సకాదు బరిలోకి దిగడమే ముఖ్యం. 'ధర్మ విస్తారకమయ్యును, సత్య శుభదాయకమయ్యును దైవముండెడిన్' అనే మాటలో సంపూర్ణ విశ్వాసం

ప్రతి ఒక్కరికీ ఉండాలి. తదనుగుణంగానే చర్యల ప్రతిచర్యలో నిర్ద్వంద్వంగా ముందడుగు వేయాలి. దేశరక్షణ, దేశభద్రత ముఖ్యం. పాలక ప్రభుత్వం ఏదయినా అందుకు దీటుగా నిలబడి వ్యవహరించాలి. అది దాని కర్తవ్యం. ప్రాథమిక బాధ్యత. రాబోయే ఎన్నికలలో గెలవడానికి ప్రధాని ఈ పని చేయలేదు. చేయాలి కాబట్టి దీటుగా నిలబడి చేశారనీ, రాబోయే ఎన్నికల తన జయాపజయాలకు ఇదేదో వ్యూహం మాత్రం అనుకునే వారుంటే అది వారి అవివేకమే అవుతుంది. ఉపేక్ష చేటు అనేది తిరుగులేని సత్యంగా గుర్తించాల్సిన ధర్మవచనం. సత్యమేవ జయతే! *

# సుధామ పరిచయం

**అసలు పేరు** : **అల్లంరాజు వెంకటరావు**

**జననం** : 25-11-1951 విశాఖ జిల్లా అనకాపల్లి పట్టణంలో

**తల్లిదండ్రులు** : కీ॥శే॥ అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మ

కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు

**విద్యాభ్యాసం** : ఒకటో తరగతి నుండి ఎం.ఓ.యల్, ఎం.ఫిల్ వరకు హైదరాబాద్‌లోనే. కేశవ మెమోరియల్ పాఠశాల, మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల, వివేకవర్ధనీ కళాశాల, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల్లో.

**వృత్తి ఉద్యోగాలు** : 1975-1977 బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల కరీంనగర్ తెలుగు లెక్చరర్‌గా.

1978లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధ భారతి) ట్రాన్స్ మిషన్ ఎక్జిక్యూటివ్‌గా చేరిక.

1990లో ప్రోగ్రామ్ ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతి, విజయవాడ, వరంగల్, హైదరాబాద్ కేంద్రాలలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసి, 2008లో ఆకాశవాణి వివిధభారతి వాణిజ్యప్రసార విభాగం నుండి స్వచ్ఛంద పదవీ విరమణ, అనంతరం బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఏ (తెలుగు) ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ కౌన్సిలర్‌గా కొన్నాళ్లున్నారు.

**అభిరుచులు** : కార్టూనిస్టుగా, కవిగా, సమీక్షకునిగా, రచయితగా, చిత్రకారునిగా, సినీ విశ్లేషకునిగా, కాలమిస్టుగా, వక్తగా, పదబంధ ప్రహేళికల వంటి వివిధ పజిల్స్ నిర్మాతగా తెలుగు పాఠకలోకానికి, సాహితీలోకానికి పరిచితులు. రేడియో 'వాడి'గా శ్రోతలకు పరిచితులు.

**ముద్రిత గ్రంథాలు:** **కవితా సంపుటులు**

అగ్నిసుధ – 1990

మనసు పావనగంగ – 2010

చిత్రగ్రంథి – 2011

కవికాలమ్ – 2011

**కాలమ్ వ్యాసాలు**

సం.సా.రాలు – 2001

మన తెలంగాణ (సుధామయోక్తి) – 2018

**ఇతరాలు**

పూతరేకులు (జోక్స్‌బాక్స్) – 2012

రామాయణ పథం (ప్రశ్నోత్తరమాలిక–పజిల్స్) 2018

భూమిక (సుధామ పీఠికలు–ముందుమాటలు) 2018

**అవార్డులు, సన్మానాలు:** 'అగ్నిసుధ' సంపుటానికి కలహంసి, ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, 'సం.సా.రా.లు' గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం 2014 సాహితీ పురస్కారం, వంశీ ఇంటర్నేషనల్, జ్యోత్స్నాకళాపీఠం, తేజ ఆర్ట్స్ కవితా పురస్కారం, మునిమాణిక్యం హాస్యనిధి పురస్కారం, నోరి నరసింహశాస్త్రి ఛారిటబుల్ ట్రస్ట్, దివాకర్ల సాహిత్య పీఠంవారి ఆచార్య దివాకర్ల వేంకటావధాని సాహిత్య పురస్కారం, ఆచార్య తిరుమల స్మారక సాహిత్య పురస్కారం, పింగళి జగన్నాథరావు స్మృతిసాహిత్య పురస్కారం, తురగా కృష్ణమోహనరావ్ హాస్య పురస్కారం,

తిరుమల శ్రీనివాసాచార్య, స్వరాజ్య లక్ష్మి సాహితీ పురస్కారం, నవ్య సాహితీసమితి ఉగాది భాషాసేవా పురస్కారం, చేతన మాసపత్రిక, సృజనప్రియ మాసపత్రికల వార్షిక సన్మాన పురస్కారం, లేఖిని సంస్థ పురస్కారం, పోలవరం వెంకట సుబ్బమ్మ సాహితీ పురస్కారం, నెల్లూరు శ్రీమతి గుర్రాల రమణమ్మ సాహితీపురస్కారం, యువ కళావాహిని వారి శ్రీ వివేకానంద సాహిత్య ప్రతిభా పురస్కారం, ఖర్గపూర్, బెంగుళూర్ తెలుగు సాహితీ సంస్థలచే, ప్రపంచ తెలుగు మహాసభలు, తానా, ఆటా హైదరాబాద్ సభల్లో, అ.జో.వి.భా, కందాళై ఫౌండేషన్ ప్రతిభా పురస్కార సభలో, కృష్ణా జిల్లా రచయితల సంఘంవారి సన్మానాలు మొదలైనవి.

1983లోనే ఆకాశవాణి జాతీయకవి సమ్మేళనానికి తెలుగు కవిగా ఎంపిక.

**ప్రస్తుతం** : యువభారతి సంస్థ ప్రచురణల ప్రధాన సంపాదకులు. ఆంధ్రభూమి దిన, వారపత్రికల్లో, నవ్య వారపత్రికలో, V6 వెలుగు దినపత్రిక ఆదివారం అనుబంధం 'దర్వాజ'లో గుళ్ళనుడికట్టులు: మాటాట, పదబంధ పారిజాతం, సుధామ పదగారడి, మాట–ఆట నిర్వహణ.

'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్' మాసపత్రికలో 'సీ'నియర్ కబుర్లు' కాలమ్ నిర్వహణ. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా ప్రస్థానం.

**జీవన సహచరి** : శ్రీమతి అల్లంరాజు (సూకూరు) ఉషారాణి

**కుమారుడు** : చి॥ అల్లంరాజు స్నేహిత్

**కోడలు** : చి॥సౌ॥ అల్లంరాజు (దువ్వూరి) లక్ష్మీ స్రవంతి.

# va'sudha(sa)ma'yam

vijayakranthi telugudaily

Column Articles by

Sudhama



